

## డా॥ జయప్రకాష్ నారాయణ్

# శాసనసభ ప్రసంగాలు



2009 - 2011

డా॥ జయప్రకాష్ నారాయణ్

# శాసనసభ ప్రసంగాలు

లోక్‌సత్తా పార్టీ

డా॥ జయప్రకాష్ నారాయణ్

# శాసనసభ ప్రసంగాలు

**(లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు కూకట్‌పల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డా॥ జయప్రకాష్ నారాయణ్ గారు 2009-2011 సంవత్సరాల మధ్యకాలంలో శాసనసభలో చేసిన ప్రసంగాలు)**

**ప్రథమ ముద్రణ : 2011 అక్టోబరు**

**ప్రతులకు :**
ఇ.నం. 5-10-180/ఎ&ఎ1,
బాండ్‌లేన్స్, హిల్‌పోర్టు రోడ్,
హైదరాబాద్ - 500 004.
ఫోన్ : 91-40-2323 1818/2829,
ఫ్యాక్స్: 2323 0111

**వెల : రూ ॥ 100/-**

**ప్రతులు :** 3,000

**ప్రచురణ :** లోక్‌సత్తా పార్టీ

**ముద్రాపకులు :**
కళాజ్యోతి ప్రాసెస్ ప్రై.లి.,
1-1-60/5, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్,
హైదరాబాద్

# విషయసూచిక

1. సామరస్యంగా సభలో చర్చలు..........3
2. ఔచిత్యభంగం తగదు ..........7
3. రాష్ట్ర బడ్జెట్..."సంకల్ప పరిమితం దృశ్యం"..........10
4. రాష్ట్ర బడ్జెట్... కొంత మంచి - చాలా చెడు ..........18
5. వెనుకబాటుతనంపై అపోహలు తొలగించండి..........29
6. రాష్ట్ర బడ్జెట్.. ఆపరేషన్ సక్సెస్ - పేషెంట్ డెడ్..........31
7. జనం చేతిలో అధికారం పెట్టండి..........39
8. గోరంతలు కొండంతలు చేయకండి..........46
9. ఆరుసూత్రాల అమలుకు ప్రత్యేక అథారిటీని పెట్టండి..........48
10. మన సంస్కృతీ ప్రతిరూపాల ధ్వంస రచన..........51
11. తుపాకులతో పారిశ్రామికీకరణ రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు..........59
12. భూ కేటాయింపులకై సమగ్ర చర్చ అవసరం..........66
13. భూ పందేరాలపై సభాసంఘం వెయ్యండి..........69
14. వ్యవసాయ సంక్షోభాన్ని నివారించాలి ..........90
15. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం..........95
16. విద్యుత్‌రంగంలో వృధాను అరికట్టాలి..........100
17. పాఠశాలలను పునర్వ్యవస్థీకరించాలి..........112
18. సర్వశిక్ష అభియాన్ నిధులు సద్వినియోగం చెయ్యాలి..........114
19. సహకార సంఘం బలంగా వుంటే మైక్రోఫైనాన్స్ బెడద వుండదు..........116
20. మహిళల సంగతి మరిచిపోకండి..........124
21. వెనుకబాటుతనం ఆధారంగానే ముస్లిం రిజర్వేషన్లు..........127
22. పౌరసరఫరాలను క్రమబద్ధం చెయ్యాలి..........134
23. గ్రేటర్ హైదరాబాద్‌కు ఏకీకృత పాలన..........136
24. హైదరాబాద్‌కు తాగునీరు..........137
25. రాష్ట్రంలో రైల్వే సౌకర్యాలు..........138

# సామరస్యంగా సభలో చర్చలు

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా 61 సంవత్సరాల క్రితం ఒక అసాధారణమైన నిర్ణయాన్ని మన రాజ్యాంగసభ చేసింది. ప్రపంచ చరిత్రలో తొలిసారిగా, రాజ్యాంగం వచ్చిన తొలిరోజునే ఆడ, మగ, తేడా లేకుండా, ఆస్తులతో నిమిత్తం లేకుండా అక్షర జ్ఞానం ఉన్నా లేకున్నా, వయోజన ఓటు హక్కు కల్పించిన తొలి రాజ్యాంగం భారత రాజ్యాంగం. అంటే ఈ ప్రజల మీద, ఈ ప్రజలకు నాయకత్వం ఇచ్చే పార్టీల మీద ప్రజలకు సేవ చేయడానికి ముందుకు వచ్చే వ్యక్తుల మీద అపారమైన విశ్వాసాన్ని మన రాజ్యాంగ నిర్మాతలు ప్రదర్శించారు. ఇలాంటి సందర్భాలలో కొంచెం శంక కలుగుతుంది. ఆ విశ్వాసానికి ఏదైనా ఆధారం ఉందా అని, అయితే ఇది కేవలం మన సభకు మాత్రమే పరిమితమైనది కాదు. ఈరోజు రాజ్యాంగ సంస్థలన్నీ తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయాయి. చట్టసభలు, రాజకీయ పార్టీలు, ఎన్నికైన ప్రభుత్వాలు న్యాయస్థానాలు, రాజ్యాంగం బయట ఉన్నటువంటి పత్రికలు, పౌరసమాజం ఈ మొత్తం కూడా అత్యంత తీవ్రమైన సంక్షోభంలో ఉన్నాయి. ఏ మూలకు వెళ్లి ఏ పౌరుణ్ణి మీరు అడిగినా మన రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలిపోతోందనే భావన ప్రజల మనసుల్లో బలంగా ఉంది. అయితే ఎక్కడ పొరపాటున్నా కూడా అధ్యక్షా, చాలా నిండు మనసుతో నేను మనవి చేస్తున్నాను. చివరికి దాన్ని సరిదిద్దే బాధ్యత రాజకీయానిది, చట్టసభలది పొరపాట్లు అన్ని చట్టసభల్లో లేవు. కానీ ఎక్కడ ఉన్నా కూడా మన విజ్ఞతను మన ఆలోచనను మన నాయకత్వాన్ని మన దూరదృష్టిని చూపెట్టి ఈ దేశంలో మౌలిక మార్పు తీసుకొచ్చి ప్రజల్లో విశ్వాసాన్ని కల్పించే బాధ్యత ఈ సభల మీద ఉంది. సర్వోన్నతమైన సభ, ప్రజలు తమ ప్రాతినిథ్యం కోసం తమకున్న సార్వభౌమాధికారాన్ని ప్రదర్శించడం కోసం వారికున్న ఏకైక మార్గం ఈ చట్టసభలు. అందుకని ఈ చట్టసభ మీద దేశం దృష్టి అంతా ఉంటుంది. సహజంగా నాకు భయం వేస్తూ ఉంటుంది. మా అమ్మాయి నన్ను ఎప్పుడూ అడుగుతుంది. మీరు సభలో ఏమి చేస్తారని అడుగుతుంది. వారికి రాజకీయాలంటే చాలా చులకన భావం

ఉంటుంది. కాని పిల్లలకు సమాధానం ఎలా చెప్పాలో అర్థం కాదు. కాని పిల్లలకు తల్లిదండ్రులుగా ఎలా ఆదర్శంగా నిలబడాలో ఆ విధంగా పిల్లలకు ఆదర్శంగా చట్టసభలలో ఇంత ప్రతిష్ట మూటకట్టుకున్న మీరు, ఈ మురికి రాజకీయాలలో ఎందుకు చేరారని అడుగుతున్నారు. వారిని ఎప్పుడూ మందలిస్తూ ఉంటాను. రాజకీయాలను మించిన పవిత్రమైన వ్యాపకం మరొకటి లేదు. మురికిగా ఉందని పిరికిపందల్లాగా పారిపోతే, ఈ దేశం నష్టపోతుంది. ఈ దేశంలోని సమస్యల పరిష్కారం కోసం ఒకే మార్గం రాజకీయం. చట్టసభలు ధైర్యం ఉంటే, భీరువులు కాకుండా ఉంటే, స్వాతంత్ర్య పోరాటంలో మహనీయులు అంతా కూడా ఎన్నో అవకాశాలున్నా కోట్ల రూపాయలు సంపాదించే శక్తి ఉన్నా ప్రత్యేకమైన విద్యాసంపద ఉన్నా, సమాజ నిర్మాణం మా లక్ష్యమని ఎలా వచ్చారో, ఈ రోజు మీరంతా అలా రావాలని, పిరికిపందల్లాగా పారిపోకండని అంటూ ఉంటాను. Due to lack of conviction the Nation will perish అని మళ్ళీ మళ్ళీచెబుతుంటాను. ఎన్ని జరుగుతున్నా, సమాజానికి మరల మరల చెబుతూ ఉంటాను "ఎన్ని ఇబ్బందులున్నా రాజకీయాన్ని ద్వేషించడం, అసహ్యించడం పరిష్కారం కాదు." ఉన్నత విద్య, ధైర్యం, దమ్ము ఉండి దేశాన్ని ప్రేమించేవాళ్ళు దూరంగా ఉండి తిట్టడం కాకుండా వచ్చి ధైర్యంగా నిలబడి ఈ సమాజాన్ని మారుద్దామని విశ్వాసం కలిగించండి. పార్టీలు చట్టసభలు అన్నీ మారతాయి. నిజమైన అధికారం బలప్రయోగంలో లేదు. సంయమనంలో ఉంది. ఒక పార్టీలో, ఒక ఇంటిలో, ఒక ప్రభుత్వంలో చట్టసభలో కావచ్చు దురదృష్టవశాత్తూ సంయమనం కోల్పోతున్నాము. ఇంతకుముందు పెద్దలు మనవి చేశారు. అడ్మండ్ బెర్క్ ఒక మాట చెప్పారు. "మీరు చెప్పే దానిని నేను అంగీకరించను కాని, మీకు ఇష్టం వచ్చిన మాటను చెప్పే హక్కుని నా ప్రాణం ఒడ్డి రక్షిస్తానని" అన్నారు. ప్రజాస్వామ్యానికి మూల సిద్ధాంతం స్వేచ్ఛ. ఈ వాక్ స్వాతంత్ర్యం లేకపోతే దానిని పదిమంది గుర్తించి గౌరవించకపోతే అదే సమయంలో వ్యక్తి స్వాతంత్ర్యాన్ని వినియోగిస్తున్న వాళ్ళ స్వేచ్ఛకు పరిధులు అర్థం చేసుకోకపోతే పరిమితులు గుర్తు ఎరుగకపోతే బాధ్యతతో మెలగకపోతే, సమాజం నష్టపోతుంది. ఈ సభలో, సభ బయట ఎన్నో పార్టీలున్నాయి. కాని సభ మాత్రం ఒకటే అబ్రహాంలింకన్ ఒకసారి ఒక మాట చెప్పాడు. A House devided against itself will fall. ఈ రోజు ఏమి అనిపిస్తుందంటే సర్వోన్నతమైన సభలో ఉన్నాము. ఈ ప్రజలు తమకు ఉన్న

సార్వభౌమాధికారాన్ని మనకిచ్చి బాధ్యతతో మెలగండని మనల్ని చట్టసభకు పంపితే మనలో మనం కలహించుకొని ప్రజాస్వామ్యాన్ని కుంటుపరుస్తున్నాము. జరిగిన సంఘటన చాలా బాధాకరమైనది. ఎత్తుగడలతో మనమంతా నష్టపోతున్నాము. ఈరోజు జరుగుతున్న సంఘటనలు, సభ జరుగుతున్న తీరు చూస్తే రాజకీయంగా ఒకరి కంటే మరొకరు పై చేయిగా మెలగాలని ప్రయత్నిస్తున్నారు. ఈ రోజు జరిగిన కవ్వింపులు, చర్యకు ప్రతి చర్య హింస ఎలా జరిగిందో, బలప్రయోగం ఎలా జరిగిందో నేను గుర్తు చేయదలచుకోలేదు. దురదృష్టవశాత్తు రాష్ట్రం అంతా చూశారు. మనమంతా ప్రేక్షకుల్లాగా ఇక్కడ ఉన్నాము. అందరం నష్టపోతున్నామని గుర్తుంచుకోండి.

ఇంటికి వెళ్ళాక పిల్లలు, సమాజంలోని మారుమూల పూరిగుడిసెలలో ఉన్నవారు మన గురించి చాలా చులకనగా మాట్లాడుతున్నారు. మనల్ని వారు ద్వేషిస్తున్నారు. ఆ విషయాన్ని మనం గుర్తించకపోతే కష్టం. మన పదవి ఎంత కాలం ఉంటుందో చెప్పలేము. ఈ రోజు ఉండవచ్చు, రేపు ఉండకపోవచ్చు. మనం పిల్లలకు ఎలాంటి సమాజాన్ని ఉదాహరణగా చూపిస్తున్నాము. ఆదర్శవంతమైన సమాజాన్నే చూపిస్తున్నామా. పిల్లలకు మన పేర్లు పెట్టుకోవడానికి, మన చిత్రపటాలని మనసు పెట్టి దాచుకోవడానికి అర్హులమా మనం? మీరు ఒకసారి పరిశీలించుకోండి. మనకే బోధపడుతుంది. చివర్లో మీ అనుమతితో సభలో మెజారిటీ పార్టీకి, సభాధ్యక్షులైన మీకు కొన్ని సూచనలు చేస్తున్నాను. ఈ రోజు ఇంత రాద్ధాంతం జరిగింది. ఏమీ జరగలేదన్నట్టుగా మన పని మనం చేసుకోవచ్చు. ఇంకా మూడున్నర సంవత్సరాలు సభ జరగాలి. ఇంకా సయోధ్యగా, సామరస్యపూర్వకంగా చర్చలు జరగాలి. దయచేసి చాలా సౌమ్యంగా ఆలోచించండి. ఆ బిల్లులు అన్నీ ఒకరోజు వాయిదా వేస్తే కొంప మునిగిపోయేది ఏమీ లేదు. వాళ్లంతా కారిడార్‌లో కూర్చున్నారు. ఈ రాత్రి అంతా ఇక్కడే ఉండాలని వారి ప్రయత్నం, వారిని తొలగించాలని మీ ప్రయత్నం... ఇది మనకు శోభాయమానం కాదు.

ఖచ్చితంగా మైక్రోఫైనాన్స్ బిల్లు గురించి రాష్ట్రం అంతా ఎదురు చూస్తుంది. ప్రధాన ప్రతిపక్షం లేకుండా హడావిడిగా చర్చించి నిర్ణయాలు చేశారనే అభిప్రాయం ప్రజలకు కలిగించవలసిన అవసరం లేదు. ప్రభుత్వం ఒక సదుద్దేశంతో ఈ బిల్లు తెచ్చింది. ఒక సంక్షోభపూరిత వాతావరణంలో ప్రజలకు ఊరట కలిగించడం కోసం

దానిలో మార్పులు, చేర్పులు చేయాలని సమాజంలో అన్ని వర్గాలకు, వారి (ప్రతిపక్షం) గొంతుకు ఒక  అవకాశం ఇవ్వడం తప్పేమి కాదు. ప్రధాన ప్రతిపక్షం కోరింది కాబట్టి కమిటీకి పంపించాము అని అనడం అవమానకరం కాదు. ప్రతిష్టాత్మకమైన విషయం కాదు. దానిని దృష్టిలో ఉంచుకొని దయచేసి మీరు అధికారంలో ఉన్నారు కాబట్టి మెజారిటీ పార్టీగా మీరున్నారు కాబట్టి ఒక అడుగు మీరు వేయండి, ఒక అడుగు వారు వేస్తే సయోధ్య కుదురుతుంది. అప్పుడే ఈ సభలో చర్చలు సామరస్యంగా చేసుకోవచ్చు.

మీరు అడుగు వేసినా, అప్పటికీ స్పందించకపోతే బయట ప్రజలు ఉన్నారు. కాబట్టి ఒక అడుగు వేసిన వాళ్లు, స్నేహ హస్తం చాచిన వాళ్లు, ఉదారహృదయంతో ప్రవర్తించిన వాళ్లు ప్రజల దృష్టిలో ఎప్పుడూ నష్టపోరు. ప్రజల గుండెల్లో నిలిచిపోతారు. ఇవ్వాళ సభ అడ్జర్న్ అయిన తరువాత కానీ, మీకు అవకాశం ఉంటే రేపు ఉదయం సభ ప్రారంభం అయ్యే ముందు కానీ అన్ని పార్టీల నాయకుల సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. మూడవది పెద్దలు కిరణ్‌కుమార్ రెడ్డి గారు మీ స్థానంలో గతంలో ఉన్నప్పుడు పధ్నాలుగవ శాసనసభ మొదటి రోజుల్లో ఒకమాట అన్నారు. సభ నిర్వహణ ఎట్లా ఉండాలి అన్న విషయంపై లోతైన చర్చను ఒకసారి పెట్టుకుందామని అన్నారు. వివిధ కారణాల వల్ల మనకు కాలం కలిసి రాలేదు. ఎప్పుడో ఒకప్పుడు లోతుగా దాని మీద చర్చ జరగాలి. ఆ చర్చలో తీసుకున్న నిర్ణయాలను తూచా తప్పకుండా పాటించే ఏర్పాట్లు చేయాలి.  ఒకళ్లు మాట్లాడుతున్నప్పుడు ఇంకొకరు రన్నింగ్ కామెంట్రీ చేయడం కానీ, పక్కదోవ పట్టించటం, అడ్డుకోవడం ఇలాంటివి ఎవరు చేసినా కూడా నిర్దాక్షిణ్యంగా సభాపతి ఉంటారని, సభ ఉంటుందని మనం ఒకటి, రెండు సందర్భాలలో రుజువు చేసినట్లయితే కనీసం మిగతా కాలాల్లో ఈ సభ  సజావుగా జరుగుతుంది. నేను చివరిగా మనవి చేసేది ఏమిటంటే నిరాశకు గురి కావలసిన అవసరం లేదు. ఈ ప్రజాస్వామ్యం కుళ్లిపోయింది. దేశం అంతా నాశనం అయిపోయింది అనే మాటలకు నేను ఏనాడు అంగీకారం తెలుపను. కొన్ని సందర్భాలలో యుద్ధ వాతావరణం ఏర్పడుతున్న మాట వాస్తవమే. దాని నుండి బయటపడే  శక్తి ఈ సభకి, విజ్ఞత గల రాజకీయ పార్టీలకి, సమర్థ నాయకత్వానికి ఉందనే విశ్వాసం నాకు ఉంది. ఒకవేళ మనలో ఆ విశ్వాసం తగ్గినట్లయితే ప్రజలు మనకు దన్నునిచ్చి నిలబెట్టి, మనలో మళ్ళీ

రాజకీయం పవిత్రవ్యాసంగం అన్నటువంటి భావం కలిగించే విధంగా చేస్తారు. ఎన్నికలు దాకా అక్కరలేదు. ప్రజలు ఇప్పుడే ప్రజాభిప్రాయం తెలియజేస్తారనే విశ్వాసం నాకు ఉంది. దయచేసి కపటం లేకుండా, ఈ విద్వేషాలను పక్కనపెట్టి రాజ్యాంగ నిర్మాతలు మన మీద పెట్టిన భారాన్ని మనమంతా నిర్వహిస్తామని, ప్రజలు మనమీద, వ్యవస్థ మీద పెట్టిన విశ్వాసానికి అర్హులమని రుజువు చేస్తామని ఆశిస్తూ... నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు నమస్కరిస్తూ సెలవుతీసుకుంటున్నాను.

**(05-01-2010 - జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# ఔచిత్యభంగం తగదు

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, సభలో ఈ రోజు నిస్సందేహంగా ఔచిత్య భంగం జరిగింది. అయితే ఆవేశకావేశాలున్నపుడు కొన్ని సందర్భాలలో మాట జారడం సహజమే. కాబట్టి జరిగిన దాన్ని మరచిపోయి, గౌరవ సభ్యులు – తాను అన్న మాటను ఉపసంహరించుకుంటున్నాను – అని అంటే మన ప్రతిష్టకు భంగమేమీ కాదు. తర్వాత వారు చెప్పుకోవడానికి మీరు కూడా కొంత leeway కూడా ఇవ్వండి. మీరు అవకాశం ఇస్తే ఒక నిముషంపాటు నేను క్లారిఫికేషన్స్ అడుగుతాను. లేదంటే తర్వాత అడుగుతాను.

On this issue అయితే, ఖచ్చితంగా ఈ రోజు ఔచిత్య భంగం జరిగింది. ప్రతిష్టకు పోకుండా మరొక్క మాట చెబితే సరిపోతుంది. తనకు దురుద్దేశం లేదని వారు ఇప్పుడే అన్నారు. జనార్ధన్‌రెడ్డి గారూ, ఇంకొక్క మాటంటే సరిపోతుంది. తర్వాత వారు చెప్పేది చెబుతారు. తదుపరి నేను క్లారిఫికేషన్స్ అడుగుతాను.

అధ్యక్షా, సంఘటన జరుగుతున్నప్పుడు పోలీసు ఉన్నతాధికారులు ఉన్నారని చెప్పారు. మంత్రిగారి ప్రకటనలో అడిషనల్ కమీషనర్ ఆఫ్ పోలీసుకు కూడా గాయాలు తగిలాయని చెప్పారు. ఉన్నతాధికారుల సమక్షంలో కూడా పరిస్థితిని సకాలంలో అదుపు చేయలేకపోయారంటే వ్యవస్థీకృత వైఫల్యం కనిపిస్తోంది. విచారణకు ఆదేశించారు. ఆ నివేదికను అనుసరించి చర్యలు తీసుకుంటానని, ముఖ్యమంత్రి గారు బి.ఏ.సిలో చెప్పారు. కానీ విద్యార్థినులు, పాత్రికేయులు కూడా దాడికి

గురయ్యారంటే ఎక్కడో తప్పిదం జరిగింది. ప్రభుత్వానికి దీనివల్ల అప్రతిష్ట కలుగుతుంది. శాంతిభద్రతలకు మరింత విఘాతమే కానీ, శాంతిభద్రతలను కాపాడటానికి ఉపకరించదు. అందుచేత తూచ తప్పకుండా తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోండి. ఉపేక్షించవద్దు. వారం రోజుల తరువాత, రిపోర్ట్ వచ్చిన తరువాత అందరూ మరచిపోతారు అనుకుంటే, ఇవన్నీ ఒకటికి, పదిరెట్లు అవుతాయి. ఈ సభ ద్వారా ఒక్క విషయాన్ని చెప్పదలచుకున్నాను. పోలీసులు ఎక్కడి నుండో వచ్చినవారు కారు. పోలీసులు మన నుండి వచ్చినవారు. చట్టాన్ని పాటించడానికి, చట్టబద్ధ పాలనను అమలు చేయడానికి, రాజకీయ నాయకత్వ ఆదేశాలను చట్టబద్ధంగా అమలుచేసి, శాంతిభద్రతలను కాపాడడానికి వాళ్ళు ఉన్నారు. పోలీసు యంత్రాంగం మీద ఒత్తిడి విపరీతంగా ఉంది. సభలో మనమే సంయమనాన్ని కోల్పోతున్నాము. అలాంటిది రాళ్లు వేస్తుంటేనో, బూతులు తిడుతుంటేనో ఎవరో ఒకరు అదుపు తప్పడంతో ప్రమాదం ఏర్పడుతుంది. ఈ హింసాయుతమైన వాతావరణం పోవాలంటే, రాజకీయంగా సంయమనం పాటించాలి. మాటల్లో, చేతల్లో హింసాయుతమైనటు వంటివి కానీ... కేవలం హింస అంటే చేతలు మాత్రమే కాదు, మాటలు. బూతులు తిడితే అది హింస, నోటికి వచ్చినట్లు మాట్లాడితే హింస, బలవంతంగా శాసనసభ్యులనో లేక మరొకరినో అవమానించాలనుకుంటే కూడా అది హింస అవుతుంది. హింసాయుత వాతావరణాన్ని రాజకీయ పార్టీలు ఖచ్చితంగా ప్రోత్సహిస్తున్న మాట వాస్తవం. దాని నుండి రాజకీయ పార్టీలు బయటపడడం లేదు. ఈ సమాజంలో శాంతిభద్రతలను కేవలం పోలీసులు మాత్రమే కాపాడలేరు. రాస్తారోకోలు వచ్చినప్పుడు కాని, లేక ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేసినప్పుడు, దహనకాండకు పాల్పడుతున్నప్పుడు పోలీసులు చూస్తూ ఊరుకోలేరు, ఊరుకోరాదు. పోలీసు యంత్రాంగానికి ఎక్కడ గీత గీస్తున్నామని చెప్పడంలో నా దృష్టిలో ప్రభుత్వం విఫలమైంది. శాంతిభద్రతలు కాపాడడం ఎప్పుడు సాధ్యం అవుతుందంటే.. ప్రెడిక్టబుల్ యాక్షన్స్ ఉండాలి. ఫలానా పని జరిగితే, ఫలానా తప్పు జరిగితే ఫలానా విధంగా ప్రతిచర్య ఉంటుంది అని స్పష్టత ఉండాలి. రెండవది, ఫెయిర్ అండ్ ఫర్మ్ యాక్షన్ఉ ండాలి. అనవసరంగా బలప్రయోగం చేయకూడదు. అవసరమైన చోట, స్పష్టంగా బలప్రయోగం చెయ్యాలి. ఏ మేరకు అవసరమో ఆ మేరకే చెయ్యాలి. ఎన్నో సందర్భాలలో దారుణమైన హింస జరుగుతున్నా కూడా పోలీసులు ఉదాసీనంగా ఉ ంటున్నారు. కారణం ఏమిటంటే, ప్రభుత్వం వాళ్ల చేతులూ, కాళ్లు కట్టేస్తుంది. ఎప్పుడో

అప్పుడు అవేశం రెక్కలు తెంచుకొంటుంది. కొన్ని సందర్భాలలో హింసాప్రయోగం పోలీసుల నుండి కూడా వస్తుంది. బల ప్రయోగం చేసే బాధ్యత, అవసరం కూడా కొన్ని సందర్భాలలో ఉంది. ఇది చాలా ప్రమాదకరమైనది. కాబట్టి ప్రభుత్వాన్ని నేను కోరేదేమిటంటే, పోలీసులకున్న శృంఖలాలను తీసివేసి, మీరు చట్టబద్దంగా అవసరమైన మేరకు బలప్రయోగం చేస్తే, మేము మిమ్మల్ని ఇబ్బంది పెట్టము, అదే సమయంలో అదుపు తప్పితే కఠినమైన చర్య తీసుకుంటాము అన్న సంకేతాన్ని మాటల్లో, చేతల్లో మీరు పంపిస్తే అందరికీ న్యాయం చెయ్యగలరు. అలా కాకుండా, మనం ఇవ్వాళ పోలీసులను తిట్టి ఇంకొక సందర్భంలో ఏమయ్యా! అక్కడ దాడులు జరుగుతుంటే నువ్వు చర్య ఎందుకు తీసుకోలేదని తిడితే ఎట్లా? చివరికి ఏమవుతుందంటే, మా ఇంటికి వస్తే ఏం తెస్తావు, మీ ఇంటికి వస్తే ఏమిస్తావు అన్నట్లుగా అవుతుంది. ఏం చేసినా తప్పు అనే పరిస్థితి తెచ్చుకోకూడదు. దానికొక సి.ఆర్.పి.సి ఉంది. ఆ సి.ఆర్.పి.సిని పాటించే అవకాశం వారికి ఇవ్వండి. అదుపు తప్పినట్లయితే వారిపై చర్య తీసుకోండి. అలా కానట్లయితే ఆది ఆర్బిటరీ పాలన అవుతుంది. ప్రజలకు న్యాయం జరగదు.

**(20-02-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

## 2009-10 రాష్ట్ర బడ్జెట్‌పైన...

# "సంకల్ప పరిమితం దృశ్యం"

అధ్యక్షా, తొలుతగా 15వ సారి బడ్జెట్‌ను, 9వ పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టినటువంటి ఆర్థిక మంత్రిగారిని మనసారా అభినందిస్తున్నాను. వారు బడ్జెట్ ప్రసంగంలో చెప్పుకున్నట్లుగా, గత కొద్ది సంవత్సరాలుగా ఓవర్‌డ్రాఫ్ట్ లేకుండా బడ్జెట్‌ను నిర్వహించడం, ఆర్థికంగా సమతుల్యాన్ని పాటించడం ముదావహం. అందుకు నేను వారిని అభినందిస్తున్నాను. ద్రవ్యలోటు ఇంటెరిమ్ బడ్జెట్‌లో దాదాపు మూడు శాతం చూపెట్టారు. ఈ బడ్జెట్‌లో ద్రవ్యలోటు నాలుగు శాతానికి పెరిగింది. అయినా మారిన ఆర్థిక పరిస్థితుల్లో ప్రపంచం అంతటా వచ్చిన ఆర్థిక మాంద్యంలో, దేశంలో వచ్చిన ఆర్థిక మాంద్యంలో ద్రవ్యలోటును మనం అర్థం చేసుకోవచ్చు. కానీ, రాష్ట్ర ప్రగతి రేటుపై, ఆర్థిక మంత్రిగారు, వారి ప్రసంగంలో చెబుతూ ప్రపంచమంతా తగ్గిపోయింది కాబట్టి. మనకు కూడా తగ్గిందని చెప్పారు. కాని, ఒక్కసారి లోతుకు వెళ్ళి పరిశీలించండి. ఆర్థిక ప్రగతి 10.60 శాతం నుండి 5.53 శాతానికి తగ్గింది. అంటే మన రాష్ట్రంలో ఆర్థిక ప్రగతి 5.10 శాతం తగ్గింది. ఇదే సమయంలో దేశంలో 9 శాతం ఉన్న ఆర్థిక ప్రగతి 8 శాతానికి తగ్గింది. అంటే 2.2శాతం తగ్గింది. ప్రపంచంలోను, మన దేశంలో నెలకొని వున్న పరిస్థితుల వల్లనే గనుక ఆర్థిక ప్రగతి తగ్గిన మాట వాస్తవమే అయితే, దేశం మొత్తంలో 2.2 శాతం తగ్గడం ఏమిటి? ఒక్క మన రాష్ట్రంలో 5.10 శాతం తగ్గడం ఏమిటి? ఖచ్చితంగా విధానాలలో, ఈ రాష్ట్రంలో కొన్ని సంవత్సరాలుగా వచ్చిన లోపాల ప్రభావం ఈ రోజు రాష్ట్ర భవిష్యత్ మీద చూపించబడుతోంది. దానిని గుర్తించకపోతే, వంకలు వెతుకుతున్నట్లయితే, ఏదో ఒక కారణం చూపెట్టినట్లయితే, భవిష్యత్తును అంధకారం చేసినవాళ్లమవుతాం. దయచేసి సహృదయంతో లోతుగా పరిశీలించండి.

ఆర్థిక నిర్వహణ వేరు, మనం పెట్టే ఖర్చుకు వచ్చే ఫలితాలు వేరు. వనరుల వినియోగం వేరు. వ్యవసాయ రంగాన్ని తీసుకుంటే, ఈ ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలను వ్యవసాయ రంగానికి పెట్టిన మాట వాస్తవమే. కానీ, ఎంత ఖర్చు పెడుతున్నా, ఫలితాలు ఏం వస్తున్నాయి? కేంద్ర ప్రభుత్వం పుణ్యమా అని, గత

సంవత్సరం 11,100 కోట్ల రూపాయలు రుణ మాఫీ రూపంలో ఖర్చు పెట్టడం జరిగింది. రుణాలు చెల్లించిన వారికి రు. 5,000 చొప్పున ముఖ్యమంత్రి గారి నిర్ణయం మేరకు ఋుణ మాఫీ చేయడం వల్ల 1800 కోట్లు భారం పడింది. అంటే రు. 13,000 కోట్లు రుణాలు ప్రత్యక్షంగా రైతులకు డబ్బులు ఇచ్చారు. అలాగే వ్యవసాయ సబ్సిడీ కింద ఉచితంగా విద్యుత్ ఇచ్చారు. తర్వాత ఇతర ఇన్‌పుట్స్ ఇచ్చారు.

వర్షాలు బాగా పడ్డాయి. దిగుబడి కూడా రికార్డ్ అన్నారు. కానీ, వ్యవసాయ రంగంలో ప్రగతి 2.2 శాతం. అందులో అసలు వ్యవసాయం ప్రగతి 0.10 శాతం. అంటే అసలు వ్యవసాయంలో ఏ మాత్రం ప్రగతి సాధించలేదనే చెప్పాలి. కేవలం పశుపోషణలో 6 శాతం పైగా ప్రగతి వల్ల వ్యవసాయంలో 2 శాతం ప్రగతిని చూపెడుతున్నారు. అంటే పెట్టే ఖర్చుకు, వచ్చే ఫలితాలకు మధ్య ఏమాత్రం సంబంధం లేకుండా పోయింది. ఈ అంశానికి ప్రభుత్వం, వారి సమాధానం షార్ట్‌కట్. తెలుగులో అడ్డదారులు అంటే అన్‌పార్లమెంటరీ పదజాలం అవుతుందేమో కాని ఇంగ్లీష్‌లో షార్ట్‌కట్. సహకార వ్యవసాయం చేస్తే పరిష్కారం వచ్చేస్తుందని వారు అనుకుంటున్నారు. సమస్య ఒకటి, పరిష్కారం మరొకటి. " పృష్ఠతాళనాదంత భంగః" అంటే మనకు పంటి నొప్పి వస్తే, వీపు మీద చాచి తంతే పంటి నొప్పి పోదు. పంటినొప్పికి పంటి వైద్యమే చేయాలి. క్లిష్టమైన సమస్యలకు లోతైన పరిశీలన లేకుండా, పైపైన పూతలు పూస్తే లాభం లేదు.

కొన్ని రంగాలలో అపరిమితంగా వ్యయం పెరిగిపోతున్నది. అధికార పక్షం వారు రుణాల కన్నా ఆస్తులు ఎక్కువ అని చెప్పుకున్నారు. వారిని అభినందిస్తున్నాం. శైలజానాథ్ గారు ఆ అంశం గురించి మళ్ళీ, మళ్ళీ ప్రస్తావించారు. కాని, ఆస్తులు కేవలం తెల్ల ఏనుగులు అయినట్లయితే, వాటి వల్ల ఫలితం లేకపోతే, వాపును బలంగా భావించినట్లే అవుతుంది. ఇంటెరిమ్ బడ్జెట్‌లో 1,10,00,000 ఎకరాలు కొత్తగా సాగులోకి రావడం కోసం 1,51,000 కోట్ల రూపాయలను చూపెట్టారు. అదే 5 నెలలు అయ్యేసరికి 1,00,00,000 ఎకరాలకు (పది లక్షల ఎకరాలు తగ్గిపోయింది.) ఖర్చు 1,76,000 కోట్లు. అంటే 25,000 కోట్ల ఖర్చు పెరిగింది. మరి ఈ మంత్రం ఏమిటో జాగ్రత్తగా ఆలోచించుకోమనండి. 10,00,000 ఎకరాలు సాగులోకి వచ్చే భూమి తగ్గిపోగా, ఐదు నెలల్లో 25,000 కోట్ల రూపాయల ఖర్చు పెరిగిపోయింది.

జలయజ్ఞాన్ని  నేను పూర్తిగా సమర్థించేవాడిని. నా జీవితం మొత్తంలో కూడా, నేను చేసిన పనుల్లో ముఖ్యమైనవి ఏమైనా ఉంటే, అది ప్రతి నీటి చుక్క కూడా సద్వినియోగం కావాలని పోరాడటమే. కాబట్టి జలయజ్ఞానికి నేను వ్యతిరేకం కాదు. కానీ, పెట్టే ఖర్చు ఏమిటి? వచ్చే ఫలితం ఏమిటి? వ్యవసాయం రంగం వల్ల ఫలితాలు రాకుండా, ఖర్చు మాత్రమే పెట్టి ఫలితాలు లేకుండా ఉన్నట్లయితే, ఈ రాష్ట్ర ప్రజల్ని రుణగ్రస్తులను చేయడమే మన లక్ష్యమయితే, అది సరయిన ఆర్థిక నిర్వహణ కాదు. కేవలం ఓవర్ డ్రాఫ్ట్ లేకుండా ఉన్నంత మాత్రాన సరైన యాజమాన్యం కాదు. వనరుల వినియోగాన్ని  లోతుగా పరిశీలించకపోతే, తాత్కాలిక లబ్ది కోసం భవిష్యత్తును సమాధి చేసినట్లయితే, వచ్చే తరం మనల్ని క్షమించదు. అసంబద్ధమైన పథకాలతో, రాష్ట్ర భవిష్యత్తును అంధకారం చేస్తున్నారు. ఎత్తిపోతల పథకాల కోసం కనీసం 6,000 మెగావాట్ల నుంచి 10,000 మెగా వాట్ల విద్యుత్ కావాలి. గౌరవ సభ్యులు అక్బరుద్దీన్ ఆ విషయాన్ని ప్రస్తావించారు. ఎత్తిపోతల పథకాన్ని ఏ రకంగా నిర్వహిస్తాం? ఎంత ఖర్చు అవుతుంది ? నీటిని పంప్ చేయడానికి, పెట్టిన పెట్టుబడులపై వడ్డీలు కట్టడానికి, పంపింగ్ మిషన్ల నిర్వహణ కోసం ఎకరానికి ప్రతి సంవత్సరం నిర్వహణ ఖర్చే రు. 40,000 నుంచి రు. 50,000 అయితే, రాష్ట్ర భవిష్యత్తు ఏ రకంగా బాగుంటుంది? వ్యవసాయం ఏ రకంగా గిట్టుబాటు అవుతుంది? వాపును బలుపుగా భావిస్తున్నామని అందుకే నేను మళ్లీ చెపుతున్నాను. పదుల, వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడితే రాష్ట్రం బాగుపడుతుందని భ్రమను కల్పిస్తున్నాం. భ్రమలో మునుగుతున్నాం. పర్యవసానంగా  రోశయ్య గారు చూపెట్టిన బడ్జెట్‌లోనే, గత సంవత్సరం 2,385 కోట్ల రూపాయల విద్యుత్ సబ్సిడీ ఉండగా, ఈ సంవత్సరం 6,040 కోట్ల రూపాయల సబ్సిడీ చూపించవలసి వచ్చింది. విద్యుత్ వ్యవస్థ నిర్వహణ ఈ విధంగానే ఉన్నట్లయితే, ఈ రకంగానే విద్యుత్‌ను వృధా చేస్తున్నట్లయితే,  ఈ రకంగానే ఉత్పత్తి అయ్యే విద్యుత్ కన్నా విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్నట్లయితే  ఐదు సంవత్సరాల తర్వాత ఈ రాష్ట్రానికి ప్రతి సంవత్సరం 15,000 కోట్ల రూపాయల విద్యుత్ సబ్సిడీ అవుతుంది. అధ్యక్షా, ఈ మాటను జాగ్రత్తగా రికార్డు చేయండి. 6,000 నుండి 10,000 మెగావాట్లు కనుక వ్యవసాయ రంగంలో కేవలం లిఫ్టింగ్ కోసం  అదనంగా కేటాయించినట్లయితేనే, 15,000 కోట్ల ఖర్చుతో కూడా సబ్సిడీ ఆగదు. అంటే, ఈ శాసనసభా కాలంలో ఈ రాష్ట్ర భవిష్యత్తును సమాధి చేసిన వారమవుతాం. ఈ విషయాన్ని నేను నిండు మనసుతో చెబుతున్నాను. ద్వేషంతో కాదు, మాలిన్యంతో కాదు, లోతుకు వెళ్లండి. భవిష్యత్తును

గురించి ఆలోచించండి. అసంబద్ధమయిన పథకాలు కట్టిపెట్టండి. విద్యుత్ రంగాన్ని బాగు చేయండి. విద్యుత్ పంపిణీ చేపట్టండి. గుజరాత్ రాష్ట్రంలో విద్యుత్ పంపిణీని బాగు చేయడం వల్ల, గ్రామాల్లో 24 గంటలూ విద్యుత్‌ను ఇస్తున్నారు. విద్యుత్ పంపిణీ కారణంగా, గ్రామాల నుండి పట్టణాలకు వలసలు 30 శాతం తగ్గిపోయాయి.

మన రాష్ట్రంలో, ఒక్క గ్రామంలో కూడా ఈ రోజు 24 గంటలపాటు విద్యుత్ వచ్చే గ్రామాల్లేవు. అంటే మనం ఏం చేస్తున్నాం అని అడుగుతున్నాను. ఇది ఇలా ఉండగా, హిందూజా పథకాన్ని చేపడుతున్నారు. Costplus basis పై అనుకొంటున్నాము. ప్రభుత్వం ఇంత వరకు వివరాలు చెప్పలేదు. పాత పద్ధతుల్లో, నష్టపోయే పద్ధతుల్లో, భవిష్యత్ ఇంధన వినియోగం కోసం రాష్ట్రంలో 'గ్యాస్ గ్రిడ్' ఇంత వరకు లేదు. దాని గురించి మాటలు సాగుతున్నాయి. గుజరాత్‌లో చూస్తే, రాష్ట్రమంతటా ఏడు పైప్‌లైన్స్ వేసి గ్రిడ్‌ని ఏర్పాటు చేసుకొన్నారు. మన రాష్ట్రంలో విశాఖ నుండి కొండపల్లి వరకు ఒకే ఒక్క పైప్ లైన్ వచ్చింది. మరొకటి వారు వేయబోతున్నారు. రాష్ట్రం నుండి ముంబయి వరకు తీసుకువెళ్లాలి కాబట్టి, ఆకాశంలో నుండి గ్యాస్ తీసుకువెళ్లలేరు కాబట్టి వారు వేస్తున్నారు. ఈ రాష్ట్ర అవసరాల కోసం పనికివచ్చే ఇంధన, విద్యుత్ రంగంలో ఏ మాత్రం ముందుచూపు కానీ, నూతన అవగాహన గానీ మీకు లేదు. బడ్జెట్‌లో దానికి సంబంధించిన కేటాయింపులు లేవు.

'విద్య' విషయానికి వస్తే, విద్య, ఆరోగ్య విషయంలో ప్రభుత్వంది ఒక పంథా కనిపిస్తోంది. ఇంటెరిమ్ బడ్జెట్‌లో పాఠశాల విద్య కోసం రూ. 9047 కోట్లు చూపించారు. ఈ బడ్జెట్‌లో రూ. 8400 కోట్లకు తగ్గించారు. అదే సమయంలో రూ. 2300 కోట్లు ఉన్న 'ఉన్నత విద్య' బడ్జెట్‌ని రూ. 2700 కోట్లకు పెంచారు. అంటే ప్రాధాన్యం ఏమౌతుందో చూడండి. 89 లక్షల మంది పిల్లలు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. ఒకపక్క స్కూల్స్‌లో మౌలిక వసతులు లేకపోయినా, ఎన్నో స్కూళ్లలో పాఠశాలల్లో గదులు లేకపోయినా, మూత్ర విసర్జనకు టాయ్‌లెట్స్ లేకపోయినా, మంచినీళ్ళు లేకపోయినా... వీటికి నిధుల కొరత ఉంది. పోనీ కొన్ని చోట్ల అవన్నీ ఉన్నాయని అనుకొన్నా... అవి లేకపోయినా కనీసం చదువు వస్తుందని అనుకొన్నా... చదువు మాత్రం లేకుండా పోతోంది. ఈ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల పిల్లల కోసం ఈ రాష్ట్ర ప్రజలు కట్టే పన్నుల నుండి తలసరి పదివేల రూపాయలను ఖర్చు చేస్తోంది. పాఠశాలల్లో ఫలితాలు ఎంత దారుణంగా ఉన్నాయో, మీకు, నాకు అందరికీ తెలుసు. పోనీ విద్య అందుతోందని అనుకొన్నా ప్రతిసారి ఏమీ జరుగుతోంది.

ప్రభుత్వం ఆత్మరక్షణలో పడితే వెంటనే తెలుగుదేశం ప్రభుత్వహయాంలో ఇంతకంటే అధ్వాన్నంగా చేశారు కదా అని చెపుతారు. 'మీకు తెలుగుదేశం పార్టీ పరిపాలన బెంచ్ మార్కా? అని గౌరవ ముఖ్యమంత్రి గార్ని అడుగుతున్నాను. ప్రజలు మీరు మంచి పాలన అందిస్తారని మీకు ఓటు వేసి గెలిపించారు. ఎంతసేపటికి అవతల వారి లోపాలను చూపించి, వారిని ఎకసెక్కాలు చేసి, దానితో మేము బాగా చేశామని అనుకొంటే ప్రమాదమని మనవి చేస్తున్నాను. ఒకసారి దేశంలోని, రాష్ట్రంలోని పరిస్థితి చూడండి. ప్రతి సంవత్సరం 16 లక్షల మంది పిల్లలు ఈ రాష్ట్రంలో పుడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సర కాలంలో పుట్టే పిల్లలు 16 లక్షల మంది. వారిలో 90 వేల మంది ఏడాది తిరగకముందే చనిపోతున్నారు. 40 శాతం మంది... ఈ 16 లక్షల మందిలో లేక మిగిలిన 15 లక్షల మందిలో, ఆరు లక్షలమంది పైచిలుకు కేవలం పౌష్ఠికాహారం లేక వారిలో ఎదుగుదల ఆగిపోతోంది ఈ రాష్ట్రంలో అని మనవి చేస్తున్నాను. 60శాతం మంది స్కూల్సకి వెళ్లినా, నూటికి 96 మంది స్కూల్సకి వెళు తున్నట్లు చూపించినా, 40 శాతం మంది చదువను కూడా చదవలేరు. ఎటువంటి సమాజాన్ని మనం ఊహిస్తున్నాము. అవతల పార్టీ వారిని తిట్టి, వారి కంటే బాగా చేస్తున్నామని చెప్పుకోడానికా? ఈ సమాజాన్ని మొత్తం మార్చడానికా? ఎంత కాలం మరుగున పడి, ఎంత కాలం ఉన్న చోటే ఉంటామని అడుగుతున్నాను.

విద్యని ఏమి చేస్తున్నాము? కార్పొరేట్ కళాశాలలకు పిల్లల్ని పంపి ఫీజురీఇంబర్స్ చేసినట్లయితే విద్య విషయంలో అంతా బాగా జరిగిందని అనుకొంటున్నాము. కాన్సెప్ట్ స్కూల్ పెడితే అంతా బాగా జరిగిందని అనుకొంటున్నాము. మళ్లీ షార్ట్‌కట్. మళ్లీ అడ్డదార్లు. జాతి ప్రగతి కోసం దీర్ఘకాలం పథకాలు వేసే ఓపిక లేక... నైపుణ్యం ఉ ందో లేదో నాకు తెలియదు.... సంకల్పం లేక అడ్డదారులతో మనం ఏదో రకంగా అభివృద్ధిగా చూపిస్తున్నాము. మళ్లీ వాపుని బలుపుగా అనుకొంటున్నాము.

ఆరోగ్యం విషయానికి వస్తే, ఆరోగ్యశ్రీ విషయం మళ్లీ మళ్లీ ప్రస్తావనకు వచ్చింది. 60వ నేషనల్ శ్యాంపుల్ సర్వేకి చెందిన గణాంకాల గురించి చెపుతాను. ఈ రాష్ట్రంలో ప్రతి రోజు ఒక లక్ష పదివేల మంది జబ్బు చేసి డాక్టర్ దగ్గరకు వెళ్లే శక్తి లేక ఇంట్లోనే మౌనంగా కన్నీళ్లు కారుస్తూ పడుకొంటున్నారు. మీరు 1100 మందికి ఆపరేషన్స్ చేయిస్తున్నారు. సోదరా, మిగతా ఒక లక్షా 9వేల మంది సంగతి ఏమిటని అడుతున్నాను. ఆరోగ్యం అందక బాధపడుతున్న వారి గురించే చెపుతున్నాను. అనారోగ్యంగా ఉన్న వారు ఏదో రకంగా ప్రైవేటు, ప్రభుత్వ డబ్బుతో ఆసుపత్రులకు వెళుతున్నా, మిగతా

వారు ఉన్నారు. ఆసుపత్రికి వెళ్లే శక్తి లేక ఇంట్లో పడుకుంటున్న వారు రోజుకి లక్షా పదివేల మంది ఉన్నారని తెలియజేస్తున్నాను. 11 వందల మందికి ఆపరేషన్స్ చేస్తే, రోజుకు మూడున్నర కోట్ల రూపాయలు ఖర్చౌతుంది. ఇంటెరిమ్ బడ్జెట్‌లో రూ. 625 కోట్లు చూపించి ఈనాడు ఆరోగ్య శ్రీ పథకానికి రూ. 925 కోట్లు చూపించారు. రోశయ్య గారి లెక్కల ప్రకారమే ఈ ఏడాది రూ. 1260 కోట్లు అవుతుంది. వచ్చే ఐదు, ఆరు సంవత్సరాల కాలంలో ఆరోగ్యశ్రీ ఖర్చు ఇలానే వెళితే ప్రజలకు ఆరోగ్యం అందకుండా మీకు కనీసం ఐదువేల కోట్లు సంవత్సరానికి ఖర్చౌతుంది. అంటే మీకు ఖర్చు ఎక్కువ, ఫలితం తక్కువ అని తెలియజేస్తున్నాను.

మద్యం విషయాన్ని సోదరుడు కిషన్ రెడ్డి గారు చాలా స్పష్టంగా చెప్పారు. వారి అభిప్రాయాన్ని కొంత సవరిస్తాను. బడ్జెట్‌లో కనిపించే అంకెలు కేవలం పైపైనే కనిపించేవి. కొంచెం లోతుగా పరిశీలిస్తే, గత సంవత్సరం కేవలం మద్యం తాగుడు పై ప్రభుత్వానికి అన్ని రూపాల్లో వచ్చిన ఆదాయం రూ. 10,500 కోట్లు, గౌరవ సభ్యుడు కిషన్‌రెడ్డి గారు, ఇతర పెద్దలు మాట్లాడుతూ, రూ. 4800 కోట్లు అని చూపించారు. వాస్తవానికిఎక్సైజ్ క్రింద రూ. 5700 కోట్లు వచ్చింది. దానిపై అమ్మకం పన్ను ఇతరమైనవి లెక్క వేస్తే రూ. 10500 కోట్లు. అంటే, రూ. 15 వేల కోట్ల నుండి 16 వేల కోట్ల రూపాయల వరకు రాష్ట్రంలో పేద ప్రజలు తాగారు. ఇల్లిసిట్ లిక్కర్ కాకుండా, కల్తీ కల్లు కాకుండా, ఈ ఏడాది ఎక్సైజ్ ఆదాయం రూ. 6200 కోట్లుగా చూపిస్తున్నారు. అంటే ఆదాయం అంతా కలిపితే 12 వేల కోట్లకు వెళుతుంది. అంతా కలిపితే 18 వేల కోట్లు తాగుతారు. 70 నుండి 80 లక్షల కుటుంబాలు నాశనమౌతాయి. అంటే బెల్టుషాపుల ద్వారా తాగించడాన్ని ఒక ఉద్యమ రూపంలో రాష్ట్రమంతా తీసుకువెళ్లడానికి ఈ బడ్జెట్ కంకణం కట్టుకొన్నట్లు కనిపిస్తోంది. ఇవన్నీ బాగానే ఉన్నాయి? ఏమి చేయాలి. నేను ఎక్కడా అనుచితమైన అన్యాయమైన విమర్శలు చేయలేదు. నేను చెప్పే లెక్కలు తప్పు కాదు. నేషనల్ శాంపిల్ సర్వే. 60వ సర్వేలో ఈ వివరాలు ఉన్నాయి. కేవలం వనరులను ఖర్చు చేయడమే ఫలితం అనుకొంటే చాలా పొరపాటు. వాపును బలుపు అనుకుంటే పొరపాటు. మొట్టమొదట చూడాల్సింది, పథకాల ఖర్చు ఏమిటి? వాటి ఫలితం ఏమిటి? ఈ ఎత్తిపోతల పథకాలు రాష్ట్రంలో రైతులకి పనికి వస్తాయా? ప్రత్యామ్నాయంగా అంత కంటే నీటి వనరులు ఇచ్చి ఎక్కువ మంది రైతులకు న్యాయం చేసి, ఖర్చు తగ్గించే పథకాలు ఉన్నాయా అన్న పరిశీలన చేయాలి. అది జరగడం లేదు. విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ కావాలి.

మేము ఎంత ఖర్చు చేస్తామన్నా అప్పు పాపం పెరిగినట్లు పెరుగుతోంది. ఈ రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీస్తుంది. కాబట్టి మొట్టమొదట చర్యగా మీరు వృధాని అరికట్టాలి. రెండవది, మన పథకాల్లో ప్రాథమ్యాలు ఉండాలి. ఏ విధంగా అయినా డబ్బు ఖర్చు చేస్తే చాలదు. ఆరోగ్యశ్రీ వివరాలు చెప్పాను. పాఠశాల విద్య ఏమౌతుందో మనకు తెలుసు. ఈ పాఠశాల విద్యను బాగుచేయడానికి తలసరి పదివేలు ఖర్చుచేస్తుంటే ఫలితాలు రావడానికి, వనరులు లేని చోట అదనంగా వనరులు కేటాయించడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వండి. మనం పెట్టే ఖర్చుకి మంచి ఫలితాలు వచ్చే ఏర్పాట్లు చేయండి. అధికారాన్ని వికేంద్రీకరించండి. వనరులను ఏ గ్రామానికి ఆ గ్రామం, ఏ వార్డుకి ఆ వార్డు ఇచ్చేయండి. తలసరి వెయ్యి రూపాయలను ఇవ్వండి.

రూ. 1లక్షా 3 వేల కోట్లు మీ బడ్జెట్ ఉంటే మేము దానిలో కోరుతున్నది రూ. 8వేల కోట్లు మాత్రమే. అదనంగా కాదు. మీరు చేసే పనులు వారికి అప్పగించండి. ఆ డబ్బు వారికి ఇవ్వండి. ఈవేళ పెద్దలు చెప్పారు. రాజీవ్‌గాంధీని కాని, రాహుల్‌గాంధీని గాని వుటంకిస్తూ. మీరు సరిగ్గా చేస్తే ఈ డబ్బు మూడు రెట్లు ఫలితాలను ఇస్తుంది. ఎందుకంటే  ఈ డబ్బు వృధాగా పోతుంది.

ఇందాకే ఆరోగ్యశ్రీ గురించి మాట్లాడుకున్నాం. గత బడ్జెట్‌కు సంబంధించి మాట్లాడుకున్నాం. పాల్ క్రుగ్‌మన్‌ని ఇంటెరిం బడ్జెట్‌లో ఉదహరించారు. అదే క్రుగ్‌మన్ చెప్పారు. మనకు కావలసింది యూనివర్శల్ కేర్, క్వాలిటీ, కాస్ట్‌కంట్రోల్..... యూనివర్శల్ కవరేజ్ అక్కర్లేదు అనుకుంటే, క్వాలిటీ ఎలా వున్నా ఫర్వాలేదు అనుకుంటే ఇప్పుడు చెప్పింది అద్భుతం అవుతుంది. అదికాదు అనుకుంటే మీరు ఎవర్ని ఉ దహరిస్తున్నారో, వారు ఏం చెబుతున్నారో ఒకసారి లోతుగా తెలుసుకోండి.

పర్‌కాపిటా (Per capita) గ్రాంట్లు ఇవ్వండి. అధికారాన్ని ప్రజల చేతికి ఇవ్వండి. అన్నింటిని మించి అవినీతిని అంతం చేయడం కోసం కంకణం కట్టుకోండి. అవినీతిని గురించి మళ్ళీ మళ్ళీ ప్రస్తావన వస్తోంది. దానిని అంతం చేయడం కోసం అందరు తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు. సంకల్పానికి సంతోషం, మాటలతో కాకుండా చేతలతో అంతం చేయండి.  ఖచ్చితంగా ఈ దేశం, రాష్ట్రం కొంత ఆర్థికంగా మాంద్యం లో ఉన్న మాట వాస్తవం. దానికి ప్రజలు కొంత మూల్యాన్ని చెల్లించాలి. ప్రతిదానికీ అన్యాయంగా విమర్శించడం ధర్మం కాదు. కానీ అదే సమయంలో ఆర్థిక నిర్వహణలో, వనరుల వినియోగంలో దూరదృష్టి, విచక్షణ,  సంకల్పబలం, మన బిడ్డల భవిష్యత్తు

పట్ల మమకారం లేకపోయినట్లయితే ఊరికే వీళ్లను వాళ్ళు, వాళ్ళను వీళ్లూ ఆడిపోసుకోవడం తప్ప బిడ్డల భవిష్యత్తు బాగుపడదు.

సంస్కృతంలో ఒక శ్లోకం ఉన్నది. 'సంకల్ప పరిమితం దృశ్యం' మనం ఎలాంటి సమాజాన్ని ఊహిస్తున్నాం? 62 ఏళ్లుగా కొనసాగిన సమాజమే మళ్లీ కొనసాగాలా? ఇప్పటికీ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిననాటి కంటే ఎక్కువ పేదలున్నా, ఎక్కువ మంది అనారోగ్యంతో మగ్గుతున్నా, ఎక్కువమంది నిరక్షరాస్యులున్నా దీనినే ఇంకా కొనసాగిస్తూ, ఇది బాగుందని తృప్తిపడాలా? గౌరవ మంత్రిగారు ఒకరు ఒకసారి నాపైన చాలా కోపం తెచ్చుకున్నారు. 'ఏమండీ, మీరు వస్తే అంతా బాగుపడుతుంది అనుకుంటున్నారా' అని మీరూ – నేనూ అని కాదు. ఖచ్చితంగా మనం చాలా రంగాలలో విఫలం చెందాం. చేసిన తప్పులనే మళ్లీ మళ్లీ చేస్తూ వుండి, తప్పుదారినే మళ్లీ మళ్లీ వుండి మరింత వేగంగా నడిచాం, దానికి ఎక్కువగా వనరులు పెట్టాం, దానికి ఇంధనాన్ని బాగా పెట్టాం అనుకుంటే మరింత ఊబిలోకి కూరుకుపోతాం తప్ప పరిష్కారంలోకి రాము. 'సంకల్ప పరిమిత దృశ్యం' ఎలాంటి సంకల్పం మనకు ఉన్నది? ఎలాంటి సమాజాన్ని మనం ఊహిస్తున్నాం? దానికి ఈ బడ్జెట్ ప్రభుత్వ విధానాలు ప్రతీకలు కావాలి. ఇప్పటికైనా సరే మించిపోయింది లేదు. అందరం కలిసి విధానాలలోనూ, ఆర్థిక విధానాలలోనూ, బడ్జెట్ కేటాయింపులలోనూ ఆ మార్పులను తీసుకువస్తే రాష్ట్ర భవిష్యత్తుకు, మన బిడ్డల భవిష్యత్తుకూ సోపానాలు వేస్తారని ఆశిస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు నమస్కారాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**(04-08-2009 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

## 2010-11 రాష్ట్ర బడ్జెట్ పై...

# కొంత మంచి - చాలా చెడు

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, నాకు రెండు రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారు మీరు. ఒకటేమో తలవని తలంపుగా, ఇప్పుడు మాట్లాడమన్నారు. రెండవదేమో అందరికి ఆకలి వేసే టైమ్. ఒకటిన్నర గంట అయిపోయింది. వినే మూడ్‌లో లేరు. అందుచేత కొన్ని అంశాలు మసాలా లేకుండా మనవి చేస్తాను.

**(సభలో నవ్వులు)**

గవర్నర్ గారి ప్రసంగం ఇంగ్లీషులో ఒక సామెత చెప్పినట్టుగా వుంది. "It is like a curate's egg – good in parts – bad in parts" నేను చాలా దుర్భిణి వేసి చదివాను. నిజాయితీగా నలభై పేజీలు కూడా, ఆసాంతం, మళ్లీ, మళ్లీ చదివాను. దీనిలో కొత్తవి, మనకు పనికి వచ్చేవి, రాష్ట్ర భవిష్యత్తుకు, మన బిడ్డల భవిష్యత్తుకు ఏమిటని చెప్పి నేను చాలా జాగ్రత్తగా మంచికోసం చూశాను. కొన్ని కనిపించినాయి. కానీ, చాలా చెడు కూడా కనిపిస్తోంది. దుర్భిణీ వేసి చూస్తే కొత్తవి, మంచివి ఏమిటని అంటే, మొట్టమొదటిది ఫుడ్ ప్రాసెసింగ్ శాఖను ప్రారంభిస్తామని చెప్పారు. ఖచ్చితంగా వ్యవసాయ రంగంలో రైతు చేసిన ఉత్పత్తికి అదనపు విలువని చేకూర్చడం కోసం ప్రాధాన్యతనివ్వడం చాలా అవసరం. జాతీయస్థాయిలో మొదలుపెట్టారు. రాష్ట్రస్థాయిలో దాని గురించి పట్టించుకోలేదు. కాగితాలకే పరిమితం గాకుండా, నిజాయితీగా రైతు ఉత్పత్తికి అదనపు విలువలు వచ్చేట్టుగా ఏర్పాటు చేస్తారని, అది ఈ సంవత్సరమే ప్రారంభమవుతుందని నేను ఆశిస్తున్నాను. రెండవది పాతవైనా కూడా మళ్లీ చెప్పారు. చెప్పుకోదగ్గవే, మూడు రంగాల్లో మనం బాగున్నామని. దేశంలో కొత్త పెట్టుబడుల్లో మూడవ స్థానంలో వున్నాం. బహుశా మహారాష్ట్ర, గుజరాత్ తరువాత అయివుంటుంది. ఎన్.ఆర్.ఇ.జి.పి. వినియోగంలో మొదటి స్థానంలో వున్నాం. ఆరువేల కోట్ల పైచిలుకు సంవత్సరానికి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా మొదటిస్థానంలో వున్నాం మనం. అందుకు నేను ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. ఇంకొకటి నాకు కొత్తగా కనిపించింది ఏమిటంటే, విశాఖపట్నం–కాకినాడ పెట్రో కెమికల్స్ కారిడార్, దాన్ని గట్టిగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అది చాలా అవసరం. ఇప్పటికే చాలా ఆలస్యం అయింది.

మరొకటి గవర్నర్ గారి ప్రసంగంలో కాస్త చెప్పుకోదగ్గది ఏమిటంటే, రోడ్ల అభివృద్ధి కోసం, మౌలిక సదుపాయాల కోసం పెద్దయెత్తున ప్రపంచ బ్యాంకు నిధులతో గానీ, ప్రభుత్వ, ప్రయివేట్ రంగ భాగస్వామ్యంతో గానీ మేము కేటాయింపులు చేస్తామని, దాన్ని గట్టిగా చేపడతామని చెప్పారు. జాతీయ స్థాయిలో ఏడెనిమిదేళ్ళ క్రితమే ప్రారంభమైంది రోడ్ల అభివృద్ధి, ఇప్పటికైనా రాష్ట్రంలో చేపడతామని అంటున్నారు. చాలా సంతోషం. ఇవన్నీ కూడా చెప్పుకోదగ్గవే అధ్యక్షా.

కానీ, ప్రస్తావనకు నోచుకోనివి గానీ, దారి పూర్తిగా తప్పుదారిన మళ్లుతున్నవి గానీ చాలా అంశాలు వున్నాయి. నిజాయితీగా వాటి గురించి ప్రస్తావించుకోవాలి. మొట్టమొదటిది క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్, ఆర్థిక మాంద్యం ఎంత వున్నా కూడా, బడ్జెట్ కష్టాలు ఎంత వున్నా కూడా పెట్టుబడులు తగ్గకూడదు. విజ్ఞత గల ఏ కుటుంబమైనా సరే వున్న ఆస్తులను అమ్ముకోదు. అప్పుల్ని పెట్టుబడి కోసం ఉపయోగిస్తుంది. అప్పుల భారం పెరుగుతూ వుండగా, గవర్నర్ గారే తన ప్రసంగంలో ఒప్పుకున్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ తగ్గుతుందని చెప్పి, నెగిటివ్‌లోకి వెళ్లిందని చెప్పారు. పార్టీల సంగతి అనవసరం. ఇది ఖచ్చితంగా చాలా ప్రమాదకరమైన విషయం. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ వృద్ధిరేటు తగ్గిందంటే క్షమించగలను నేను. కానీ ఆ గ్రోత్ రేట్ తగ్గితే పర్వాలేదు గానీ, పెట్టుబడి నెగటివ్‌లోకి వెళ్లడమనేది చాలా ప్రమాదకరమైన ధోరణి. చాలా ఖచ్చితంగా దాన్ని పరిశీలించవలసిన అవసరం వున్నది. రెండవది ప్రస్తావన చేసిన వాటిలో కూడా ఫ్యాన్సీ ఐటమ్స్ వున్నాయి కానీ, దీర్ఘకాలిక దృష్టి లేదు. ఉదాహరణకు హైదరాబాదు నగరంలో గ్యాస్ గ్రిడ్ అని చెప్పారు. గతంలో గవర్నర్ గారి ప్రసంగంలో చూశాను. ఇప్పుడు కూడా చూశాను.

మహాశయా, ఈ రాష్ట్రానికి కావల్సింది హైదరాబాదు నగరంలో గ్యాస్ గ్రిడ్ కాదు. ఇక్కడ ఏ ఇంటిలో కూడా గ్యాస్ సిలెండర్ లేక మేమేమీ సతమతమవడం కావడం లేదు. కాకపోతే ఇంట్లో గ్యాస్‌గ్రిడ్ పెడితే, మేము ఆ యొక్క గ్యాస్ పైపు నుంచి తీసుకుంటాం. లేకపోతే గ్యాస్ సిలెండర్ వస్తుంది. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి కావాలి. దాదాపుగా రెండు వందల మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఈ రాష్ట్రంలో వచ్చే అవకాశం వుంటే, దాన్ని పరిశ్రమల కోసం వాడాలని చెబుతున్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక గ్యాస్ గ్రిడ్ కావాలి. గుజరాత్‌లో ఏడు గ్యాస్ పైప్ లైన్స్‌ను గ్రిడ్ కోసం వారు గ్యాస్ ఎలొకేషన్ లేకుండానే ముందు చూపుతో ఏర్పాటు

చేసుకున్నారు. ఇన్నిసార్లు చెప్పాక కూడా, ఇప్పటికి కూడా రాష్ట్రంలో గ్యాస్ గ్రిడ్ గురించి మాట్లాడకుండా, హైదరాబాద్ నగరంలో వంటింటి గ్యాస్ గ్రిడ్ గురించి మాట్లాడుతున్నారు. అంటే, ప్రభుత్వానికి ఆర్థికాభివృద్ధి గురించిన అవగాహన ఏమాత్రం లేదు. కటువైన మాటైనా సరే చెప్పాల్సివస్తున్నది. దాని గురించి ఆలోచన లేదు.

మూడవది, నిస్సందేహంగా మొన్నటి వరదల్లో ప్రభుత్వం గానీ, ప్రయివేట్ రంగంలో గానీ, స్వచ్ఛంద సంస్థలు గానీ, రాజకీయ పార్టీలు గానీ, పత్రికలు, టీవీఛానళ్లు గానీ, ఎప్పుడు లేనంత విధంగా బాగా స్పందించాయి. అందుకు నేను అభినంది స్తున్నాను. కానీ దీర్ఘకాలంగా సంగతేమిటి. గవర్నర్ గారి ప్రసంగంలో మేము ప్రాణాలు రక్షించామని అన్నారు. ఖచ్చితంగా దానికి ప్రభుత్వానికి మార్కులు రావాలి. అందుకు నేను ఒప్పుకుంటున్నాను. తాత్కాలిక సేవలందించామని అన్నారు. సంతోషం. దానికి కూడా నేను ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. కానీ, దీర్ఘకాలిక సంగతి ఏమిటి? ముఖ్యమంత్రిగారు ఎప్పుడు లేనంతగా పెద్దయెత్తున రూ. 68,450/–లు వరద ప్రాంతాల్లో ఒక్కొక్క ఇంటికి ఇందిరా ఆవాస్ యోజన క్రింద మంజూరు చేశారు. కానీ కాగితాల మీద మనం ఇక్కడ రాస్తే చాలదు. అధ్యక్షా, మనకు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో కూడా చూడాలి. ఉదాహరణకు మహబూబ్‌నగర్ జిల్లాలో నేను స్వయంగా వెళ్లి చూశాను. ఒక్కొక్క జిల్లాలో ఒక్కో గ్రామాన్ని మా లోక్‌సత్తా పార్టీ దత్తత తీసుకున్నది. ఇప్పటికి కూడా ఒక్క ఇంటికి కూడా పునాది పడలేదు అధ్యక్షా. వరద వచ్చిందేమో అక్టోబర్‌లో. ప్రస్తుతం ఫిబ్రవరి మాసం నడుస్తోంది. డబ్బులున్నాయి, మంజూరు చేశామని ప్రభుత్వం చెబుతోంది. ఒక్క ఇంటికి కూడా పునాది పడలేదు. నేను చెప్పేది అతిశయోక్తి కాదు. నేను అబద్ధం ఆడడం లేదు. పూర్తిగా వాస్తవం నేను చెప్పేది ఉదాహరణకు మహబూబ్‌నగర్ జిల్లా, ఐజ మండలంలోని కేశవరం గ్రామంలో ఒక్క ఇంటికి కూడా ఇంత వరకు పునాది పడలేదు. అలాగే ఒక్క ఎకరం పొలానికి కూడా తుంగభద్ర వరద వస్తే, ఆ పొలాల్లో ఇసుక మేటలు వేస్తే, ఒక్క ఎకరం పొలానికి కూడా... ప్రభుత్వం నుంచి ఋణంగానీ, సబ్సిడీగానీ అందలేదు. సహకార బ్యాంకులు నుంచిగానీ, వాణిజ్య బ్యాంకుల నుంచిగానీ, రైతులకు ఋణం ఇప్పించలేకపోయారు. రైతులు స్వంతంగా అప్పో సప్పో చేసి ఒక వంద ఎకరాల పొలాన్ని మాత్రం బాగుచేసుకున్నారు. గ్రామంలోని మిగతా రెండు వందల ఎకరాల్లో ఇసుక మేటలు అలాగే వున్నాయి. ఏ ఒక్క ఎకరం పొలానికీ ఋణం ఇంత వరకు

అందలేదు. అంటే ఖచ్చితంగా డబ్బు లేకపోవడం కాదు. ప్రభుత్వం తీరులో, యంత్రాంగం పనితీరులో మౌలికమైన లోపం వుందని నిజాయితీగా అంగీకరించి, చెప్పి తీరాలి. ఇక దీర్ఘకాలికంగా వరద నివారణ చర్యలు. నిజమే, మొన్న వచ్చిన వరద అసాధారణమైనది. పదివేల సంవత్సరాల కాలంలో ఒకసారి వచ్చేది. ఇరవై ఐదు లక్షల క్యూసెక్కుల నీరు కృష్ణానదిలోకి రావడమనే విషయాన్ని చరిత్రలో ఎప్పుడూ మనం వినలేదు. అలా జరుగుతుందని చెప్పి ఎప్పుడూ అనుకోలేదు. కానీ ఇప్పుడు వచ్చింది. కాబట్టి భవిష్యత్తులో రాదనే నమ్మకం లేదు. కానీ దీని గురించి ఒక్కటంటే ఒక్కమాట గవర్నర్ గారి ప్రసంగంలో వుంటుందని నేను చూశాను. ఇక నుంచి కృష్ణా డెల్టాలో ఇరవై ఐదు లక్షల నీటి ప్రవాహనికి తగ్గట్టుగా మేము దీర్ఘకాలికంగా ఫ్లడ్ ప్రూఫింగ్ చేపడతాము, వరదలు వచ్చినా కూడా తట్టుకునేట్టుగా చేపడతాము, పది లక్షల క్యూసెక్కుల నీరు వస్తే బెంబేలెత్తే పరిస్థితి గాకుండా, ఇరవై ఐదు లక్షల క్యూసెక్కుల నీరు వచ్చినా కూడా తట్టుకునేటట్టుగా అందుకోసం కరకట్టలు గానీ, ఫ్లడ్ ప్రూఫింగ్ గానీ చేస్తామనే మాట వుంటుందేమోనని చూశాను. పొరపాటుగా కూడా నలభై పేజీల గవర్నర్ గారి ప్రసంగంలో ఎక్కడా లేదు. నేను చెప్పే దాంట్లో ఏమైనా తప్పుగా వుంటే క్షమించండి అధ్యక్షా, నాకు మాత్రం ఒక వాక్యం కూడా ప్రసంగంలో కనిపించలేదు. అంటే, మళ్లీ ఇందాక చెప్పినట్టుగానే, తాత్కాలికమైన ఏర్పాట్లు తప్ప, దీర్ఘకాలికంగా బాగుచేయడం గురించిన అవగాహన ప్రభుత్వంలో కొరవడిందని మాత్రం స్పష్టంగా కనబడుతోంది.

ఇక వ్యవసాయం గురించి. ప్రభుత్వం మళ్లీ, మళ్లీ చెప్పుకునేది ఆహారధాన్యాల ఉత్పత్తి గత ఐదేళ్లలో ఏటా 8.98 శాతం పెరిగింది. అద్భుతంగా చేశాం. దేశంలో మూడు, నాలుగు శాతం వ్యవసాయం రంగంలో అభివృద్ధి జరిగితే మాది ఆరు శాతం అని చెప్పారు. చాలా సంతోషం. కానీ, అధ్యక్షా, గత సంవత్సరం పదమూడు వేల కోట్ల రూపాయలు ఈ రాష్ట్రంలోనే ఋణ మాఫీ ద్వారా గానీ, తీసుకున్న ఋణాలు తీర్చిన రైతులకు మళ్లీ ఐదు వేల రూపాయల ప్రోత్సాహకం ద్వారా గానీ దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా లేనంతగా పదమూడు వేల కోట్ల రూపాయలను రైతులకు ఇవ్వగా, ఉచితంగా విద్యుత్తును, రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతున్నా కూడా భారాన్ని వేసుకుని ఇస్తుండగా, మరెన్నో సబ్సిడీలను రైతులకు అందిస్తుండగా, కాస్తంత దుర్భిక్షానికి గురికాగానే ఒక్కసారి నలభై లక్షల టన్నుల ఆహారధాన్యం పడిపోయిందే ఉత్పత్తి. అంటే, ఎన్నేళ్ళుగా, ఎన్నో ప్రయత్నాలు చేసి, ఇన్ని వేల, లక్షల కోట్ల

రూపాయలు ఖర్చు పెట్టినా, జలయజ్ఞాన్ని గురించి మనం ఎన్ని మాటలు చెప్పుకున్నా, వరుణదేవుడు కరుణించకపోతే, ఒక్క సంవత్సరం రెండు మూడునెలలు వర్షాలు సరిగ్గా పడకపోతే, తరువాత వర్షాలు ఎక్కువయి వరదలు వచ్చినా వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** (కం) ఉచిత విద్యుత్‌ని రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతున్నప్పటికి కూడా భారాన్ని వేసుకొని ఇస్తుండగా మరిన్ని సబ్సిడీలు అందిస్తుండగా కాస్తంత దుర్భిక్షానికి గురి కాగానే ఒకేసారి 40 లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోయింది. ఇన్ని ఏళ్లుగా ప్రయత్నాలు చేసి ఇన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా జలయజ్ఞం గురించి ఎన్ని మాటలు చెప్పుకున్నా వరుణదేవుడు కరుణించకపోతే ఒక మూడు నెలల పాటు వర్షం తగ్గితే ఆ దెబ్బకి ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఆహారమే కాదు వ్యవసాయ ఉత్పత్తి మొత్తం తగ్గిపోతుంది. నెగిటివ్ గ్రోత్‌కి వచ్చేశామే అంటే ఏమిటి వరుణ దేవుడి కటాక్షాన్ని మన గొప్పతనంగా చెప్పుకుంటున్నాము. వేల కోట్ల రూపాయలు ఓట్ల కోసమని డబ్బులు పంపిణి చేస్తున్నాము. వ్యవసాయాన్ని, గ్రామాలని మాత్రం బాగుచేయలేకపోతున్నాము. నిజాయితీగా నిష్కర్షగా ఒప్పుకోవాలి. మన విధానాల్లో వాటి అమల్లో మౌలికమైనటువంటి లోపం మనది. అది గుర్తించకుండా గతానుభవాన్ని గురించి వాగాడంబరాలు చేస్తే లాభం లేదు.

**ఇక ఆర్థిక నిర్వహణ :** మన ముఖ్యమంత్రిగారికి దేశంలో వున్న ప్రత్యేకమైన పేరు ఏమంటే ఆర్థిక నిర్వహణ విషయంలో ఎఫ్‌బిఆర్‌ఎంని చాలా జాగ్రత్తగా పాటించడంలో కానీ, పొదుపుగా వనరులను వినియోగించడంలో కానీ దానిలో ఎవరూ రోశయ్యగారికి సరిపోరు. అందుకు వారిని అభినందిస్తున్నాను. దుబారా ఖర్చును అరికట్టడంలో మాత్రం ఇప్పటిదాకా అనుకున్నంత విజయాన్ని సాధించలేదు. చేసిన ఖర్చుకి ఫలితం వచ్చే ఏర్పాటు చేయకపోతే ఎంత ఖర్చుపెట్టినా ఉపయోగం లేదు. ఇవాళ ప్రశ్నోత్తరాల సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా గురించి చర్చ వచ్చింది. 4 పథకాలకు 6 వేల కోట్ల రూపాయలు పైచిలుకు మంజూరు చేశామని చెప్పి సగర్వంగా ఇరిగేషన్ మంత్రిగారు చెప్పారు. ఇప్పటికి నేను లెక్కవేస్తే 3,638 కోట్ల రూపాయలు ఖర్చు అయినది. ఒక్క ఎకరం కూడా ఇరిగేషన్ రాలేదు. అంటే ఏమి జరుగుతున్నది? నెమ్మదినెమ్మదిగా ప్రతి సంవత్సరం 10 శాతం ఖర్చు పెట్టి వడ్డీ భారం పెంచిపారేసి రాష్ట్రం నడ్డి విరగకొట్టడమే తప్ప ప్రాధమ్యాల ప్రకారం చేపట్టి, పెట్టిన ఖర్చుకి ఫలితాలు

వెంటనే ఇచ్చి వ్యవసాయాన్ని, గ్రామాల్ని బాగు చేద్దామన్న స్పృహలేదు. ఖర్చు చూపెడుతున్నారు. కాని ప్రజల ప్రయోజనాన్ని చూపించడం లేదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రిగారూ! దయచేసి మీరు ఆర్థికమంత్రిగా పెట్టే ఖర్చుకి ఫలితాలు వచ్చేటట్లుగా ఈ పథకాలను పునస్సమీక్ష చేసి రీఓరియంట్ చేయండి. లేకపోతే లక్షా 76 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది; ఫలితాలు రావు. నేను ఖచ్చితంగా వచ్చే 5 సంవత్సరాలలో జరగబోయేది ఇవాళ ప్రివ్యూ చూపెడుతున్నాను. 4 సంవత్సరాల తరువాత మనం మనల్ని బాధపెట్టుకోవడం కాకుండా ఇప్పటికైనా సరే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ డబ్బుని పద్ధతి ప్రకారం ఖర్చు పెడితే ఫలితాలు వస్తాయి, రైతులకు న్యాయం జరుగుతుంది. రాష్ట్రం బాగుపడుతుంది. ఏడాదిలో పథకానికి కేటాయించిన దానిని ముందు పెట్టండి; తరువాత రెండవది పెట్టండి, తరువాత మూడవది పెట్టండి – సంవత్సరానికి ఒక పథకం కంప్లీట్ అవుతుంది. 2013, 2017లో పథకాలు అన్నీ పూర్తి అవుతాయని ఊరించేకంటే సంవత్సరానికి 2, 3 పథకాలు ప్రతి జిల్లాలో పూర్తి చేయండి, దానికి ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నాను. ఆర్థిక భారం ఎంత వున్నా కూడా ఖర్చు పెట్టే చోట ఖర్చు పెట్టాలి. రైతు అప్పులుపాలు అవుతాననే భయంతో విత్తనాలు కొనడం కోసం వెరచినట్లయితే వచ్చే సంవత్సరం పంట రాదు. ఆర్థికాభివృద్ధికి కావల్సిన విధంగా ఖర్చు పెట్టకపోతే, అవసరానికి ఖర్చు పెట్టకపోతే, అనవసరానికి ఖర్చు పెట్టి ఫలితం రాకుండా పోతే, రెండు రకాలుగా దివాళాతీస్తాము. ఆర్థిక నిర్వహణ విషయంలో వెసులుబాటు ప్రదర్శించవలసిందిగా ప్రత్యేకంగా కోరుకుంటున్నాను.

**విద్యుత్‌రంగం:** ఈ సంవత్సరం పుష్కలంగా వర్షం వద్దు అన్నా కూడా వానవచ్చి వరదలు, రిజర్వాయర్లు అన్ని కూడా ఎప్పుడు వూహించనంత స్థాయిలో నిండిపోయిన తరువాత కూడా ఇవాళ రాష్ట్రంలో విద్యుత్ కొరత. ఇవాళ కూడా విద్యుత్ కోత పెడుతున్నారు. హైద్రాబాదు నగరంలో కూడా కోత పెడుతున్నారు. అంటే విద్యుత్ నిర్వహణ ఎంత బాధాకరంగా వుందో స్పష్టంగా తెలుస్తుంది. గవర్నర్ గారి ప్రసంగంలో కొత్త విద్యుత్ ఉత్పాదనలు తప్ప ఎన్ని వేల మెగావాట్లు మొదలు పెట్టామో చెప్పి దివాళా తీసే పథకాలు చెబుతున్నారు. కాబట్టి విద్యుత్ పంపిణీని బాగుచేయడం కానీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని బాగు చేయడం కానీ విద్యుత్ రంగంలో వున్న లోటు నివారించడానికి ఎట్లాగన్న ఆలోచన పొరపాటున కూడా సూచన మాత్రంగా కూడా తెలియచేయలేదు.

**విద్యా, ఆరోగ్యం :** విద్య, ఆరోగ్యం ప్రభుత్వ కేటాయింపులలో ఖర్చు మాట్లాడు తున్నది. కొన్ని పథకాల గురించి 104, 108, ఆరోగ్యశ్రీ, అలాగే విద్యారంగంలో సర్వశిక్షాభియాన్, రాబోతున్న సెకండరీ ఎడ్యుకేషన్ మిషన్ వీటి గురించి మాట్లాడుతున్నాము. ఫలితాల్ని గురించి మాట్లాడడం లేదు. విద్యారంగంలో ఈ సంవత్సరంలోనే మూడు నెలల క్రితం యాన్యువల్ స్టేటస్ ఎడ్యుకేషన్ రిపోర్టు. ప్రయివేటు రంగం నుంచి స్వచ్ఛందసంస్థల నుంచి ప్రతి సంవత్సరం వస్తుంది. ఈ సంవత్సరం కూడా వచ్చింది అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో వున్న అధ్యాపకుల ద్వారా సర్వేలు చేయించింది. రెండు కూడా ఒకే మాటా చెబుతున్నాయి. స్కూలుకు వెళుతున్న పిల్లల్లో 30 నుంచి 40 శాతం మందికి 7వ తరగతిలో చదవడం రావడం లేదు. 60 శాతం మందికి 7వ తరగతిలో చిన్న చిన్న లెక్కలు రావడం లేదు. విద్య, ఆరోగ్యం అంటే ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టాము అన్నది మాత్రమే కాదు, దాని వల్ల ఫలితాలు ఏమి వస్తున్నాయి. ఆరోగ్యం సంగతి మళ్లీ, మళ్లీ ప్రస్తావన, నిన్న డెంగూ వ్యాధి, ఇతర వ్యాధుల గురించి వచ్చింది. ఆరోగ్యశ్రీ పరిష్కారం ఏమీ కాదు, రాష్ట్రంలో మలేరియా వ్యాధికి వేలమంది చనిపోతున్నారు. డెంగూ వ్యాధికి వేలాదిమంది చనిపోతూ వుంటే దోమల్ని నియంత్రించలేనటువంటి వ్యవస్థ. ప్రజారోగ్యం అంటే కనీసం అర్థం కాని వ్యవస్థ. ఎన్ని వేలు ఖర్చు పెడితే అంత ఎక్కువ ప్రజలకు న్యాయం చేసే వ్యవస్థ లేకుండా ఈ దేశంలో ఆరోగ్యాన్ని విద్యని బాగుచేయలేము. ఒక వైద్యుడిగా, ప్రజారోగ్యం పట్ల లోతైన స్పృహ వున్న వాడిగా, జాతీయ ఆరోగ్య మిషన్‌ను రాసిన వాడిగా నేను స్పష్టంగా చెబుతున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆరోగ్యం అంటే కనీసం అవగాహన లేదు. వేలాది కోట్ల రూపాయలు ఖర్చుపెట్టడమే తప్ప ప్రజల ఆరోగ్యం సాధించాలంటే దీనిని పునసమీక్షించడం ఎట్లాగో తెలియదు. దయచేసి ఇప్పటికైనా సరే, జాతీయ ఆరోగ్య మిషన్ స్ఫూర్తిని అర్థం చేసుకొని విద్యని, ఆరోగ్యాన్ని ప్రజలకు అందించే ఏర్పాట్లు నిజాయితీతో చేయకపోయినట్లయితే ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా కూడా ప్రజాధనం వృధా అవుతుంది తప్ప ప్రజలకు న్యాయం జరగదు.

**మైనింగ్ పాలసీ:** దేశంలో మాకు అత్యధికంగా రెవిన్యూ వస్తుందని చెప్పారు. గత సంవత్సరం చాలా వివాదం దీనిమీద చెలరేగింది. ఇనుప ఖనిజం మీద ముందు 16 రూపాయలు వసూలు చేసి ఇవాళ 130, 150 రూపాయలు వసూలుచేసి, విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ ప్రయివేటు సెక్టారు వస్తావుంటే ఫస్ట్ కమ్, ఫస్ట్ సర్వ్ అని చెప్పి

మీరు మైన్సుని కేటాయించి అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి, బంధు ప్రీతికి పెద్దపీట వేస్తున్నారు తప్ప, రాష్ట్రంలో ఖజానా నింపడం లేదు. వచ్చే లాభం ప్రజలకు అందే ఏర్పాట్లు చేయడం లేదు. విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ ఉండాలి. ఫస్ట్ కమ్, ఫస్ట్ సర్వ్ బేసిస్ మీద కాకుండా వచ్చిన వాళ్ల మధ్య కాంపిటీటివ్ బిడ్డింగ్ పెట్టి అంతర్జాతీయ మార్కెట్టులో వున్న పరిస్థితులను బట్టి ఖనిజానికి డిమాండ్ ఎంత వుందో చూసి, ఎవరు ఎక్కువ రేటు ఇస్తామంటే వారికే ఇచ్చే ఏర్పాటు చేయాలి. అలా కాకుండా నాకు ఇష్టమైన వాడికి నేనే అప్లికేషన్ పెట్టించి, 5 నిమిషాల ముందు నోటిఫికేషన్ పెట్టించి వాళ్లు ఇచ్చిన కాగితమే మొట్టమొదటిదని చెప్పి ఇచ్చినంతకాలం బంధుప్రీతి వుంటుంది. అశ్రితపక్షపాతం వుంటుంది. కానీ ప్రజాధనానికి నిజమైన పోటీ వుండదు. నేను వ్యక్తిగతమైన ఆరోపణలు చేయడం లేదు. విధానపరమైన విషయాలను– సహేతుకమైనవి మనవి చేస్తున్నాను. నాకు ఆ పార్టీ ఈ పార్టీ అని తేడా లేదనే సంగతి అందరికీ తెలుసు. నాకు కావాల్సింది వచ్చే లాభాలు అన్నీ రాష్ట్ర ఖజానాకు వెళ్లాలి కానీ కొందరి జేబులోకి మాత్రం కాదు. నిజమైన, ఆరోగ్యకరమైన పోటీ వుండాలి కాని పోటీ వ్యవస్థలో ఆశ్రిత పక్షపాతం, అర్జెంటు అప్లికేషన్ ఇచ్చినవాడికి మైన్సు మంజూరు చేయడం కాదు. ప్రభుత్వ రంగంలో వున్న ఫ్యాక్టరీలకు–స్టీల్‌ప్లాంటు కావచ్చు, మరొకటి కావచ్చు – వారికి కావలసిన మేరకు ఖనిజాన్ని కేటాయించాలి. కానీ దానిని వదిలివేసి ప్రయివేటురంగానికి పెద్దపీట వేయడం కాదు. ఈ మూడు కూడా చాలా హేతుబద్ధమైనవి: కొత్త విషయాలు ఏమీ కాదు, మీకు తెలుసు వాస్తవం ఏమిటో: జరిగింది ఏదో జరిగిపోయింది. ఇప్పటికైనా మొదలు పెట్టండి, లేకపోతే ఖనిజాల మీద ఆదాయం ఎక్కువ వచ్చిందీ అంటే మీకు 10 రూపాయలు వస్తే పోయేది వంద రూపాయలు అవుతుంది.

నాకు చాలా ఆశ్చర్యాన్ని కల్గించేది...మూడు ముఖ్యమయిన అంశాల గురించి ప్రస్తావన మాట మాత్రం కూడా లేదు. అంటే నేను భారతదేశంలో ఉన్నానా, మరే. దేశంలోనో ఉన్నానో నాకే ఆశ్చర్యంగా వున్నది. ఒక అమెరికన్ స్టేట్ ఆఫ్ ది యూనియన్ అడ్రస్ చూస్తే ఇలాంటి ఈ ప్రస్తావన లేకపోతే నేను ఆశ్చర్యపడను. ఎందుకంటే ఇవి అన్ని కూడా వాళ్లకి అక్కరలేదు. వాళ్లకి ఈ సమస్యలు చాలా మేరకు పరిష్కారం అయినాయి. మన రాష్ట్రంలో సంవత్సరానికి ఒకేసారి వచ్చే గవర్నర్ గారి ప్రసంగంలో ప్రభుత్వ విధానాన్ని, ప్రభుత్వం మార్గాన్ని స్పష్టంగా చూపెట్టేటటు వంటి, దిశ నిర్దేశించే ప్రసంగంలో ఒక్కమాట కూడా మచ్చుకు కూడా ప్రస్తావన లేదు. అంటే అసలు ప్రభుత్వానికి ఇది సమస్యగా కనిపించలేదు.

**అవినీతిపై** అధ్యక్షా 1. అవినీతి విశృంఖమైపోయింది. రాష్ట్రంలో వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని తరలించుకుపోతున్నారు. ప్రభుత్వోద్యోగులు కానీ, అధికారములో వున్న వారు కానీ అందుకు అవకాశం వున్నవారు ఈ దేశానికి, ప్రజలకు హాని చేస్తున్నారు. ఎన్నో సందర్భాలలో మనమే ప్రతి సంవత్సరం ఆగస్టు 15, లేదా జనవరి 26వ తేదీలలో అవినీతి గురించి మాట్లాడుతున్నాం. మచ్చుకైనా సరే, కనీసం మాట వరుసకైనా సరే అవినీతిని అంతం చేస్తామనే మాట ప్రభుత్వం నుంచి గవర్నర్ నోటి ద్వారా ఒక మాట కూడా రాలేదంటే అవినీతే ప్రభుత్వ విధానమా, అవినీతి మార్చలేమని ప్రభుత్వం పూర్తిగా చేతులు ఎత్తివేసిందా? ఈ సభ ముందే గతంలో గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని చర్చలో నేను ఒక బిల్లును మీకు చూపించాను. అది మీకు, సభ నాయకులందరికీ పంపించాను. తర్వాత ప్రధాన ప్రతిపక్షం వారు ఇటీవల దానిని మేము చేపడతాం ఈ చట్టం వచ్చేటట్లుగా ఈ రాష్ట్రంలో గట్టిగా ప్రయత్నం చేస్తామని అన్నారు. నేను ప్రభుత్వానికి, ప్రధాన ప్రతిపక్షానికి సవినయంగా మనవి చేస్తున్నాను. అయ్యా ఈ రాష్ట్ర భవిష్యత్తును అంధకారం చేయకుండా వుండాలంటే రాష్ట్రానికి ఈవేళ అవినీతి అన్నది మాయని మచ్చగా వున్నది. అవినీతి విశృంఖలంగా వున్న భారతదేశంలో కూడా, ఢిల్లీ పురవీధులలో కూడా, ఆంధ్రప్రదేశ్ అవినీతిని గురించి విపరీతంగా కథలు కథలు చెప్పుకుంటున్న మాట వాస్తవం. ఈ రాష్ట్రానికి వున్న అపప్రధను తొలగించండి. అవినీతి నిరోధం కోసం, అవినీతిపరుల భరతం పట్టడం కోసం, కఠినమైన చట్టాన్ని తీసుకొని వచ్చి ఇప్పటికైనా ఉదాసీనతను వదలి ప్రజలకు న్యాయం చేయండి.

**స్థానిక ప్రభుత్వాలు :** ఇక రెండో విషయం. ఈ సంవత్సరం వచ్చే కొద్ది నెలలో స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలు జరుగుతాయి. రాజ్యాంగ సవరణ వచ్చి 15 సంవత్సరాలు పూర్తి అయింది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ప్రభుత్వాలు అత్యంత పేలవంగా వున్నాయి. మన ఫెడరల్ వ్యవస్థలో మూడవ స్థాయి సంస్థలు అతి బలోపేతంగా కావల్సిన సంస్థలు. జనం చేతులలో అధికారం పెట్టకపోవటం చేతనే, ఆక్రోశం వల్ల ఈ రోజు ఉద్యమాలు వస్తున్నాయి. అధికారం పంచుకోవాలనే ఆరాటంతో ఎందరో మనుషులలో కసి పెరుగుతున్నది. 40 పేజీల గవర్నర్ గారి ప్రసంగంలో పెడరల్ వ్యవస్థ గురించి ఒక మాట కూడా రాలేకపోయింది. అధికారం మొత్తం ఎంఎల్ఎలు, అధికారుల చేతులలో పెట్టివేసి ప్రజలకు నిరాశ మిగిలించారు. ప్రజలలో శాసనసభ మీద, ప్రభుత్వాల మీద, రాజకీయాల మీద ద్వేషం రగిలించి ఈ దేశాన్ని ఉద్యమాల

కుంపటిగా మార్చడమే మన లక్ష్యమా? లేక జనం చేతులలో అధికారాన్ని పెట్టి మేము కట్టిన పన్ను డబ్బులు మాకు వినియోగమవుతాయనే నమ్మకాన్ని మాకు కలుగచేసి, మేము వేసిన ఓటు వల్ల మాకు మంచి జరుగుతుందనే విశ్వాసాన్ని కలుగజేసి అధికారం ఎక్కడ వుందో అక్కడ బాధ్యతను ఇచ్చి ప్రజాస్వామ్యాన్ని సార్థకం చేయడం మన లక్ష్యమా? దయచేసి రాజ్యాంగాన్ని ఇప్పటికైనా గుర్తించండి. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు ఇచ్చేందుకు ఇప్పటికైనా ఆలోచన చేయండి. కేవలం ఎన్నికలు జరపడం కాదు.

మనం గత 15 ఏళ్లుగా అభివృద్ధిపంథాని చూశాం. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కూడా అభివృద్ధి నమూనా ఏమి మారలేదు. ఇది కేంద్రీకృతమైన అభివృద్ధి. హైదరాబాదు నగరం చుట్టూ జరుగుతున్న అభివృద్ధి. ఈ రాష్ట్రంలో లక్షలాది యువతకు ఉపాధి కల్పించని అభివృద్ధి. ఈ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో హాహాకారాలు పెంచే అభివృద్ధి. ఈ రాష్ట్రంలో గ్రామీణులు, రైతుల ఆత్మహత్యలను పెంచే అభివృద్ధి. అభివృద్ధి జరగడం లేదని ఎవరూ అనరు. కానీ 9 శాతం అభివృద్ధి కనిపించిన 5 ఏళ్ల కాలంలో ఇంకా పేదరికం తగ్గలేదు. ఇంకా ఉపాధి పెరగలేదు. ఇంకా ఉపాధి కోసం హైదరాబాదుకో, బొంబాయికో, బెంగుళూరుకో, చెన్నైకో తరలిపోవల్సి వస్తోందంటే అంతకంటే సిగ్గు చేటు లేదు. వీరు పెద్ద పెద్ద ఉద్యోగాల కోసం తరలిపోవడం లేదు. నెల రు॥15 వేలు లేక రూ॥ 5 వేల కోసమో తరలిపోవడం లేదు. కేవలం నెలకు రూ॥3 వేలకు హైదరాబాద్ లేక బెంగుళూర్‌కు వెళ్తున్నారు. అందుకే వికేంద్రీకరించిన అభివృద్ధి అవసరం. రాష్ట్రంలో కనీసం వేయి చిన్న పట్టణాలను ఏర్పాటు చేసి ఒక్కొక్క చిన్న పట్టణానికి రూ॥ 50 కోట్లు మంజూరు చేసి పూర్తి మౌలికసదుపాయాల కల్పన చేయండి. అక్కడ ఉపాధి కల్పన కోసం శిక్షణను ఇచ్చి అక్కడ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రోత్సాహకాలు ఇచ్చి, అభివృద్ధి ఫలాలు అందరికీ అందించండి. ఎన్ని పరిశ్రమలకు ఎన్ని వేల కోట్ల రూపాయలు సబ్సిడీలు ఇచ్చారని ఈవేళ ప్రస్తావనకు వచ్చింది. ఆ సబ్సిడీలు ఆ స్థాయిలో ఇచ్చి లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఏర్పాట్లు చేయాలి. Food Processing అందులో భాగంగా అయితే చాలా సంతోషం... ఉపాధి కల్పన కోసం ప్రయత్నం చేస్తారని ఆశిస్తున్నాను. చివరిగా ఒక మాట. గాంధీజీ talisman గవర్నర్ గారి ప్రసంగంలో ఉదహరించారు. ఈ ప్రసంగాలు ఎవరు తయారు చేస్తున్నారోగానీ చాలా చక్కటి కొటేషన్లు ఇస్తున్నారు. గతంలో గవర్నర్ గారి ప్రసంగంలో నారాయణన్ గారు

అద్భుతంగా చెప్పిన మాటను ఉదహరించారు. ఆ మాటను ప్రభుత్వంలో వున్న వారు చదివారో లేదో, గుండెలలోకి ఎక్కించుకున్నారో లేదో తెలియదు. ఈ రోజేమో గవర్నర్ గారి ప్రసంగంలో గాంధీజీ talisma అను ఉదహరించారు. నేను ఎప్పుడు దాన్ని నా ఎదురుగా పెట్టుకుంటాను. నిజంగా పాటించే ప్రయత్నం చేస్తాను. దానిలో బాపూజీ చెప్పింది మరొకసారి సభ దృష్టికి తీసుకొని వస్తాను. బాపూజీ చెప్పింది మారుమూల పూరి గుడిసేలో వున్న వాడికి సహాయం చేయమని చెప్పలేదు. మారుమూల పూరిగుడిసెలో వున్న ఆ సామాన్యుడి జీవితం మీద తనకు అధికారం పెరిగేటట్లైతే ఆ పని చేయండన్నాడు. ప్రజల శక్తి సామర్థ్యాలు పెంచండన్నారు, జనసత్వాలను పెంచండన్నారు. ఆత్మస్థయిర్యాన్ని పెంచండన్నారు. ఆత్మ విశ్వాసాన్ని పెంచండన్నారు. వాళ్లను సంపద సృష్టించే పౌరులుగా తయారు చేయండి గానీ బికారులుగా, బిచ్చగాళ్లుగా తయారు చేయకండి. మీరిచ్చే ఎంగిలి మెతుకుల కోసం నిరంతరం వేచి ఉండేవాళ్లుగా తయారు చేస్తే ఈ దేశంలో ఉండేది పౌరులు కాదు. బిచ్చగాళ్లని మహాత్మాగాంధీ స్పష్టంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నోసార్లు చెప్పారు. గవర్నర్ గారి ద్వారా ఆ మాటలను మీరు వినిపించారు. దయచేసి ఆ మాటలను అర్థం చేసుకోమని కోరుతున్నాను.

అధ్యక్షా, ఒక తహశీల్దారు గారు ఉన్నారు. ఆ తహశీల్దారు గారి మీద కాన్ఫిడెన్షియల్ రిపోర్టు రాయమని కలెక్టర్ గారి దగ్గరకు వచ్చింది. ఈయన ఇరవై సంవత్సరాల అనుభవం కలిగిన తహశీల్దారని రాశారు. ఇది ఆ పై అధికారి దగ్గరకు వెళ్లింది. ఆయన ఏం రాశారంటే "ఇది నేను ఒప్పుకోను. ఒక్క సంవత్సరం అనుభవాన్ని ఇరవై సంవత్సరాలు రిపీట్ చేసిన తహశీల్దార్ ఈయన అని అన్నారు." ఇవ్వాళ జరుగుతున్నది, గత అనుభవాన్ని బేరీజు వేసుకుని భవిష్యత్తును నిర్మించుకోవడమే కాకుండా గత అనుభవం నుంచి పాఠాలు నేర్చుకుని పంథాని అవసరమైనచోట మార్చుకోవడం కాకుండా ఎంతసేపటికి చర్విత చర్వణం ఎంతసేపటికి పాత చింతకాయ పచ్చళ్లు, ఎంతసేపటికి పాత విధానాలు, పాత మాటలు తప్ప ఈ దేశ అవసరాలు, ఈ జాతి అవసరాలు ఈ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల ప్రజల అవసరాలు పట్టించుకునే శక్తి లేనటువంటి దురవస్థను మనం చూస్తున్నాం. గవర్నర్ ప్రసంగంలోని చాలా భాగాలు దానికి ఉదాహరణ. దయచేసి ఈ విమర్శను సహేతుకమైన విమర్శగా, ఆరోగ్యవంతమైన విమర్శగా మీరు స్వీకరించండి. దీనినుంచి పాఠాలు నేర్చుకుని ఈసారి గవర్నర్ ప్రసంగంలో గత సంవత్సరంలో ఈ రకంగా దిశను మేము మార్చాం,

దశ తిప్పాం ఈ రాష్ట్ర భవిష్యత్తును మారుస్తున్నామని సగర్వంగా చెబుతారని ఆశిస్తూ గవర్నర్ ప్రసంగంపై నాకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

**(20-02-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# వెనుకబాటుతనంపై అపోహలు తొలగించండి

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ఈ వేళ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో, వివిధ జిల్లాలలో మేం బాగా వెనుకబడ్డామంటే మేం వెనుకబడ్డామనే భావనలు దహించి వేస్తున్నాయి. వివక్షకు గురయ్యామని, ప్రభుత్వ వనరుల కేటాయింపుల్లోనూ, అభివృద్ధి పథకాల అమలులోనూ తమకు దోపిడీ జరిగిందని కానీ, అన్యాయం జరిగిందని కానీ, వెనుకబాటుతనం ఉందని కానీ రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో భావాలు బలంగా వస్తున్నాయి. ఈ సభలో ఉన్న సభ్యులు కానీ, బయట ఉన్న రాజకీయ పక్షాల నాయకులు కానీ, కొన్ని సందర్భాలలో మన మంత్రులు కానీ ఈ మాటలు బాహాటంగా వ్యక్తపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో నేను ప్రత్యేకంగా మీ ద్వారా ముఖ్యమంత్రి గారిని కోరుతున్నదేమంటే కొన్నేళ్లపాటు ప్రభుత్వం వాస్తవాల్ని ప్రజల ముందు పెట్టటంలో చాలా నిర్లక్ష్యం ప్రదర్శించిన కారణంగా ఈ అపోహలు పెరిగిపోయాయి. వివిధ ప్రాంతాలలో అసమానతలకు కారణం ప్రభుత్వాలే అని ప్రజలు భావిస్తున్నారు. వనరుల కేటాయింపులలో వివక్ష కాని, అన్యాయం కాని, విపరీతంగా దోపిడీ కాని సాగిపోయింది అని నమ్ముతున్నారు. కాబట్టి ప్రభుత్వాలు వనరుల కేటాయింపుల్లో రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు, జాతీయ స్థాయి నుంచి జిల్లాలకు వనరుల బదిలీ చేయటంలో కావచ్చు, వివిధ పథకాల అమలులో కావచ్చు. వివిధ అభివృద్ధి సూచికలు కావచ్చు, విద్య, ఆరోగ్యం, ఇతర మౌలిక సదుపాయాలను, ప్రజలకు ఏర్పాటు చేస్తున్న ఆర్థిక

వనరులలో కావచ్చు. రోడ్లు కానీ, విద్యుత్ కానీ, నీటి పారుదల కానీ, ఇతర మౌలిక సదుపాయాలు కానీ, వాటి మీద కేటాయింపులకు ఉన్న అవకాశాలు కావచ్చు... రాష్ట్రంలో అభివృద్ధి సూచికలు, మానవ అభివృద్ధి కాని, లేకపోతే వ్యవసాయం నుంచి పరిశ్రమలు, ఇతర రంగాల దాకా, విద్య, ఆరోగ్యంతో సహా ప్రతి రంగంలో సాధించిన ఫలితాలు కావచ్చు, అట్లాగే ఆర్థికాభివృద్ధి రేటు ఇప్పుడు ప్రతి జిల్లాకు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి జిల్లావారీగా అర్థికాభివృద్ధి ఎట్లా సాధించిందనే దానికి సంబంధించిన సంవత్సరం వారీగా ప్రతి జిల్లాలో తలసరి ఆదాయం ఎట్లా ఉందీ, సగటు ఆదాయం ఎట్లా ఉందీ అన్నది కావచ్చు, ఈ వేళ రాష్ట్ర సగటు తలసరి ఆదాయం ఏ జిల్లాలో హెచ్చుగా ఉంది, ఏ జిల్లాలో తక్కువగా ఉంది, పట్టణాలలో ఎట్లా ఉంది, గ్రామీణ ప్రాంతాలలో ఎట్లా ఉందీ.. ఈ మొత్తం విషయాలన్నీ సమగ్రంగా ప్రజల దృష్టికి వచ్చేటట్లుగా, ఏ రకమైన అపోహలకు ఆస్కారం లేకుండా భారత ప్రభుత్వం యొక్క సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్ గానీ, ప్లానింగ్ కమిషన్ కానీ, సెన్సస్ కమీషనరేట్ గానీ, రాష్ట్రంలోని బ్యూరో ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ నుంచి గానీ, అన్ని విభాగాలనుంచి వివరాలను సమగ్రంగా సేకరించి ప్రజల ముందు ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయవలసినదిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఈ విషయంలో ఇప్పటికే చాలా తాత్సారం జరిగింది కాబట్టి. ప్రజలకు చాలా నష్టం జరిగింది కాబట్టి. దీనిని ప్రజల ముందు పెట్టి అపోహలు లేకుండా ఉండేలా చేయవలసిందిగా కోరుతున్నాను.

**(04-03-2010న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

## 2010-11 రాష్ట్ర బడ్జెట్‌పై...

# "ఆపరేషన్ సక్సెస్... పేషెంట్ డెడ్"

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్ ప్రకారం రూ॥1,13,675 కోట్లు సంవత్సర వ్యయమైతే, ప్రతిరోజు రూ॥312 కోట్లు ఖర్చు కాబోతున్నది. ప్రతిగంటా రూ॥13 కోట్లు ఖర్చు కాబోతున్నది. ప్రతి నిమిషం రూ॥22 లక్షలు ఖర్చు కాబోతున్నది. ప్రతి సెకండు రాత్రి, పగలు, ఆదివారం, శనివారం, పండుగ రోజు, శెలవు రోజు ప్రతి సెకండూ రూ॥38,000 ఖర్చు కాబోతున్నది. మరి ఈ బడ్జెట్ వెనకాలున్న ఫిలాసఫీ ఏమిటి? లోతుగా ఆలోచిస్తే, చరిత్రలో ప్రతి ప్రభుత్వం కూడా 200 ఏళ్ల క్రితం దాకా కేవలం దేశ రక్షణ కోసం, రెండు దేశంలో శాంతిభద్రతలు కాపాడటం కోసం, అరాచకత్వం లేకుండా ఆపడం కోసం ఖర్చుపెట్టాయి. ఆ తరువాత కాలక్రమేణా మౌలిక సదుపాయాల కోసం, సహజవనరుల అభివృద్ధి కావచ్చు, రోడ్లు కావచ్చు, మౌలిక సదుపాయాలు కావచ్చు. కానీ అధ్యక్షా, గత శతాబ్దంలో ప్రత్యేకంగా ప్రభుత్వాల తీరులో ఒక మౌలికమైన మార్పు వచ్చింది. అదేమంటే, ఒక బిడ్డ భవిష్యత్తు ఏ తల్లి గర్భాన పుట్టింది అన్నది నిర్ణయం చేయకూడదు. ప్రతిబిడ్డకి సమాజంలో ఎదిగే అవకాశాలు ఇవ్వడం ప్రభుత్వం ప్రధాన కర్తవ్యం అన్న ఒక మౌలికమైన నైతిక లక్ష్యం ప్రభుత్వాలను ప్రేరేపించింది. ఈవేళ ఈ బడ్జెట్‌ను పరిశీలించినప్పుడు, అధ్యక్షా, ప్రధానంగా దీన్ని ఆలంబనగా చేసుకుని నేను విశ్లేషిస్తున్నాను మీరిచ్చిన కొద్దిపాటి సమయంలో. ఒక సామెత వుంది అధ్యక్షా, Operation successful; but patient dead అని చెప్పి, డాక్టర్ గారు చాలా విజయవంతంగా ఆపరేషన్ చేసారు. అద్భుతంగా డబ్బు ఖర్చుపెట్టారు, గొప్ప సాంకేతిక విజ్ఞానమున్నది, ఎంతో నైపుణ్యమున్నది. కానీ చివరికి పేషెంట్ జీవితం పోయింది. ఈవేళ అద్భుతంగా మనం వేల కోట్లు, పదుల వేల కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నాం. పేదరికం పోవడం కోసం కనీసం 39 సంవత్సరాలుగా మాట్లాడుతున్నాం. కానీ పేదలను ఓటు బ్యాంకులుగా మార్చి పేదరికం కొనసాగేందుకు

బాటలు వేస్తున్నాం. దానికి ఇటీవల 20,25 ఏళ్లుగా వచ్చిన బడ్జెట్‌లతో పాటు ఈ బడ్జెట్ కూడా ఆ పరంపరనే కొనసాగిస్తున్నది.

ముందుగా ద్రవ్య నిర్వహణ, ఆర్థిక నిర్వహణ గురించి ఖచ్చితంగా ముఖ్యమంత్రి గారిని ప్రశంసించాలి. ఈ ప్రతికూల పరిస్థితుల్లో కూడా ద్రవ్యలోటుని, అంటే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే ఖర్చు చేసేది ఎంత ఎక్కువ అంటే... అప్పులు ఎంత ఎక్కువ అవుతున్నాయంటే మొత్తం రాష్ట్రం ఆదాయంలో మూడు శాతానికి కుదించగలిగారు. అలాగే రెవెన్యూ సర్ప్లస్ చూపించగలుగుతున్నారు 3,548కోట్ల రూపాయలు. నడుస్తున్న సంవత్సరంలో కూడా ప్రతిపాదించిన దాని కంటే ఎక్కువగా రెవెన్యూ  మిగులు వున్నట్లుగా అంచనాలు 2,900 కోట్లుగా చూపెట్టారు. అలాగే ప్రణాళికా వ్యయాన్ని పెంచుతున్నారు. ఇవన్నీ సంతోషం, కానీ దీని వెనకాలే పెట్టుబడులు తగ్గుతున్నాయి. గత సంవత్సరం కంటే వచ్చే సంవత్సరం రూ 2,000 కోట్లు పెట్టుబడులు తగ్గుతున్నాయి, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ తగ్గుతున్నది. ఇది చాలా ప్రమాదకరమైంది. ప్రభుత్వ వ్యయం రూ14 వేల కోట్లు పెరుగుతుండగా, పెట్టుబడులు మాత్రం రూ 2,000 కోట్లు తగ్గుతున్నాయనంటే ఇది చాలా ప్రమాదానికి సంకేతం.

మరొకటి, వచ్చే సంవత్సరం గుర్తించవలసింది 2011, ఏప్రిల్ నుంచి జి.ఎస్.టి. జాతీయ స్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం వుంది. జి.ఎస్.టి. అంటే సెంట్రల్ ఎక్సయిజ్ గాని, ఇతర పరోక్ష పన్నులు గాని జాతీయ స్థాయిలోని, మన రాష్ట్రంలో వున్న సేల్స్ టాక్సుగానీ, ఇతర పరోక్ష పన్నులు గానీ మొత్తం కలిపేసి ఒకేసారి ఒకేచోట నుంచి వసూలు చేయడం, తరువాత వ్యాట్‌లాగానే వివిధ స్థాయిల్లో వాల్యూ ఎడిషన్‌ని బట్టి వసూలు చేయడం. అప్పుడు అకస్మాత్తుగా రూ 31,000 కోట్లు వస్తున్న సేల్స్ ట్యాక్సు ఆదాయంలో నుంచి హెచ్చుతగ్గులు రావచ్చు. ప్రభుత్వాన్ని ఈ సంవత్సరం కాలంలో అందుకు జాగ్రత్తగా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాం.

ఇక బడ్జెట్‌లోకి వెళితే, రూ॥28,000 కోట్లు కేవలం జాతీయ స్థాయి నుంచి మనకు వస్తున్న నిధులు. అది కూడా సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్ కాకుండా, రూ॥23 వేల కోట్ల అప్పులు, రూ॥12 వేల కోట్లు తాగుడు నుంచి వచ్చే ఆదాయం. మనం ముద్దుగా పిలుచుకుంటున్న ఎక్సైజ్, ఈ మూడు కలిపితే రూ॥ 63 వేల కోట్లు అవుతున్నాయి. అంటే అవి మినహాయిస్తే మన బడ్జెట్ రూ॥ 50 వేల కోట్లు మాత్రమే. చాలామందికి ఈ విషయం తెలియక మనమేదో లక్ష కోట్లు సంపాదిస్తున్నామని,

ఖర్చు పెడుతున్నామని అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పేదరికం అంతానికి బడ్జెట్ ఏ రకంగా ఉపయోగపడుతుంది? పేదరికం అంతం కావాలంటే మూడే మూడు మంత్రాలున్నాయి. ప్రతి బిడ్డకీ మంచి ప్రమాణాల విద్య, ప్రతి కుటుంబానికి నిరంతరం మంచి ఆరోగ్యం, ప్రతి యువకుడికీ, యువతికీ సంపద సృష్టిలో పాలుపంచుకునే నైపుణ్యం. విద్యకి ఈ బడ్జెట్‌లో కేటాయింపు కేవలం రూ॥ 12,074 కోట్లు. గతంకంటే పెంచామని చెప్పుకుంటున్నారు. కానీ, రాష్ట్ర స్థూల ఆదాయంలో ఇది 2.8 శాతం మాత్రమే. ప్రపంచంలో మీరు ఎక్కడ చూసినా సరే.. విద్యకి కనీసం 6 శాతం జాతీయ ఆదాయంలో ఖర్చుపెడుతుండగా, మన రాష్ట్రంలో ఈ వేళ కూడా ఖర్చుపెట్టేది 2.8 శాతం. ఆ విద్య కూడా పనికిరాని విద్య. నేనొక ప్రభుత్వ పాఠశాల్లో చదువుకున్నాను. ఇక్కడున్న యువశాసనసభ్యులు చాలామంది ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుని వుండరు. కానీ, అనుభవం వున్నవారు చాలామంది చదువుకుని వుంటారు. ఈవేళ మనందరిలో ఏ ఒక్కళ్ల బిడ్డ కూడా ఒక ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే సాహసాన్ని చేయడం లేదు. ఆ సాహసం చేస్తే ఆ బిడ్డకి భవిష్యత్తు లేనట్టే లెక్కవుతున్నది. నిరుపేదలు కూడా, రిక్షా లాగే కార్మికులు కూడా ఆడపిల్ల, మగబిడ్డ వుంటే మగపిల్లాణ్ణి డబ్బులిచ్చి ప్రైవేటు స్కూల్లో – పైసల బళ్లో చదివించి, ఆడపిల్లని ఎలాగా ఆడపిల్లే కదా అని అక్కడ ప్రభుత్వ స్కూల్లో చదివిస్తున్నారు. ఇంతకంటే దారుణం లేదు. డబ్బులు కేటాయింపు గాని, వినియోగం గాని రెండూ కూడా దారుణంగా వున్నాయి. అందుకనే కేవలం అక్షర జ్ఞానం రీత్యా చూసినా కూడా దక్షిణాదిన వున్న మిగతా మూడు రాష్ట్రాల కంటే, తమిళనాడు, కర్నాటక, కేరళ కంటే తక్కువున్నాం. పశ్చిమాన వున్న మహారాష్ట్ర, ఎక్కడో పర్వత ప్రాంతాల్లో వున్న హిమాచల్‌ప్రదేశ్ కంటే కూడా తక్కువున్నాం, ఇది ఆంధ్రప్రదేశ్‌కు ఏ రకంగా కూడా గర్వకారణం కాదు. ఎన్నో సందర్భాల్లో విద్యలో వున్న లోపాలను గురించి నేను ప్రస్తావించాను. ఏడో తరగతిలో కూడా కనీసం చదివేటువంటి శక్తి, ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే పిల్లలకు కూడా గ్రామ ప్రాంతాల్లో ముప్పై నుంచి నలభై శాతం మంది పిల్లలకు చదివే శక్తి కూడా లేదు. ఏడో తరగతిలో కూడా చిన్న లెక్క చేసే శక్తి లేదు.

ఇక అధ్యక్షా, ఆరోగ్యాన్ని గురించి రూ॥4,183 కోట్లు. అంటే రాష్ట్ర ఆదాయంలో మొత్తం ప్రభుత్వ ఆదాయం కాదు, రాష్ట్ర గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్టు (జిడిపి)లో ఇది కేవలం 0.9 శాతం మాత్రమే. ఒక్క శాతం కంటే తక్కువ. దాన్లో కూడా వెయ్యి కోట్ల రూపాయలు ఆరోగ్యశ్రీ కోసం. కేవలం 1,80,000 మందికి గాను, రోజుకి 500

మందికి ఆపరేషన్ చేయడం కోసం వెయ్యి కోట్లు ఖర్చుపెడుతుంటే, మిగతా మొత్తం ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ అన్నీ కలిపి మీరు ఖర్చుబెడుతున్న డబ్బు జీతభత్యాలతో సహా 3,100 కోట్ల రూపాయలు. ఆరోగ్యశ్రీ గురించి అందరూ కూడా చాలా అద్భుతమని చెప్పుకుంటున్నారు. ముఖ్యమంత్రి గారి మాటల్లో చాలాసార్లు నేను విన్నాను. కఠోరమైన వాస్తవాలను మీ దృష్టికి తీసుకువస్తున్నాను. అధ్యక్షా, రోజుకి 70 వేల మంది రోగులు ఈ రాష్ట్రంలో డాక్టర్ల వసతి కోసం ఎదురు చూస్తున్నారు. వారిలో రోజుకి 25 వేల మంది రోగులు డాక్టర్ల దగ్గరకు వెళ్లే స్తోమత లేక, దగ్గర్లో అసుపత్రి సౌకర్యం లేక నిట్టూరుస్తూ, ఇంట్లో రోగంతో కూర్చుని మూలనపడి ఏడుస్తున్నారు. రోజుకి 20,000 మంది. అధ్యక్షా, 500 ఆపరేషన్లు ఆరోగ్యశ్రీలో ప్రతిరోజూ చేస్తుంటే, ఈ రాష్ట్రంలో సగటున 15 వేల నుంచి 20 వేల మందికి ప్రతిరోజు హాస్పిటల్‌లో అడ్మిషన్ అవుతున్నారు. ఈ 20 వేల మందిలో 500 మందికి ఆపరేషన్‌లు చేసి, మిగతా 14,500 మంది లేక 19,500 మంది వాళ్ల బ్రతుకులను బుగ్గిపాలు చేస్తున్నారు. మొన్ననే ఆరోగ్య మంత్రి గారు రూ।।77 కోట్ల రూపాయలు మేము ప్రభుత్వ ఆసుపత్రులన్నింటికి టీచింగ్ ఆసుపత్రుల నుంచి పీ.హెచ్.సి ఆసుపత్రుల దాకా డబ్బులిస్తున్నామని చాలా సగర్వంగా చెప్పారు. వెయ్యి కోట్ల రూపాయలు, 1,80,000 మంది ఆపరేషన్ల కోసం ఖర్చుపెడుతూ, మొత్తం రాష్ట్రంలో వున్న ఆరోగ్యవ్యవస్థలో మందుల కోసం ప్రభుత్వమే చెబుతున్న లెక్కల ప్రకారం పెడుతున్న ఖర్చు కేవలం రూ।।77 కోట్లు. దాన్లో నలభై శాతమేమో టీచింగ్ జనరల్ హాస్పిటల్స్, మిగతావన్నీ మిగిలిన స్థాయిల్లో, ఎలాంటి ఆరోగ్యం అందుతోంది? ఎక్కడుంది ఆరోగ్యం? అధ్యక్షా, ఆరోగ్యశ్రీ పరిష్కారం కానేకాదు. ఈ వేళ కూడా బాగా అభివృద్ధి చెందిన సంపన్న దేశాల్లో కూడా విద్యని, ఆరోగ్యానికి పెద్దపీట వేసి చట్టసభల్లో చర్చంతా దాని గురించే జరుపుతున్నారు. అమెరికాలో జార్జ్‌బుష్ వున్న కాలంలో కూడా, పేదల గురించి పట్టించుకోడు అనుకున్న వాడు వున్న కాలంలో కూడా అమెరికాలో No child left behind Act తీసుకొచ్చారు. అలాగే, ఈ వేళ అమెరికాలో చర్చంతా కూడా ఆరోగ్యం అందరికీ అందించడమెలా అన్నది. బ్రిటన్‌లో నేషనల్ హెల్త్ సర్వీస్, కాంప్రెహెన్సివ్ ఎడ్యుకేషన్ కానీ, నిరుపేదలున్న దేశంలో విద్య అని, ఆరోగ్యమని ఏదో ఒక మాట చెప్పడం కేవలం ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసపుచ్చడం తప్ప, పేదరికాన్ని తొలగించడం కోసం కావాల్సిన ఆరోగ్యాన్ని, నైపుణ్యాన్ని ఇచ్చేటువంటి శక్తిగానీ, ఆలోచన గానీ ప్రభుత్వాలకు లేదు. కఠోర వాస్తవాన్ని తెలియజేస్తున్నాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** వస్తున్నాను అధ్యక్షా... ఇక ప్రభుత్వం పూర్తిగా కేంద్రీకరించింది.

**డా॥ జయప్రకాష్ నారాయణ : (కం)**

ఈ వేళ జాతీయ స్థాయి నుంచి 32 శాతం కేవలం పన్నుల్లో వాటాగా రాష్ట్రానికి వస్తుంది. ఇటీవలిదాకా 30.5 శాతం వచ్చేది. మన ముఖ్యమంతిగారు బడ్జెట్ ప్రవేశపెట్టాక, దానిని 13వ ఆర్థిక సంఘం నివేదిక ప్రకారం 32 శాతం చేశారు. అదికాకుండా, మిగిలిన Grants in - aid గాని లేదా Centrally Sponsored Schemes గాని కలిపినట్లయితే, జాతీయంగా ప్రభుత్వ ఆదాయంలో దాదాపు 46 శాతం రాష్ట్రానికి వస్తున్నది. రాష్ట్రం నుండి స్థానిక ప్రభుత్వాలకు ఎంత ఇస్తున్నారు? కేంద్రం నుంచి స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్షంగా వచ్చే నిధులంత కూడా లేదు. పూర్తిగా ప్రభుత్వాన్ని కేంద్రీకరించిపారేశారు. జిల్లాలు గానీ, పట్టణాలుగానీ, నగరాలుగానీ, గ్రామాలుగానీ వాటి ఘోషే పట్టించుకునేది లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఇంకా ఏర్పాటు చేయలేదు. రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోంది. ఏర్పాటు చేసినప్పుడు పట్టించుకోవడం లేదు. జిల్లాలకు అధికారం లేదు. నగరాలకు అధికారం లేదు. జిల్లా బడ్జెట్లు లేవు. గతంలో అధ్యక్షా.. ఈ రోజు ప్రాంతీయ ఉద్యమాలు చెలరేగుతున్న నేపథ్యంలో 1973–74 సంవత్సరాలలో ప్రతి జిల్లాకి కేటాయింపుల్ని, ప్రతి ప్రాంతానికి కేటాయింపుల్ని చూపెట్టారు. కనీసం ముఖ్యమంత్రిగారు ఈ రోజు రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల్లో అపోహలను తొలగించడం కోసం జిల్లావారీగా, ప్రాంతాలవారీగా కేటాయింపులు చూపెడతారని ఆశించాం. కానీ దాని ఆలోచనే లేదు. ఇక ప్రాంతీయ కమిటీలు ఏర్పాటు చేసి, వారి నిధుల్ని వారికే ఇచ్చి, మీరు చూసుకోండని చెప్పారంటే గుండె కోత పోతుంది, గుండె మంట తగ్గుతుంది, విశ్వాసం కుదురుతుంది. జిల్లాలకు అధికారం ఇవ్వకుండా, ప్రజల చేతులకు అధికారాన్ని ఇవ్వకుండా, ప్రజల బాధ్యతని వారి చేతుల్లో పెట్టకుండా మీరు ప్రజల విశ్వాసాన్ని చూరగొనలేరు. వారికి నమ్మకాన్ని కలిగించలేరు. పేదరికాన్ని తొలగించలేరు.

హైదరాబాద్ నగరం మొత్తం.. రాష్ట్ర రాజకీయ, ఆర్థిక వ్యవస్థ అంతా కూడా హైదరాబాద్ నగరం చుట్టూ తిరుగుతుంది. ఈవేళ ప్రాంతీయ ఉద్యమాలకు కారణం కూడా హైదరాబాద్ నగరమే.. ఎందుకని? గ్రామాల నుంచి లక్షలాది మంది పొట్టచేత పట్టుకుని వలసిపోతున్నారు. రూ॥13 వేల కోట్లు మీరు రుణాలు మాఫీ చేసినా, వ్యవసాయ రంగంలో Interest Subsidy లు ఇస్తున్నా....

**డా॥ జయప్రకాష్ నారాయణ :** నేను అర్థం చేసుకోగలను అధ్యక్షా.. రూ॥13 వేల కోట్ల రుణమాఫీ చేసినా.. వడ్డీలలో రాయితీలిచ్చినా.. ఉచితంగా విద్యుత్ ఇచ్చినా.. పదుల వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఇరిగేషన్ తీసుకువస్తున్నామని చెప్పి అనుకొంటున్నా.. ఫెర్టిలైజర్ సబ్సిడీ జాతీయ స్థాయి నుంచి వేలాది కోట్లు ఇచ్చినా ఈ రోజు మిత్రులు చెప్పినట్లుగా 40 లక్షల టన్నులు, కొద్దికాలం కాస్త వర్షం తగ్గినా మళ్ళీ తర్వాత మొత్తం మీద వర్షం బాగానే పడింది. కొద్దిగా వర్షం తగ్గగానే మనకు ఉత్పత్తి పడిపోతున్నది. అంటే వ్యవసాయాభివృద్ధి అంతా కూడా కాగితాల మీదే కనిపిస్తోంది, వరుణ దేవుడి వలన కనిపిస్తోంది. ఎక్స్‌టెన్షన్ ఎక్కడున్నది? ఈవేళ ప్రజలకి, రైతులకి నిజంగా సాంకేతిక విజ్ఞానం ఎక్కడ అందుతున్నది? ఒక్కసారి పంట పండిస్తే మార్కెటింగ్ సౌకర్యం ఎక్కడున్నది? మార్కెటింగ్ సౌకర్యం ఒకవేళ ఉన్నా కూడా వాల్యూ ఎడిషన్ ఎక్కడున్నది? పంట ఎక్కువ పండితే ధర తగ్గిపోవడం తప్ప, పంట పండటం వలన రైతుకు లాభం లేకుండా పోతున్నది. అందుకే అధ్యక్షా, వెయ్యి చిన్న పట్టణాలను ఏర్పాటు చేసి, అక్కడ Extension, Marketing, Agro Processing, చిన్న పరిశ్రమలు, నైపుణ్యం, దానితోబాటు ఉపాధి, విద్య, ఆరోగ్యం, మంచి జీవిత ప్రమాణాలు, దాని కోసం బడ్జెట్‌లో రూ॥10 వేల కోట్లు కేటాయిస్తారని ఆశించాను. అది చేసినట్లయితే, ఏటా 10 లక్షల మందికి ఉపాధి వచ్చుండేది. 5 ఏళ్లలో 50 లక్షల మందికి ఉపాధి దొరికేది, ఈ వలసలు తగ్గేవి. చివరికి వస్తున్నాను. మౌలికమైన పరిపాలనలో భూమిని గూర్చి ఇటీవల చర్చకు కూడా వచ్చింది. భూమి రికార్డుల్లో దాదాపు 50 శాతం రికార్డులు లేవు. ఎప్పుడో వందేళ్ల క్రితం సర్వే జరగడమే కాదు, 50 శాతం రికార్డులు అధికారికంగా ఇచ్చిన మాట, చాలా జిల్లాల్లో 50 శాతం రికార్డులు గాయబ్ అయిపోయాయి. అసలు Land records లేవు FMBS లేవు.

పోలీసు.. Modernization కోసం అట్లాగే ప్రతి జిల్లాకి Forensic Lab కోసం Independent Crime Investigation - నేర పరిశోధన స్వతంత్ర ప్రతిపత్తి కోసం కేటాయింపులు చేస్తారనుకున్నాను. అవేవి కనిపించడం లేదు. న్యాయ వ్యవస్థ... జాతీయ స్థాయిలో లోక్‌సత్తా చేసిన పోరాటం వల్ల స్థానిక న్యాయాలయాల కోసం చట్టం వస్తే, ఢిల్లీ నుంచి డబ్బులిస్తామయ్యా, ప్రతి మండలంలో కోర్టు పెట్టండి, చిన్న కేసులన్నీ కూడా పరిష్కారమవుతాయని చెపుతుంటే, మన రాష్ట్రంలో డబ్బులిస్తామన్నా కూడా కోర్టులు పెట్టడానికి ఏమాత్రం ఇంగిత జ్ఞానం లేదు. ఈ బడ్జెట్‌లో దాని గురించి ప్రస్తావనే లేదు.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** ఇక మౌలిక సదుపాయాలు అధ్యక్షా.. రోడ్ల విషయంలో బడ్జెట్ బాగా చూపెడుతున్నారు సంతోషం. ఈ సంవత్సరం ఖచ్చితంగా జాతీయ స్థాయిలో రోడ్లు చూపెట్టినట్లుగా, పెద్దఎత్తున చేపట్టడం కోసం పథకాలు రూపొందించారు, సంతోషం. కాని, దీర్ఘకాలికంగా ఫ్లడ్ రిలీఫ్ ఇటీవల వచ్చిన వర్షాలు, ఈ వరదల నేపథ్యంలో పెద్దఎత్తున దీర్ఘకాలికంగా మళ్లీ వరదల నుంచి తట్టుకోవడానికి వీలుగా ఏర్పాటు చేస్తారనుకుంటే.. ఒక్క రూపాయి కూడా కేటాయింపులు చూపెట్టలేదు.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** విద్యుత్ విషయంలో, గుజరాత్‌లో 24 గంటల విద్యుత్ అందుతుంటే.. మన రాష్ట్రంలో హైదరాబాద్ నగరంలో మార్చి మాసంలో కూడా కొరతలుంటున్నాయి. విద్యుత్‌ను 24 గంటలు అందించకుండా గ్రామాలను బాగా చేయలేరు, పారిశ్రామికీకరణను పెంచలేరు, వలసలను అరికట్టలేరు. అది కావాలని చెప్పంటే.. ప్రతి గ్రామంలో మీటర్లు కావాలి. నిజాయితీగా విద్యుత్ ఎక్కడికి పోతుందో ఆ దొంగతనాన్ని అరికట్టాలి. సాంకేతిక నైపుణ్యాన్ని పెంచాలి. నిజంగా ప్రజలు కోరుకుంటుంది 24 గంటలు అందే విద్యుత్తు. మాటలతో కాదు లోక్‌సత్తా చేసి చూపెట్టింది కొన్ని జిల్లాల్లో సబ్ స్టేషన్లలో ఈ విద్యుత్ పంపిణీలో నష్టాలను నివారణ చేసి. గ్యాస్ గ్రిడ్.. ఎన్నిసార్లు చెప్పినా గ్యాస్ గ్రిడ్ కోసం ఈ సారి ఒక్క రూపాయి కూడా కేటాయింపు లేదు. అలాగే ఇరిగేషన్ గురించి ప్రస్తావన వచ్చింది. ఇప్పటికైనా సాధ్యాసాధ్యాలను పరిశీలన చేసి నిజంగా రైతుల ప్రయోజనం కోసం పునరాలోచన చేయండి. చివరి మాట పెట్టుబడులు రాష్ట్రంలో ప్రైవేటు రంగంలో, ప్రభుత్వ పెట్టుబడులేమో.. గతంలో రూ॥16 వేల కోట్లుంటే.. రూ॥14 వేల కోట్లకు పడిపోయింది. ప్రైవేటు పెట్టుబడులు ఎస్ఇజెడ్‌ల బయట అక్కడ ఎంతుందో దేవుడికెరుక, కేవలం రూ॥8,400 కోట్లు మాత్రమే, ఇన్ని లక్షల కోట్ల రూపాయలు మనం బడ్జెట్లో చూపెడుతున్నా.. రూ॥8,400 కోట్లే ప్రైవేటు పెట్టుబడులు, ఇక ఉద్యోగాలెక్కడ? అవినీతి అధ్యక్షా.. అవినీతిని గూర్చి ఒక్క మాట కూడా గవర్నర్ ప్రసంగంలోగానీ, బడ్జెట్లోగానీ లేదు.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అవినీతి.. ఇది కేవలం హాస్యం కాదు అధ్యక్షా.. ఆరోపణల కోసం నేను చెప్పడం లేదు. అవినీతి ఈ రోజు జీవనస్రవంతిలో అంతర్భాగమైంది. కేవలం ఖజానాలో డబ్బు వృధాగా పోవడమే కాదు, కాంపిటీషన్‌ను నాశనం చేస్తోంది. పోటీకి తట్టుకొని, మంచి ప్రమాణాలతో పనులెవరు చేయాలో వారికి కాకుండా లంచాలిచ్చిన వాళ్లకు ఎప్పుడైతే పనులివ్వడం మొదలెడుతున్నామో.. వ్యవస్థ

సర్వనాశనమవుతుంది. దానితోబాటు ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. హెరాస్‌మెంట్.. అవినీతి కోసం... అధికారిని నియమించడం కోసం నేను అవినీతికి పాల్పడితే.. వాడు క్రిందవాడిపై అవినీతికి పాల్పడితే.. ఆ క్రిందవాడు పౌరుడి దగ్గర నుండి లంచం తీసుకోకుండా ఒక్క పని చేయడం లేదు. హైరానా పెట్టి ప్రజలను వేధిస్తున్నారు. అధ్యక్షా.. అందుచేతనే.. నేను ఈ వేళ అంకెలతో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. రాజకీయ విమర్శ చేయలేదు. ఈ పార్టీ ఆ పార్టీ కాదు. 60 ఏళ్లలో కొంత మంచి చేశాం కానీ, ఎన్నో రంగాలలో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు రాజకీయాన్ని పరిపాలనను ద్వేషిస్తున్నారు, అసహ్యించుకుంటున్నారు. ఎందుకు ఈ అసహ్యాన్ని మనమంతా మూట కట్టుకోవాలి? ఈ శాసనసభ్యులు వచ్చింది ప్రజల గౌరవాన్ని పొందడం కోసం. సభ్యులందరి మనస్సుల్లో ఉంది, ప్రజల్లో ఔన్నత్యాన్ని పెంచాలని మన పదవి కాలంలో మంచి జరగాలని, అది జరగాలంటే అధ్యక్షా...అందరికీ అవకాశాలు రావాలి. బీదరికాన్ని కొనసాగించి సంక్షేమం పేరుతో ప్రజల్ని భిక్షగాళ్లగా చేసే వ్యవస్థకాదు కావాల్సింది. అందరికీ అవకాశాలను ఇచ్చే వ్యవస్థ. అవినీతిని అంతం చేసే వ్యవస్థ.

అధికారాన్ని వికేంద్రికరించే వ్యవస్థ, ప్రజల చేతుల్లో అధికారాన్ని పెట్టే వ్యవస్థ, ప్రతి మండలంలో ఒక పట్టణాన్ని అభివృద్ధి చేసి, లక్షలాది మంది యువతకు ఉపాధి కలిగించే వ్యవస్థ, అలాంటి వ్యవస్థ నిర్మాణం కోసం ఇప్పటికైనా పట్టించుకోండి. ఈ బడ్జెట్లో ముఖ్యమంత్రిగారికి నేను 55 శాతం మార్కులు మాత్రమే ఇస్తాను. మీరు తలసరి వెయ్యి రూపాయల్ని కనీసం పంచాయితీలకు, మున్సిపాలిటీలకు కేటాయించి అధికారాల్ని అక్కడికి పంపించి రూ॥10 వేలకోట్లు ఏటా.. ఉపాధి కల్పనకి, వెయ్యి చిన్న పట్టణాల ఏర్పాటుకి ఇచ్చిన నాడు, నేను ఆ బడ్జెట్లో 90 శాతం మార్కులిస్తాను. వచ్చే ఏడాదికి ముఖ్యమంత్రిగారో వారు పెట్టిన ఆర్థిక మంత్రో ఆ 90 శాతం మార్కుల కోసం ప్రయత్నం చేస్తారని ఆశిస్తూ, మీకు ధన్యవాదాలు తెల్పుతూ సెలవు తీసుకుంటున్నాను.

**(11-03-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

## 2010-11 రాష్ట్ర బడ్జెట్‌పై...

# జనం చేతుల్లో అధికారం పెట్టండి

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, చట్ట సభల్లో పన్నుల ప్రతిపాదనలు ఎప్పుడు పెట్టినా "చాలా భారమైన హృదయంతో పన్నుల ప్రతిపాదన పెడుతున్నాం, తప్పనిసరి" అని ప్రభుత్వం వారు చెప్పటం, "భయంకరంగా పన్నులు వేసి జనాన్ని కుళ్లబొడుస్తున్నారు తీసివేయండని" ప్రతిపక్షం చెప్పటం ఇదొక ఆనవాయితీ అయిపోయింది. కాబట్టి నేను ఆ మాటల్లోకి వెళ్లదలచుకోలేదు. ఎందుకంటే ప్రభుత్వాన్ని నడపాలంటే పన్నులు కావాలి. దాన్నెవరూ కాదనరు. Taxation is the basis of civilization నిజంగా ఒక నాగరిక ప్రభుత్వ పాలన ఉందంటే పన్నులు రావాలి. పన్నుల నుంచి మంచి పరిపాలన అందించాలి. ప్రజలకు సేవలు అందాలి. సమస్య ఎక్కడ వచ్చిందంటే కట్టే పన్నులకు, అందే సేవలకు మధ్య సంబంధం తెగిపోతున్నది. పన్నులు లేకుండా ఏ ప్రభుత్వం నడవదు. రూ॥1లక్షా 13 వేల కోట్ల బడ్జెట్ పెట్టినప్పుడు వాణిజ్య పన్నులు లేక వ్యాట్ ట్యాక్స్ ఇవాళ రాష్ట్రంలో అతి పెద్ద పన్ను అయినప్పుడు... బహుశా నాకు సంఖ్య గుర్తులేదు, వాణిజ్య పన్నుల నుంచి మన రాష్ట్రానికి వస్తున్న ఆదాయం సుమారుగా రూ॥36 వేల కోట్లు అనుకుంటాను. అతి పెద్ద పన్ను అయినప్పుడు మనం రూ॥1000 కోట్లు రాబట్టాలనుకుంటే దానిలో రావలసిందే, వేరే మార్గం లేదు. కాబట్టి దానిలో నేను ప్రభుత్వాన్ని తప్పు పట్టను. అందులోనూ ట్యాక్స్ జీడీపీ రేషియో చాలా మందికి ఈ దేశంలో అర్థం కానిదీ, చర్చ జరగనిది ఏమిటంటే ఒక దేశం ఆర్థికంగా ఎదుగుతున్నప్పుడు మొత్తం జాతీయ ఆదాయంలో పన్నుల వాటా పెరుగుతుండాలి. ఇవాళ కూడా భారతదేశంలో 18 శాతం మాత్రమే ఉన్నది. జాతీయ స్థాయిలో గానీ, రాష్ట్ర స్థాయిల్లో గానీ మొత్తం పన్నులన్నీ కలిపి ట్యాక్స్ జీడీపీ రేషియో 18 లేదా 19 శాతంగా ఉన్నాం. అప్పులు 7 లేదా 8 శాతం ఉంటే మొత్తం 25 శాతం లేదా 26 శాతం ప్రభుత్వం జాతీయ ఆదాయంలో ఖర్చు పెడుతున్నది.

అదే మీరు అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో చూసినట్లయితే అమెరికాలో 40 శాతం ట్యాక్స్ జీడీపీ ఉంది. అలాగే బ్రిటన్‌లో 47 శాతం ఉంది. యూరప్‌లో 50

శాతం ఉంది. కాబట్టి మన దేశంలో కూడా పెరగాలి. పెరిగింది ఎలా ఉపయోగపడుతుందన్నది కూడా ముఖ్యం. అందుచేత మొట్టమొదటగా నా అభ్యంతరం ఏమిటంటే మనం చాలా పారదర్శకంగా బడ్జెట్‌లో చూపెట్టవలసి వుంది. ఎక్స్‌ట్రా బడ్జెటరీగా చూపెడుతున్నారు. ఎందుకు ముఖ్యమంత్రి గారు నోటిఫికేషన్ ముందిచ్చారు? అంత పెద్దలు మీరు, అనుభవం ఉన్నవారు. బడ్జెట్‌లో నిజాయితీగా ఇదిగో ఇది అవసరమవుతున్నది. ఇంత ఖర్చు పెడుతున్నాం కాబట్టి బడ్జెట్‌లో ఈ రకంగా పన్ను పెంచుతున్నాం అంటే సంతోషంగా, హుందాగా ఉండేది. అలా కాకుండా మీరు 79 సబ్‌సెక్షన్ 1 ప్రకారం నోటిఫై చేసి, తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండని బడ్జెట్‌లో ఏ పన్నులు పెంచకుండానే చేస్తున్నామని చెప్పి ఇప్పుడు ఆ నోటిఫికేషన్ రిప్లేస్ చేస్తూ వ్యాట్ చట్టం 79(2) ప్రకారం చట్టం తీసుకువచ్చారు. అందుచేత హుందాగా ఒప్పుకుందాం, ప్రతిపక్షం వాళ్లు తిడతారో మరొకటో కాకుండా మాకు పన్నులు అవసరం, ఇవి హేతుబద్ధంగా, శాస్త్రీయంగా ఈ రకంగా చేస్తున్నామని చెప్పినట్లయితే ఆ పారదర్శకత ఉంటే ప్రభుత్వానికి మరింత హుందాగా ఉంటుంది.

కిషన్‌రెడ్డి గారు ముందుగానే ప్రిపేర్ అయ్యారు కాబట్టి బిజెపి ఏ రాష్ట్రాల్లో పరిపాలిస్తుందో ఆ రాష్ట్రాల్లో లెక్కలు తీసుకువచ్చి చెప్పారు, మధ్యప్రదేశ్ గానీ, గుజరాత్ గానీ, కానీ మన రాష్ట్రానికి సంబంధించినంతవరకూ కావలసింది మన చుట్టూ ఉన్న రాష్ట్రాలకు దీని వలన ఏమన్నా వ్యాపారం వెళ్లిపోతుందా? పరిశ్రమలు పోతాయా? కాబట్టి దీనిమీద తరువాతైనా సమాచారం అందించాలని ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను. ఈ షెడ్యూల్ ఆఫ్ వ్యాట్ ట్యాక్స్ చుట్టూ ఉన్న కర్నాటక, తమిళనాడు ముఖ్యంగా ఈ రెండు మన పక్కనే ఉన్న రాష్ట్రాలు. ఒక పక్కన మహారాష్ట్ర, బహుశా ఒరిస్సా కూడా ఉన్నాయి. ఆ రాష్ట్రాలతో పోలిస్తే మన షెడ్యూల్స్ ఎట్లా ఉన్నాయనేది సభ్యులకు ఇచ్చినట్లయితే ఇవాళ కాకపోయినా తరువాతైనా సభ్యులకు ఉపయుక్తంగా ఉంటుంది. లేకపోతే వ్యాపారం ఇతర రాష్ట్రాలకు పోయే అవకాశం ఉంది.

డీజిల్ జనరేటర్ల మీద ట్యాక్స్ తగ్గించారు. సంతోషం, కానీ ప్రభుత్వం ఏమి ఒప్పుకొంటున్నదంటే, డీజిల్ జనరేటర్లు లేకుండా ఈ రాష్ట్రంలో మీరు వ్యాపారం చేయలేరు, మీరు పరిశ్రమలు పెట్టలేరు, విద్యుత్ కొరత ఇట్లాగే ఉంచుతాం, రాష్ట్రాన్ని నాశనం చేస్తామని, ఇవాళ 3 లక్షల మంది చిన్న పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు పనిచేస్తున్నారు. హైదరాబాద్ చుట్టుప్రక్కలనే 9000 పరిశ్రమలు విద్యుత్ వినియోగం

లేక ఖాయిలా కావడం చేత, విద్యుత్ దొరక్క వారానికి మూడు రోజులు హాలిడే ప్రకటించి మిగతా రోజుల్లో సాయంత్రం 6 నుంచి 10 గంటల దాకా విద్యుత్ అందకుండా విద్యుత్ కట్టడి చేసి మిగతాప్పుడు అన్‌షెడ్యూల్డ్ Power cuts చేసి ఈ పరిశ్రమలు మొత్తం మూతపడే పరిస్థితి మనం తీసుకువచ్చాం. 3 లక్షల మంది ఉద్యోగులు తెలంగాణా ప్రాంతంలో కేవలం హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనే ఉన్నారు.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** కాబట్టి, డీజిల్ జనరేటర్స్ మీద పన్నులు తగ్గించారు సంతోషం, కానీ జనరేటర్స్ అవసరం లేకుండా చేయండి స్వామీ! చిన్న పరిశ్రమలు డీజిల్ జనరేటర్స్‌ను తట్టుకోలేవు. దయచేసి వాటి అవసరం లేకుండా చేయండి, కాబట్టి, ఒక దారుణమైన సంక్షోభాన్ని మీరు తయారు చేసి, ఆ తరువాత మీకు కొంచెం పన్ను తగ్గించామని చెప్పటమంటే – గట్టిగా గిల్లి, తరువాత ముద్దు పెట్టినట్టు వుంది. దాని వల్ల ప్రయోజనం లేదు. అందుచేత, మనం ఏ విధానాన్ని చేపట్టినా కూడా పరిశ్రమలు పోకుండా, ఉత్పత్తి పోకుండా, ఉత్పాదకత పోకుండా ఏర్పాట్లు చేయాలి. నాలుగవది అధ్యక్షా... నాకు ప్రభుత్వ ప్రతిపాదనల్లో అడ్‌హాకిజమ్ కనిపిస్తుంది. గత సమావేశాల్లో ముఖ్యమంత్రి గారు ఆర్థికమంత్రిగా వుండగా వారే ప్రవేశపెట్టారు. ఇక్కడున్న ఆర్ అండ్ బి శాఖామాత్యులే ఆనాడు కూడా చదివి వినిపించారు, నాకు బాగా గుర్తుంది. ఏవియేషన్ టర్బయిన్ ఫ్యూయల్‌ను నాలుగు శాతానికి ఆనాడు తగ్గించారు. వద్దు మొర్రో అని ఇక్కణ్ణించి ప్రతిపక్షాలు ఆనాడు మొత్తుకున్నాయి. కాదు, కాదు తగ్గించాల్సిందే అన్నారు, ఈవేళ మళ్లీ పెంచేస్తున్నారు. పెంచడాన్ని నేను తప్పు పట్టడం లేదు. ఇతర రాష్ట్రాలో 20 శాతం కనీసం వుంది, మనం 16 శాతమన్నా చేయకపోతే ఎట్లా, నాలుగు శాతమే పెట్టామన్నారు. మంచిదే, కానీ, ఈ ప్రాప్తకాలజ్ఞత ఎందుకు అని అడుగుతున్నాను. ఈ పన్నుల విషయంలో ఇంత అడ్‌హాకిజం ఎందుకు? ఒక సెషన్ క్రితమేమో పన్నులు తగ్గించే చట్టాలను తీసుకువచ్చి, మళ్లీ మూడు నెలల్లో పన్నులు పెంచే చట్టాన్ని తీసుకొచ్చామనంటే, మనం కనీసమైన ఆలోచన చేయడం లేదా? అడ్‌హాకిజం వున్నాదా? దీనికి సమాధానం కావాలి అధ్యక్షా.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** ఇక అధ్యక్షా, రెండు విషయాలు, వ్యాట్‌లో పన్నులు వేయాలి. నేను కాదనడం లేదు. వీలైనంతవరకు రాష్ట్రంలో పన్నులు భయంకరంగా వున్నాయని అనడం లేదు. 5,6, ఏళ్లుగా పెద్దగా అదనంగానూ పన్నులు వేయడం లేదు. అసలు

పన్నులు వేయకుండా వుండటం, చార్జీలు లేకుండా చేయడం రాజకీయంగా మార్చిపారేశారు. జనాకర్షణ..

**డా॥ జయప్రకాష్ నారాయణ:** అయిపోయింది అధ్యక్షా, కానీ, లీకేజెస్ ఇంకా వున్నాయని చాలా తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలామంది ఈ రంగంలోని నిపుణులు చెప్పేది – పన్నులు ఏమీ పెంచాల్సిన అవసరం లేకుండానే, వ్యాట్‌లో లీకేజెస్‌ని గాని గట్టిగా మదింపు చేసినట్లైతే, కనీసం మరొక 15,20శాతం ఒక్క ఈ కమర్షియల్ ట్యాక్సెస్‌లోనే అంటే ఇవాళ వ్యాట్ టాక్సుల్లోనే పొందే అవకాశం వుంది. 15,20 శాతం బహుశా ఎగ్జరేషన్ కావచ్చు, అతిశయోక్తి కావచ్చు, కానీ సిగ్నిఫికెంట్ Leakages దాన్లో వుంటే, పన్ను తగ్గించమని నేను అనడం లేదు. కానీ లొసుగుల్ని సరిచేసి ఆదాయం రాబట్టే ఏర్పాటు చేయండి. చివరిగా ముఖ్యమంత్రి గారి నుంచి ఒక్క వివరణ వారి అనుభవం నుంచి, నైపుణ్యం నుంచి నేను కోరేదేమంటే– ఎట్లాగైతే కమర్షియల్ టాక్సెస్ నుంచి, సేల్స్ ట్యాక్స్ నుంచి వెళ్లామో, వ్యాట్ నుంచి 'గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్సు' కు వెళ్లబోతున్నాం. జాతీయ స్థాయిలో ఈ వేళ అక్కడ పరోక్ష పన్నులు, మన సమస్యలు కలిపేసి ఒకేరకంగా, ఒకే ఏజెన్సీ ద్వారా వసూలు చేసే అవకాశమున్నది. ఈవేళ ఈ బిల్లును అవకాశంగా తీసుకుని, రెండు విషయాలు దయచేసి మాకు క్లారిఫై చేయండి. ఒకటి, ఈ జిఎస్‌టి వచ్చినప్పుడు చాలా కీలకంగా పరోక్ష పన్నుల మీద, అందునా సేల్స్ టాక్స్ మీద బాగా ఆధారపడ్డ రాష్ట్రం మనది. చాలా ఎక్కువ ఆదాయాన్ని తీసుకుంటున్న రాష్ట్రం, దీన్లో ఆంధ్రప్రదేశ్ ఏ రకంగానూ రెవెన్యూ విషయంలో నష్టపోదు సార్, నాకు తెలిసి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రత్యేకంగా డబ్బులు కేటాయిస్తోంది, నష్టపోయే రాష్ట్రాలకు డబ్బులు ఇస్తోంది. వ్యాట్‌లో అనుభవం మనకు పాజిటివ్‌గానే వుంది. ఇవన్నీ తెలుసు. కానీ ఇది చాలా పెద్ద మూవ్. జిఎస్‌టిలో చేర్చేసి, ఏజెన్సీ కూడా ఇవాళ మన రాష్ట్రంలో, మన సిబ్బందే కాకుండా, జాతీయస్థాయిలో సిబ్బంది పనిచేస్తారు. లేకపోతే, బహుశా ఏమన్నా కొన్ని వస్తువుల మీద మీరు, కొన్ని వస్తువుల మీద మేము అనంటారేమో, రేప్పొద్దున రాష్ట్రాలకు, కేంద్రాలకు మధ్య ఒప్పందం ఎలా కుదురుతుందో తెలియదు. అది జరిగినప్పుడు అతలాకుతలం కాకుండా వుండాలి. చాలా పెద్ద బడ్జెట్‌ను పెట్టుకున్నాం, రెండవది, మీరు జిఎస్‌టి చేస్తున్నప్పుడు వీటి ప్రభావం ఎట్లా వుంటుంది? ఈ వేళ మీరు వేస్తున్నా గాని వీటి ప్రభావం ఎట్లా వుంటుంది?...

**డా॥ జయప్రకాష్ నారాయణ :** జిఎస్‌టి రాబోయేది స్వామీ! ఈ సభ రాష్ట్ర భవిష్యత్తును పట్టించుకోకపోతే, ఇంకెవరు పట్టించుకుంటారు అధ్యక్షా? సభలో బూతులు తిట్టుకోవడానికి వున్నామా? కొంచెం పేషన్స్ అండీ! చాలా కీలకమైన అంశాలు, నిజమైన అంశాలు మాట్లాడుతుంటే మీకు ఇంత అసహనం వుంటే ఎట్లాగ? జిఎస్‌టి మనకు అవసరం లేదా? జిఎస్‌టి అంటే మహాశయా! రేపొద్దున్న జాతీయ స్థాయిలో ఉన్న పరోక్ష పన్నులు, రాష్ట్రపరోక్ష పన్నులు కలిసి ఒకే ఏజెన్సీ కలెక్ట్ చేసే పరిస్థితి వస్తున్నది.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అది చాలా కీలకమైనది. రాష్ట్ర భవిష్యత్తుకి, రాష్ట్రాల భవిష్యత్తుకి చాలా కీలకమైనది. ముందుజాగ్రత్త చర్యలు ఏం తీసుకుంటున్నారో చెప్పండని కోరుతున్నాను. దాంట్లో తప్పేముందో నాకు అర్థం కావడం లేదు. దయచేసి, ఆ విషయం మీద క్లారిఫై చేయండి. అధ్యక్షా, ఈ అవకాశం ఇచ్చినందుకు నమస్కరించి సెలవు తీసుకుంటున్నాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ఇందాక పన్నులు వేస్తామంటే తప్పదు, దాని గురించి కొంత బాధైనా కూడా పన్నుల విషయంలో ప్రభుత్వం తప్పిదం లేదని అన్నాను. కాబట్టి నేను ఆషామాషీగా చెప్పడం లేదు. ముఖ్యమంత్రి గారికి ఇక్కడ అందరి కంటే ఎక్కువ అనుభవం వున్నది, నలభై, యాభై సంవత్సరాల క్రితం నాటి స్థానిక ప్రభుత్వాలను వారు చూశారు. ఏనాడైతే ఈ రాష్ట్రంలో సిబ్బందిని ప్రొవిన్షియలైజేషన్ చేశారో ఆనాడు స్థానిక ప్రభుత్వాలకు దుర్గతి పట్టింది. బ్రహ్మానందరెడ్డి గారి కాలంలో, నాకు గుర్తు వున్నంతవరకు 1960 దశకంలో వాళ్ల జీతాలను మేమిస్తామని కూర్చున్నారు. వాటిని బలోపేతం చేసే, వాటికి నిధులను పెంచి సిబ్బందికి జీతాలను వాళ్లు ఇచ్చే ఏర్పాటు చేయాలిగానీ, జీతాలు మేమిస్తాం, పన్నులు మాకివ్వండి అంటే, కేంద్రీకరణను మనం పెంచుతున్నాం. మీరు ప్రొవిన్షియలైజేషన్ చేసి, అక్కడ జీతభత్యాలను ఎవరు ఇవ్వమన్నారు మిమ్మల్ని. కొందరు కోరినా కూడా అది తప్పు. మీరు స్థానిక ప్రభుత్వాన్ని మూడవ Tier (అంచె)గా గుర్తించకపోతే రేప్పొద్దున కేంద్ర ప్రభుత్వం వచ్చి మీ పన్నులను మేము వసూలు చేసుకుంటాం, మీ జీతాలు మేమిస్తామంటే బాగుంటుందా అది. మన మూడవ అంచె ప్రభుత్వానికి పూర్తిగా బాధ్యత పెట్టండి. అధికారాన్ని ఇవ్వండి. జవాబుదారీతనం ఇవ్వండి గానీ, మీ జీతాల బాధ్యత మేము తీసుకుంటాం

కాబట్టి ఆ పన్నులు మేము తీసుకుంటామంటే రేప్పొద్దున ఎందుకు ఈ స్థానిక ప్రభుత్వాలు? అలా వద్దని చెప్పే 73, 74 సవరణలు వచ్చింది. దీనివల్ల ఆర్థికంగా ఏమీ తేడా వుండదు కానీ, సూత్రప్రాయంగా స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేసి, పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో అధికారాన్ని కేంద్రీకరణ చేయడంలో భాగమే. అసలు ఈ ప్రొవిన్షియలైజేషనే జీతభత్యాలను మీరు ఇవ్వడమే తప్పు. జీతాలు మీరిస్తే, అక్కడ వాళ్లు బాధ్యతగా ఎట్లా వుంటారండీ? మునిసిపాలిటిలో ఎట్లా పనిచేస్తారు? పెద్దలు, అనుభవజ్ఞులు మీరు. 1965వ సంవత్సరంలో పంచాయతీసమితి జీతాలిచ్చినప్పుడు, ఆనాడు పి. హెచ్. సి. లన్నింటిని కూడా పంచాయితీసమితి పట్టించుకున్నప్పుడు 2010వ సంవత్సరంలో మునిసిపల్ సిబ్బందికి మీరు జీతాలు ఇస్తారా? బ్రిటిష్ కాలంలో కూడా ఇలా జరగలేదే? తెల్లదొరల కాలంలో ఆనాడు మునిసిపల్ కమిషనర్ వంటి ఉద్యోగాల్లో వేయడానికి ఆనాడు ప్రభుత్వం పూర్తిగా సహకరించింది.

అధ్యక్షా, కలకత్తా మహానగరంలో, ఈ విషయం ముఖ్యమంత్రిగారికి తెలుసు. వారొక్కరే బహుశా ఆనాడు దాని గూర్చి కాస్తో, కూస్తో హిస్టారికల్‌గా అనుభవం మరియు కాస్త గుర్తు వున్న మనిషి, 1924వ సంవత్సరంలో చిత్తరంజన్‌దాస్ కలకత్తా మేయర్‌గా ఎన్నికైతే, ఆనాడు కమిషనర్‌గా మేయర్ చెప్పిన మనిషిని తెల్లవారి ప్రభుత్వం నియమించే అవకాశానిచ్చింది. ఒక నగరంలో ఇవాళ బి. గ్రేడ్ మునిసిపాలిటీలో కూడా నియమించేది మీరు. జీతాలు మీరిస్తారు, కానీ పని అక్కడ ఎలా జరుగుతుంది? ఇది పద్ధతి కాదు, అసలు మీరు మౌలికంగా ఈ బిల్లు తేవడానికి ఉద్దేశం వుందే, మేం జీతాలిస్తున్నాం కాబట్టి ఈ పన్నులనేది. దయచేసి ఆలోచించండి

ఇవాళ సరే, నేనొక్కడినే వున్నాను, చాదస్తం అనుకుంటారు.

పంచాయతీలకు అధికారం ఇవ్వడమేమిటి? మునిసిపాలిటిలకు అధికారం ఇవ్వడమేమిటి? అధికారం అంతా మన చేతుల్లో వుండాలని అనుకుంటారు మీరు. ఈ దేశంలో వ్యవస్థ మారేవరకు తప్పదు, కానీ, ఈ సభను నేను చాలా వినమ్రంగా కోరుతున్నాను. ఈ దేశంలో ప్రజాస్వామ్యం నడవల్సిన దారి ఏమిటంటే, జనం చేతుల్లో అధికారం పెట్టండి, బాధ్యత పెట్టండి, ఆ ఉద్యోగుల్ని, సిబ్బందిని అక్కడ స్థానిక ప్రభుత్వానికి బాధ్యులుగా చేయండి. మీరు వాళ్లనందరినీ కంట్రోల్ చేయలేరు. మీరు వాళ్లతో పనులను అలా చేయించుకోలేకపోతున్నారు. అవినీతిని ఆపలేకపోతున్నారు. సేవలు అందించలేకపోతున్నారు. ప్రజలను కాపాడలేకపోతున్నారు. తిట్లు తింటున్నారు.

తిట్లు తింటున్నారు కాబట్టి అన్ని ఉచితంగా ఇచ్చేస్తామని అంటున్నారు. ఇది పద్ధతైన పాలన కాదు. పాలన సరిగ్గా నడవాలంటే అక్కడ అధికారం పెట్టండి.

అక్కడ బాధ్యత పెట్టండి. అక్కడ జీతాలు ఇవ్వలేకపోతే ప్రత్యేకంగా మీరు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇవ్వండి. దానికోసం స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌లో మంచి వాళ్లను అపాయింట్ చేయండి. ఫైనాన్స్ కమిషన్ ద్వారా జాతీయ స్థాయి నుంచి నిధులు పెద్ద ఎత్తున మీకు ఎట్లా అయితే వస్తున్నాయి? 32 శాతం జాతీయ స్థాయి నుంచి కేవలం మీకు పన్నుల వాటా క్రింద వస్తున్నాయి. అవి కాకుండా సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్ వస్తున్నాయి. అవి కాకుండా ఇతర ప్లాన్ ఫండ్స్ వస్తున్నాయి. అదేవిధంగా మీరు జిల్లా స్థాయిలకు పంపించండి. అదే విధంగా మున్సిపాల్టీలకు పంపించండి. పని చేయకపోతే భరతం పట్టండి. పని చేయకపోతే గట్టిగా వాళ్లను శాసించే రీతిలో, వాళ్ల పదవులు తీసే రీతిలో, శిక్షించే రీతిలో ఏర్పాట్లు చేయండి. అంతేగానీ బాధ్యత మీరు తీసుకొని రాజ్యాంగం చెప్పింది కాబట్టి పేరుకు ఎన్నికలు జరిపించి, వాటన్నింటినీ ఉత్సవ విగ్రహాలుగా మార్చిపారేసి, ఎన్నికలలో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి వ్యవస్థను కొల్లగొడుతున్నారు.

సిద్ధాంతరీత్యా చాలా ముఖ్యమైనది మీరు వెయ్యి కోట్ల రూపాయలు పన్నులు వేస్తే తప్పు లేదనే వాణ్ని నేను. ఇంకా పన్నులు పెంచినా  కూడా నేను తప్పు లేదని అంటాను. కానీ, మౌలికంగా రాజ్యవ్యవస్థను కూలగొట్టే భాగం ఇది. కేంద్రీకరణను గత నలభై ఏళ్లలోగా పెంచి పోషిస్తున్నాము. రాజ్యాంగ సవరణ మీ పార్టీయే జాతీయ స్థాయిలో చేపట్టిన 73 సవరణ, 74 సవరణ దీని కోసం కాదు. దాని స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమే. మీకు మెజారిటీ ఉంది కాబట్టి దీనిని పూర్తిగా ఆమోదించుకుంటారు. దీని గురించి ఆలోచించేవాళ్లు లేకపోవచ్చు. కానీ, ఖచ్చితంగా ఇది దేశంలో సరైన పంథా కాదు. కేంద్రీకరణ కాదు, వికేంద్రీకరణ కావాలి. స్థానికంగా అక్కడికి అక్కడే అధికారాలు ఇవ్వండి .బాధ్యతలు ఇవ్వండి. వాళ్ల వేతనాలను వాళ్లకు చెల్లించండి. వాళ్ల పన్నులను వాళ్లు వసూలు చేయించండి.

**(30-03-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# గోరంతలు కొండంతలు చేయకండి

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, 2010లో కూడా ఇంకా కులం పేరుతోనో, మతం పేరుతోనో, ప్రాంతాల పేరుతోనో విద్వేషాలు రేగుతున్నాయంటే ఈ జాతి నిర్మాణం పూర్తి కాలేదు, మత సామరస్యం కోసం జాతిపిత తన ప్రాణాలనే బలిపెట్టారు. ఆయన పోయిన 62 ఏళ్ల తర్వాత కూడా ఇంకా ఇలాంటివి అడపాదడపా జరుగుతూనే ఉన్నాయి. వాటి గురించి మనం చర్చించుకోవలసి రావడం చాలా దురదృష్టకరం ఈ సమస్య అందరిది, ఈ రాష్ట్రం మొత్తానిది, ఈ దేశం మొత్తానిది, ఈ నగరానిది, ఈ సభలో వున్న అన్ని రాజకీయ పక్షాలది ఇది ఏ ఒక్కరి సమస్యా కాదు. ఈ సమస్యను ఎదుర్కోనడంలో మనమందరమూ కలిసే ఉన్నాం. ఆ సంకేతం ఈ సభ ద్వారా చాలా స్పష్టంగా ఈ రాష్ట్ర ప్రజలకు, ఈ దేశ ప్రజలకు వెళ్లాలి. మన రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి, పాలనా యంత్రాంగానికి సామర్థ్యం వుంది, ఈ అల్లర్లను అదుపు చేసే శక్తి వుంది. ఈ రోజు ముఖ్యమంత్రిగారు హామీ ఇచ్చారు. ఈ విషయంలో పోలీసు యంత్రాంగానికి పూర్తి స్వతంత్ర ప్రతిపత్తిని ఇస్తున్నాం, ఏవిధమైన రాజకీయ జోక్యం గానీ, పక్షపాతం గానీ వుండదని చెప్పారు. పోలీసు యంత్రాంగానికి ఈ సభ ద్వారా తెలియజేసేదేమంటే – ఇటువంటి విషయాలలో నిష్పక్షపాతంగా నిర్మొహమాటంగా, కఠినాతి కఠినంగా వ్యవహరించండి, అవసరమైతే నిర్దాక్షిణ్యంగా వ్యవహరించండి. ఎట్టిపరిస్థితుల్లో శాంతిభద్రతలను పునరుద్ధరించండి. ఒక్కరోజు ఆలస్యమైనా, సమాజంలో ఈ అల్లకల్లోలాలున్నట్లయితే లబ్ధిపొందే వర్గాలకు మనం ఊతం ఇచ్చినట్లవుతుంది. ఆ అవకాశం ఇవ్వబోకండి ముఖ్యమంత్రిగారు మరొక హామీ కూడా ఇచ్చారు. సామాన్యులకు కడగండ్లు లేకుండా, మంచినీళ్లు గానీ, నిత్యావసర వస్తువులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. కొన్ని రోజుల్లో లారీల వాళ్ళు కూడా సమ్మె చేస్తామంటున్నారు. దాన్ని కూడా నిలువరించడానికి ముఖ్యమంత్రిగారు ప్రయత్నం చేస్తారని నేను ఆశిస్తున్నాను.

అధ్యక్షా, అన్ని పార్టీల తరపున, సభ తరపున నేను ప్రత్యేకంగా మీడియాకు చేసే విజ్ఞప్తి ఏమంటే దయచేసి సంయమనం పాటించండి. దయచేసి గోరంతలు కొండంతలు చేయకండి. స్థానికంగా పొరపాట్లు జరిగినా కూడా ఆ సంఘటనలను పదేపదే చూపడం

వల్ల ప్రచురించడం వల్ల పరిస్థితులు చేయిదాటిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. ప్రజల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉంటే, దయచేసి పూర్తిగా సంయమనం పాటించండి. ప్రజలకు శాంతిని పెంచే అవకాశం కల్పించండి. అధ్యక్షా, చివరగా – రవీంద్రనాథ్ ఠాగూర్ ఒక విషయం చెప్పారు "కృత్రిమమైన అడ్డుగోడలు ఈ దేశాన్ని ముక్కలు చేస్తున్నాయి. ఈ దేశాన్ని కృత్రిమమైన అడ్డుగోడలు లేకుండా వుండే దారిని నడిపించు మహాప్రభో" అని వేడుకున్నారు. Where narrow domestic walls do not fragment our nation - అలాంటి లోకంలోకి ఈ దేశాన్ని తీసుకెళ్లడానికి ఈ సభ, ఈదేశంలోని అన్ని రాజకీయపక్షాలు, సమాజంలోని అన్ని వర్గాలు కలిసి వస్తాయని ఆశిస్తూ ఇలాంటి చర్చ ఈ 13వ శాసనసభలో మళ్లీ జరిగే అవకాశం ఉండకూడదని కోరుకుంటూ, ఈ అవకాశం ఇచ్చిన మీకు నమస్కారాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**(30-03-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# ఆరుసూత్రాల అమలుకు ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చెయ్యాలి

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ఈవేళ రాష్ట్రంలో వున్నటువంటి ఈ ప్రాంతీయ విద్వేషాలూ, అపోహలు ఈ నేపథ్యంలో ఒక కీలకమైన అంశాన్ని మీ ద్వారా సభ దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకు వస్తున్నాను.

అధ్యక్షా, 1973లో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో పెద్దలతో చర్చించిన తర్వాత ఆరు సూత్రాల పథకానికి అనుగుణంగా రాజ్యాంగంలో 32వ సవరణ తీసుకువచ్చారు. దానికి అనుగుణంగా రాష్ట్రపతి ఉత్తర్వులను 1975 సంవత్సరంలో Andhra Pradesh Public Employment, (Organization of Local Cadres and Regulation of Direct Recruitment ) Order 1975 అనే పేరుతో ఉత్తర్వు వచ్చింది. ప్రధానంగా ఈ ఉత్తర్వు ప్రకారం, రాష్ట్రంలో ప్రతి జిల్లా స్థాయిలోనూ కింది స్థాయి ఉద్యోగుల నియామకం, వీలున్నంతమేరకు జిల్లాలోనే చేయడం. ఎల్‌డిసి, ఆ కింది స్థాయి ఉద్యోగులు 80 శాతం మేరకు నియామకాలు జిల్లాలోనే చేయడం. ఇతర నాన్ గెజిటెడ్ ఎంప్లాయీస్ అందరికీ కూడా 70 శాతం ఒక జోన్‌గా అంటే 3 లేక 4 జిల్లాలను ఒక జోన్‌గా కలిపి రాష్ట్రంలో 6 జోన్లు చేయడం జరిగింది. హైదరాబాద్ నగరం మరొకటి మొత్తం 7 జోన్స్‌గా చేసి, అక్కడ నియామకాలు చేయడం జరిగింది.

తాసీల్దార్లు, అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్, ఇంజినీర్లు, అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్లు, ఇనిస్పెక్టర్స్ ఆఫ్ పోలీసు, మోటర్ వెహికిల్ ఇనస్పెక్టర్స్‌ల నియామకంలో జోన్‌ని యూనిట్‌గా చేసి 60 శాతం స్థానికంగా నియామకం చేయడం, ఇవి ప్రధానంగా దాని ఉద్దేశ్యాలు. దానికి అనుగుణంగా జీవో 728, 729 మరి ఇతర జోవోలు వచ్చాయి.

నా దగ్గర వున్న సమాచారం ప్రకారం రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో, ఉదాహరణకు ఉత్తరాంధ్ర జోన్‌లో అంటే, జోన్ –1లో ఈ వేళ ఆ ప్రాంతీయులు కానివారు రకరకాల ప్రాంతాలకు చెందినవారు 11 నుంచి 12 శాతం వరకూ వున్నట్లుగా సమాచారం

వుంది. ప్రతి జోన్‌లోనూ 5 లేక 6 శాతం మంది ఆ ప్రాంతాలకు చెందని వారు అదనంగా వున్నట్లుగా, అంటే ఈ చట్టం నిర్దేశానికి అదనంగా వున్నట్లుగా సమాచారం వుంది.

అలాగే హైదరాబాద్ జోన్‌లో, ఇది రాష్ట్ర రాజధాని కాబట్టి దాదాపు 11 నుండి 12 శాతం వున్నట్లుగా అంకెలు తేలుతున్నాయి. కాబట్టి ఈ రోజు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల వారికి కూడా ఈ రాష్ట్రపతి ఉత్తర్వులను తూచాతప్పకుండా, నిజాయితీగా అమలు చేస్తారన్న విశ్వాసాన్ని కల్పించవలసిన అవసరం వుంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఈ సభలో వున్న గౌరవ సభ్యులు ఉత్తమ కుమార్ రెడ్డి గారి అధ్యక్షతన ఒక సభా సంఘాన్ని ఏర్పాటు చేసినా కూడా ప్రజలలో ఆ విశ్వాసం కలగలేదు. కాబట్టి, మీ ద్వారా ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరేది ఒక చట్టాన్ని చేసి, రాష్ట్రానికి చెందనటువంటి, నిజాయతీకి పేరుపొందిన, నిష్పాక్షికతకు పేరొందిన ఒక హైకోర్టు న్యాయ మూర్తి ఆధ్వర్యంలో, ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన యంత్రాంగాన్ని, అథారిటీని శాశ్వత ప్రాతిపదికన రాష్ట్రం మొత్తానికి, అంటే అన్ని జోన్సుకూ ఏర్పాటు చేసి వారికి పూర్తి అధికారాన్ని యివ్వాలి. అంటే ఎక్కడెక్కడైతే ఉత్తర్వులు అమలు కావడంలేదో, ఎంతమంది ప్రాంతీయేతరులను ఆ జిల్లా నుంచి, ఆ జోన్ నుంచి ప్రక్కకు పంపించవలసి వుందో నిర్ణయం చేసే అధికారం కూడా పూర్తిగా వారి చేతికి యిస్తే బాగుంటుంది. దాని మీద అప్పీల్ ఏమైనా వుంటే కేవలం హైకోర్టు, సుప్రీం కోర్టుకు మాత్రమే అధికారం వుండేటట్లుగా చట్టాన్ని చేయాలి. రాష్ట్రంలో విశ్వాసం కల్పిస్తే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రత్యేకంగా దీనిని చేపట్టవలసిందిగా మీ ద్వారా ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** చేనేత మంత్రిగారి ప్రకటన కొంచెం నిరుత్సాహాన్ని కలుగచేసింది. సంక్షేమ పథకంలో రూ॥312 కోట్లు రుణ మాఫీ చేస్తామన్నారు. చేయాలి మంచిదే. కాని రాష్ట్రంలో సుమారు 8 లక్షల కుటుంబాలు ఈ వృత్తి మీద ఆధారపడ్డారు. మారుతున్న పరిస్థితుల వల్ల మార్కెటింగ్ కష్టం కావడం వల్ల, సాంకేతిక విజ్ఞానంలో మార్పుల వల్ల వారంతా సంకటంలో పడ్డారు. వారి జీవితాలను 30 సంవత్సరాల నుండి నేను కలెక్టర్‌గా ఉన్నప్పటి నుండి ఇప్పటివరకూ చూస్తూనే ఉన్నాను. భారత ప్రభుత్వం వారికి ప్రత్యేక ప్యాకేజెస్ ప్రకటించి క్లస్టర్ ప్రోగ్రామ్స్‌ను ప్రకటించాలి. క్లస్టర్స్‌ను గుర్తించి, దీర్ఘకాలిక ప్రణాళిక వేసి ఢిల్లీ నుండి సహాయం అందించి వారికి

మార్కెటింగ్, ప్రత్యేక నైపుణ్యం, అప్‌గ్రెడేషన్, మోడ్రనైజేషన్ మొదలైనవి చేసి వారికి ఆదాయాన్ని పెంచితే బాగుంటుంది. మన రాష్ట్రంలో కొన్ని చోట్ల చేపట్టారు. మన రాష్ట్రంలో పరిస్థితులను అధ్యయనం చేసి ఆధునీకరించి వారికి శాశ్వత ఆదాయ మార్గాన్ని అన్వేషించాలి తప్ప వేరేది ఏది చేసినా తాత్కాలికమే. మంత్రిగారి నుండి స్పష్టమైన ప్రకటన రాలేదు. శిక్షణకు సంబంధించి కొన్ని ఉమ్మడి వర్క్‌షెడ్ నిర్మాణాలను చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రతి చేనేత కుటుంబాన్ని గుర్తించి డజన్ల కొద్దీ ప్రాంతాలలో క్లస్టర్స్‌ను ఏర్పాటు చేసి వారి అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళికలను తయారు చేయాలి. అహ్మదాబాద్‌లో మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఉంది. వారితో కూర్చుని భారత ప్రభుత్వం తయారు చేస్తుంది. ఆషామాషీగా తయారు చేయడం కాదు. మార్కెటింగ్ గురించి లోతైన అధ్యయనం చేయాలి. వారికి శిక్షణ ఇప్పించాలి. ఆదాయం వచ్చే మార్గం చూడాలి. టైమ్ బౌండ్ ప్రోగ్రామ్ పెట్టి ఇంప్లిమెంట్ చేస్తారా? లేదంటే ఈ విధంగా తాత్సారం చేస్తారా?

**(19-03-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# మన సంస్కృతీ ప్రతిరూపాల ధ్వంస రచన

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, సభలో గానీ, సభ బయట గానీ, జరిగింది చాలా దారుణమైన సంఘటన. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో, ఈ నగరంలో నిన్న జరిగిన సంఘటనకు కన్నీళ్లు కార్చనివాళ్లు, గుండెల్లో రోదించనివాళ్లు ఒక్కరు కూడా ఉండరు. భాషకి అందని భావం మనసుని పిండేస్తుంటే, మనకు మామూలు మాటలు చాలవు. ఈ రోజు ఈ దెబ్బ పడింది, తెలుగు భాషా, సంస్కృతి మీద, ఈ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల చరిత్ర పునాదులపై పడింది. దీని విషయంలో మనం సంకుచితంగా ఆలోచిస్తే లాభం లేదు. ఏదైనా తెలుగు సాహిత్యంలో పదాలు వాడదామంటే, నాకే క్షణం అనుమానం వచ్చింది. ఆ మహాకవి తెలంగాణా వాడా, రాయలసీమ వాడా, లేక కోస్తా ఆంధ్రా వాడా ఏ పేరు చెపితే దానికి ఏమర్థాలు చెప్పుకొంటారో, ఏమౌతుందో.

అధ్యక్షా, మహాకవి గురజాడకు కులాన్ని, మతాన్ని, ప్రాంతాన్ని అంటగడితే, ప్రజాకవి వేమనకు సంకుచితత్వాన్ని అంట కడితే, మధుర కవి పోతనను ఒక ప్రాంతం వాడిగా ప్రకటించినట్లైతే మనను మనం అవమానించుకొంటున్నట్లే ఔతుంది. మన వేళ్లతో మన కళ్లను పొడుచుకొంటున్నాం. మన మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని మనం బైటపెట్టుకోవడమే అవుతుంది. 115 సంవత్సరాల క్రితం గురజాడ అన్నారు. చాలా మంది గురజాడ వారిని నిన్న, మొన్న అనుకోవచ్చు. 'కులములన్నియు కూలిపోవును. మతములన్నియు మాసిపోవును, ఎల్లలోకములు ఒక్క ఇల్లయి జ్ఞానమొక్కటి నిలిచియుండును'. పాపం అయనకేమి తెలుసు అజ్ఞానులు రాజ్యమేలుతారని, అంధకారంలో దేశం, జాతి మునిగిపోతాయని, మన బిడ్డల భవిష్యత్తును మన చేతుల్తోని పొడిచేసుకొంటామని పాపం ఆయనకేం తెలుసు.

అధ్యక్షా, విక్టర్ హ్యూగో 120 సంవత్సరాల క్రితం 20వ శతాబ్దం గురించి మాట్లాడుతూ, అన్నారు. He mentioned in his book 'The future of man'. In the 20th century for all There will be but one country - that country the whole earth. అందరికీ ఒకే దేశం ఉంటుంది, జాతి, దేశం ఎల్లలు కూడా పోతాయి. తరువాత ఆ దేశం ఈ భూమి మొత్తం అని అన్నారు. For

all there will be but one hope - that hope the whole heaven. స్వర్గం అందరికీ ఒకే ఒక ఆశా కిరణంగా ఉంటుందని ఆశించారు. ఇంతటి మూర్ఖంగా మనం ఉంటామని ఆశించలేదు.

అధ్యక్షా, 'ఇమ్మోర్టల్ పోయం'లో గురుదేవ్ ఠాగూర్ ఇలా అన్నారు. 'Where the world is not fragmented by narrow domestic walls.' ఈ రోజు ఈ కులాలు, పార్టీలు, ప్రాంతాలు భాషలకు అతీతంగా ఉదాత్తమైన మానవ విలువలని మళ్లీ ఒకసారి పుణికి పుచ్చుకోకపోతే, గుండెలోతుల్లోకి వెళ్లి ఆత్మ విమర్శ చేసుకోకపోతే జాతికి ద్రోహం చేసినవారమౌతాం.

అధ్యక్షా, James Kirkup గొప్ప కవి. ఆయన మాటలు నన్ను కదిలించి వేశాయి. ప్రొద్దున చదువుతుంటే. Remember no man is strange, no contry is foreign beneath all uniforms a single body breathes liks ours. The land our brothers walk upon is earth like this in which we all shall live. Remeber they have eyes like ours that wake or sleep, and strength that can be won by love but not by hatred- by love. In every land is common life that all recognize and understand. Let us remember whenever we are told to hate our berothers it is ourselves that we shall dispossess, betray and condemn. Remember we who take arms against each other, its is the human earth that we defile. అధ్యక్షా, మనం మన భూమిని మనం కించపరుచుకొంటున్నాం. ఒక మనిషిపై మనం వేలెత్తి ఆ మనిషికి కులాన్నో, మతాన్నో, భాషనో, ప్రాంతాన్నో ఆపాదించి, ఆ మాటకు వస్తే, వంటి రంగునో, జాతీయతనో ఆపాదించి కేవలం ఆ కారణంగా గుండెల్లో ద్వేషాన్ని నింపుకొని మనకు మనం మనుషులుగా చవకపరుచుకొంటున్నాం. ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో, ఇతర సందర్భాల్లో కొన్ని చోట్ల జరుగుతోంది మనల్ని మనం చౌకబారు చేసుకోవడం. ఒక్క సారి ఈ రాష్ట్రాన్ని వదిలి దేశం గురించి ఆలోచించమని నిన్న వీధుల్లోకి వచ్చిన ఈ వేలాది మందిని, ఈ రోజు ఈ ప్రాంతీయ విద్వేషాలతో ఆవేశం తెచ్చుకొంటున్న లక్షలాది మందిని కోరుతున్నాను.

ఈ దేశమంత సంక్లిష్టమైన సమాజం మరొకటి లేదు. ప్రపంచ చరిత్రలో భారతదేశ

మంత సంక్లిష్టమైన సమాజం మరొకటి లేదు. ఈ రోజు కెనడాలో ఇంగ్లీష్ మాట్లాడేవారు, ఒక్క క్విబెన్ ప్రావిన్స్‌లో ఫ్రెంచ్ మాట్లాడేవారుంటే ఆ దేశం కలిసి ఉంటుందా? ముక్కలైపోతుందా? అని ప్రతిరోజు తన్నులాడుకొంటున్నారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి రెఫరెండమ్ అంటున్నారు. బెల్జియం గోచిపాతంత దేశం. చాలా చిన్న దేశం. అక్కడ రెండు భాషలు. అక్కడ ఫ్లెమిష్ జాతి వాళ్లు, ఫ్రెంచ్ జాతివాళ్లు ఉన్నారు. ఫ్లమిష్ వారు మాట్లాడేది డచ్. ఈ డచ్‌కి, ఫ్రెంచ్‌కి మధ్య ఆ దేశంలో గందరగోళం ఎంతగా ఉందంటే ప్రభుత్వాల ఏర్పాటే అసాధ్యమౌతోంది. మన దక్షిణాన ఉన్న శ్రీలంక విషయానికి వస్తే, సింహళ భాష కాకుండా కేవలం తమిళం ఒక్కటే అదనంగా ఉంది. ఆ రెండు భాషల మధ్య సమన్వయాన్ని సాధించలేక ఆ దేశం కొన్ని లక్షల మందిని పొట్టన పెట్టుకొంది. ఒకప్పుడు దక్షిణాసియాలో తలమానికంగా మానవాభివృద్ధి అంకాల్లో ఉన్నటువంటి శ్రీలంక చాలా పతనావస్థకు చేరి, ఇటీవలే ఆ దౌర్భాగ్యం నుండి బయటపడింది. యుగోస్లోవియా, అలాగే మన నుండి విడివడిన పాకిస్థాన్‌లను చూడండి. పాకిస్తాన్ ప్రధానంగా ముక్కలైన కారణం బెంగాలీ భాష. ఉర్దు, పంజాబీ భాషల మధ్య ఉన్న వైరుధ్యం. అటువంటిది ఇన్ని భాషలను కలిపి ఉంచింది మన నాయకత్వం. మన రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టి, సంకల్పం, స్వాతంత్ర్యం వచ్చాక కూడా భాషను కీలకంగా భావించి, అన్ని భాషలను గౌరవించి, ఒక భాష వారు, మరోభాషవారిని తిట్టకుండా, ఒక సంస్కృతి మరొకరిపై పెత్తనం చేయకుండా ఈ దేశంలో అందరికీ అవకాశం కల్పించడం కోసం, మన నాయకత్వం జాతీయ స్థాయిలో ప్రయత్నం చేసింది. కాబట్టి, ఇంత సంక్లిష్టమైన చర్చ ప్రపంచంలో ఊహకు కూడా సాధ్యం కాని దేశంలో ఈనాడు కలిసి ఉంటున్నాం. ఈనాడు ఒక జాతి మూలాలపైన, ఒక భాషపైన, సంస్కృతిపైన దెబ్బ కొట్టడమంటే, ఆ జాతి ఐక్యతను, ఈ దేశపు ఔన్నత్యాన్ని నాశనం చేయడం, ఈ దేశాన్ని ముక్కలు చేయడం కోసం చేసే ప్రయత్నం. అధ్యక్షా.. ఉద్యమాలు ప్రజలు ఆలోచనలను, సరైనటువంటి వాస్తవాల ఆధారంగా, హేతుబద్ధమైన వాదనల ఆధారంగా బయటపెట్టడానికి మార్గాలు కావాలి. కానీ, హింసని, ద్వేషాన్ని, ఫాసిస్ట్ ధోరణిని, సాంస్కృతిక విధ్వంసాన్ని మనం వేరు, వారు వేరు, కులం పేరుతోనో, భాష పేరుతోనో, మతం పేరుతోనో ప్రాంతం పేరుతోనో అన్న భావాన్ని పెంచేవి ఉద్యమాలు కావు. ఇంతకు ముందు సోదరులన్నట్లుగా అది ధ్వంస రచన.

అధ్యక్షా, ఈ రోజు పులిమీద స్వారీ జరుగుతోంది. 'తిలా పాపం తలా పిడికెడని'

సోదరులు చాలా మంచి మాట చెప్పారు. ఇప్పుడు తప్పులు ఒప్పులు అంటే లాభం లేదు. కానీ, మొత్తం కలిపి ఈ రోజు పులి మీద స్వారీ చేస్తున్నాం. ఆ పులి దానిపైన స్వారీ చేసే వారిని కూడా తినడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికైనా మనం కళ్లు తెరవకపోతే, సంయమనంతో వ్యవహరించకపోతే, జాతికి చాలా ప్రమాదం వస్తుంది. ఈ భాషకి సంబంధించిన విధ్వంసం వెనకాల ఉన్న ఆలోచనలను చూడాలి. దాదాపు 35 సంవత్సరాల క్రితం కాంబోడియాలో దేశంలోని మూడవ వంతు జనాభాని చంపేశారు. చేతులు కొంచెం నున్నగా ఉంటే వీడు పనిచేయడం లేదని చంపేశారు. కళ్ల జోడు పెట్టుకొంటే, వీడు చదువుకొంటున్నాడని చంపేశారు. తల్లిదండ్రుల ఎదురుగా పిల్లల్ని చంపి, ఆ తరువాత వారిని చంపారు. చైనాలో సాంస్కృతిక విప్లవం పేరుతో, ఆ జాతి నాగరికత మూలాలను మొత్తాన్ని చంపేందుకు ప్రయత్నం చేశారు. 90 శాతం ఆ దేశంలోని అవశేషాలను నాశనం చేశారు. ఈ రోజు మన దేశంలో కూడా, ఇన్ని వేల సంవత్సరాల అవిచ్ఛిన్నమైన చరిత్ర, సంస్కృతి, ప్రపంచ చరిత్రలో ఏనాడూ చూడనంత వైవిధ్యం ఉన్నటువంటి సమాజంలో కూడా ఈ విధంగా ఈ విధ్వంసం చేయడమనేది కేవలం మన జాతి మూలాలను దెబ్బకొట్టడం మాత్రమే. తెలుగువాళ్ళ విగ్రహాలు కాదనుకోండి, అక్కడ తమిళుల విగ్రహాలను పెట్టామనుకోండి. సుబ్రహ్మణ్య భారతిదో, తిరువళ్ళువర్‌దో, సంగంకవులదో ఉంటే ధ్వంసం చేస్తామా? భారతీయులు కాదనుకోండి. ఒక అరిస్టాటిల్‌దో, ఒక ప్లేటోదో, ఒక నెల్సన్ మండేలాదో, ఒక అబ్రహాం లింకన్‌దో విగ్రహం పెట్టామనుకోండి. ధ్వంసం చేస్తామా? సర్ అర్థర్ కాటన్ గారు, ఎక్కడి నుంచో ఈ దేశానికి వచ్చాడు ఆయన. చాలా మంది ఈ దేశంలో జీతం తీసుకుంటున్నట్లుగా జీతం కూడా తీసుకుని దేశాన్ని దోచుకోవచ్చు, మందులు లేని కాలంలో టి.బి. వస్తే దాన్ని తట్టుకోవడానికి పాపం ఆయన ఆస్ట్రేలియాకు వెళ్లి ఐదేళ్లు ఉండవలసి వచ్చింది. ఒకసారి. మళ్లీ రెండోసారి వెళ్లడం జరిగింది. ప్రభుత్వం ఆయన మీద గట్టిగా దండనకు దిగినా, ఇక్కడి ప్రజల కోసం ఏదో చేయాలని తమిళనాడు వాళ్ల కోసం చేశారు, తెలుగు వాళ్ల కోసం చేశారు, దేశంలోని ఇతర ప్రాంతాల వాళ్ల కోసం చేశారు. ఆయన బతికి వుండగానే ఆయనకు గుడి కట్టి ఆయనను ఆరాధించారు అధ్యక్షా! జాషువా గారు రాసిన గబ్బిలాన్ని ఎవ్వరైనా చదివితే, వివక్షతకు గురైన వాళ్ల ఆవేదన ఏమిటో ఎవరికైనా అర్థమైతే, వివక్షతకు గురవుతున్నామని చెప్పుకునే ఏ ఒక్కడు కూడా గుర్రం జాషువా మీద వేలు చూపించలేడు, అది సాధ్యం కాదు. నన్నయ్య– ఈ భాషకు ప్రాణం పోస్తే, గురజాడ – ఈ భాషను ప్రజల్లోకి

తీసుకొస్తే... వాళ్లనే మనం శత్రువులుగా భావిస్తే ఇక మీద ఎవరికి మిత్రులు? ఈ ప్రజలకు మిత్రులా? ఈ సమాజాన్ని చీల్చడం కోసం, ఈ సమాజాన్ని నాశనం చేయడం కోసం, జాతి ఐక్యతను భగ్నం చేయడం కోసం, ఈ రాజ్యాంగాన్ని తగలబెట్టడం కోసం వచ్చినటువంటి వాళ్లా? విధ్వంసకారులా? జాతి నిర్మాతలా?

ఈరోజు ఏ స్థాయికి వెళ్లామంటే– సాక్షాత్తు మహాత్మాగాంధీ గురించి మాట్లాడితే, వీడు గుజరాతు వాడా, హిందీ వాడా, తెలుగు వాడా, ఈయన బ్రాహ్మణుడా, క్షత్రియుడా, వైశ్యుడా, శూద్రుడా అని అనుమానిస్తున్న పరిస్థితులున్నాయి. ఆయన విగ్రహం పాడైతే ఆయన కులం వాళ్లు తప్ప ఇంకొకరు పట్టించుకోకూడదు, మరొక ఆయనకు దెబ్బతగిలితే ఆయన మతం వాళ్లు తప్ప వేరే వాళ్లు పట్టించుకోకూడదు. మానవాళికి కృత్రిమంగా పెట్టుకున్న సరిహద్దులు ఇవి. మనల్ని మనం పొడుచుకుంటున్నామనే ఇంగిత జ్ఞానం నశించిపోయింది. దానినుంచే వచ్చే సమస్యలే ఇవి. జె.జె.హాలెండ్ ఈ విధంగా అన్నారు. ఈ రోజు నాయకత్వంలో కావలసింది. tall men and women, సూర్యుణ్ణి కిరీటంగా ధరించిన వాళ్లు, మబ్బులను ఛేదించి నిల్చునేవాళ్లు both in public duty and in private thinking ఈ రోజు ఉద్యమాల పేరుతో మనం గనుక సంయమనం పాటించకపోతే, ఒక ఉద్యమం జాతి ఐక్యత కోసం, రాజ్యాంగ విలువల కోసం, ఇతరుల స్వేచ్ఛను గుర్తించేందుకు ఆర్ద్రత కోసం ఒక ఉద్యమం నిలబడకపోతే ఆ ఉద్యమాలు జాతీయత, ప్రజల భవిష్యత్తును బలిపెడతాయి. ఈ రోజు ఈ దేశంలో వివిధ ప్రాంతాలలో ఏదో ఒక పేరున ఉద్యమాలను రేకెత్తిస్తున్న పెద్దలు ఆలోచించాలి, మనం నాగరికతను పెంచుతున్నామా లేక తుంచుతున్నామా? మన జాతిని బలోపేతం చేస్తున్నామా? లేక వ్యక్తిగత ప్రయోజనాల కోసం జాతిని నాశనం చేస్తున్నామా? బుద్ధుడి గురించి ప్రస్తావన వచ్చింది. ప్రేమ, సంయమనం, ధర్మ నిరతి, శాంతికి సజీవ రూపం గౌతమ బుద్ధుడు. ఉదయం మీ ఛేంబర్స్‌లో మాట్లాడుతున్నపుడు పెద్దలు అశోక్‌గారు వున్నారు. మా అందరి భావాలు వ్యక్తం చేసే అవకాశం ఇవ్వండి, జయప్రకాష్‌నారాయణగారు మాత్రం రాజ్యాంగం గురించి మాట్లాడతారన్నారు. ఖచ్చితంగా మాట్లాడతాను. అందుకే రాజ్యాంగంలో 51–ఎ అధికరణ పెట్టుకున్నాం ప్రాథమిక విధుల గురించి దీంట్లో మూడు మాటలు పెట్టుకున్నాం.

Sir, 51(e) says that "it shall be duty of every citizen to promote the spirit of comman brotherhood amanget the people of india. again 9f) says that "it shall be the duty of every citi-

zen of india volue and preserve the rich heritage of our composite culture next, it says that "it shall be the duty of every citizen of india to safeguard public property and to abjure violence."

హైదరాబాదు నగరం కాంపోజిట్ కల్చర్‌కు ప్రతిరూపం. నాయకులుగా చెప్పుకుంటున్న వారందరికీ కూడా రాజ్యాంగ విలువలు పట్టకపోతే, నోరు తెరిస్తే బూతులు వస్తే, ఒక కులం కారణంగానో, ఒక మతం కారణంగానో ఒక భాష కారణంగానో, ఒక ప్రాంతం కారణంగానో ద్వేషాన్ని విరజిమ్మితే, ప్రజల్లో ఆగ్రహావేశాలున్నపుడు దాన్ని చల్లార్చడానికి బదులు రెచ్చగొడితే, ఇక ఏ రకంగా ఈ రాజ్యాంగాన్ని వాళ్లు పాటిస్తున్నట్టు? రాజ్యాంగాన్ని పాటిస్తామని అభ్యర్థులైనప్పుడు ప్రమాణం తీసుకుంటున్నారు, పదవుల్లోకి వచ్చినపుడు ప్రమాణం తీసుకుంటున్నారు, మంత్రులైతే తీసుకుంటున్నారు, తర్వాత వాళ్లు ఇలా చేస్తే... ఏ పులి మీద స్వారీ చేస్తున్నారో ఆ పులి వాళ్లను తినేస్తుంది. ఇప్పుడు విగ్రహాల ధ్వంసమే కాదు, పాత్రికేయులు, రాజకీయాల్లో వున్న వాళ్లు వీళ్లు అని లేదు. సమాజంలో అరాచకత్వం రాజ్యమేలుతున్నపుడు, మానవ విలువలు, రాజ్యాంగం పతనం అవుతున్నపుడు ఏమి జరుగుతుందో అది జరుగుతోంది ఈ రోజు. అందుచేత నాయకత్వం నిర్ణయించుకోవాలి. నాయకత్వం ప్రజల్ని నడిపించేదా? లేక వెనక నడిచేదా? నాయకత్వం ద్వేషం, మాత్సర్యాన్ని పెంచేదా? లేక ప్రజల్లో రాగ ద్వేషాలు లేకుండా ప్రజలందరినీ సమానంగా ప్రేమించేదా? నాయకత్వం కొందరి పదవుల కోసం కోట్ల మంది భవిష్యత్తును బలిపెట్టేదా? లేక కోట్ల మంది భవిష్యత్తు కోసం అన్ని త్యాగాలకు సిద్ధపడేదా? గతంలో జరిగిన తప్పిదాల గురించి మాట్లాడనక్కర్లేదు. మనందరికీ తెలుసు. Sir we are aware of the saying that "past sins cast long shadows." ఈ సభలో ప్రతి ఒక్కరికీ తెలుసు, గుండెలోతుల్లోకి వెళితే తెలుస్తుంది. ఈ రోజు నాయకత్వం కావచ్చు, పార్టీలు కావచ్చు, పత్రికలు కావచ్చు, ఈ రోజు మనమందరమూ సంయమనంతో వుండాలి.

అధ్యక్షా, గతం గతన్నాస్తి. మొట్టమొదటగా నేను కోరేదేమంటే–ఈ విగ్రహాలను ఈ గడ్డ పవిత్రతకి మన జాతీయతకు, మన సంస్కృతికి ప్రతిరూపాలుగా అత్యంత వేగంగా అపూర్వమైన గౌరవంతో, మళ్లీ ఎంత ఖర్చయినా, ఎంత ఇబ్బందైనా

పునఃప్రతిష్టించడం మనందరి బాధ్యత. ఆ బాధ్యతను ప్రభుత్వం నిర్వహిస్తుందనే విశ్వాసం నాకుంది. రెండు– హైదరాబాదు నగరం ఈ దేశంలో వున్న, ఈ సమాజంలో వున్న వైవిధ్యానికి, జాతీయతకి, ఎల్లలు, సరిహద్దులు లేనటువంటి ద్వేషరహిత సమాజానికి ప్రతీకగా వుంది. ఈ నగరాన్ని, ఈ నగర ప్రజలను, ఈ రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాంతాలను కాపాడుతామనే నిశ్చయాన్ని ప్రభుత్వం మాటల్లోనే కాదు చేతల్లో కూడా చూపించవలసిన అవసరం వుంది. దానికి సహకరించవలసిన బాధ్యత మా అందరి మీదా వుంది, సభ బయట గానీ, సభ లోపల గానీ, మూడు– ఇదొక defining moment జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పటికైనా ఒక దేశమో, ఒక రాజ్యాంగమో, ఒక ప్రభుత్వమో, అందరికీ సమానంగా వర్తించే ఒక చట్టమో ఉందా లేదా? తేల్చుకోవలసిన అవసరం వుంది. నోటితో నవ్వి నొసటితో వెక్కిరిస్తే లాభం లేదు. మన మాటలు, మన చేతలు కలిసివుంటేనే ప్రజలు హర్షిస్తారు, అప్పుడే ఆ మాటలకు గౌరవం, ఆ గొంతుకు ఆ బలం వస్తుంది. చాలా మంది ప్రస్తావించారు. నేను ఇపుడు వాటిని చెప్పదలుచుకోలేదు. కానీ ఈ జాతి నిర్మాణం చేసిన పెద్దలందరూ ధైర్యంగా, కీలకమైన సమయాలలో తాత్కాలికంగా రాజకీయంగా దెబ్బ తగిలినా... నా రాజకీయానికి తగిలిన దెబ్బకంటే నా దేశానికి జరిగే మేలే చాలా ముఖ్యమని గుర్తించి త్యాగాలకు సిద్ధపడ్డారు. ఇప్పుడు సమయం ఆసన్నమైంది. తక్షణమే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇప్పటి వరకూ జరిగిన నాటకాలన్నింటికీ స్వస్తి చెప్పి ఈ దేశ ప్రయోజనాలు, ఈ రాష్ట్రంలో వున్న అన్ని ప్రాంతాల ప్రజల ప్రయోజనాలు, ఈ దేశంలో అన్ని ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన ప్రజల ప్రయోజనాలు, వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగానికి అనుగుణంగా ఒక నిర్ణయం వెంటనే చేసి, పటిష్టంగా దాన్ని అమలుచేసే బాధ్యత ప్రభుత్వం మీద వుంది. ఇది కేవలం ప్రభుత్వం మాత్రమే చేస్తే చాలదు. తాబట్టిన కుందేలుకు మూడే కాళ్లు అని పార్టీలు వ్యవహరించి, బయట ఒక మాట, లోపల ఒక మాట మాట్లాడి, ప్రజలను రెచ్చగొట్టే తతంగం చేసి తర్వాత ప్రైవేటుగా ఇంకొక మాట మాట్లాడితే లాభం లేదు. ఇప్పటికైనా సరే సంయమనంతో, సామరస్యంతోటే పరిష్కారాలు సాధ్యమవుతాయని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల పార్టీలు, రాష్ట్రంలో ఎలాంటి అభిప్రాయం వున్నా, భావావేశాలున్నా, అభిప్రాయ భేదాలున్నా కూడా సామరస్యం అవలంభించకపోతే అది ప్రమాదానికి దారి తీస్తుంది. తాత్కాలిక ప్రయోజనాల కోసం, ఓటు బ్యాంకుల కోసం, దేశ ప్రజల భవిష్యత్తుకు సమాధి కట్టే రాజకీయం నుంచి, దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం, అవసరమైతే తాత్కాలికమైన

రాజకీయ ప్రయోజనాలను ప్రక్కకుబెట్టే రాజకీయం రావాలి.

అధ్యక్షా, చివరగా– సామాన్య ప్రజలు. ఇది కేవలం రాజకీయ పార్టీలు, నాయకుల తప్పు మాత్రమే కాదు. భావావేశాలకు గురై, ఆగ్రహ జ్వాలల్లో వున్నపుడు మంచీ చెడూ, ఉచితానుచితాలు లేకపోతే తండ్రి అని చూడం. కన్నతల్లి అని చూడం, తోడబుట్టిన చెల్లెలని చూడం, మానవత్వం మరిచిపోతాం. ఇప్పటికైనా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళ్లు తెరవాలి. ద్వేషాన్ని మాత్సర్యాన్ని హింసను విడనాడాలి. అన్నింటిని మించి 'జీరో సమ్ గేమ్' పాలిటిక్స్ వదలాలి. ఒకరికి లాభం అయితే, మరొకరికి నష్టం, కాబట్టి వాడికి లాభం రాకుండా వాడి కళ్లు పొడిచేస్తాను అనే పరిస్థితి కాకుండా చేయాలి. జాతి నిర్మాతల్లో ఒకాయన అన్నారు. If india loses, who will win భారతదేశమే? ఓడిపోతే ఎవరు గెలుస్తారు? If India wins, who loses? ఈ దేశమే గెలిస్తే నష్టం ఎవరికి అని? అది గుర్తిస్తారని ఆశిస్తూ ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**(17-03-2011న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# తుపాకులతో పారిశ్రామికీకరణ రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ఇది మామూలుగా ఈ సభలో అధికార పక్షానికి, ప్రతిపక్షాలకు మధ్య జరిగే వివాదంగా భావించకూడదు. దీని వెనకాల చాలా మౌలిక అంశాలు ఇమిడి వున్నాయి. ప్రభుత్వాన్ని చాలా నిండు మనసుతో కోరుతున్నాను దయచేసి లోతుగా పరిశీలించమని. ముఖ్యమంత్రిగారు కూడా ఇక్కడే వున్నారు. ఇది కేవలం ఒక వివాదంగానో, ఒక ప్రాజెక్టుకు సంబంధించిందిగానో అనుకోకూడదు. 25 ఏళ్ల క్రితం నేను ఒక అధికారిగా 26వేల ఎకరాల భూమిని సేకరించాను విశాఖపట్నం స్టీలు ప్లాంటుకు. ఆ రోజు నామమాత్రంగా రైతుకి డబ్బు ఇచ్చాం, మెట్టభూమైతే ఎకరానికి రూ॥1100లు, పల్లమైతే రూ॥2200లు ఇచ్చాం నేను గట్టిగా పోరాడి దాన్ని రూ॥10వేలు చేశాను. అదే చాలా గొప్ప అనుకున్నారు. రాత్రి పగలు పోరాడి 8వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే ఏర్పాటు చేశాం. ఆనాడు అంతగా ప్రజలు సహకరించారు. మాకు ప్రాజెక్టు కావాలని ప్రాణాలు తీసుకున్నారు. విశాఖ ఉక్కు– ఆంధ్రులహక్కు అని రాష్ట్రంలో అన్ని ప్రాంతాల నుంచి ఉద్యమాలు చెలరేగి తుపాకుల బుల్లెట్లను ఎదుర్కొంటే... ఈ రోజు రాష్ట్రంలో ఎక్కడ ఏ ప్రాజెక్టు వచ్చినా, ఆ ప్రాజెక్టు రావడానికి వీలులేదని చెప్పి ప్రాణాలు పోగొట్టుకోవడానికి సిద్ధపడుతున్నారు. ఎక్కడ తప్పటడుగు వేశాం? లోతుగా వెళ్లకుండా ఎప్పటికెయ్యది ప్రస్తుతం.... అనుకుంటూ పోతే, మొన్న సోంపేట.....చెబుతాను, నేనెవ్వరినీ నిందించడం కోసం మాట్లాడడం లేదు. దీని పరిష్కారం కోసం అడుగుతున్నాను. ఎందుకంటే పారిశ్రామికీకరణ లేకుండా రాష్ట్రం బాగుపడదని మనందరికీ తెలుసు, కానీ పారిశ్రామికీకరణ పేరుతో ప్రజలు తుపాకుల వరకూ వస్తే, మనుషులు శవాలై తేలితే అది రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు. ప్రజలను మనం విశ్వాసం లోకి తీసుకుని, నమ్మకం కలిగించి, వారి జీవితాలు బాగుపడతాయనే విశ్వాసం కల్పించి, అటు పారిశ్రామికీకరణ, ఇటు నిర్వాసితుల భవిష్యత్తు, ఆ ప్రాంత ప్రజల భవిష్యత్తు రెండింటినీ సమన్వయం చేయడంలో ఈ పార్టీ ఆ పార్టీ అని అనడం లేదు, అధికార యంత్రాంగం నుంచి పార్టీలు, ప్రభుత్వాల

వరకు మనమందరమూ విఫలమయ్యాం. ఈ నేపథ్యంలో మంత్రిగారి ప్రకటన చాలా అసమగ్రంగా వుంది. ఒక పోలీసు అధికారి ఆ రెండు గంటల్లో జరిగిన సంఘటనపై వివరణ ఇచ్చినట్లుగా వుందే గానీ అసలెందుకని ప్రజల నుంచి ఇంత ప్రతిఘటన వచ్చిందనేదానికి సంబంధించి ఎక్కడా ఒక్క మాట కూడా లేదు. ఏ సమస్య లేకుండా అంతమంది ప్రజలు తిరగబడతారా? అక్కడే పెట్టాలా ఈ ప్రాజెక్టు, ఇది సరైన భూమేనా కాదా? ఉదాహరణకు సోంపేటలో అది బీల భూమైతే కాదని దొంగ సర్టిఫికేట్ ఇచ్చారు. రెండోది – ఎంత భూమిని సేకరించారు? ఏ పరిహారాన్నిచ్చారు? మూడు– దీర్ఘకాల పునరావాసం కోసం ఏర్పాట్లు చేశారా? అన్నింటికీ మించి, ఇంతకు ముందు పెద్దలు చెప్పారు. థర్మల్ పవర్ ప్లాంటు పొల్యూషన్ అంటేనే భయపడిపోతున్నారు. అసలు ఏ కారణంగా ప్రజల నుంచి అంత ప్రతిఘటన వచ్చింది? ఆ వివరాలు స్టేటుమెంటులో లేవు. మంత్రిగారి స్టేటుమెంటు చాలా అసమగ్రంగా వుంది. ఆ వివరాలు కావాలని కోరుతున్నాను.

నాలుగోది– పార్టీలుగా మనం మనం కొట్టుకుంటున్నాం. శాంతి భద్రతలు ముఖ్యమంత్రిగారి బాధ్యత కాదే. రోజువారీగా జిల్లా కలెక్టర్ ఏమి చేస్తున్నారు? ఇంత పెద్ద తతంగం ఇన్నాళ్ల నుంచి జరుగుతుంటే, ఆరేడు నెలల నుంచి గందరగోళం జరుగుతుంటే, గతంలో ఇదే జిల్లాలో సోంపేటలో భయంకరమైన సంఘటన జరిగి మనుషులు ప్రాణాలు కోల్పోతే, ప్రజల్లో ఉద్రేకాలు చెలరేగుతుంటే ఏం చేస్తున్నారు జిల్లా కలెక్టర్? District collector is the eyes and ears of the Government కేవలం ఆర్డీఓ మొక్కుబడిగా అక్కడేదో గొడవ జరుగుతుంటే సర్దుబాటు చేయడానికి ప్రయత్నం చేశాడనే మాట తప్ప, ఇంత పెద్ద ఉద్యమం జిల్లాలో చెలరేగుతుంటే, ఇది ప్రజలకు– పరిశ్రమలకు మధ్య యుద్ధంగా పరిణమిస్తే, ప్రజల పక్షాన ఉండవలసిన ప్రభుత్వం. రెండింటికీ సమన్వయం చేయవలసిన ప్రభుత్వం, దానికోసం ప్రభుత్వం దగ్గర పనిచేస్తున్న యంత్రాంగం ఏమి చేస్తున్నది? ఎంత దారుణమైన వైఫల్యం కనిపిస్తోందిక్కడ! స్టేట్‌మెంటులో పోలీసుల ప్రస్తావన వచ్చింది. కంపెనీ వాళ్లు రాసిన లెటర్ ఏదో కలెక్టర్ పోలీసులకు పంపినట్లుగా ప్రస్తావన వచ్చింది. ఆ రోజు ఆర్డీఓ వెళ్లి బతిమాలాడారని ప్రకటనలో వస్తుంది గానీ ఏమి చేస్తోంది జిల్లా యంత్రాంగం? ఇదేనా జిల్లా యంత్రాంగం పనిచేయవలసిన తీరు? దాని మీద ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

ఐదు- పోనీ ఆరు నెలలు మరచిపోయారు, అక్కడ జిల్లా కలెక్టర్/ దొరగారికి తీరిక లేదు. ఫిబ్రవరి 17న శాసనసభ సమావేశాలు ప్రారంభమైన రోజున పెద్ద సంఘటన జరిగిందని ఆరోజు మనం టీవీలలో చూశాం. కనీసం ఆపద్ధర్మంగానైనా, అప్పటి వరకు నిద్రపోతున్న ఆయన-17 నుంచి మళ్లీ 28 వరకు ఏం జరిగింది. పాలనా యంత్రాంగం నుంచి ఎలాంటి స్పందన వచ్చింది? అక్కడి ప్రజలను కూర్చోబెట్టి, అక్కడి మత్స్యకారులను కూర్చోబెట్టి, అక్కడి రైతులను, కౌలుదారులను  కూర్చోబెట్టి ఏమిటి మీ సమస్య, ఏమి జరిగింది. దాని పరిష్కారానికి ఏమైనా చేశారా? ప్రభుత్వానికి ఏదైనా నివేదిక పంపించారా? ఇక్కడ శాంతి భద్రతల సమస్య వచ్చింది. లాఠీ ఛార్జ్ చేయవలసి వచ్చింది. కలెక్టర్ నుంచి నివేదిక వచ్చిందా? రాష్ట్రంలో శాంతిభద్రతలు చూడవలసిన బాధ్యత వున్న అధికారులు, మంత్రులూ నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారా? లేకపోతే జిల్లాలో ఏమి జరుగుతోందో ప్రశ్నించరా? నివేదిక ఏదైనా వుందా? ఉంటే బయట పెట్టండి ఏం చేశారు? అంటే తుపాకీ కాల్పులు జరిగి ప్రాణాలు పోయేదాకా ఈ రాష్ట్రంలో పట్టించుకోరా? నెలల తరబడి గందరగోళం జరుగుతున్నా, కనీసం ఏమి జరుగుతోందో పరిపాలనా యంత్రాంగాన్ని హెచ్చరించారా? బెత్తం పట్టుకోరా? పట్టుకునే నాథుడే లేడా? రాజకీయాలలో మనమంతా తగవులాడుకోవడం తప్ప, మనం రోజూ అధికారంలో మునిగిపోవడం తప్ప పెద్ద పెద్ద శాంతిభద్రతల సమస్య వచ్చినా పట్టించుకోరా? ఇదేదో ఒక గ్రామంలో వచ్చిన చిన్న సమస్య గాదు, ఇదేదో ఒక గ్రామంలో ఒక గోతి దగ్గరి తగాదా కాదు. ఒక పెద్ద ప్రాజెక్టు గురించి ప్రభుత్వం తరపున ఇస్తున్న వివరణ ఇది. 28న శాంతి భద్రతల సమస్య వచ్చింది. అయినా పట్టించుకోకపోతే ప్రభుత్వానికి పరిపాలనా యంత్రాంగం మీద పట్టు ఉందా లేదా అసలు?

అధ్యక్షా, మొన్న సోంపేట, ఈ రోజు కాకరాపల్లి. రెండు కేసులూ చూడండి అధ్యక్షా! ఫైరింగ్ జరిగి మనుషులు చనిపోగానే జాతీయ స్థాయి నుంచి మినిస్టర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్స్, మీ పార్టీయే ప్రభుత్వంలో ఉంది అక్కడ. మరుక్షణమే అనుమతులు రద్దు చేస్తున్నామని అక్కడ అన్నారు. సస్పెండ్ చేశామని ఇక్కడ అన్నారు. అదే రీతిన ఈ సభలో వున్న మంత్రులలో కొందరు- ప్రభుత్వం తప్పు చేసిందని బహిరంగంగా వ్యాఖ్యానించినట్లుగా వార్త వచ్చింది. జాతీయ స్థాయిలో మీ పార్టీ అధికారంలో వున్న ప్రభుత్వం... తప్పు చేశామని ఒక కేసులో వెనక్కి వెళ్లిపోయారు. ఇంకొక కేసులో సస్పెండ్ చేసినా పునర్విచారణ చేస్తున్నామని అంటున్నారు. ఈ

సభకు ఉమ్మడిగా బాధ్యత వహించవలసిన మంత్రులలో కొందరు మేము తప్పు చేశామని బహిరంగ వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అంటే కుడి చెయ్యికి, ఎడమ చెయ్యికి సంబంధం లేకుండా పోయింది. ఈ సభ విశ్వాసం పొందడం కోసం సమిష్టి బాధ్యత వహిస్తుందా? లేకపోతే ఏమంత్రి దారి ఆ మంత్రిదేనా? ఈ ప్రభుత్వమన్నది ఒకటుందా? లేదా?

**సింహాద్రి పవర్‌ప్లాంటు:** ఇందాక పెద్దలు ప్రస్తావించారు. సింహాద్రి పవర్ ప్రాజెక్టు ప్రభుత్వ పవర్ ప్రాజెక్టు. యన్‌టిసిసి ప్రాజెక్టు యన్‌టిసిసి ప్రాజెక్టులో యాష్ పొల్యూషన్ మనం ఎప్పుడైతే అదుపు చేయలేకపోయామో, ప్రభుత్వరంగ సంస్థ అయినప్పటికీ కూడా కొన్ని కోట్ల రూపాయల కోసమని వెరచి, అక్కడ 20,30 గ్రామాలలో అదే పనిగా ఆ బూడిద పడుతున్నా. వాళ్ల జీవితాలు బూడిదవుతున్నా పట్టించుకోకుంటే– ఉద్యమకారులు, పర్యావరణ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఏమి చేస్తున్నారంటే, ప్రతి గ్రామం నుంచి రైతులను ఆ సింహాద్రి ప్రాజెక్టు దగ్గరకు తీసుకెళ్లి ఒకసారి చూడండి. ఒకవేళ రేపొద్దున ఈ పవర్ ప్రాజెక్టు వస్తే మీ గతి అంతేనని అంటే– మాకు సరైన పరిహారం వస్తుందని, మా బతుకుల బాగుపడతాయని, పరిశ్రమలు వస్తే ఉపాధి దొరుకుందని నమ్ముతున్న వాళ్లు కూడా చచ్చినా మాకు ఈ ప్రాజెక్టు వద్దని అంటున్నారు. రాష్ట్ర మొత్తం అంటున్నారు ఈ ఒక్క చోటే కాదు అధ్యక్షా! ఈ నేపథ్యంలో– సింహాద్రి ప్రాజెక్టులో గానీ, ఇప్పటికున్న ఇతర బొగ్గు అధారిత ప్రాజెక్టుల్లోగానీ ఈ యాష్ పొల్యూషన్ లేకుండా ప్రభుత్వం ఎందుకని చర్యలు తీసుకోవడం లేదు? పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏం చేస్తోంది? అసలు పట్టించుకోరా? 30 గ్రామాలలో భయంకరమైన పొల్యూషన్ ఉంటే, రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టులు రావడానికి వీలులేదని ఇంత తీవ్రంగా జనమంతా ఘోషిస్తుంటే, ప్రతిసారీ ఫైరింగులు జరిగిపోతే, ఇక్కడ మేమందరమూ ప్రభుత్వాన్ని చెడామడా తిట్టడం, ప్రభుత్వమేమో సమాధానం చెప్పడం, అక్కడా ఇక్కడా తంటాలు పడడమేమిటి? ఏమి చేస్తోంది పొల్యూషన్ బోర్డు? చట్టాలున్నాయే చట్టబద్ధ సంస్థలున్నాయే ఎందుకని పట్టించుకోవడం లేదు? అక్కడ పొల్యూషన్ లేదా? డజన్ల కొద్దీ గ్రామాలు నష్టపోవడం లేదా?

ఒకసారి వెళ్లి చూడండి. ఎందుకు పట్టించుకోము? ఆ అధికారులను, ఎం.డిలను జైలులో పెట్టండి. ఈ రాష్ట్రంలో ఖచ్చితంగా చట్టం ఉందనే నమ్మకం ప్రజలకు కలిగించాలి. అది చేయకుండా, ఆ పొల్యూషన్‌ను ఆపుతామంటే నమ్ముతారా? 60 వేల మెగావాట్సు ప్రాజెక్టు అని అంటున్నాము. ప్రకాశం జిల్లాలోని కనపర్తిలో రాష్ట్ర

ప్రభుత్వ ప్రాజెక్టు 8వేల మెగావాట్సు అన్నారు. ఆనాడు నేను జిల్లా కలెక్టరుగా అక్కడ పని చేసినప్పుడు లిఫ్ట్ ఇరిగేషన్ చేశాను. ఇప్పటికీ అది అమలు అవుతోంది. డబుల్ క్రాప్ ల్యాండ్ అక్కడ బంగారంలాగా ఉన్న ల్యాండ్‌ను తీసుకుంటున్నారు. కోస్ట్ ప్రక్కనే ఖాళీగా ఏ రకమైన ప్రయోజనం లేని ల్యాండ్సు వ్యాన్‌పిక్‌కు ఇచ్చినవి ఉన్నాయి. ఏ భూమి, ఎలా, ఎక్కడ తీసుకోవాలి? ఎన్ని ప్రాజెక్ట్స్ కావాలి? 60వేల మెగావాట్సు అని అంటున్నాము. 60 వేల మెగావాట్సు కావాలా? పొల్యూషన్ మనం కొనుక్కొని, మన ప్రజల ప్రాణాలు తీసివేసి, ఉపాధి మనం పోగొట్టి, విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయాలా? ఈ ప్రాజెక్టుకు మనం అనుమతి ఎందుకు ఇవ్వాలి? ఇది ఆలోచన చేశారా? ఈ నేపథ్యంలో ఒక డిమాండ్ చేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు లోతుగా ఆలోచించాలి. ఏ పార్టీ ప్రభుత్వంలో ఉన్నా పారిశ్రామికీకరణ జరుగుతున్నప్పుడు శాంతిభద్రతల సమస్య రావడం ప్రజలకు ప్రభుత్వం మీద విశ్వాసం పోవడం, ఒకళ్ల మీద ఒకళ్లు కల్పించుకోవడం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి శ్రేయస్కరం కాదు. దయచేసి మన రాష్ట్రంలో భూసేకరణ చట్టాన్ని సవరించాలి. ఒక ఇండిపెండెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలి. ఏ పెద్ద ప్రాజెక్టు వచ్చినా, దానికి ఎంత భూమి కావాలి. ఎక్కడ కావాలి, ఏ మేరకు పరిహారం ఇవ్వాలి, పరిహారంతోపాటు ఒక ఎకరం డెవలప్ చేసి ఇస్తే, ధర పెరుగుతుందనే.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** రాష్ట్రంలో చాలా చోట్ల ఉంది. పెరుగుతున్న విలువలో నాకు వాటా ఉందనే భావన ఉంటే ప్రయివేటుగా తీసుకున్నా, ప్రభుత్వం సేకరించినా, ఆ భూములలో ప్రభుత్వానికి ప్రజలకు వాటా ఉంటే ప్రతిఘటన ఉండదు. ఉపాధి ఎలా కలిగించాలి. పొల్యూషన్‌కు సంబంధించి ఎలా చేయాలి? మొదలైన వాటిని సమన్వయం చేయాలి. ప్రతిదీ ఒక ఉద్యమంలాగ, యుద్ధంలాగ, ఇక్కడ శాంతి భద్రతలకు విఘాతం పరిశ్రమలా ప్రజలా అనే పరిస్థితి రాకుండా ఒక చట్టబద్ధమైన విధంగా చట్టాన్ని సవరించాలని స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థను క్వాజీ జ్యుడిషయల్ అథారిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, చాలా నిర్దిష్టమైన అంశాలను నేను మీ దృష్టికి తీసుకొస్తున్నాను అవి (1) మంత్రులు వారి వివరణ ఇస్తున్నప్పుడు అభివృద్ధికి రాష్ట్రంలో విద్యుత్ కావాలి కాబట్టి ఈ ప్రాజెక్టులు అవసరమన్నారు. నాకు అర్థమైనంతవరకు ఇది మర్చంట్ పవర్ ప్లాంట్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విధిగా ఒక్క యూనిట్ కూడా ఇవ్వాలనే నిబంధన గానీ విద్యుత్ ఒప్పందం గానీ లేదు. కాబట్టి మన రాష్ట్రం అభివృద్ధి

కోసం మాత్రం కాదు. సభను పక్కదోవ పట్టిస్తున్నారు. దీని గురించి మాకు స్పష్టమైన వివరణ కావాలి. ఎందుకంటే ఈ సభలో కూర్చుని చాలా క్యాజువల్‌గా మాట్లాడటం మంచిది కాదు. సభ ద్వారా వాస్తవాలు ప్రజలకు స్పష్టంగా తెలియాలి. (2) డ్రైయిన్ లేకపోవడం వల్ల, పల్లపు ప్రాంతాన్ని మేరకు చేయడం చేత రెండు గ్రామాలలో పంటలు మునిగిపోయి నష్టం వాటిల్లింది కాబట్టి ప్రజలలో ఆందోళన వచ్చింది. మంత్రులు ఇప్పుడు డ్రైయిన్ నిర్మాణం చేయిస్తున్నామని చెప్పారు. మరి జిల్లా యంత్రాంగానికి ఇప్పటిదాకా డ్రైయిన్ లేదనే విషయం కనిపించలేదా?

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, నేను మంత్రిగారిని వ్యక్తిగతంగా తప్పుపట్టడం లేదు. నేను చెప్పేదేమిటంటే నిజంగా అక్కడ సమస్య ఉందని తేలినప్పుడు, వర్షాలు వచ్చింది వర్షాకాలంలోనేఅంటే జూలై, ఆగస్టు, సెప్టెంబర్, నవంబర్ మాసాల్లో వర్షాలు వచ్చాయి. దీని గురించి ప్రజల నుంచి ఉద్యమం, ఆందోళన వచ్చినప్పుడు ప్రస్తుతమున్న డ్రెయిన్ సరిపోక పంటలు మునిగిపోతున్నాయి. దానిని పరిష్కారం చేస్తామని ఎందుకు ఒప్పించలేకపోయారు? ఎందుకు ప్రభుత్వానికి చెప్పలేకపోయారు? ముందు జాగ్రత్త చర్యలు ఎందుకు తీసుకోలేదు? నేను మంత్రులను తప్పు పట్టడం లేదు. అది జిల్లా అధికారుల బాధ్యత.

మూడవది, నేను ఇందాక ప్రస్తావించాను గానీ దాని గురించి ఎవరూ మాట్లాడటం లేదు. సీనియర్ మంత్రులు బహిరంగంగా ప్రభుత్వం తప్పు చేస్తున్నదని వ్యాఖ్యానించిన మాట వాస్తవమా? ఆ వ్యాఖ్యాను ఉపసంహరించుకుంటారా లేదంటే ఒప్పుకుంటారా? ఈ సభ అంటే ప్రభుత్వానికి సమిష్టి బాధ్యత ఉన్నదా లేదంటే ఎవరి దారిన వారు పోతారా? ఇప్పుడు ఈ మాట ఎందుకు ప్రస్తావించాల్సి వస్తుందంటే ఇవ్వాళ రాష్ట్రంలో ఈ ప్రభుత్వం ఉమ్మడిగా సమిష్టి బాధ్యత వహిస్తున్నదనే భావం ప్రజలకు కలగడం లేదు. ఎవరికి ఇష్టం వచ్చినట్లుగా వారు మాట్లాడుతున్నారు. మనమున్నది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో. ఈ సభలో మీకు మెజారిటీ మద్దతు ఉండి, మీరు ప్రభుత్వం నడుపుతున్నంతవరకు ఈ సభకు మీరు సమిష్టిగా, ఉమ్మడిగా బాధ్యులు, ఏ మంత్రికి ఆ మంత్రి ప్రైవేట్ అఫైర్స్ ఉండొచ్చు.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ఈ సభలో ఒక సభ్యుడిగా, ఈ సభకు మీరు సమిష్టిగా బాధ్యత వహించమని కోరే హక్కు నాకున్నది. ఖచ్చితంగా ప్రభుత్వం సమిష్టిగా సభకు బాధ్యత వహించడం లేదు. ఎన్నో సందర్భాలలో మౌలికమైన విధానపరమైన

విషయాలలో మంత్రులు ఎవరి మాట వారు మాట్లాడుతున్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం పని చేయాల్సిన తీరు కాదని చెప్పాల్సిన అవసరం నాకెంతైనా ఉన్నది. దానికి ముఖ్యమంత్రిగారు సమాధానం చెప్పాలి.

సింహాద్రి ప్రాజెక్టు గురించి చెప్పాను. ఆ ప్రాజెక్టు మీద నాకెలాంటి కోపం లేదు. అది ప్రభుత్వ ప్రాజెక్టు. ఆ ప్రాజెక్టు కట్టడం కోసం ప్రత్యేకంగా ఇద్దరు వ్యక్తులం ఆనాడు ఒప్పించాము. నేను, డా॥ఇ.ఎ.ఎస్.శర్మ గారు, ఆనాడు నేను ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కార్యదర్శిగా ఉన్నప్పుడు ప్రత్యేకంగా ఈ రాష్ట్రానికి డెడికేటెడ్‌గా చేయించి పెట్టాం. మాకు వ్యతిరేకం కాదు. కానీ ఆ ప్రాజెక్టులో పొల్యూషన్‌ను పట్టించుకోకపోవడం వల్ల గ్రామ గ్రామాల నుంచి బృందాలుగా అక్కడ పర్యటనకు తీసుకెళ్లి వాళ్లకు చూపెట్టి విద్యుత్ ప్రాజెక్టులంటే అసహ్యం కలిగేటట్లుగా చేస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా లేదా? ఆ ప్రాజెక్టు కావచ్చు లేదంటే అటువంటిదే ఇంకొక ప్రాజెక్టు కావచ్చు. మంత్రిగారు ఇందాక మాట్లాడుతూ ఇప్పుడు కొత్తగా వచ్చిన సాంకేతిక విజ్ఞానం కాదని అన్నారు. వారు చెప్పింది వాస్తవమే. కానీ మిగతా చోట లేని సమస్యలు సింహాచలంలోనే ఎందుకొచ్చాయి? దీని గురించి ప్రజలలో అంత ప్రతిఘటన వస్తుంటే ఎందుకు పట్టించుకోలేకపోతున్నారనే దానికి మంత్రిగారు సమాధానం చెప్పాలని మీ ద్వారా కోరుతున్నాను.

**(05-03-2011 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# భూ కేటాయింపులపై సమగ్ర చర్చ అవసరం

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, చాలా రోజుల తరువాత సభలో గందరగోళం లేకుండా మాట్లాడడం కొత్తగా ఉంది.

స్టార్మ్ కాకుండా వేడి కాకుండా వెలుతురు వస్తుందని ఆశిస్తున్నాను. చాలా సంవత్సరాల తరువాత ఈ రాష్ట్రంలో సహజవనరుల కేటాయింపులో ప్రజా ప్రయోజనాలు దెబ్బతిన్నాయని స్పష్టమైన అభిప్రాయం రాష్ట్రంలో ఉంది. ఒకటి అధికార దుర్వినియోగం జరిగిందని, రెండవది అశ్రిత పక్షపాతం బంధుప్రీతి చోటుచేసుకున్నాయని, మూడవది విపరీతమైన అవినీతికి భూమినో, సహజవనరులనో అడ్డుపెట్టుకొని పాల్పడ్డారని, నాల్గవది ప్రజాప్రయోజనాలు దెబ్బతిన్నాయని, అయిదు అవసరమైన చోట అవసరమైన కార్యక్రమం కోసం భూములు ఇచ్చినా కూడా చాలా ఎక్కువగా అవసరానికి మించి అప్పజెప్పారని ఈ అయిదు రకాల నిర్దిష్ట ఆరోపణలున్నాయి. మళ్లీ భూముల్లో కూడా నాలుగు రకాలుగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రత్యక్షంగా ప్రభుత్వ భూములు ఇచ్చినవి కావొచ్చు. ఏ.పి.ఐ.ఐ.సి ద్వారా ప్రభుత్వ భూములను కానీ సేకరించిన భూములు కానీ ఇవ్వడం కావచ్చు లేకపోతే ఎస్.ఇ.జెడ్‌ల పేరుతో సేకరణ కానీ ప్రభుత్వం నుండి ఇవ్వడం కానీ లేదా ఒప్పందాల ద్వారా గాని ఇవ్వడం కావొచ్చు లేదా వక్ఫ్ భూములు ఎండోమెంట్స్ భూములను ప్రభుత్వం పందేరం చేయడం కావొచ్చు. ఈ మొత్తం విషయంలో సమగ్రంగా చర్చ జరగడం అవసరం. ప్రతిపక్షాలేమో చర్చ కావాలని అంటే చర్చలో ప్రాధమిక ఆధారాలున్నట్లయితే అక్రమాలు జరిగాయని అనడానికి రుజువు చేయలేరు. ఇది కోర్టు కాదు. ఆ సమయం లేదు. ప్రాధమిక పరిశీలనలో మనం దీని నిగ్గు తేల్చాలని భావించినట్లయితే, ఆ అంశాలలో మాకు ఒక సభా సంఘాన్ని వేయండి సరే జె.ఎల్.సి నా లేకపోతే సభా సంఘమా అన్నది మీ విచక్షణ అధ్యక్షా, సభా సంఘం వేసినా సరిపోతుంది. ప్రభుత్వం నుండి కావలసింది ఏమిటంటే సమగ్రమైన చర్చ జరగాలి, ఆ చర్చ కోసం కావలసిన పూర్తి సమాచారాన్ని సభ ముందు, చర్చకు ముందే ఉంచాలి.

అధ్యక్షా, కాగితాల ఆధారంగా పత్రికలలో వచ్చిన వార్తల ఆధారంగానో లేక పరిశ్రమల శాఖా మంత్రి గారు ఒక కంపెనీ మీద తీసుకొచ్చిన చిన్న స్టేట్‌మెంట్ మీద చర్చ అంటే అసంబద్ధం. ఈ చర్చ గానీ సభా సంఘం గానీ ఒక కుటుంబం మీదో, ఒక వ్యక్తి మీదో ఒక కంపెనీ మీదో వేయడానికి ఉండకూడదు. ఈ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడం కోసం కావాలి. కాబట్టి నేను మీ ద్వారా ప్రభుత్వానికి కోరేది ఏమిటంటే మిమ్మల్ని కోరుతోంది ఈ ప్రభుత్వానికి రూలింగ్ ఇవ్వమని చెప్పి దయచేసి ఇవ్వాళ ఎలాగో చర్చ సాధ్యం కాదు కాబట్టి రేపటి లోపల మీ దగ్గర ఉన్నటువంటి సమగ్ర సమాచారాన్ని ఏ.పి.ఐ.ఐ.సీ ద్వారా కేటాయింపులు చేసింది కావచ్చు ఎస్.ఇ.జెడ్‌లు వగైరా లేదంటే కంపెనీలకు ప్రభుత్వం ప్రత్యక్షంగా కట్ట బెట్టింది కావొచ్చు. వక్ఫ్ భూములు లేదంటే ఎండోమెంట్స్ భూములు కావొచ్చు, మైనింగ్ లీజులు కావొచ్చు వీటి మీద నిర్ధిష్టంగా మీరు మాకు సమాచారాన్ని సభ ముందు ఉంచండి. దాని ప్రాతిపదికగా చర్చ జరపండి. లేకపోతే ఒకరి మీద ఒకరు దుమారం చేసుకోవడం తప్ప ఇంకొకటి ఉండదు. దురదృష్టం ఏమిటంటే ఏమైనా ఆరోపణలు ఒకరు చేస్తే, మీరు అంతకన్నా ఎక్కువ చేశారు కదా అనేది సమాధానంగా కనిపిస్తుంది. ఇది ఏ రకంగానూ ఈ సభకు ఆరోగ్యకరం కాదు. మన గౌరవానికి ఇది సరైనది కాదు. ఈ రాష్ట్రంలో ఆరోపణ వస్తే ఆ ఆరోపణ చేసినవారు దాని ప్రాధమిక ఆధారాలు చూపించాలి. ఆరోపణ వస్తే సమగ్రంగా సవివరంగా నిజాయితీగా ప్రభుత్వం స్పందించాలి. తప్పు జరిగితే ఒప్పుకోవాలి. అంతే తప్పు నేను చేసాను కాబట్టి మీరు ఇంతకంటే ముందు తప్పు చెసారు కాబట్టి తప్పుకు తప్పు సరి అని అంటే, ఈ రాష్ట్రం ఈ సభలో ఉన్నవారి ఆస్తి కాదు.

కాబట్టి ఈ చర్చ ఆ రకంగా ఉండాలి. ఎందుకంటే రేపొద్దున ఎలా జరుగుతుందా అని ప్రజలంతా చూస్తున్నారు ఆసక్తిగా ఒకరి మీద ఒకరు దుమారం వేసుకుంటే చాలదు. పూర్తి వివరాలు మీ దగ్గర ఉన్నాయి. లేకపోతే చర్చకు సిద్ధం అనే హక్కు మీకు లేదు. చర్చకు సిద్ధం అంటే సమాచారం ఉండాలి. ఉన్న సమాచారాన్ని అక్కడ పెట్టండి. లేని సమాచారాన్ని తెప్పించండి. ఇప్పటి దాకా మంత్రులకు పనిలేకుండా ఉంది. అధికారులు పనిలేకుండా కూర్చున్నారు. ఈ 16 గంటలూ చిత్తశుద్ధితో లోతుగా పనిచేయమనండి. ఆ సమాచారం మొత్తం రేపటి లోగా ఇస్తే బాగుంటుంది. రాత్రి నిద్రపోకపోయినా నష్టం లేదు. ఆ సమాచారాన్ని తీసుకొచ్చి ఈ సభలో పెడతారని, ఈ సభలో వచ్చినటువంటి నిర్దిష్టమైన సమాచారం మేరకు, చర్చ మేరకు స్పష్టమైన

ఆరోపణల మీద ప్రాథమిక ఆధారాలున్నట్లయితే ఒక కంపెనీ మీద, ఒక వ్యక్తి మీద కాకుండా సమగ్రంగా విచారణ కోసం సభాసంఘాన్ని ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ముందుగా ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. ఎందుకంటే సమస్య తీవ్రతను గమనించి పరిష్కారం కోసం ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం ముందుకు వచ్చాయి.

అధ్యక్షా, నిర్దిష్టంగా నేను కోరేదేమంటే స్పెషల్ ఎకనమిక్ జోన్స్ అంటే ప్రత్యేక ఆర్థిక మండళ్లకు కేటాయింపులు జరిపిన, లేక సేకరిస్తున్న మొత్తం భూముల వివరాల సమాచారం ఒక సింగిల్ డాక్యుమెంట్ క్రింద రెడీ చేయవచ్చు. రెండవది మౌలిక సదుపాయాల కోసం కేటాయించిన భూములకు సంబంధించి పది ఎకరాలు మించిన వాటిని లెక్కలోకి తీసుకోవచ్చు. ఎందుకంటే రోడ్ల కోసం సేకరిస్తున్న చిన్న చిన్న వాటిని, పది సెంట్లు, 20 సెంట్లు, రోడ్ల కోసం భూసేకరణ చేసిన వాటిని వదిలేసినా మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం పదెకరాలకు మించి కేటాయింపులు జరిపిన వాటి గురించి సమగ్రంగా చర్చించాలి. ఒకటి స్పెషల్ ఎకనమిక్ జోన్స్, రెండవది మౌలిక సదుపాయాలకు సంబంధించిన వాటిని ఈ ప్రభుత్వం వచ్చిన 2004 నుంచి ఇవ్వండి కాదూ అంతకుముందు నుంచి అంటే 1995 కాని లేదా అంతకు ముందు నుంచి ఇచ్చినా మాకు అభ్యంతరం లేదు. ఆ భూముల ఓనర్‌షిప్ విషయాలకు వస్తే అవి ప్రభుత్వ భూములు కావచ్చు, వక్ఫ్ భూములు కావచ్చు, భూసేకరణ భూములు కావచ్చు. మరేదైనా భూములు కావచ్చు. ఏవైనా సరే ఇందులోకి వచ్చేస్తాయి. వాటిని పరిశీలించినట్లయితే ఎమ్ఐఎమ్ సభ్యులు కానీ, బీజేపీ సభ్యులు కానీ, మిగతా ప్రతిపక్షాలు కానీ లేవనెత్తిన అభ్యంతరాలు కూడా కవర్ అయ్యే అవకాశముంది. కాబట్టి మౌలిక సదుపాయాల అంశానికి సంబంధించి నిర్దిష్టంగా 2004కు తగ్గకుండా అంతకు ముందువి ఎంత వీలైతే అంత కాలానివి వివరాలు ఇవ్వండి.

**(25-03-2011 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# భూ పందేరాలపై సభాసంఘం వెయ్యండి

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, రీయిన్‌హోల్ నేబర్ అనే సుప్రసిద్ధ తత్వ వేత్త ఒక మాట అన్నారు. ఆయన ఎంతో కాలం క్రితం ఈ మాట అన్నారు. Man's capacity for justice makes Democracy possible. మనిషిలో ఉన్న ధర్మ నిరతి ప్రజాస్వామ్యాన్ని సాధ్యం చేస్తుంది. Man's inclination to injustice makes Democracy necessary. మనిషిలో ఉన్న అధర్మ ప్రవృత్తి ప్రజాస్వామ్యాన్ని అవసరం చేస్తుంది. కాని ఈ సభలో భూముల గురించి, ప్రభుత్వానికి ఇచ్చిన అధికారాన్ని వినియోగించిన తీరును గూర్చి, స్పెషల్ ఎకనామిక్‌జోన్స్ గురించి, పారిశ్రామిక ప్రగతి గురించి మనం చర్చిస్తున్నాం. మొదట ఒక విషయాన్ని మా పార్టీ తరపున స్పష్టం చేస్తున్నాం. వ్యవసాయానికి, పారిశ్రామికీకరణకు మధ్య ఏ రకమైన వైరుధ్యం లేదు. మన రాష్ట్రంలో 3.50 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి వుంది. మొత్తం పరిశ్రమలకు మనం ఇచ్చే భూమి లెక్కేసినా కూడా 1.50 లక్షల ఎకరాలు లేదా 1.75 లక్షల ఎకరాలు, అంటే అర్థశాతం. ప్రతి రెండు వందల ఎకరాల వ్యవసాయ భూమికి ఒక ఎకరాన్ని మన పిల్లలకు ఉపాధి కలగడం కోసం, మన ఆర్థిక వ్యవస్థ పెరగడం కోసం, మన రాష్ట్రంలో పారిశ్రామికీకరణ జరగడం కోసం, రెండు వంద ఎకరాలకు ఒక ఎకరాన్ని కేటాయించినట్లయితే అది అన్యాయం కాదు. కాబట్టి ఈ భూమి కేటాయిస్తే వ్యవసాయం పోతుందన్న వాదనతో నేను ఏకీభవించను. సమస్య అక్కడ లేదు. సమస్యల్లా భూమి కేటాయింపుల్లో కనీస ప్రమాణాలు పాటించారా లేదా, ప్రజా ప్రయోజనాలు కాపాడారా లేదా అన్నది. భూమి కేటాయించడంలో మొట్టమొదట కావలసింది Due diligence, కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. ఇదే రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ప్రభుత్వం ఉన్నప్పుడే వోక్స్‌వ్యాగన్‌కి రూ॥10 కోట్లో ఎంతో, కనీసం ఆ కంపెనీకి వెళుతోందా లేదా, మధ్యలో ఎకడైనా తినేస్తున్నాడా, ఏమీ జరుగుతోందనేది చూడకుండా రూ॥10కోట్లు ఇచ్చేశాం. అధ్యక్షా, ఇప్పటకి కూడా నాకు తెలిసి Due diligence లేకుండా ఖజానా నుంచి వాళ్లకు రూ॥10కోట్లు ఇచ్చేస్తే కనీస జాగ్రత్తలు తీసుకోకుండా. ఏమీ పోలేదన్నది కాదు, అక్రమంగా ఒక్క రూపాయి అయినా ఖజానా నుంచి తరలిపోతే వాడి ఉద్యోగం పోతుంది. ఎవడు తరలించాడు? ఆ అధికారి ఎవడు? మంత్రినేమీ

నేను తప్పు పట్టడం లేదు. ఆనాడు కూడా నేను తప్పు పట్టలేదు. నేను ఆనాడు పౌర సమాజ ప్రతినిధిగా వున్నాను. రాజకీయ పార్టీలో కూడా లేను. కానీ ఖజానా నుంచి రూ॥10 కోట్లు అప్పనంగా, అక్రమంగా తరలిపోతున్నా పట్టించుకోని అధికారుల మీద మీరేమైనా చర్యలు తీసుకున్నారా? అధ్యక్షా, ప్రభుత్వ ఖజానాకు కావలి కుక్కలా ప్రభుత్వం వుండాలి. ప్రజల పన్ను డబ్బు ఇది. లేదా ఈ బిడ్డల బతుకులను తాకట్టు పెట్టి అప్పు తీసుకొచ్చిన డబ్బు ఇది. అలాగే ప్రజల ఆస్తులకు కావలి కుక్కల్లా వుండాలి. కానీ ఇది అప్పనంగా పోతుంటే కనీస ప్రమాణాలు పాటించకపోతే అక్కడ ప్రభుత్వ నిర్లక్ష్యం నిరసించదగింది. రెండోది – నిజాయితీగా చేశారా లేదా? సాధారణంగా ప్రభుత్వం నుంచి ఒక ఆదేశం వస్తే, We give the benefit of doubt. వారు చేసింది సక్రమంగా, నిజాయితీగా చేశారా? అని. కానీ ప్రభుత్వానికి కూడా like Caesar's wife, you must be above Suspicion మీరు చేసే చర్యల్లో ఎక్కడా కూడా అతి చిన్న స్థాయిలో కూడా పొరపాటు జరిగింది, దురుద్దేశం వుందనే మాట వచ్చినట్లయితే, దానికి ఆధారాలు ఉంటే, ప్రభుత్వం విఫలమైనట్లు లెక్క. మూడోది– ప్రజా ప్రయోజనాలను కాపాడారా లేదా? ఇది కేవలం కొందరి ప్రైవేటు వ్యక్తుల కోసం పోయిందా లేక ప్రజా ప్రయోజనాలను కాపాడారా? నాలుగోది– పరిమితమైన సహజ వనరులను మీరు కేటాయిస్తున్నప్పుడు – అది భూమి కావచ్చు, మైనింగ్ కావచ్చు, తీర ప్రాంతం కావచ్చు, మరొకటి కావచ్చు, అక్కడ కనీస జాగ్రత్తలు పాటించారా లేదా? ఐదవది– అసలు పోటీతో మీరు ఈ వనరులు కేటాయించారా లేక రహస్య ఒప్పందాలు చేసుకుని ఎవడు ఇష్టమైతే వాడికి వనరులు ఇచ్చారా? ఈ ఐదు ప్రమాణాలు చాలు అధ్యక్షా, నేను ఇంకేరకంగానూ పరిశీలించను, వ్యక్తిగత ఆరోపణలు చేయను, వీలైనంత వరకు వ్యక్తుల పేర్లు తీసుకురాను. కానీ ఈ ఐదు ప్రమాణాలు దెబ్బతింటే, దాన్ని ఈ సభలో నేను ప్రస్తావించకపోతే ఒక సభ్యుడిగా ఈ సభకు, ఈ రాష్ట్రానికి అన్యాయం చేసినట్లు లెక్క. ఎప్పుడో 110 ఏళ్ల క్రితం టాల్‌స్టాయ్ ఈ కథ రాశాడు. ఆయన చనిపోయి 101 ఏళ్లు అయింది. ఆ కథ టైటిల్ How much land does a man require? నా దగ్గర ఆ కథ వున్నది. జానారెడ్డిగారు చెబుతున్నారు. సుమారుగా అదే కాలంలో గురజాడ అప్పారావు గారు కన్యాశుల్కం రాశారు. దాంట్లో ఆయన చెప్పాడు. ఇళ్లు ఇళ్లనేవు చిలుకా, ఇళ్లెక్కడే చిలుకా, ఊరికి ఉత్తరాన సామాధిపురాన ఆరడుగుల పొడగున ఇల్లుందని ఆయన రాశాడు. తెలుగునాట ఒక అద్భుతమైన దృశ్య కావ్యం అది.

**డా॥ జయప్రకాష్ నారాయణ:** అధ్యక్షా, నిన్న మాట్లాడుతూ... ఆ భూమి మీద వెంపర్లాటతో ఓ మనిషి ఎక్కడెక్కడో ఓల్గా నది దాటి దూర ప్రాంతానికి పోయి ఎట్లా చనిపోయాడో రాసారు. నిన్న గౌరవ సభ్యులు కిషన్‌రెడ్డి గారు మాట్లాడుతూ, ఓ పార్టీని ఉద్దేశించి... భూమి చుట్టూ ఆ పార్టీ తిరుగుతోందని మాట్లాడారు. దానిని నేను ఒప్పుకోను. ఈ రోజు రాజకీయం మొత్తం, భూమి చుట్టూ, ప్రభుత్వ వనరుల చుట్టూ, ఆస్తుల చుట్టూ తిరుగుతోంది. ఈ రోజు ప్రజల మనస్సుల్లో రాజకీయం పట్ల ఇంత జుగుప్స పెరగడానికి కారణం – మేము ప్రభుత్వ ఆస్తుల్ని ప్రజల ఆస్తుల్ని కాపాడమని మిమ్మల్ని పంపిస్తే, మీరు దానిని సొంతం చేసుకోవడం కోసమే మీ శక్తంతా ఉపయోగిస్తున్నారు అని ప్రజల మనస్సుల్లో చాలా బలంగా ఈ భావన నాటుకుంది.

అధ్యక్షా, ఏదైనా కొత్త విధానాలు చేపట్టినప్పుడు కొన్ని పొరపాట్లు దొర్లుతాయి. ఉదాహరణకి మొదట్లో విద్యుత్ ప్లాంట్లలో జాతీయస్థాయిలో మనం చాలా పెద్ద తప్పిదాలను చేశాం. మనం కాస్ట్ ప్లస్ అనే పేరుతో ఎంత పెట్టుబడి పెట్టినా ఆ పెట్టుబడికి అంగీకరించి దాని మీద 16.5 శాతం వారికి లాభం రావాలని ఆ రకమైన రేట్లకు ఒప్పుకున్నాం. అధ్యక్షా, కాలక్రమేణా ఆ అనుభవాల నుంచే పాఠాలు నేర్చుకున్నాం. ఇప్పుడు కాంపిటీటివ్ బిడ్డింగ్ అంటున్నాం. అలాగే, భూ కేటాయింపుల్లో తప్పులు జరిగివుండొచ్చు. గతంలో ఈ వైపు ఉన్న మిత్రులు అధికారంలో ఉన్నప్పుడు, ఒక పొరపాటు జరిగింది. మిగతా విషయాలు నాకు తెలియదు, నేను ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఐఎంజీ కంపెనీకి కొన్ని వందల ఎకరాల భూమిని....

**(అంతరాయం)**

సరే అప్పటి ప్రభుత్వం. అసెంబ్లీ రద్దయిన తరువాత కూడా దానిని కట్టబెట్టారు. కనీస ప్రమాణాలను, జాగ్రత్తలను పాటించలేదు. ఆ కేసు గురించి నేను ఎందుకు చెబుతున్నానంటే, అంతకు కొన్నేళ్ల ముందు నేను అధికారిగా ఈ రాష్ట్రంలో ఉన్నాను. నా చివరి పోస్టింగు, ఈ రోజు మంత్రి గారు నిర్వహిస్తున్న ఏపీఐఐసీకి ఎండీగా నేను పనిచేశాను. ఆనాడు ఆ కంపెనీకి చెందిన వాళ్లు అనేకసార్లు నా మీద ఒత్తిడి తీసుకొచ్చారు. రాజకీయంగా ఏ ఒత్తిడీ రాలేదు, నేను అబద్ధమాడటం లేదు. కానీ, ఎన్నిసార్లు ఒత్తిడి తెచ్చినా కూడా ఇది అసంబద్ధమైన పథకమని ప్రక్కన పెట్టాను. కానీ, ముందుచూపు లేకుండా వీళ్లేదో రాష్ట్రానికి ఒరగబెడతారనే భ్రమతో, ఇతర కారణాలతోనో కట్టబెట్టారు. మీ ప్రభుత్వం వచ్చిన తరువాత మీరు దానిని రద్దు

చేశారు. రాష్ట్ర ప్రజలంతా ముక్తకరంతో మీరు చేసిన పని సరైందని హర్షించారు. కానీ, అంత తప్పు జరిగిందని తెలిసిన తరువాత, దానిని సరిదిద్దిన తరువాత అనంతరం ఆ తప్పు చేయకుండా ఉండే బాధ్యత ప్రభుత్వ పక్షానికి ఉందా లేదా? ముందు తప్పు చేసారంటే విషయం తెలియదు కాబట్టి. తప్పులు దొర్లాయి. ఎవరో వస్తుంటారు... నాకు అనుభవం ఉంది. అధికారంలోకి క్రొత్త ప్రభుత్వం రాగానే ఎంతో మంది కాగితాలు పట్టుకొని వస్తుంటారు. అయ్యా, మీరు ఒక్క కాగితం మీద సంతకం పెట్టండి, మేము రేప్పొద్దున ఒక్క శాతం వడ్డీ చొప్పున 10 బిలియన్ డాలర్లు ప్రభుత్వానికి ఇస్తామని వచ్చిన వాళ్లు నాకు తెలుసు. ఐటీ మంత్రి గారు తల ఊపుతున్నారు. ప్రతి మంత్రికీ ఈ అనుభవమున్నది. రాష్ట్ర గవర్నర్ గారి దగ్గరకు, ముఖ్యమంత్రి గారి దగ్గరకు ఇలాంటి వారు రావడం నాకు తెలుసు. ఒకసారి ఎవరో 10 బిలియన్ డాలర్లో, 15 బిలియన్ డాలర్లో తెస్తామని చెప్పినవాడు.... పాపం ఆ నాటి ముఖ్యమంత్రి గారు అమాయకుడాయన. ఆయనకు నిజాయితీగా కోట్లు సంపాదించడం తెలుసు, కానీ దోచుకోవడం తెలియదు. ప్రభుత్వానికి డబ్బులేమైనా వస్తాయని ఆయన మమ్మల్నందరినీ పిలిపించి, చూడండి.. ఈయన డబ్బు తీసుకొస్తాడట. ఖజానా ఖాళీగా ఉంది, మనకు ఒక్క శాతానికి వడ్డీకి ఇస్తానంటున్నాడు, ఈ సంగతి ఏమిటో చూడండంటే మేము ఉన్నతాధికారిని, ఆయనను కూర్చొబెట్టాం. కూర్చోబెడితే ఒక గంటైన తరువాత ఆయన మాకు చెప్పిందేమంటే.. సార్ ఈ రోజు మాకేమైనా అకామడేషన్ ఏర్పాటు చేస్తారా అన్నారు. రాష్ట్రానికి 15 బిలియన్ డాలర్లు డబ్బులు తెస్తామన్న పెద్దమనిషి, రాత్రికి మాకేమైనా హోటల్ రూము, గెస్ట్ హౌస్ రూము ఇస్తారా అని అడిగారు. అప్పుడు మేము ప్రభుత్వానికి తెలియజేశాం. చాలామంది తిరుగుతూ మోసం చేస్తున్నారు. బహుశా హవాలా డబ్బుగానీ, మాఫియా డబ్బుగానీ, అంతర్జాతీయ సంఘటిత నేరస్థుల డబ్బుగానీ వస్తున్నదేమో జాగ్రత్త పడండని వారికి చెప్పడం జరిగింది. అలా పొరపాట్లు జరగొచ్చు. కానీ జరిగిందని తెలిసిన తరువాత కూడా పట్టించుకోకపోతే అంతకంటే దారుణం మరొకటి లేదు.

అధ్యక్షా, ఇప్పుడు మీ దగ్గరకు సాక్ష్యాలతో సహా వస్తాను. రస్ అల్ ఖైమా అనేది గోచిపాతరంత దేశం మనందరికీ మనస్సుల్లో ఏముందంటే వెస్ట్ ఏషియాలో ఉన్న ప్రతి దేశానికి అపారమైన ఆయిల్ సంపద ఉంది, వాళ్లు కువైట్‌లాగా ఉన్నారనుకుంటున్నాం. రస్ అల్ ఖైమా కి ఏ వనరులు లేవు. ఏ డబ్బులు లేవు. ఎందుకూ కొరగాని దేశమది. ఆ దేశం పట్ల నాకు ఏ విధమైన దురుద్దేశం లేదు.

2008న సంవత్సరంలో వాళ్లతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇది కేవలం ఒక నిర్దిష్టమైన ఆరోపణ చేస్తున్నాను. గవర్నమెంటు– గవర్నమెంటు ఒప్పందమన్నట్లయితే వేరే పోటీకి అవకాశముండదు. ఎవరూ తప్పు పట్టలేరన్న కారణంగా ప్రభుత్వంలో ఉన్న మౌలికమైన నిబంధనల్ని తుంగలోకి తొక్కడం కోసం ఈ ఒప్పందాన్ని సృష్టించారు.

దీనిలో పేర్కొన్న పేరు కాతర్ మసాద్. ఎవరీ కాతర్ మసాదనీ నేను ఇంటర్నెట్‌కి వెళ్లి చాలా జాగ్రత్తగా పరిశీలించాను. 2009వ సంవత్సరంలో అక్టోబర్, 13వ తేదీన న్యూయార్క్ సుప్రీంకోర్టులో ఇదే కాతర్ మసాద్ ఫైల్ చేసిన ఒక ఆఫిడవిట్ నాకు దొరికింది. ఈ పేరు ఆ పేరు కూడా ఒకటి కాదు, స్పెల్లింగ్ తప్పే కావచ్చు. ఆ మనిషి అవునో కాదో కూడా నేను చెప్పలేదు. ఎందుకంటే, సంతకం మాత్రం సుమారుగా ఒకే విధంగా కనిపిస్తుంది. కానీ, ఆ మనిషో కాదో నేను స్పష్టంగా చెప్పలేను. కానీ, ప్రభుత్వంతో ప్రభుత్వం ఇంత పెద్ద ఒప్పందం అన్నప్పుడు, కనీసం ఆ రస్ అల్ ఖైమా ప్రభుత్వానికి చెందిన దౌత్యాధికారులు, ప్రభుత్వ నాయకులు ఒక్కరు కూడా లేకుండా, ఎవడో ఒకానొక సంస్థకు అధిపతినని చెప్పుకున్నవాడిని కూర్చోబెట్టుకొని, మన మంత్రులు వారితో సంతకాలు పెట్టేసారు గానీ, కనీస ప్రమాణాలను పాటించలేదు. ఆ కాతర్ మసాద్ దీనిలోనేమో KHATEER అని పేరున్నది, అదే న్యూయార్క్ సుప్రీంకోర్టులో ఫైల్ చేసిన అఫిడవిట్‌లో KHATER అని పేరున్నది. స్పెల్లింగ్ మిస్టేకే కావచ్చు నాకు తెలియదు. నేను ఖచ్చితంగా అతడు సంతకం పెట్టలేదని అనలేను. కానీ, ఈ ఒప్పందాన్ని ఎంత అదరాబదరాగా చేసుకున్నారంటే, అసలు వాడి పేరు సరిగ్గా రాశాడా లేదా? వాడు వాడా కాదా? ఎందుకు చేస్తున్నాం? ఆ దేశానికి వనరులున్నాయా లేదా? అనేది చూడకుండా ఒప్పందం చేసుకున్నాం.

అతడు న్యూయార్క్‌లో మరో మాట చెప్పాడు. మేము కేవలం రస్ అల్ ఖైమా లో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం ఏర్పడ్డ కంపెనీ, రస్ అల్ ఖైమా లోకి 2.5 బిలియన్ డాలర్ల పెట్టుబడిని పెట్టిన ఖ్యాతి మాకున్నది అన్నాడు తప్ప, ప్రపంచంలో పోర్టుల నిర్వహణలో మాకు అనుభవమున్నదనిగానీ, ప్రపంచంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టే శక్తి మాకున్నదని గానీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తున్నామనే మాటలు పొరపాటున కూడా అతడు న్యూయర్క్ సుప్రీంకోర్టులో మాట్లాడలేదు. అధ్యక్షా, దీని వివరాలు మీకు కావాలంటే పంపిస్తాను, ఇంటర్‌నెట్‌లో కూడా దొరుకుతుంది.

ఎనిమిదిన్నర కోట్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వం, ఒక సంవత్సరానికి

1 లక్షా 28 వేల కోట్ల రూపాయల బడ్జెట్ ఉన్న ప్రభుత్వం, దగ్గర దగ్గర అయిదున్నర లక్షలు, ఆరు లక్షల కోట్ల రూపాయలు జీడీపీ ఉన్న రాష్ట్రం...గోచిపాతరంత ఉన్న ఒక చిన్న దేశం, భూతద్దంతో చూస్తే కూడా కనిపించనంత దేశం. ఏ మాత్రం వనరులు లేని దేశం, ఆ దేశంలో ఒక సంస్థకు అధిపతిగా చెప్పుకుంటున్నవాడితో కళ్లు మూసుకొని సంతకాలు పెట్టారే... ఈ రాష్ట్ర ప్రతిష్టను కాపాడారా? ఈ రాష్ట్ర ప్రజలను కాపాడారా? లేకపోతే నడివీధిలో ఈ రాష్ట్ర పరువును తాకట్టు పెట్టారా? అధికార దుర్వినియోగం కోసమని చెప్పి... మీరనవచ్చు దీనిలో పొరపాటు ఉండవచ్చు గానీ దుర్వినియోగం ఎక్కడ ఉందని. అధ్యక్షా 51 శాతం పెట్టుబడి పెడతామని చెప్పిన వాడు, నేను ప్రభుత్వ పక్షాన్ని సవాలు చేస్తున్నాను.. ఈ రోజువరకూ ఒక్క శాతమైనా పెట్టుబడి వారి నుండి వచ్చిందా? ఎక్కడి నుంచి వస్తుంది? Articls of Associations ఏవైతే ఉన్నాయో, ఈ దేశంలో ఉన్న ప్రైవేటు కంపెనీకి రసాల్‌ఖైమాలో ఉన్న ఇన్‌వెస్ట్‌మెంటు అథారిటీకి మధ్య ఒప్పదం కుదుర్చుకున్నామంటున్నారే, ఈ రెండింటికీ మధ్య ఒప్పందంలో అర్టికల్స్‌ని ఈనాటికైనా అమలు చేశారా? మన ప్రభుత్వం నుంచి రసాల్‌ఖైమా ప్రభుత్వంతో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపారా? జరపకపోతే కనీస ప్రమాణాలను పాటించే పద్ధతి లేదా? ఇక్కడ ప్రభుత్వమున్నదా? లేక ఇక్కడేమైనా పచారీ కొట్టు నడుపుతున్నామా?

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, అంతటితో ఆగలేదు. దీనిలో మన రాష్ట్రంలోనే ఒక ప్రైవేట్ సంస్థ ఈ రస్ అల్ ఖైమాలో ఉన్నటువంటి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీతో మళ్లీ ఇంటర్నల్‌గా ఒక ఒప్పందం కుదుర్చుకుంది. కుదుర్చుకుని, వాన్‌పిక్ అంటే నాకు సరిగా పేరు ఎక్స్‌పాన్షన్ గుర్తుకు రావడం లేదు. ఏమిటంటే, వాడరేవు అండ్ నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ఇంగ్లీష్ పేరు లాగా చాలా అద్భుతంగా ఉంది. దానిలో పెట్టుబడి ఎక్కడి నుంచి వచ్చింది. రస్‌అల్‌ఖమా వాళ్లు పెట్టుబడి పెడతారని, గవర్నమెంట్ గవర్నమెంట్ ఒప్పందం చేసుకున్న తరువాత పదుల వేల ఎకరాలను వాళ్లకు కట్టబెట్టే హక్కు ఈ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారు ఈ రస్ అల్‌ఖైమా లేకుండా, అలా కాకుండా, పెట్టుబడి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం అనుకొని ఉంటే, ఎందుకని కాంపిటీటిన్ బిడ్డింగ్ చేయలేదు మీరు? అంటే ప్రభుత్వం నుంచి ప్రభుత్వం ఒప్పందం అనే దొంగ మాటలు చెప్పి, ఈ ప్రజలను ఏమార్చి, ఈ ప్రజలను మోసపుచ్చి, ద్రోహ బుద్ధితో, ఈ రాష్ట్రంలో వనరులను కొంత మంది ప్రైవేటు

వ్యక్తులకు కేటాయించడం కోసం ఈ ఒప్పందం చేశారనే విషయం స్పష్టంగా తేటతెల్లంగా కనబడుతోంది.

అధ్యక్షా, కథ అంతటితో ఆగలేదు. ఉడికిందో, లేదో తెలుసుకోవాలంటే అన్నం అంతా చూడనక్కర్లేదు. నాలుగు మెతుకులు చాలు. అందుకనే నేను ఎక్కువ కేసుల్లోకి వెళ్లను. రెండు, మూడు కేసులనే నేను స్పష్టంగా వివరాలతో, ఆధారాలతో ప్రస్తావిస్తాను.

అధ్యక్షా, ఈ రస్ అల్ ఖైమాతో ఒప్పందం కుదుర్చుకున్న భారతీయ కంపెనీ వారేమి చేశారు. ఇక్కడేమో వెంటనే 2008, జూలై నెలలో వారికి కన్‌సెషన్ అగ్రిమెంట్ అయిపోయింది. అయిన కొద్దికాలంలో వారేమి చేశారంటే, నేను చూపించే ఈ ఆధారం, ఇది భారత ప్రభుత్వంలో ఇన్‌కంటాక్స్ శాఖలో ఒక ఉన్నతాధికారి సవివరంగా పరిశోధన చేసి ఇచ్చినటువంటి చట్టబద్ధమైన ఆదేశం ఇప్పుడు నా చేతిలో ఉంది. దీని కాపీ మీకు కావాలంటే నేను పంపిస్తాను.

అధ్యక్షా, ఏయే కంపెనీల వాళ్లు రాష్ట్ర ప్రభుత్వంతో లావాదేవీలున్న కంపెనీల వాళ్లు, ఈ రాష్ట్ర ప్రభుత్వం మంచి భూమిని, సహజ వనరులను అప్పనంగా కొట్టేస్తున్న కంపెనీల వాళ్లు, ఈ రాష్ట్రంలో నిజాయితీగానే పెట్టుబడులు పెడతామని ముందుకు వచ్చిన కంపెనీల వాళ్లతో సహా, ఏయే కంపెనీల వాళ్లు ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉన్న వారి కుటుంబ సభ్యుల కంపెనీల్లో ఏ రీతిని పెట్టుబడులు పెట్టారన్నది సవివరంగా సాక్ష్యాధారాలతో అధికారికంగా భారత ప్రభుత్వంలో ఆదాయ పన్ను శాఖ అధికారులు అధికారికంగా ఇచ్చినట్టువంటి నివేదిక ఇది. ఆదేశం ఇది. అసెస్‌మెంట్ అర్డర్. 2008–2009 Assessment Order అధ్యక్షా ఇది. ఆ సంవత్సరానికి ఒక ప్రైవేట్ కంపెనీకి సంబంధించినది. నేను పలానా కంపెనీ అని గానీ, పేర్లు గానీ ప్రస్తావించను. నా ఉద్దేశం వ్యక్తుల మీద కాదు. కానీ, ఈ రాష్ట్రంలో ప్రజలకు అన్యాయం జరిగింది. ఈ రాష్ట్రంలో ప్రజా ప్రయోజనాలకు దెబ్బ తగిలింది. ఇప్పటికైనా సవరించే ప్రయత్నం కావాలి. అందుకోసమే వివరాల్లోకి వెళ్లాల్సి వస్తోంది.

అధ్యక్షా, ఈ రస్ అల్ ఖైమాతో ఒప్పందం కుదుర్చుకున్నటువంటి కంపెనీ, భారతీయ కంపెనీ, మీరేం చేశారంటే 19,44 లక్షల షేర్లు, 19 లక్షల 44 వేల షేర్లను 70 కోట్ల రూపాయలకు ఒక ప్రైవేట్ కంపెనీ షేర్లు కొన్నారు. షేర్లు కొనడం తప్పు కాదు. నేను కూడా చిన్న, చిన్న షేర్లు అంటే ఐదు వేలు, పదివేల రూపాయల లెవెల్‌లోనే ఉన్నాయి. షేర్లు కొనడం తప్పు కాదు. కానీ, ఆ కంపెనీల్లోని భూమి, ఆ కంపెనీల్లో ఉ

న్నటువంటి భవనాలు దానికున్న అసలైన వనరులు. విచిత్రమేమిటంటే ఆ భూమి, భవనాలు ఉన్నవేమో వేరే కంపెనీ పేరుతో ఉన్నాయి. కేవలం విలువ నిరంతరం తగ్గిపోయి డిప్రిషియేట్ అయ్యేటటువంటి, ప్రతి యేడాది డిప్రిషియేట్ అయ్యేటువంటి మిషనరీ మాత్రం, అలాగే కంపెనీల్లో జీతభత్యాలు ఇవ్వాల్సిన బాధ్యత నష్టాలు, liabillities ఉన్నాయే, అవన్నీ కలిపి వేరే కంపెనీ ఉంది. ఆ వేరే కంపెనీలో భూమి లేకుండా, భవనాలు లేకుండా కేవలం మిషనరీ, కేవలం ఉద్యోగుల జీతభత్యాలు, కేవలం గాలిలో డబ్బు కలిసిపోయేది దాంతో కంపెనీ పెడితే, దాని ప్రమోటర్ల షేర్ల 2 కోట్ల 35 లక్షల షేర్లుంటే, 23 కోట్ల 50 లక్షలు వారి పేరుతో పెట్టాం. అది ఎట్లా సాధ్యమైందంటే ఆ విషయాల్లోకి నేను వెళ్లను. ఆ విషయాలను ఇన్‌కంటాక్స్ అధికారులు చూస్తారు. ఆ విషయాలు నాకు తెలియదు. కానీ, ఈ మిగతావాళ్లంతా, ఈ రస్ అల్ ఖైమా వారితో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీతో సహా కూడా మిగిలిన వారంతా కలిపి, నేనే చాలా జాగ్రత్తగా అంకెలు లెక్కేశాను. 79 లక్షల 43 వేల షేర్లు.

అధ్యక్షా, వాటి face value 23.50 కోట్ల రూపాయలు ప్రమోటర్స్ పెడితే, వీటి face value 7 కోట్ల 94 లక్షలు, అంటే మొత్తం పెట్టుబడుల్లో నాలుగో వంతు కూడా లేదు. ఎందుకంటే, 23.50 plus 7.94 crores కలిపితే మొత్తం 31.00 కోట్లు అయ్యింది. 31.00 కోట్లల్లో ఇది 25 శాతం కూడా లేదు. కానీ, దాని కోసం వీళ్లు పెట్టినటువంటి డబ్బు 292 కోట్ల రూపాయలు. మీరనొచ్చు ఏమనంటే, తప్పేముందండి, చాలా గొప్ప కంపెనీ స్థాపిస్తే, చాలా గొప్పగా ఆదాయం వచ్చే అవకాశముంటే, చాలా దూరదృష్టి కల్గినటువంటి వాళ్లు కాబట్టి, ఋషుల్లాంటి దివ్య విచక్షణ ఉన్నటువంటి వాళ్లు కాబట్టి, వాళ్లు భవిష్యత్తులో పిల్లలకు లాభాలొస్తాయని కంపెనీలను పెట్టారని చెప్పి, ఆ విషయంలో కూడా నేను చూశాను. ఆ కంపెనీకి 31, మార్చి 2010 నాటికి 320 కోట్ల రూపాయల నికర నష్టం ఉన్నట్టు తేలింది. Cumulative losses as on 31st March, 2010 is 320 Crores. కరెక్టుగా అయితే 319 కోట్ల 60 లక్షల రూపాయలుంది. నేను కొంచెం nearest కోటికి దాన్ని తీసుకువచ్చాను. దీనిలో, ఇన్‌కంటాక్స్ ఆర్డర్‌లో మూడు కంపెనీల గురించి చాలా స్పష్టంగా చూపించారు. రాష్ట్రంలో భూముల కేటాయింపు ప్రముఖుల కుటుంబాలకు చెందిన సభ్యుల కంపెనీలలో, నష్టాలు వస్తున్న ఈ కంపెనీలలో ఏ రకమైన ఆస్తులు లేనటువంటి కంపెనీలలో కేవలం, మిషనరీ మాత్రమే చూపెట్టి, డిప్రిషియేషన్ చూపిస్తున్న కంపెనీలో, జీతాలు మాత్రమే చెల్లించి, ఆదాయం లేనటువంటి

కంపెనీలో, ఆదాయం కంటే ఖర్చు ఎక్కువ ఉన్న కంపెనీలో పెట్టుబడులు పెట్టడానికి, రాష్ట్రంలో భూముల కేటాయింపుకు చాలా స్పష్టమైన సంబంధాన్ని ఇన్‌కంటాక్స్ అధికారులు నిర్థారించారు.

అధ్యక్షా, ఉదాహరణకు అరబిందో గ్రూప్, అది నిజమైన గ్రూప్, Genuine pharmacy group. వాళ్లు ఎక్కడా కూడా తప్పు చేసినటువంటి గ్రూప్ కాదు. వారికి మహబూబ్‌నగర్ జిల్లాలో పోలేపల్లి గ్రామంలో, చాలా మంది సభ్యులకు బహుశా పోలేపల్లి గుర్తు ఉంటుంది. APIIC కోసం నిరుపేదలకు సంబంధించిన భూమిని సేకరించారు. నేను పోలేపల్లి గ్రామంలో ఒక మూడు గంటల సమయం ఎప్పుడో నాలుగు యేళ్ల క్రితం గడిపాను, ఆనాడు ఆ గ్రామంలో చికెన్ గున్యా వస్తే, ప్రతి ఒక్కరు కూడా ఆ గ్రామంలో ఆ వ్యాధికి గురైనారు. కనీసం ఆ వ్యాధికి వైద్య చికిత్స పొందే శక్తి కూడా లేక, ప్రభుత్వ ఆసుపత్రులు పట్టించుకోక, ప్రైవేట్ డాక్టర్ల వద్దకు పోతే, వాళ్లు పది రూపాయలకో, ఇరవై రూపాయలకో నొప్పి తగ్గే మందులు ఇవ్వాల్సిన దానికి వేల రూపాయలు ఖర్చు పెట్టించేసి ఆ గ్రామాన్ని గందరగోళం చేశారు. నిరుపేద గ్రామం అది. మా భూములు పోయినా, మా బతుకుతెరువు పోయింది. మాకు కూలీ నాలీ కూడా లేకుండా పోయిందని వాళ్లు ఏడుస్తున్న గ్రామంలో, ఈనాటి వరకూ నాకు తెలిసి ఇప్పటికైనా వాళ్లకు కనీసం కొంతైనా డబ్బు ఇచ్చిన సంఘటన జరిగిందో, లేదో నాకైతే వాస్తవం తెలియదు. నాకు తెలిసినంత వరకు డబ్బు ఇచ్చినట్టు సమాచారం లేదు. సభలో ఉన్న ఆ జిల్లా మంత్రిగారైన శ్రీమతి డి.కె.అరుణ గారికి ఏమైనా తెలుసేమో, ఎందుకంటే అది వారి జిల్లా కాబట్టి.

(ఆ సందర్భంలో మంత్రిగారైన శ్రీమతి డి.కె. అరుణ గారు పరిహారం ఇచ్చారని మైక్ లేకుండా చెప్పారు.)

అధ్యక్షా, రైతుల దగ్గర ఆనాడు బహుశా లక్షకో, యాభైవేల రూపాయలకో, లక్షన్నరకో ఎకరం భూమిని ప్రభుత్వం తీసుకోవడం జరిగి ఉంటుంది. రెండు కంపెనీలకు అంటే, దీనిలో వాన్‌పిక్‌కే కాకుండా, అరబిందో కంపెనీకి మరో కంపెనీ హెటెరో గ్రూప్ ఆఫ్ కంపెనీకి, అది కూడా Genuine pharmacy group వారిద్దరి దగ్గర కూడా పెట్టుబడులను ఇందాక చెప్పిన రీతిలోనే తీసుకుని, వారికి SEZ క్రింద స్థలాలను ఇచ్చారు.

అధ్యక్షా, మహారాష్ట్రంలో బహుశా 1983–84వ సంవత్సరమని నాకు గుర్తు ఉంది. అంతూలే గారు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగారు. ఆనాడు అంతూలే చేసింది.

ఇవాళ్టితో పోలిస్తే పాపం చాలా నిజాయితీగా, ధర్మంగా పనిచేశారు ఆయన. సిమెంట్‌లో కూడా ఆయనేమి దోచుకోలేదు. ఆనాడు సిమెంట్ పర్మిట్లు ఉన్న రాజ్యం, లైసెన్స్ పర్మిట్లు ఉన్న రాజ్యం అది. కాబట్టి పరిశ్రమలకు గానీ, కట్టడాలకు గానీ సిమెంట్ కావాలంటే, ఎవరో ఒకరు ఆ పర్మిట్ ఇస్తేనే సిమెంట్ వస్తుంది. ఆయనేమి చేశాడంటే, ఇందిరా ప్రతిభా ప్రతిష్టాన్ అని ఒకటి, మరొకటి ఆమె పేరుతోటే మరొక ప్రతిష్టాన్ అనే పేర్లతో రెండు ట్రస్ట్‌లను ఏర్పాటు చేశాడు. ఆయన పాపం సదుద్దేశంతో వాటిని ఏర్పాటు చేశాడు. అవి Genuine Voluntary Organizations. నిరుపేదలకు చదువు కోసమో, ఇతర రంగాల్లోనో ఒక స్వచ్ఛంద సంస్థగా విరాళాలు సేకరించి, వారి కోసం ఖర్చు పెట్టాలనే ఉద్దేశంతో వాటిని ఏర్పాటు చేశారు. దాంట్లో ఏం చేశారంటే, మీకు సిమెంట్ పర్మిట్లు కావాలంటే, బస్తాకు పది రూపాయలు ఈ ట్రస్ట్‌లో పెట్టమని అడిగితే వాళ్లు చాలా సంతోషంగా అందులో పెట్టేశారు. ఇంతకంటే అన్యాయం అక్కడ జరగలేదు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవి పోయింది.

సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ఈ రోజు మైనారిటీ నుండి వచ్చిన ప్రముఖ నాయకుడి భవిష్యత్తు చాలా బాగా ఉంటుందన్న తరుణంలో ఆయన రాజకీయ భవిష్యత్తు సమాధి అయింది. నేను అప్పట్లో ముఖ్యమంత్రిగారి కార్యదర్శిగా ఉండగా, నాటి ప్రభుత్వం ఒక అనాలోచితమైన నిర్ణయం తీసుకొన్నది. రెండు రూపాయల కిలో బియ్యం పథకానికి డబ్బు లేదని ప్రజల నుండి విరాళాలు సేకరిస్తామని ప్రకటన చేసారు. పెద్దలు చంద్రబాబునాయుడుగారు, అశోక గజపతిరాజుగారు ఆ రోజు మంత్రులుగా ఉన్నారు, వారికి తెలుసు. వారు సదుద్దేశంతోనే చేసారు. నేను వద్దని చెప్పాను. అలా చేస్తే డబ్బు రాదు. పరువు పోతుందని చెప్పాను. ఇవి ప్రభుత్వ పథకాలు, పరువు పోతుందని చెప్పాను. డబ్బు వస్తే సంతోషం అని చెప్పాను. వారు డబ్బు వస్తుందనే ఆశతో ఉన్నారు.

ఒకరోజు మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక పరిశ్రమ ఖాయిలా పడిందని చాలా కాలం నడవడం లేదని ఒక పారిశ్రామికవేత్త నా దగ్గరకు వచ్చారు. హేతుబద్ధమైన కోరిక కోరారు. వారు కోరిందేమంటే, విద్యుత్ బకాయిలు ఉన్నాయి. పరిశ్రమలు ప్రారంభిస్తామని కోట్లాది రూపాయలు పెట్టినవాడిని, విద్యుత్ బకాయి ఉందని, ఎలక్ట్రిసిటీ బోర్డ్‌తో ఒప్పందం ఉంది. విడిగా లోడ్ ఉపయోగించలేదు కాబట్టి మాకు పెనాల్టి తొలగించమని కోరారు. రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి కొరత ఉంది. పరిశ్రమలు పెట్టుకోలేము. కాబట్టి పెనాల్టిని రాయితీగా ఇవ్వమని కోరారు. వారు చెప్పింది సబబే అని నాకు

అనిపించి, తప్పకుండా ఈ విషయం పరిశీలిస్తాను, ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళతాననీ, ఇది మీ ఒక్కరి సమస్య కాదు, అందరికీ సంబంధించింది, అందరికీ చేయాలనీ, తప్పకుండా ప్రభుత్వ సానుభూతితో పరిశీలిస్తుందని చెప్పడం జరిగింది. వెంటనే నేను ఆ మేరకు ఏపిఎస్ఇబి వారికి పంపించాలని ఒక నోట్‌ను కూడా డిక్టేట్ చేయడం జరిగింది. అయితే అప్పుడే అతను ఒక పెద్ద తప్పు చేసారు. నాకు ఈ పని చేసి పెట్టండి, కావాలంటే ముఖ్యమంత్రిగారి నిధికి రెండు రూపాయల కిలో బియ్యం పథకానికి నేను ఎంతో కొంత డబ్బును ఇస్తానని చెప్పారు. వెంటనే, ఆ మరుక్షణమే ఆయనను బయటకు పంపించి, ఆ నోట్‌ను చింపివేసాను. ఏ విధంగా ఆలోచించినా, ప్రభుత్వానికి డైరెక్ట్‌గా డబ్బును ఇస్తామంటున్నారు. మీరు ఇది చేయిస్తే అలా చేస్తానని వారు చెప్పారు. ఎవరితో మాట్లాడుతున్నది ఆయనకు తెలియదు కాబట్టి అలా మాట్లాడారు. ఏదో విరాళంగా అలా ఇస్తానని అన్నారు. ప్రభుత్వంలో విధాన నిర్ణయమనేది ఉంది. ప్రభుత్వంలో ఉన్నవారు like Ceasors wife they should be above suspicion. There is an absolute nexus in between Governmental benefits accrued to the people and the money that has gone to the individuals who are close to those in the Government. This is an act of blatant corruption.

ఏ మాత్రమూ సందేహం లేదు. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ ఆక్ట్ క్రింద......

(అంతరాయం)

అధ్యక్షా, నేను పొరపాటున కూడా ఎవరి పేర్లు తీసుకురావడం లేదు. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ ఆక్ట్ క్రింద, లంచం పుచ్చుకున్నా, లంచం కోసం నిర్ణయం చేసిన అధికారి మాత్రమే కాదు, ఆ లంచం ఫలితం పొందినవారూ They are guilty of corruption.

ఈ కేసులను మనం పునఃపరిశీలించకపోతే పారిశ్రామికవేత్తలు బాగానే అర్థం చేసుకుంటారు. ఈ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టాలంటే, నా మామూలు నాకు ఇస్తావా అంటారు. వారి పని వారు చేస్తారు. వ్యాపారం చేసేవారు చేస్తారు. పెట్టుబడి పెట్టేవారు పెడతారు. ధర్మం, రాజకీయం, చట్టమని కూర్చోరు. కానీ ప్రభుత్వంలో ఉన్నవారు చట్టసభలో ఉన్నవారు చట్టబద్ధమైన యంత్రాగాన్ని కాపాడేవారు అవినీతి ఎక్కడ ఉన్నా అధికార దుర్వినియోగం ఎక్కడ ఉన్నా నిర్ద్వంద్వంగా దానిని ఖండించడమే కాదు,

శిక్షించాలి. జరిగిన తప్పును సవరించాలి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలి.

కాకినాడ దగ్గర ఉప్పాడ, కొత్తపల్లి మధ్యన... నేను ఆ జిల్లా కలెక్టర్‌గా పని చేసాను. 25 సంవత్సరాల క్రిందట కలెక్టర్‌గా ఉన్నాను. గౌరవ సభ్యులు వంగా గీత గారికి బాగా తెలుసు. మూడు సంవత్సరాల క్రిందట నా దృష్టికి ఒక విషయం వచ్చింది. వారంతా అక్కడ ఓఎన్‌జిసి పేరు చెప్పారు. అక్రమాలు ఎన్ని రకాలుగా జరిగాయో చెబుతున్నాను. ప్రతీ దానిలో జరిగిందని అనడం లేదు. కానీ ఖచ్చితంగా కొన్నింటిలో జరిగాయి. పూర్తి సాక్ష్యాలు ఉన్నాయి. There is no conjecture. There is an absolute evidence.

పాపం అక్కడ అమాయకులు ఓఎన్‌జిసితో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నదని అక్కడి ప్రజలు అనుకుంటున్నారు. వాస్తవానికి ప్రైవేట్ వ్యక్తితో ఎంఓయు., కుదుర్చుకోవడం జరిగింది. రైతులు అది తెలియక ఓఎన్‌జిసివారితో ఒప్పందం ఉందని చెప్పారు. వారితో నాకు ఒకసారి ఎంఓయు కాపీని చూపించమని చెప్పాను. అయితే అందులో ఒక వ్యక్తి పేరు ఉంది. పేరు ప్రస్తావించనని మాట ఇచ్చాను కాబట్టి ప్రస్తావించను.

**(అంతరాయం)**

సభలో ఒక పేరు ప్రస్తావించాలంటే ముందుగా నోటీస్ ఇవ్వాలి. నేను ఒట్టు పెట్టుకున్నాను. నా నోటితో చెప్పి తప్పు చేయనని అనుకున్నాను. కంపెనీ పేరు మాత్రమే చెబుతాను. కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్. ఓఎన్‌జిసి ఒక ప్రైవేట్ వ్యక్తితో సంతకం పెట్టుకున్నది. నేను స్వయంగా చూసాను. ఏ సభా సంఘాన్ని అయినా పర్సనల్‌గా వెళ్లి విచారించి రమ్మని చెప్పండి. అక్కడి జిల్లా అధికారులు ఈ భూములు కంపెనీకి ఇవ్వకపోతే బలవంతంగా మేము సేకరిస్తామని చెప్పి రూ॥2.00 లక్షలు, రూ॥3.00 ఇస్తామంటున్నా, బలవంతగా రూ॥50,000లకే తీసుకుంటాము. మీ ఖర్మ. నూటికి నూరు పాళ్లు బెదిరించారు. ప్రజలను కాపాడవలసిన వారు ఈ ఖజానా నుండి జీతాలు పొందే ప్రభుత్వ అధికారులు కొంత మంది ప్రైవేట్ వ్యక్తుల ఏజెంట్లుగా ప్రైవేట్ వ్యాపారస్థుల సొంత ప్రయోజనాల కోసం కొమ్ముకాసే ఏజెంట్లుగా, కిరాయి గుండాలుగా ప్రవర్తించారు. నిరుపేదలు, అక్షర జ్ఞానం లేనివారు, ఈ కంపెనీ ఏమిటో, తెలియని వారంతా ఉన్నారు.

ప్రభుత్వ భూసేకరణ చట్టం గురించి ఏమీ తెలియని సామాన్య ప్రజలు కన్నీళ్లు కక్కుతూ, గొంతులో దుఃఖాన్ని తెచ్చుకుంటూ భూములు ఇచ్చారు. నేను నా వద్దకు వచ్చినవారికి ఒకటే చెప్పాను. మీరంతా ఏమీ తెలియకుండా సంతకాలు పెట్టారు. వారు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మారు. మీ చేతులతో మీరే ఉరివేసుకున్నారని చెప్పాను. దానికి పరిష్కారం ఇది కాదు. సంతకాలు పెట్టని వారిని గట్టిగా పట్టుకోండి. ప్రాణాలు పోయినా భూమిని ఇవ్వవద్దని చెప్పండి అప్పుడు మొత్తం భూమి లేకుండా వారు ఏ పని కూడా మొదలుపెట్టలేరని చెప్పి పంపించాను. అందరికీ న్యాయం జరిగితే మేమూ ఇస్తామని చెప్పమని అన్నాను. అయితే, ఈ అధికార యంత్రాంగం, రాజకీయ తంత్రాలు, ధనబలం, కండబలం ముందు సామాస్య రైతులు నిలబడే శక్తి లేదు. నేను వారికి మీ ప్రాణాలకు నేను భరోసా ఉంటానని చెప్పాను. నా ప్రాణాలను అడ్డుగా పెడతానని చెప్పాను. తరువాత నేను విన్నదేమంటే, 8,800 ఎకరాలని అనుకున్నాను. మంత్రిగారి సంతకాలు లేకుండా... సోదరులు అక్బరుద్దీన్ చెప్పినట్లుగా మా మొహం మీద కాగితాలు పడవేసారు. సంతకం లేదు. ఏమిటో తెలియదు. చాలా పరిమితమైన 36,000 ఎకరాలకు సంబంధించి మాత్రమే స్టేట్‌మెంట్‌లో ఉంది. దానిలో ఏమీ ఉండదు. కాబట్టి చర్చలేదు. అందులో గొడవ రాదు. నాకు కరెక్ట్ ఎకరాలు తెలియదు. ఈఎస్ఇజడ్ స్టేట్‌మెంట్‌లో ఆ ప్రస్తావన ఉంది. ఇటీవల మన రాష్ట్రంలో ఒక ప్రముఖమైన కంపెనీకి రైతుల దగ్గర రూ॥2.00, రూ॥3.00 లక్షలకు సేకరించిన భూమిని నేను విన్న దాని ప్రకారంగా దాదాపుగా 25 రెట్లు ఎక్కువ రేటుకు అమ్మారు. ప్రభుత్వం పేరు చెప్పి భూమిని సేకరిస్తామని చెప్పి బెదిరించి ప్రజల దగ్గర రూ॥2.00, రూ॥3.00 లక్షలకు భూమిని తీసుకుంటారా? ప్రభుత్వం ఓఎన్‌జిసి పేరుతో అన్ని అబద్ధాలు ఆడి ప్రజలను మోసం చేయకూడదు. ఈ సభకు, ప్రజలకు అర్థం కావాలి. ఏ ప్రభుత్వం కూడా, నియంతృత్వ ప్రభుత్వమైనా, రాచరిక ప్రభుత్వమైనా అబద్దాలు ఆడవు, ఛ,ఛ ఆత్మగౌరవం మాకు ఉందని అనుకుంటారు. దుర్మార్గుల ప్రభుత్వం కూడా అలా చేయదు. పచ్చి అబద్దాలు చెప్పి ఓఎన్‌జిసి పేరుతో సంతకాలు పెట్టిస్తారా?

ఆ తరువాత దాంట్లో 2006–07 ఇంకా వివరాలు కావాలా? తేదీలతో సహా చెప్పమంటారా? అక్కడ ఒక్క రూపాయి కూడా పెట్టుబడి లేకుండా, వీసమెత్తు పెట్టుబడి లేకుండా, ఒక్క పరిశ్రమ రాకుండా, ఒక్క మనిషికి కూడా ఉపాధిని కల్పించకుండా, రియల్ ఎస్టేట్‌గా మార్చి, కోట్లాది రూపాయల విలువచేసే కంపెనీకీ ఈ రోజు 20 రెట్ల ఖరీదుకు అమ్ముకొంటారా? ప్రజల ప్రాణాలతో, వారి ఆస్తులతో మీరు ఆడుకోవడం

తప్ప, ప్రభుత్వాధికారంతో బినామీ ఆస్తులు సంపాదించడం తప్ప అధికారం అడ్డు పెట్టుకొని వేల కోట్ల రూపాయలు దోచుకోవడం తప్ప పారిశ్రామిక ప్రగతి ఎక్కడ ఉంది? పారిశ్రామిక ప్రగతి గురించి ఏం మాట్లాడుతున్నారు. పరిశ్రమలు ఆకాశంలో రావు, భూమి మీద వస్తాయని ఈ సభలో పలుమార్లు నేను చెప్పాను. కచ్చితంగా పరిశ్రమల కోసం భూమి ఇవ్వాలి. కొన్ని త్యాగాలైనా చేయాలి. సమాజం మొత్తం త్యాగాలు చేయాలే కానీ, భూములు కోల్పోయినవారు కాదు. కానీ, నేడు జరిగిందేమిటి అధ్యక్షా, హైదరాబాద్‌లో ఎమార్ కావచ్చు, వి.ఐ.పిల.ల వారి సొంత భవనాల కోసం, సామాన్యుల నుండి భూములు తీసుకొన్నారు. భూములు కోల్పోయిన సామాన్యులు ఇప్పటికీ కన్నీరు కారుస్తున్నారు. కారు చౌకగా భూములు తీసుకొని, కోట్లాది రూపాయలుగా మార్చేసుకొని, వి.ఐ.పి.లకు అందిస్తున్నారు. అధ్యక్షా, ఇందూ ప్రాజెక్టులని, బ్రాహ్మణీ అని అన్నారు. హైదరాబాద్‌లో ఒక పెద్ద కంపెనీ పేరుతో 250 ఎకరాలు చూపెట్టడం ఏమిటి? వెంటనే ఎమ్.ఓ.యు మార్చేసి 150 ఎకరాలు ఎస్.ఇ.జడ్ కోసం, వంద ఎకరాలు ప్రైవేటు డెవలప్‌మెంట్ కోసం పెట్టడమేంటి? మంత్రి గారి స్టేట్‌మెంట్‌లో 150 ఎకరాలుగా చూపించడమేంటి? ఎవరికీ ఈ విషయాలు అర్థం కావు కదా, పోల్చుకోలేరని చెప్పి ఆ విధంగా మీరు ఇస్తున్నారు. ఆ తరువాత వెంటనే దాంట్లో ఇంకొకర్ని తీసుకురావడం ఏమిటి? వారికి చెందినటువంటి ఆస్తులను మలేషియా నుండి డబ్బులు తెచ్చినట్లుగా చూపించి, కారుచౌకగా మహానగరంలో కొట్టేయడమేంటి? ప్రభుత్వ ఆస్తులు ఇక్కడ నుంచి వెళ్లిపోవడమేంటి? ప్రైవేటు ఆస్తులు అక్కడ నుండి ప్రభుత్వంలో ఉన్న ఆ పెద్దల కుంటుబాల్లోని సభ్యుల చేతుల్లోకి మనం ఊహించనంత పెద్ద ఆస్తులు చేరడమేంటి అధ్యక్షా, ఇంకేమైనా సాక్ష్యాలు, ఆధారాలు కావాలా? ప్రజాస్వామ్యమంటే ఇదేనా? ప్రభుత్వ ఆస్తులు ప్రభుత్వంలో ఉన్న పెద్దల పరం కావడమా? ఎన్నో సందర్భాల్లో మా కమ్యూనిస్ట్ సోదరులు ప్రభుత్వ రంగం కావాలని అంటుంటే, నేను అనేవాడిని, 'అయ్యా, ప్రభుత్వ రంగం అంటే It is a private sector ప్రభుత్వంలో ఉన్నవాళ్ల ప్రైవేటు రంగమయ్యా అది. అది ప్రభుత్వ రంగం కాదు రంగారెడ్డిగారు అంటుండేవాడిని. నా మాటలను అక్షర సత్యం చేశారు. ప్రభుత్వ ఆస్తులు కూడా ప్రభుత్వంలో ఉన్న పెద్దల ప్రైవేటు ఆస్తులుగా మారిపోతాయని చెప్పి, తిరుగులేనటువంటి సాక్ష్యాలతో నిసిగ్గుగా చేశారు. ఈ పరిస్థితుల్లో నేను సాక్ష్యాలు చాలా చూపించాననే అనుకొంటున్నాను. మీరు నాకు సమయం ఇస్తే ఇంకా సాక్ష్యాలు చెపుతాను. విశాఖపట్టణం దగ్గర్లో 'బ్రాండిక్స్' కంపెనీకి వెయ్యి ఎకరాలు ఇచ్చారు.

అక్కడ మార్కెట్ రేటు ఎంత? ఏ రేటుకి మీరు ఇచ్చారు? ఒక్క రూపాయికి ఇచ్చారు. ఏ ప్రమాణాలతో మీరు ఇచ్చారు. శాసనసభ్యులకు అన్ని సబ్సిడీలు ఇస్తున్నా ఇక్కడి క్యాంటీన్‌లో టీ ఐదు రూపాయలకు లభిస్తున్నది.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అలాగే మహేశ్వరం దగ్గర ఫ్యాబ్‌సిటీకి 1074 ఎకరాలు ఏ రేటుకి, ఏ ప్రాతిపదికన ఇచ్చారు? కాంపిటీటివ్ బిడ్డింగ్ ఏమైనా జరిగిందా? ప్రపంచ ప్రసిద్ధమైన కంపెనీలు వచ్చి ఇన్ని లక్షల కోట్లు పెట్టుబడి పెడుతున్నాం కాబట్టి మాకు కొంచెం కన్‌సెషన్ ఇవ్వండి రేపొద్దున తిరిగి ఇస్తామనే మాట వారన్నారా? ఇష్టం వచ్చినట్లు చేశారు. మైనింగ్ విషయానికి వస్తే, ఏ కాంపిటీటివ్ బిడ్డింగ్ లేకుండా, ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ బేసిస్‌తో ఈ జాతికి చెందాల్సిన సహజ వనరులని పదుల వేల కోట్ల రూపాయల సహజ వనరులను అప్పనంగా, ఆశ్రిత పక్షపాతంతో బంధుప్రీతితో ఇచ్చేశారు. అంతటితో ఆగలేదు. దాంట్లో టర్నోవర్ ఎంత ఉంటే అందులో మళ్లీ 50 శాతం ఏ పని చేయకుండా స్వెటీ క్విటీ పేరుతో ఏ రకమైన పెట్టుబడి పెట్టకుండా, ఏ రకమైన టెక్నాలజీ లేకుండా, ఏ ప్రయోజనాన్ని సాధించకుండా అధికారంలో ఉన్న పెద్దల కుటుంబ సభ్యులకు ప్రత్యక్షంగా 50 శాతం డబ్బులు ఇచ్చేపని చేశారు. ఇంకా ఋజువులేమి కావాలి? తుపాకీతో కాల్చి పారేసిన తరువాత స్మోకింగ్ గన్ చూపెడుతుంటే, మనిషి శవం కనిపిస్తుంటే, రక్తం కారుతుంటే, గుడ్లు తేలేసిన మనిషి కనిపిస్తుంటే, ఇంకా సాక్ష్యం కావాలని చెపుతుంటే ఏం చెప్పాలి అధ్యక్షా.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** కాంపిటీటివ్ బిడ్డింగ్ ఎందుకు చేయలేదు. ఈ సభలో దానిపై చర్చ జరిగినప్పుడు, ఆనాటి ముఖ్యమంత్రి గారు సరైన మాట అన్నారు. నేను పూర్తిగా దాన్ని సమర్థిస్తున్నాను. ప్రైవేటు తగాదాల్లో మనకెందుకు చంద్రబాబు అని అన్నారు. నేను ఒప్పుకొంటున్నాను. కానీ అడగాల్సింది అది కాదు అధ్యక్షా. ఎవరికిచ్చినా ఏరకంగా ఇచ్చారు పెద్దాయనా? ఎట్లా మీరు ఇస్తారు? సహజ వనరులు Un replaceable assets వాటిని కేటాయిస్తున్నప్పుడు మన సొంత జాగీరులాగా, మన తాతగారి నుండి వచ్చిన ఆస్తిలాగా, మన ఇష్టం వచ్చిన వారికి ఇచ్చేసి 50 శాతం మనం సమకూర్చుకోవడమా అధ్యక్షా, There must be competitive bidding ఈ రోజు 2జీ స్పెక్ట్రమ్‌లో జరిగింది అదే. ఈ రాష్ట్రంలో సహజవనరుల విషయానికి వస్తే నేను మళ్లీ మళ్లీ ప్రస్తావన చేశాను. తీరప్రాంతం విషయం ఈ సభలోనే చర్చకు వచ్చింది. ఎన్నో వందల కిలోమీటర్లను మీ ఇష్టం వచ్చినట్లు

రాసిపారేశారు. ఎలా, ఏ ప్రాతిపదికను ఇచ్చారు? ఏ కాంపెటీటీవ్ బిడ్డింగ్‌పై ఇచ్చారు. ఈ రకంగా గుత్తాధిపత్యం వహించిన కంపెనీ కూడా ఉంది, అధ్యక్షా. ఏరకంగా మీరు ఇచ్చారు?

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ఈ రోజు ఈ చర్చలో ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి, అవినీతి, అధికార దుర్వినియోగం, సహజ వనరుల పందారం, పోటీలేని గుత్తాధిపత్యం, బలవంతంగా ప్రజల నుండి అబద్దాలు చెప్పో, అధికార దుర్వినియోగం చేసో, భూములను సేకరించే పద్ధతి, లాలూచి పడి ప్రజల వనరులను దోచుకొన్న వైనం. అవసరానికి నిజాయితీగా ఇచ్చినా కూడా, ఎంత అవసరమో కూడా గుర్తించకుండా ఇష్టం వచ్చినట్లు అవసరాన్ని మించి భూములు ఇచ్చిన పద్ధతిఇవన్నీ స్పష్టంగా తేటతెల్లమయ్యాయి. ఇప్పుడేమి చేయాలి. ఆ డిమాండ్స్‌ని చెప్పి నేను ముగిస్తాను.

వెంటనే స్పష్టమైన ఆధారాలు ఉన్నచోట ఎంత పెద్దవారైనా వాళ్లు ఆ భూములు గానీ, సహజ వనరులు గానీ, ఆ కేటాయించిన వాటిని వెంటనే రద్దుచేయండి. ఎలా చేస్తామన్న ప్రశ్న అక్కడ నుండి రావచ్చు. అవినీతి ఉందని ఐ.టి.అధికారులు నిర్ధారించిన తరువాత ఇంకా తాత్సారం అక్కరలేదు. A corrupt deal abnitio is void and contract involving corruption and illegality is null and void మన కాంట్రాక్ట్ యాక్ట్ ప్రకారం. It is the bounden duty of the Government to protect the public interest and to approve the law. ఇప్పటికైనా ఆ చట్టాన్ని మీరు పాటించి తీరాలి. మీకో నాకో తల్లి దండ్రులు సంపాదించి ఇచ్చిన ఒకటి రెండు ఎకరాలు ఉంటే, మన సొంత భూమినే సేకరిస్తున్నారు. ఆ హక్కు ప్రభుత్వానికి ఉంది. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సొంత ఆస్తుల మీద కూడా మీకు ఏమీ హక్కు లేదు, మీకు అది ప్రాథమిక హక్కు కాదని ఆ సవరణ చేశారు కాబట్టి. There is no fundamental property సంపాదించే హక్కు ఉన్నప్పుడు, మనం అప్పనంగా ఇస్తే అవినీతికి పాల్పడితే దానిపై హక్కు లేకపోతే ఎట్లా ఇంక ప్రభుత్వానికి ఆ మాటకే అర్థం లేదు. అందుకనే 2G spectrum విషయంలో దాన్ని రద్దు చేయాలని అన్నాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** It involves very serious crimes కాబట్టి వీటిని మీరు వెంటనే సి.బి.ఐ.కి అప్పగించి పూర్తి విచారణ చేయించండి. సి.బి.ఐ.కి కూడా

సమయం చాలదు కాబట్టి there must be an authority to investigate into such serious cases. మూడవది ఉభయ పక్షాలూ సభలో ఒకరిని ఒకరు నిందించుకుంటూ వుంటే చాలా కాలం నుంచి మేం వారిని ఒకటే కోరుతున్నాం. అయ్యా, కబుర్లు కాదు అవినీతికి ఎవరు పాల్పడ్డా వారి ఆస్తులు జప్తు చేసి, జైల్లో పెట్టేందుకు వీలుగా ఒక చట్టాన్ని మనం తీసుకువద్దామని. ఒట్టి కబుర్లు కాదు. మనం ఆచరణలోకి తీసుకువద్దామని చెప్పి కోరడం జరిగింది.

ఈ మధ్యనే అమెరికాలోని టెక్సాస్‌లో డా॥అరుణ్ శర్మ అతని భార్య కిరణ్ భారతీయ దంపతులు వున్నారు. వారిద్దరూ రోగులను ఎడాపెడా దోచుకుని డబ్బు సంపాదించారు. అరుణ్ శర్మ డాక్టరుకావడంతో అతను అక్కడున్నటువంటి హెల్త్ కేర్ సిస్టమ్‌ని ఉ పయోగించుకుని రోగులను మోసం చేసి ఎడాపెడా దోచుకుని సంపాదించాడు. అయితే, అక్కడ ఈ విషయం బయటకు వచ్చింది. దానికి అక్కడి శాసనసభలలో చర్చలు, వాదాలూ ఏమీ జరగలేదు. అమెరికన్ సెనెట్‌లో చర్చలు, వాదోపవాదాలూ అసలు జరగలేదు. అయితే బోస్టన్‌లో కోర్టు మాత్రం ఆ ఇద్దరికీ 15 సంవత్సరాల జైలు శిక్షవేసింది. దానితోబాటు 30 సంవత్సరాలపాటు ఆ ఇద్దరూ గడ్డితిన కూడబెట్టిన 43 మిలియన్ డాలర్ల మొత్తం సంపదను, వాళ్ల ఇతర ఆస్తులు, వాళ్ల షేర్లు, ఇళ్లు, నగదు అంతా కూడా ప్రభుత్వపరం చేయవలసిందిగా కోర్టు తీర్పు యిచ్చింది. ఆ విధంగా జిల్లాకు ఒక 10 మందికి యిక్కడ చేయండి అధ్యక్షా. ఇక ఈ దేశంలో ఏ రాష్ట్రంగానీ, ఏ ప్రభుత్వంగానీ మళ్లీ యిలా అవినీతి చేసే సాహసం చేయదు. చేయకుండా వుంటుంది.

ప్రభుత్వం యింతకు ముందు ప్రకటించిన విధానానికి కట్టుబడి ప్రతి కేసునూ నిజాయితీగా రెవ్యూ చేసి ఆ రెవ్యూ ఫైండింగ్స్‌ను రహస్యం కాకుండా బహిరంగంగా ప్రజల ముందుపెట్టాలండీ, మీరు పూర్తి వివరాలను బయటపెట్టిండి. అసలు ఏం చర్య తీసుకున్నారో? ఎందుకు ఆ చర్య తీసుకున్నారో చెప్పండి. వాటిని ప్రజల ముందు పెట్టండి. అలాగే నిజాయితీగా పెట్టుబడికోసం వచ్చిన వారికి కూడా అనవసరంగా, అప్పనంగా ఎక్కువ భూములను మీరు యిచ్చారు. అదనంగా భూమిని యివ్వడం జరిగితే, అది ఉపయోగించుకునే పరిస్థితిలేనట్లయితే వాటిని వెంటనే వెనుకకు తీసుకోండి.

అధ్యక్షా, అప్పనంగా భూమి మీదగానీ, గనుల మీద గానీ లాభాలు ఆర్జిస్తే యిప్పుడు

అలాంటి వారిని జైల్లో పెట్టినందువల్ల లాభం లేదు. వారిమీద విండ్ ఫాల్ ప్రాఫిట్ టాక్స్ వేయండి. అంతేకాదు వాళ్ల లాభాలలో కనీసం 80 శాతం ప్రభుత్వ ఖజానాకు చేరే ఏర్పాట్లు చేయండి. అలా చేస్తే, ఆర్థిక మంత్రి గారికి వచ్చే సంవత్సరం ఈ ద్రవ్యలోటు అనే సమస్యే వుండదు. ఆ గ్యారంటీ నేను యిస్తున్నాను. ఇందాక నాకు వారికి చెప్పే అవకాశం లేకపోయింది. ఈ సంవత్సరం ఈయన రూ॥17 వేల కోట్ల అప్పు తీసుకున్నారు. తీసుకున్నది రూ॥11,500 కోట్లు ఆస్తులే. నిజానికి అప్పుతీసుకున్న డబ్బుకి కూడా ఆస్తులు రావడం లేదు. ఇలాంటి పరిస్థితులలో ఆ విండ్‌ఫాల్ ప్రాఫిట్ టాక్స్ వేసి, వారి లాభంలో 20 శాతం వారినే వుంచుకోమనండి. మంచోచెడో తప్పు చేశాంకదా. అందుకే మనం దానికి ఫలితాన్ని అనుభవిద్దాం. ఇలా చేయడం మూలంగా 80 శాతం లాభం వచ్చే విధంగా ఏర్పాటు చేసిన ప్రిసిడెంట్స్ కూడా వున్నాయధ్యక్షా, వాటిని నేను తమకు తెలియజేస్తాను. దీని మూలంగా ఆర్థికంగా ఖజానాకు పరిపుష్టి కలుగుతుంది. ద్రవ్య లోటన్నది వుండదు. వచ్చే సంవత్సరం దీనిపై చర్చలు అక్కర్లేదు.

ఇక సహజ వనరుల పందేరాలలో ఇష్టం వచ్చినట్లుగా చేయకుండా కాంపిటీటివ్ బిడ్డింగ్ పెట్టి, బహిరంగ వేలం ద్వారా మాత్రమే భూములు కావచ్చు. సెజ్‌లు కావచ్చు, తీర ప్రాంతం కావచ్చు. ఇండస్ట్రియల్ కారిడార్స్ లేదంటే మైనింగ్ ల్యాండ్స్ కావచ్చు, ఇంకా ఇతరాలు కావచ్చు వాటిని కేటాయించడం అన్నది కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా మాత్రమే జరగాలి అధ్యక్షా.

ఇదే సమయంలో నిజాయితీతో వచ్చిన కంపెనీలు వున్నాయి అధ్యక్షా. మనం రేపు పొద్దున కమిటీని ఏర్పాటు చేసినా కూడా నిజాయితీతో వస్తున్న కంపెనీల మీద ఏమాత్రం ఈగ వాలకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వ పక్షం మీద, ప్రతిపక్షాల మీదా రెండింటి మీదా వుంది అధ్యక్షా. అదే రీతిలో చూస్తే నిజాయితీగా అధికారులున్న సందర్భాలు కూడా కొన్ని సందర్భాలలో కంపెనీ యిన్ని లక్షల మందికి ఉపాధి యిస్తామని చెప్పినప్పటికీ, అంతమందికీ యివ్వలేదు అంటే, అది దురుద్దేశంతో చేస్తే తప్ప అలాంటి దానిని తప్పని నేను భావించను. ఎందుకంటే పరిస్థితులు మారినప్పుడు తప్పకుండా కొన్ని హెచ్చుతుగ్గులుంటాయి. నిజాయితీతో వచ్చిన కంపెనీలు గాని, అధికారులు గాని మనం ఏమిచేసినా గానీ మనపై ఎంక్వయిరీ వేస్తారన్న భయంగానీ, లేదా తలకాయలుతీస్తారన్న భయంగానీ వారికి లేకుండా మనం చూడాలి. ఆ విధంగా మనపై నమ్మకం కలిగించే విధంగా ప్రభుత్వం గాని, పార్టీలు గానీ వారికి నమ్మకాన్ని

కలిగించే విధంగా ప్రయత్నించాలి. ఆ బాధ్యత ప్రభుత్వం మీద, ఈ సభ మీద వుంది. కాబట్టి ఈ విషయాన్ని అందులో చేర్చాలి.

భూమికి సంబంధించి చాలాసార్లు మేం మళ్లీ మళ్లీ డిమాండు చేయడం జరిగింది అధ్యక్షా. మీరు ఇండిపెండెంట్ స్టాట్యుటరీ అథారిటీని ఏర్పాటు చేయండి. ఉదాహరణకు ఈ సభలోనే పాపం కొందరు మంత్రులు సభలో చెప్పుకోలేక నాతో చెప్పారధ్యక్షా. కొందరి మంత్రులు తమ సొంత భూములను అవుటర్ రింగ్‌రోడ్ ప్రాంతంలో ఎలైన్‌మెంట్‌ను ఇష్టం వచ్చినట్లుగా, అడ్డదిడ్డంగా మార్చిన కారణంగా కోల్పోయారు. దాదాపు 14 లేక 15 ఎకరాల భూమిని కోల్పోయినవారున్నారు. కొందరు భూములు కోల్పోవలసినవారు వాటిని దక్కించుకుని, దాని విలువ రూ॥కోట్లు పొందినవారు కూడా వున్నారు. కాబట్టి, భూములసేకరణ విషయంలో ఇండిసెంటెంట్ స్టాట్యుటరీ అథారిటీ ఒకటి వుండాలి. అలాగే ఒక ఎకరం భూమి అవసరం అయితే రెండు ఎకరాల భూమిని మీరు సేకరించండి. ఆ రెండకరాలలో ఒక ఎకరాన్ని పరిశ్రమకు యిచ్చి, మిగిలిన ఎకరంలో కోల్పోయిన వారికి కనీసం, సగం ఎకరంభూమి యిచ్చినట్లైతే భూమికోల్పోయిన మంత్రికి వారు కోల్పోయిన దానిలో సగం భూమి వచ్చి, ఆ భూమి విలువ పెరిగి వారు సంతోషించేవారు. భూమి కోల్పోయిన వారికి గుండె కోత వుంటే, ఈ రాష్ట్ర ప్రజలు క్షమించరు. పరిశ్రమలు వచ్చినా దానివల్ల ఉపాధిరాదు. ఇండిపెండెంట్ స్టాట్యుటరీ అథారిటీ పెట్టండి. భూములు కోల్పోయిన వారికి అభివృద్ధి చెందిన సగం భూమి యివ్వండి.

ఎండోమెంట్స్‌గాని, వక్ఫ్ గాని, ఇందాక శాసనసభ్యురాలు సోదరీమణి క్రైస్తవుల భూమి గురించి చెప్పారు. ఆ భూములన్నీ ప్రైవేటు భూములు. ఎండోమెంట్ చట్టం గాని, వక్ఫ్ చట్టం గాని చేసింది. కేవలం ప్రైవేటు భూములను ధర్మకార్యం గురించి యిచ్చినట్లయితే వాటిని పరిరక్షించడానికి, అవి గవర్నమెంటు భూములుగా పరిగణించడం తప్పని తెలిసింది. కాబట్టి యిప్పుడు వాటిని ప్రైవేటు భూములుగా పరిగణించి వాటికి రక్షణ కల్పించి, పరిహారం యిచ్చే ఏర్పాటు చేయాలి. సభాసంఘాన్ని విధిగా ఏర్పాటు చేసి, ఈ రోజు ఆదరాబాదరాగా చేసిన ఈ లిస్టే కాకుండా సహజవనరులన్నింటినీ దానిలో చేర్చాలి అధ్యక్షా, ఎందుకంటే వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయినప్పుడు దానిని రక్షించాల్సిన బాధ్యత మన మీద వుంది. ఈ 36 వేల 425 ఎకరాలు ఎపిఐఐసికి యిచ్చి, ఎపిఎసిఇజెడ్‌లకి యిచ్చిన భూమి చాలదు అధ్యక్షా, మిగతా భూములలో కూడా చాలా అక్రమాలు జరిగాయని నేను

స్పష్టమైన ఆధారాలు చూపెట్టాను. కాబట్టి, సభా సంఘాన్ని వేసి పూర్తిగా పక్షపాత రహితంగా రాగద్వేషాలకు అతీతంగా నిర్ణయం జరగాలి. తదుపరి చర్యలు తీసుకోవాలని, అందుకు ఈ సభ, ఈ ప్రభుత్వం సహకరిస్తుందని ఆశిస్తూ అవకాశం యిచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ముందుగా ప్రభుత్వ పక్షాన్ని అభినందిస్తున్నాను. ఆవేశకావేశాలకు పోకుండా, చాలా సావధానంగా, చిత్తశుద్ధితో ఈ చర్చకు సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. భవిష్యత్తులో ఇక్కడ జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా, పరిష్కారాల కోసం స్పష్టమైన అడుగులు వేస్తామని నిర్దిష్టమైన హామీ ఇచ్చినందుకు ముఖ్యమంత్రి గార్ని, ప్రభుత్వ పక్షాన్ని అభినందిస్తున్నాను. 1989లో బెర్లిన్ వాల్ కూలిపోయినప్పుడు హెల్మెట్ కోల్... జర్మనీలో మహానాయకుడు అధిపతిగా ఉన్నాడు. చాలా చిన్న ఆరోపణ ఆయనపై వచ్చింది. ఎన్నికల ప్రచారం కోసం డబ్బులు తీసుకున్నారు. ఎన్నికల కోసమే డబ్బులు ఖర్చుపెట్టాడు. ఎవరిచ్చారో మాత్రం ఆయన చెప్పలేదు. ఇంతే ఆయన చేసింది. ఆయన పదవీచ్యుతుడయ్యాడు. ఆయన పార్టీ నాయకత్వాన్ని వదులుకొన్నాడు. అంతేకాదు, చట్టం విధించిన జరిమానాను పార్టీ పరంగా కాకుండా, తన జేబు నుండి కట్టాడు. తన ఇంటిని తాకట్టు పెట్టి కట్టాడు. 12 సంవత్సరాల పాటు ఆ దేశానికి అధినేతగా ఉన్న మనిషి, చరిత్ర సృష్టించిన మనిషి తన ఆస్తులను మొత్తం అమ్మి జరిమానా కట్టారు. 1974లో....

**డా॥ జయప్రకాష్ నారాయణ :** We have made specific allegations of improper conduct and corruption. The Government can not get away from that. ఈ సభలో ముఖ్యమంత్రిగా ఉన్న నీలం సంజీవరెడ్డి గారిపై హై కోర్టు చాలా చిన్న ఆరోపణ చేసింది. బస్సుల జాతీయకరణ చేస్తున్నప్పుడు కొంత పొరపాటు జరిగింది. ఆర్బిటరీగా చేశారని ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రిగా ఆయన తక్షణమే రాజీనామా చేశారు. ఈ సభలో నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారు మెడికల్ కాలేజీల ఏర్పాటు విషయంలో తన సొంత జిల్లాలో సొంత సంస్థకు ఇచ్చుకోవడం పొరపాటు అని కోర్టు చెప్పగానే ఆయన పదవి పోయింది.

**(అంతరాయం)**

నన్ను చెప్పనీయండి. ఈ దేశంలో పార్లమెంట్‌లోనే ఎస్.జి.ముద్గల్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యుడు. కేవలం రెండు వేల రూపాయలు ఒక ఫీజుగా తీసుకొన్నారు.

లంచంగా కాదు. ఆయనకేమీ రాజ్యాధికారం లేదు. ఆర్థిక మంత్రితో అప్పాయింట్‌మెంట్ ఇప్పిస్తానని రెండువేల రూపాయలు ఆయన తీసుకొన్నాడు. రసీదు కూడా ఇచ్చాడు. జవహర్‌లాల్ నెహ్రూ పోరాడి మరీ సభా సంఘాన్ని ఏర్పాటు చేసి, టి.టి.కృష్ణమాచారి ఆధ్వర్యంలో ముద్గల్‌ను పదవి నుండి బయటకు పంపించారు. ఈవేళ ఈ సభలో నిర్దిష్టంగా అవినీతి ఆరోపణలు చేశాము. అవినీతి నిరోధక చట్టం క్రింద a consideration for decision is an act of corruption. ఈ రోజు ఈ సభలో we have established consideration. Several considerations of decisions by public servants. It is clear cut act of corruption and arbitration. ఖచ్చితంగా అవినీతి నిరోధక చట్టం క్రింది దాంట్లో పాల్గొన్న వాళ్లు, బెనిఫిట్ పొందినవారూ, నిర్ణయాలు తీసుకొన్న వారు శిక్షార్హులే. ఈ విషయంలో ముఖ్యమంత్రి గారి నుండి స్పష్టమైన సమాధానం రావాలి. దీనిని సి.బి.ఐ.కి నివేదించాలి. ఈ కేసులో ప్రైమాఫేసీ ఉన్నట్లైతే, ప్రాధమిక ఆధారాలు ఉన్నట్లయితే, చర్చలో కొంత నిర్దిష్టమైన ఆరోపణలు చేసినట్లైతే, వాటి వెనుక నిర్దిష్టమైన ఆధారాలు ఉన్నట్లయితే సభా సంఘం ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లయితే, చర్చలలో నిర్దిష్టమైన ఆరోపణలు వున్నట్లైతే ఆ పరిశ్రమలకు ఏ రకమైన యిబ్బందులు లేకుండా ఆ మేరకు సభా సంఘాన్ని వేస్తామన్న హామీ యిచ్చారు. దాని మీద మీరు వెనక్కు పోయినట్లయితే ఈ సభ మీద, ప్రభుత్వం మీద విశ్వాసం పోతుంది సార్.

**(20-04-2011 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# వ్యవసాయ సంక్షోభాన్ని నివారించాలి శాశ్వత పరిష్కారాలు ఆలోచించాలి

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ఆహారం ధరలు అనేవి చరిత్రలో ఎప్పుడూ కూడా చాలా కీలకమైనవి. ఎన్నో మౌలికమైనటువంటి మార్పులకు దారితీశాయి. ఫ్రెంచి విప్లవానికి మూలం రొట్టె ముక్కలు దొరక్కపోవడం. తూర్పు యూరప్ పతనం కావడానికి కారణం 80వ దశకంలో పోలెండ్‌లో ఆహారం ధరలు పెరగడం. అక్కడి నుండి ఉద్యమం వచ్చింది. జనతా ప్రభుత్వం ఓటమి పాలై మళ్లీ కాంగ్రెస్ రావడానికి కారణం 80లో ఆనాడు ఉల్లిపాయల ధరలు. 1998–99లో వివిధ రాష్ట్రాలలో మళ్లీ కాంగ్రెస్ నెగ్గడానికి కారణం అప్పటి ఉల్లిపాయల ధరలు. ఇవాళ మళ్లీ ఆ పరిస్థితులు ఉత్పన్నం అవుతున్నాయి. అయితే పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రపంచ ఆర్థిక మాంద్యం వుంది. కానీ వ్యవసాయంలో మాత్రం కొన్ని ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కారణం ఏమిటి? ఆంగ్లంలో ఒక సామెత వుంది. Past sins cast long shadows గతంలో చేసిన పాపాలు, గత వైఫల్యాలు చాలా పొడుగాటి నీడను ఇస్తున్నాయి. దశాబ్దాల పర్యంతం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం, ఆర్థిక సంస్కరణలు చేపట్టినా కూడా వ్యవసాయ రంగంలో క్యాపిటల్ ఫార్మేషన్ – పెట్టుబడులు గానీ, ఉత్పాదకత గానీ ముఖ్యంగా మెట్ట ప్రాంతాలలో ఉత్పాదకత గానీ ఈ విషయాలలో పూర్తిగా విఫలం కావడం, హరిత విప్లవం కేవలం పల్లపు ప్రాంతాలకే పరిమితం కావడం ఇవన్నీ 30,40, ఏళ్లుగా మనం ఈ దేశంలో చేసిన పాపాలు. దాని పర్యవసానాన్ని ఈ రోజు చూస్తున్నాం. అందుకే పెద్దలు కిషన్ రెడ్డి గారు మాట్లాడుతూ వారు బిజెపికి చెందినవారు అయినా కూడా శ్రీశ్రీ గారిని ఉటంకించారు. 50 ఏళ్ల క్రితం ఏమి చెప్పుకున్నామో మళ్లీ ఇవాళ అదే చెప్పుకుంటున్నాము. ఈ ఆహారం, ధరల గురించి మనకు బహుశా ప్రపంచంలో చాలా కొద్ది దేశాలలో వున్న బలమైన చట్టం ఒకటి వున్నది. నిత్యావసర వస్తువుల చట్టం. ఆ చట్టాన్ని నేను స్వయంగా అమలుచేసిన వాడిని, అధికారిగా కోట్ల రూపాయల ఆస్తులు జప్తు చేసినవాడిని. చాలా బలమైన చట్టం. స్వేచ్ఛాయుత సమాజంలో అంత బలమైన చట్టం మరొకటి లేదు. మీకు

కావాలంటే వంద కోట్ల రూపాయల ఆస్తులను ఒక్క క్షణంలో ఒక కలెక్టరు, జాయింట్ కలెక్టరు, ఆర్‌డిఓ వాళ్ళ స్వాధీనం చేసుకోవచ్చు.

మొత్తం కాన్ఫిస్కేట్ చేయవచ్చు. జైల్లో పెట్టడానికి అవకాశం లేదు. కాని కాన్ఫిస్కేట్ చేసుకోవచ్చు. బ్లాక్‌మార్కెటింగ్‌ని ఆపగలిగే చట్టం క్రింద ప్రివెంటివ్ డిటెన్షన్ చేయవచ్చు. ఇది చాలా బలమైన చట్టం. దానిని సద్వినియోగం చేసుకోవడం చాలా అవసరం. దాని దుర్వినియోగాన్ని ఆపడం చాలా అవసరం. నేను ఎవరిపైనా వ్యక్తిగత ఆరోపణలు చేయడం లేదు. ఇవ్వాళ ఇది కొత్తగా వచ్చింది కాదు. ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో ముప్పైఏళ్ల నుండి సివిల్‌సప్లయిస్ అధికారులను మీరు ఒక జిల్లాకు బదిలీ చేస్తే లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. **(అంతరాయం)**

ఇవి వ్యక్తిగత ఆరోపణలు కావు. ఇవ్వాల్టి గురించి నేను మాట్లాడడం లేదు. ఇది సాంప్రదాయంగా కొనసాగుతోంది. ఇవ్వాళ కూడా నడుస్తోంది. దీంట్లో అనుమానం లేదు. సివిల్ సప్లైస్ విజిలెన్స్‌లో కానిస్టేబుల్స్‌ని బదిలీ చేయాలంటే ఎంతో మంది పైరవీలు చేస్తున్నారు. లక్షలు చేతులు మారుతున్నాయి. ఎందుకని? కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎందుకంత మమకారం? నిత్యావసర వస్తువుల చట్టాన్ని అమలు చేయడంలో లంచాలు లేవని మనల్ని మనం మోసం చేసుకుంటే అది ఆత్మవంచన అవుతుంది. ఇది పార్టీల విషయం కాదు. ఈ రాష్ట్రంలో ఎప్పుడో ముప్పై ఏళ్ల క్రితం రాబర్ట్ వేడ్ అనే ఆయన దీనిని లోతుగా అధ్యయనం చేసి ఒక మాట అన్నారు. There is a well developed market for public office in India. ఈ దేశంలో ప్రభుత్వోద్యోగాలకు బోలెడంత గిరాకీ ఉంది, వాటిని అమ్ముకుంటున్నారు, వాటిని కొనుక్కుంటున్నారని అన్నారు. ఇవ్వాళ కొన్ని శాఖలలో ఇదే నడుస్తోంది. వాటిలో పౌరసరఫరాల శాఖ జాతీయ స్థాయిలో కాని, రాష్ట్రస్థాయిలో కాని కొంత కీలకమైనది. దానిని మనం ఊరికే పార్టీ వ్యవహారంగా చేయవద్దు. నిజాయితీగా పరిశీలిద్దాము. ఈ చట్టాన్ని ఎంత గట్టిగా ఉపయోగించాలి అన్నదానికి కొన్ని పరిమితులున్నాయి. ప్రపంచ చరిత్రలో ఇలాంటి చట్టాలను చాలా కఠినంగా అమలు చేసింది. 1942–43 సంవత్సర కాలంలో స్టాలిన్ గ్రాడ్ ఈనాటి ఓల్గో గ్రాడ్‌లో జర్మన్ సిక్స్త్ ఆర్మీ దానిని ఎటాక్ చేసినప్పుడు, చాలా భయంకరంగా, కఠినంగా చట్టాన్ని అమలు చేశారు. బయట నుండి లోపలికి ఆహారం వచ్చేది కాదు. లోపల నుండి బయటకి మనుషులు వెళ్లేవారు కారు. ఆ పరిస్థితులలో ఒక సంఘటన జరిగింది. కుటుంబంలో స్టార్వేషన్ రేషన్ ఇస్తున్నారు అందరికీ. పరిమితమైన ఆహారం, సైన్యానికి ఎక్కువ ఇవ్వాలి కాబట్టి.

ఒక ముసలాయన చనిపోతే, పాపం ఆ పేరుతో రేషన్లు ఆశించి మిగతా వారికి కాస్త భోజనం ఎక్కువ దక్కుతుందని, ఆ వ్యక్తి చనిపోయిన సంగతిని ఈ కుటుంబ సభ్యులు ఆకలికి తాళలేక దాచిపెట్టారు. మార్షల్ ఆ కుటుంబాన్ని గోడ పక్కన నుంచోబెట్టి అందరిని కాల్చి చంపారు. అంత కఠినంగా ప్రజాస్వామ్య సమాజంలో చట్టాలను అమలుచేయడం అసాధ్యం. సప్లయి తక్కువ ఉన్నప్పుడు, గిరాకీ ఉన్నప్పుడు మీరు చట్టాలను ఎంత కఠినంగా అమలు చేసినా కూడా ధరలు పెరుగుతాయి. బ్లాక్‌మార్కెటింగ్ ఎంతో కొంత ఉండి తీరుతుంది. కాబట్టి చట్టానికి పరిమితులున్నాయి. అందులో ఆహారానికి, మిగతా వాటికి తేడా మనందరికీ తెలుసు. ఇన్ ఎలాస్టిక్ డిమాండ్. ధరలు పెరిగినా కూడా విధిగా కొనుక్కోవలసిందే, తప్పదు. ఒకటి ప్రత్యామ్నాయాలు – సబ్‌స్టిట్యూట్స్, ఎక్కడ ప్రత్యామ్నాయ పంటలు ఉంటే, ఆ ప్రత్యామ్నాయాల గురించి రాజకీయాలకు అతీతంగా చర్చ జరగాలి. ప్రజలలో ఆలోచన పెరగాలి. సోయాపప్పు పది రూపాయలు తక్కువగా ఉంటే దానిని కొనుక్కోమని మనం చెప్పాలి. దానికి సిగ్గుపడక్కరలేదు. కందిపప్పే కొనుక్కోనక్కర లేదు. శెనగపప్పు పది రూపాయలు తక్కువ ఉంటే దానిని కొనుక్కోమని మనం చెప్పాలి. నిజానికి సోయాపప్పు కందిపప్పు కంటే మంచిది. ఒక్క దాని మీదే డిమాండ్ పెంచి, స్పెక్యులేషన్ పెంచి, ధరలు పెరిగి గందరగోళం చేసే బదులు, సప్లయి తక్కువ ఉన్నప్పుడు మనం ప్రత్యామ్నాయం ఆలోచించాలి. రెండవది, విదేశాల నుండి అవసరమైతే దిగుమతి చేసుకోవాలి. ఇతర రాష్ట్రాలలో కూడా ఈ పంట లేదు. ఉదాహరణకు కంది తీసుకోండి. దిగుమతుల గురించి ఆలోచించాలి. అది చేయాలంటే, ప్రభుత్వానికి ఒక సూచన చేస్తున్నాను. వచ్చే కొద్ది మాసాలలో దేశంలో, రాష్ట్రంలో మరింత గడ్డు పరిస్థితి రాబోతున్నది. వర్షపాతం తగ్గడం వల్ల, దుర్భిక్ష పరిస్థితి వల్ల ఇంకా ఉత్పత్తి పడిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి ధరలు ఇంకా పెరిగే ప్రమాదం ఉంది. ఇవ్వాళ మనం చూస్తున్నది చాలా తక్కువ. కమోడిటీస్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఒక దానిని భారత ప్రభుత్వం రాష్ట్రాల వాటాతో ఏర్పాటు చేయించాలని కోరుతున్నాను. కేవలం ప్రైవేటు రంగంలో దిగుమతుల మీద ఆధారపడకుండా వాళ్లు మళ్లీ దీనిని కబ్జా చేసి, ధరలు పెంచే అవకాశం లేకుండా, జాతీయ స్థాయిలో కమోడిటేస్ ట్రేడింగ్ కార్పొరేషన్‌ని వెంటనే కొన్ని వేల కోట్ల రూపాయలను ఖర్చుపెట్టి ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. మనకు అవసరమైన కీలకమైన ఆహారపదార్థాలను ఇప్పటి నుండే పెద్ద ఎత్తున దిగుమతి చేసుకొని, దేశంలో నిలవ వుంచి, పి.డి.ఎస్‌లో కానీ ఓపెన్ మార్కెట్‌లో కానీ తగిన రేట్లను బట్టి రిలీజ్

చేయడం కోసం ఈ కార్పొరేషన్‌ని పెట్టడం చాలా అవసరం. దానికి ఇప్పుడే మన ముఖ్యమంత్రి గారు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, చొరవ తీసుకున్నట్లయితే వచ్చే గడ్డుకాలం నుండి మనం బయటపడ్డవాళ్లమవుతాము. లేకపోతే మళ్లీ రెండు నెలల తరువాత దీనిగురించి అరుపులు, కేకలు, ఆందోళనలు తప్పవని నేను ఖచ్చితంగా చెబుతున్నాను. ధరలు పెరగడం తప్పదు. ఇది ఎవరి చేతుల్లోనూ లేదు.

అధ్యక్షా, డిమాండ్ కంటే సప్లయి తక్కువ ఉన్నప్పుడు, ఉత్పత్తి లేనప్పుడు, వర్షం లేనప్పుడు ఆహారధాన్యాల విషయంలో మనకు తాత్కాలికమైన పరిష్కారాలు, చిట్కాలు, మ్యాజిక్‌లు లేవు. ఈ మధ్య కాలంలో ఈ చర్చలో ప్రైస్‌సిగ్నల్స్ మరిచిపోతున్నాం. మనం ఎంతసేపు చర్చ చేసినా కూడా వ్యవసాయ సంక్షోభం లేదనుకుని మాట్లాడుకుంటున్నాము. ధరలు పెరిగిన రోజు ధరలు తగ్గించాలని అంటున్నాము, మరునాడు రైతు నష్టపోతున్నాడు. రైతుకు ధరలు పెంచాలని అంటున్నాము. రైతుల ప్రయోజనాలని ఉత్పత్తిదారుల ప్రయోజనాలని విస్మరించి వినియోగదారుల ప్రయోజనాలను కాపాడడం కాదు. టమోట, ఆనియన్ ధరలు విపరీతంగా పెరిగాయి. మళ్లీ వెంటనే తగ్గాయి. మూడు నెలల తరువాత ఎవరు పట్టించుకోరు. కాబట్టి ప్రైస్‌సిగ్నల్స్ ప్రకారం రైతు ఆ పంటలకు వెళ్లే అవకాశాన్ని మనం కల్పించాలి. రైతుకు ప్రత్యక్షంగా మార్కెట్‌లో యాక్సెస్ కల్పించాలి. మధ్యలో దళారీలను తగ్గించినట్లయితే, మార్కెట్ చెయిన్‌ని కంప్రెస్ చేసినట్లయితే వినియోగదారుడికి చెల్లించే రేటు, రైతుకు వచ్చే రేటు రెండింటికీ వ్యత్యాసం తగ్గుతుంది. ఇవ్వాళ రెండింటీకి మధ్య పెద్ద వ్యత్యాసం ఉంది. ఇద్దరూ నష్టపోతున్నారు. ప్రత్యక్ష యాక్సెస్ కావాలి. మార్కెట్లను ప్రత్యక్షంగా రైతుల చేతుల్లో పెట్టాలి. ఇక్కడ సభలో ఎం.ఎల్.ఏలున్నారు. మనం చెప్పిన వాళ్లను మార్కెట్ ఛైర్మన్లుగా నియమించనక్కరలేదు. రైతులనే పెట్టుకోమనండి Value addition చేయించమనండి. స్టోరేజ్‌కి, ప్రాసెసింగ్‌కి అవకాశం కల్పించండి. ఇక ప్రభుత్వం వెంటనే చేయగలిగింది రైతులకు ఏమవుతుందంటే, ఈ సంవత్సరం ఒక పంటకి గిరాకి బాగా ఉందంటే అందరూ దానికే వేలంవెర్రిగా వేస్తారు. వచ్చే ఏడాది ధర తగ్గిందంటే అందరూ పారిపోతారు. చెరుకు సంగతి మనం చూశాము. ఆకస్మాత్తుగా చెరుకు ఉత్పత్తి తగ్గిపోయి షుగర్ ప్రైస్ పెరిగిపోయింది. ఇది పూర్తిగా స్వయంకృతాపరాధమే. ఇలా కాకుండా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రతి గ్రామానికో లేక మూడు, నాలుగు గ్రామాలకు ఒక కంప్యూటర్ రిజిస్ట్రేషన్ సెంటర్‌ని పెట్టి, ఏ రైతు ఏ పంటని ఎంత విస్తీర్ణంలో వేస్తున్నాడో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ని స్వచ్ఛంధంగా

ఏర్పాటు చేస్తే రైతులు ప్రైస్ సిగ్నల్స్‌ని బట్టి, ఎంత పంట విస్తీర్ణం వస్తుందో తెలుసుకొని దానిని బట్టి వారు ఆలోచించుకొని పంట వేసుకొనే అవకాశం ఉంటుంది. ఇవ్వాళ అందాజ్‌గా అనుకోవడం తప్ప ఏ రైతుకు ఎంత పంట వేస్తున్నాడో తెలియడం లేదు. ప్రతిసారి మనం యాభై ఏళ్ల నుండి ఇదే మాట అనుకుంటున్నాము. రైతు అన్యాయం అయిపోతున్నాడని ఒక రోజు, ధరలు పెరిగిపోతున్నాయని మరొక రోజు అనుకుంటున్నాము. కాబట్టి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం దయచేసి ఏర్పాటు చేయండి. చివరిగా ఏమిటంటే, దీర్ఘకాలంలో మన దేశం కాని, ప్రపంచం కాని ఆహార విషయంలో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోబోతుంది. మన చరిత్రలో తొలిసారిగా భూమి మీద ఒత్తిడి ఎప్పుడూ లేనంత పెరుగుతోంది.

కేవలం ఆహారం కోసమే భూమి కాదు. మొట్టమొదటిసారిగా బయోఫ్యూయెల్స్ కోసం, ఇంధనం కోసం భూమిని పెద్ద ఎత్తున వాడేది ఈ ప్రపంచం మొత్తంలో  పెరుగుతోంది. వచ్చే ముప్పై ఏళ్లలో మరింత పెరుగబోతోంది. ఇవ్వాళ గోదావరి ద్వారా గ్యాస్ రావొచ్చు. మరొకటి రావొచ్చు. మరో ప్రాంతంలో ఆయిల్ రావచ్చు. 30 ఏళ్లలో ఆయిల్ ఎకానమీ అంతరించిపోతుంది. కాబట్టి వచ్చే రెండు తరాల కాలంలో ఖచ్చితంగా వ్యవసాయ యోగ్యమైన భూమి  పరిమితం అవుతుంది. ఆహారాన్ని పండించే భూమి పరిమితం అవుతుంది. ఆహారేతరోత్పత్తులు సాధించే వ్యవసాయం పెరుగుతుంది. అది తప్పదు. మానవాళికి అవసరం. కాబట్టి, దీర్ఘకాలిక దృక్పథంతో ఇవ్వాళ మెట్ట వ్యవసాయంలో హరితవిప్లవం కోసం మౌలికమైన ప్రయత్నం చేయకపోతే, కేవలం హరితవిప్లవం పేరుతో ఈ దేశంలో పల్లపు భూములలో, మనకు వరి, గోధుమ పంట పెరిగింది తప్ప మిగతావి పెరగలేదు. ఇప్పటికి కూడా the Green Revolution has not touched the dry land farming. దానిని మౌలికంగా మార్చకపోతే, వేలాది కోట్ల రూపాయలను పెట్టుబడి పెట్టి, శక్తిని వెలికితీసి, దానికి కావలసిన వంగడాలు, దానికి కావలసిన కొత్త సాంకేతిక పరికరాలు, పరిశోధనలు చేయకపోతే దీర్ఘకాలంలో జాతి నష్టపోతుంది. ఇవ్వాళ ఈ పూట ఏమి అవుతుందో అనేది కాదు. వచ్చే 30 ఏళ్లకి ఈ పథకం వేయాలి. అందుకోసం కేవలం ఈ పూట ధర గురించి ఆలోచించకుండా, ఇవ్వాళ సమస్యను చూస్తూ, రైతు ప్రయోజనాలను కాపాడుతూ, వచ్చే సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ దుర్భిక్షాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సరైన చర్యలు చేపడుతుందని ఆశిస్తున్నాను. నమస్కారం.

**(21-08-2009 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

మన దేశ చరిత్రలో సాంఘిక సంక్షేమంలో ఇది ఒక అసాధారణమైన చట్టం. తొలిసారిగా ఒక పథకం ప్రభుత్వం నుండి రావటం కాకుండా ఒక ఎన్‌టైటిల్ మెంట్, చట్టబద్ధమైన హక్కుగా పేదలకు సంక్షేమాన్ని ఏర్పాటు చేసిన తొలి చట్టం ఇది. కాకతాళీయంగా ఈ చట్టం రూపకల్పనలో నేను ప్రధాన పాత్ర వహించాను. ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ యాక్ట్‌గాని, ఈ పథకం అమలుకోసం కీలకమైన మరో చట్టం పాలనా సమాచార చట్టం, ఈ రెండింటిలో ప్రతీ కామా, ఫుల్‌స్టాఫ్, ప్రతిపదం, ప్రతి వాక్యం, ప్రతి క్లాజు నేను చదివీ, 6 నెలలపాటు సుదీర్ఘంగా దీనిపై తలలు పట్టుకునీ చట్టాన్నీ తయారుచేశాము. మంత్రిగారి ప్రకటన ఉత్తమ ప్రమాణాలతో ఉన్నది. వారిని మనసారా అభినందిస్తున్నాను. ప్రకటన, దాని క్వాలిటీ, దానిని తయారుచేసిన తీరుగాని, లోతుకు వెళ్లటంగాని, ఈ పథకం పకడ్బందీగా అమలుచేయటంకోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంగాని చాలా నిర్దిష్టంగా, సవివరంగా తెలియచేశారు. వారిని అభినందిస్తున్నాను. నేను ఎప్పుడూ బహిరంగా చర్చల్లో ఒక ప్రమాణాన్ని పాటిస్తాను. నేను అక్కడ కూర్చుని ఉంటే ఇంతకంటే బాగా ఏమి చేస్తానని ఆలోచించి దాని ప్రకారం మాట్లాడడం నాకు అలవాటు. ఆమేరకు వారిని అభినందిస్తున్నాను.

సంస్కృతంలో మనకు 'కంబళి భోజన న్యాయం' అనే న్యాయం ఒకటి ఉన్నది. అపరిశుద్ధమైన కంబళిలో భోజనం చేస్తూ అన్నంలో వెంట్రుకలు ఉన్నాయని వాపోతే లాభంలేదు. ఒక భయంకరమైన వ్యవస్థలో, అవినీతి క్రిములు లుకలుకలాడుతున్న వ్యవస్థలో మనం ఉన్నాం కాబట్టి ఎంత సదాశయంతో చట్టాన్ని తయారుచేసినా లుకలుకలు కనపడతాయి. జాతీయ స్థాయిలో అన్ని పార్టీలు విభేదాలను విస్మరించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అందరూ ఏకగ్రీవంగా ఒక చట్టాన్ని ఆమోదించినా ప్రభుత్వంలో మంత్రిగాని, మంత్రులుగాని, అధికారులుగాని చిత్తశుద్ధితో గట్టి ప్రయత్నాలు చేసినా కూడా స్థానికంగా అవినీతి క్రిములు లుకలుకలాడుతున్నాయి. నిష్పాక్షికంగా ఉన్నవారితో నేను విచారించాను. ఫీల్డ్ లెవెల్లో నేను దీన్ని చూడలేదు. అందుచేత నా స్వానుభవంతో నేను మాట్లాడను. కానీ, నిష్పాక్షికంగా, నిజాయితీగా

చెప్పేవారిని అడిగితే కొన్ని జిల్లాల్లో బస్తాలకు బస్తాలు పాస్ పుస్తకాలు, మనం ఏదైతే పోస్టాఫీసుల ద్వారా ఇస్తామని అంటున్నామో, జాబ్‌కార్డ్‌లు, పోస్టాఫీస్ పాస్‌పుస్తకాలు బినామీ పేర్లతో బస్తాలకు బస్తాలు......

**డా॥ జయప్రకాష్ నారాయణ :** దయచేసి వినండి. వినరే మీరు? అధ్యక్షా, ఇది వ్యక్తులమీద కాదు. వ్యవస్థలో లోపాలు ఉన్నప్పుడు నిజాయితీగా తప్పులను సవరిద్దాము. నేను ఎవ్వరిపైనా వ్యక్తిగత ఆరోపణలు చేయటంలేదు. నేను ఈ ప్రభుత్వాన్ని అభినందించాను. ఈ చట్టం రూపకల్పన చేసినవారిలో నేను ఒకడిని అరె... ఒక్కమాట, నిజాయితీగా చెపితే, కొంచెం మంచి జరగాలని చెప్పినా ఓపిక లేకపోతే ఎట్లా విక్రమార్కగారూ?

**డా॥ జయప్రకాష్ నారాయణ :** నేను చాలా నిండు హృదయంతో, మంత్రిగారిని, ప్రభుత్వాన్ని ఒక చక్కటి, చాలా చక్కటి ప్రకటన చేశారు, మంచి ప్రకటన చేశారు. ఇంతవరకు అంత మంచి ప్రకటన నేను చూడలేదు. దానికి అభినందిస్తున్నాను. అదే సమయంలో, అయ్యా మీరు, నేను ఎంత మంచివారము అయినప్పటికీ ఫీల్డ్‌లో తప్పులు ఉంటాయి. దానిని పరిశీలించమని కోరుతున్నాను. దానికంత బాధపడితే ఎట్లాగండీ? నాకసలు అర్థం కావటంలేదు. మిమ్మల్ని ఏమనమంటారు?

అధ్యక్షా, వారికి టైమ్ కావాలంటే నేను కూర్చుంటాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** నేనొక్క మాట చెప్పగలను. నా నోటి నుండి బహిరంగ జీవితంలో అనృత దోషం అసాధ్యం. ఇంతవరకూ నా జీవితంలో, ప్రజా జీవనానికి సంబంధించి విషయంలో ఒక్క విషయంలోకూడా, పొరపాటునకూడా అబద్ధం ఆడలేదు, అతిశయోక్తులు పలుకలేదు. గుండెమీద చెయ్యి వేసుకుని చెప్పగలను. కాబట్టి నాగురించి ఆ మాట అనబోకండి. దయచేసి గీతదాటబోకండి. ఈ వేళ మీరు పేమెంట్స్‌లో మంచి ఏర్పాట్లు చేశారు. బ్యాంకులద్వారా ఏర్పాట్లు చేస్తున్నారు, సంతోషం. ఐ.టి.ని ఉపయోగిస్తున్నారు, సంతోషం. పోస్టాఫీసులను దేశంలో తొలిసారిగా వాడారు, సంతోషం. కాని, అసలు ఆదిలోనే పొరపాటు ఉంటే, జాబ్‌కార్డ్‌లు ఇచ్చేదాంట్లోనే సుమారు 1 కోటి 17 లక్షల జాబ్‌కార్డ్‌లు ఇచ్చేప్పుడు అగ్రకులాలు, జీవితంలో కూలి మొహం చూడనివారు, ఏనాడు మట్టి పిసకనివారికి మీరు జాబ్‌కార్డ్‌లు ఇచ్చినట్లయితే ఏ పేదలకు, ఏ కూలివారికి ఈ ఫలాలు అందాలని కోరుకున్నామో, ఎవరికి జీవిత భద్రత కావాలని మనం కోరుకున్నామో అక్కడ వారికి

అన్యాయం జరుగుతోంది. అందుకే నేను నా దృష్టిని అక్కడ కేంద్రీకరిస్తున్నాను. దయచేసి నిండు మనసుతో ఆలోచించండి. ఇది ఎవరిపైనా వ్యక్తిగత ఆరోపణలు చేయటం కాదు. వ్యవస్థ కుళ్ళి పోయిందని చెప్పాను, 'కంబళి భోజన న్యాయం' అని చెప్పాను.

దీనిని అమలుచేయటంలో నిర్దిష్టమైన సూచనలు చేయదలచాను. విమర్శలకు పోదలచుకోలేదు. నేను అక్కడ కూర్చున్నప్పటికీ వ్యవస్థలో పొరపాట్లు జరుగుతాయి. వాటిని అరికట్టటం కోసం సంస్థాగత మార్పులు ఏవో ఆలోచించాలి. మొట్టమొదటి పాలనా సమాచార హక్కును కొన్ని అంశాలలో బలంగా వాడాలి. ఉదాహరణకు మంత్రిగారి ప్రకటనలోనే ఉన్నది. సోషల్ ఆడిట్ చేస్తున్నప్పుడు, సోషల్ ఆడిట్ టీమ్‌కు 'ఆర్.టి.ఐ.ద్వారా వారు సమాచారాన్ని సేకరించి' అని అంటున్నారు. సమాచారాన్ని సేకరించటం ఎందుకు? ప్రోయాక్టివ్‌గా మనంత మనమే సోషల్ ఆడిట్ టీమ్ అడగవలసిన అవసరం లేకుండా ఏ గ్రామంలో ఏ పనులు మంజూరు చేశారు, ఎంత ఖర్చు అయినది ఎన్ని కార్డులు ఉన్నాయి, ఆ జాబ్ కార్డులు ఎవరివి, ఎవరెవరు పనిచేశారు, మస్టర్ రోల్స్‌లో ఎవరు ఉన్నారనే వివరాలన్నీ మనంతట మనమే ప్రోయాక్టివ్‌గా ఎందుకు ఇవ్వటంలేదు. దయచేసి ఆ పనిచేసే ఏర్పాట్లు చేయండి. అలాగే రాష్ట్రంలో ఉన్న 1 కోటి 17 లక్షల జాబ్‌కార్డ్‌లు, 84 లక్షల 27 వేలమందికి ఉపాధి కల్పించామని అంటున్నారు. వారందరికీ ఎక్కడెక్కడ ఉపాధి కల్పించారు, ఎంతెంత అనేది పొందుపరచాలి. ఈ ఐ.టి.రోజుల్లో అది పెద్ద కష్టమైన పని కాదు. నిజంగా ఈ పథకం అమలుకావాలనుకుంటే ఈ మొత్తాన్ని కూడా 24 గంటలు యాక్సెస్‌లో ఉండేట్లు ఏర్పాట్లు చేయండి. అదే విధంగా సోషల్ ఆడిట్ రిపోర్ట్, ఒకసారి నివేదిక వచ్చిన తరువాత దానిని బటన్ క్లిక్‌తో అందుబాటులోకి వచ్చేట్లు ఏర్పాట్లు చేయండి. ఈ మూడూ చేయటం ......

రెండవ విషయం ఏమంటే ఆనాడు చట్ట రూపకల్పనలో చాలా గట్టిగా పోరాడి సాధించిందేమంటే, నా మిత్రులు చాలామందికి పంచాయితీలమీద నమ్మకంలేక స్థానిక ప్రభుత్వాలకు పాత్రలేకుండా పూర్తిగా జిల్లా కలెక్టర్ చేతుల్లో పెట్టాలని పోరాడితే చాలా కాలం... రెండు మూడు నెలలపాటు దానిని నేను ఆపి ఉంచాను. పంచాయితీలకు కీలకపాత్ర పెట్టకపోతే నేను ఒప్పుకోనని గట్టిగా పోరాడి దానిని సాధించాను. ఈ వేళ పూర్తిగా కేంద్రీకృతం చేశారు. పంచాయితీలకు నామమాత్రంగా మాట్లాడటమే తప్ప చట్టాన్ని, చట్ట స్ఫూర్తిని, రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘించి పనులన్నీ

మనమే నిర్ణయించాలనుకుంటున్నాము. ఎమ్.ఎల్.ఎ.లు, మాజీ ఎమ్.ఎల్.ఎ.లు, మంత్రిగారు లేక మరో అధికారి, వీరెంత మంచివారైనా కావచ్చు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, చట్టస్ఫూర్తి సరిగా ఉండాలంటే ఆ పంచాయితీలు, ఆ మండలాలు, ఆ జిల్లా పరిషత్‌లకు పూర్తి అధికారం ఇవ్వండి. తప్పులు చేస్తే వారిని గట్టిగా దండించండి. దండించవద్దని అనటంలేదు. కాని అధికారం, బాధ్యత వారికి పూర్తిగా ఇచ్చి జనం చేతుల్లో పెట్టండి. జాబ్‌కార్డ్‌లు మొత్తం రంగు అప్పుడు బయటపడుతుంది. తప్పు జరిగితే బయటపడుతుంది. అక్కడ వారికి ఆ శక్తిసామర్ధ్యాలు వారికి లేకపోతే, ఇంత కాంప్లెక్సిటీని అమలుచేసేప్పుడు వారికి నైపుణ్యం లేదనుకుంటే తర్ఫీదు ఇవ్వండి. కెపాసిటీ బిల్డింగ్ కోసం శిక్షణ ఇవ్వండి.

మూడవ విషయంపెద్దలు రంగారెడ్డి గారు చెప్పారు. పౌరసరఫరాలకోసం ఫుడ్ ఎడ్వైజరీ కమిటీలు ఎలాగైతే ఉన్నాయో ఆవిధంగానే మండల, జిల్లా స్థాయిల్లో మీరు ప్రత్యేకంగా పార్టీలు, నిపుణులైనవారు, నిజాయితీపరులు, నిష్పాక్షింగా ఉండేవారు, సమాజంలో పేరున్న పౌరులందరితో ప్రతి మండలం, ప్రతి జిల్లాకు సలహాసంఘాన్ని ఏర్పాటు చేసి మొత్తం వివరాలను వారి ముందు పెట్టండి. సమస్యలు అక్కడనే పరిష్కారం అవుతాయి.

నాలుగవ అంశం ఎస్సెట్స్. ఉదాహరణకు 21 లక్షల పనులు జరుగుతున్నా యన్నారు. 8 లక్షల 84వేల పనులు పూర్తయినాయని అన్నారు. ఇది చాలా పెద్ద యంత్రాగం. ఈ మొత్తంలో ఎస్సెట్స్ వెరిఫికేషన్ లేకపోయినట్లయితే కుదరదు. ఏమేమి ఎస్సెట్స్ బిల్డ్ చేశామనే స్టేట్‌మెంట్ ఆఫ్ ఎస్సెట్స్ డిస్‌క్లోజ్ చేయండి. రెండవ అంశం అప్‌డేటింగ్. ఎస్సెట్స్ అన్నింటిలో ఎప్పటికప్పుడు ఏమి జరుగుతుందనేది తెలియచేయండి. మూడవది ఎస్సెట్స్ వెరిఫికేషన్ కోసం యంత్రాంగాన్ని ఏర్పాటుచేయండి.

దీనితోపాటు ఆంబుడ్స్‌మెన్ కావాలని ఆనాడు నేను గట్టిగా పట్టుపట్టాను. దయచేసి ప్రతి జిల్లాకూ ఒక ఆంబుడ్స్‌మెన్‌ను ఏర్పాటుచేయండి. పార్టీలకు అతీతంగా, ప్రభుత్వ యంత్రాంగానికి అతీతంగా ఏర్పాటుచేయండి. స్వతంత్ర్య ప్రతిపత్తిని ఇవ్వండి. తప్పుచేస్తే దండించే ఏర్పాటుచేయండి. మీరెవరు బాధ్యత తీసుకోవలసిన అవసరం లేదు. ఎవరో ఏదో గ్రామంలో తప్పుచేస్తే బాధ్యత మీకెందుకు? ఆ తప్పుచేసినవారిని దండించే ఏర్పాటుచేయండి. స్వతంత్ర ప్రతిపత్తిగల యంత్రాగాన్ని పెట్టండి. వేల

కోట్ల రూపాయలు పేదలకు వెళ్లాలని అంటున్నప్పుడు మనం ఎందుకు ఆ పని చేయలేకపోతున్నాము? ఆమాత్రం ధైర్యం మనకు ఎందుకులేదు? తప్పు జరిగితే ఎవరు దండిస్తారు?

చివరగా చెప్పేదేమంటే ఈ చట్టం పెట్టింది తాత్కాలికంగా నిరుపేదలు కడుపుతో ఆకలితో ఎవరూ పండుకోకూడదని, పనిచేస్తానన్న అన్నార్తుడు ఎవరున్నా కూడా పనిచేయటానికి అవకాశం ఉండాలని తప్ప ఇదే ఉపాధి అనే ఆలోచనతో కాదు. 21వ శతాబ్దంలో మనకు గోతులు తవ్వటం , గోతులు పూడ్చటమే ఉపాధి కాజాలదు. బ్రిటిష్‌వారు ఆనాడు ఎలాగైతే డ్రౌట్ కోసం ఆనాడు కరువు పథకాలు పెట్టారో, ఆ తరువాత ఎన్.ఆర్.ఇ.పి., ఆర్.ఎల్.ఇ.పి. అని అనుకున్నామో ఆ రీతిలో తాత్కాలిక ఉపశమనం కోసం ఏర్పాటుచేసిన దానిని శాశ్వత ఉపాధిగా భావించబోకండి. అధికారపక్షం నుండి మిత్రులు సదుద్దేశంతో అన్నారు. ఇది ఒక్క రోజుతో పోయేది కాదు, శాశ్వతంగా ఉండేదని అన్నారు. కాదు, ఇది పోవాలని కోరుకోండి. దీని అవసరం ఉండకూడదని కోరుకోండి. నిజమైన ఉపాధి కావాలంటే నైపుణ్యం కావాలి. విద్య కావాలి, తలెత్తుకునీ ధీమాగా నెలకు అయిదారు వేలు సంపాదించుకునే శక్తి కావాలిగానీ బాబ్బాబు నువ్వు పనిస్తే ఆరోజు కూలికి వస్తాను అనే పరిస్థితి ఉండకూడదు. ఇది తాత్కాలికంగా ఇచ్చే సోషల్ సెక్యూరిటీ మెజర్ మాత్రమే. నిజంగా సాంఘిక భద్రత కావాలంటే, పేదరికం తొలగాలంటే ఇది అవసరం లేని రోజు త్వరగా రావాలి. అందుకోసం పోరాడమని కోరుతున్నాను. అయ్యా, ఈ తప్పులు మీరు వ్యక్తిగతంగా చేశారని అనటం లేదు. సహృదయంతో వీటిని నిర్మాణాత్మకంగా స్వీకరించండి. సంస్థాగతంగా పరిష్కారాలను ఏర్పాటుచేయండి. మరింత మంచి పేరు తెచ్చుకుంటే మేమంతా సంతోషిస్తాము. పథకాలతో అనుకున్న ఫలితాలు నెరవేరాలని చూస్తాము, ప్రతిదానికి ఉలికిపడబోకండని మనవిచేస్తూ మీకు నమస్కరిస్తూ సెలవుతీసుకుంటున్నాను.

**(27-03-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# విద్యుత్‌రంగంలో వృధాను అరికట్టాలి

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, గత పదిహేను సంవత్సరాల నుంచి నేను చాలా నిశితంగా విద్యుత్తు రంగాన్ని పరిశీలిస్తున్నాను. ఈ రాష్ట్రం ఆర్థికంగా కుప్పకూలడానికి విద్యుత్తు రంగం కారణం అవుతుంది. 15 ఏళ్లుగా మనం చాలా దారుణమైన విధానాల్ని అనుసరించాము. ఆ నేపథ్యంలో మొట్టమొదటి క్లారిఫికేషన్, ఒకేసారి 1342 మెగా వాట్లు థర్మల్ పవర్ జనరేషన్ అగిపోయింది. అలాగే 40 శాతం హైడ్రో పవర్ అగిపోయింది. ఈ సంవత్సరం ఎప్పుడు లేనంతగా వరదలు వచ్చి రిజర్వాయర్‌లు నిండి కళకళలాడుతున్నప్పుడు కూడా కొంచెం వర్షం ఆలస్యం అయినా కూడా 40 శాతం విద్యుత్తు ఉత్పత్తి హైడ్రో పవర్ రంగంలో తగ్గిందంటున్నారు. అలాగే ఒకేసారి 1342 మెగా వాట్లు థర్మల్ పవర్ జనరేషన్ రంగంలో తగ్గిందని అంటున్నారు. ఇది కాకాతాళీయమా, దీర్ఘకాలిక సమస్య ఏమన్నా ఉందా, ఒకసారి మంత్రి గారు క్లారిఫై చేయాలి. 2. నాగార్జున సాగర్, శ్రీ శైలం రిజర్వాయర్ దగ్గర హైడ్రో పవర్ స్టేషన్స్ దగ్గర వరదలు వచ్చినప్పుడల్లా మునిగిపోతున్నాయి. దీర్ఘకాలికంగా ఎంత వరద వచ్చిన కూడా ఫ్లడ్ ఫ్లో(వరద ప్రవాహం) ఎంత ఉన్న కూడా అది మునగకుండా, కొన్ని వందల కోట్ల రూపాయల నష్టం లేకుండా, కొన్ని నెలల పాటు విద్యుత్తు ఉత్పత్తి ఆగకుండా దీర్ఘకాలికంగా ప్రణాళిక చేపట్టారా? దాని కోసం నిధులు ఏమైనా కేటాయించారా? 3. ఆర్థిక మంత్రిగా ముఖ్యమంత్రి గారే విద్యుత్తు మంత్రి కూడా, ఆయన బడ్జెట్‌లో 4,500 కోట్ల రూపాయలు వ్యవసాయ విద్యుత్తు సబ్సిడీగా చూపెట్టారు. వాస్తవానికి గత సంవత్సరమే 6,800 కోట్ల రూపాలయల పైచిలుకు చూపెట్టారు. ఈ సంత్సరం ఈ పరిస్థితి ఉంటే ఇంకా పెరిగే అవకాశం ఉన్నది. ఆ గణాంకాలు realistic గా లేవు. రోజుకు 20 కోట్ల రూపాయల సబ్సిడీ ప్రస్తుతం ఉండే అవకాశం ఉన్నది. అలాంటి పరిస్థితులలో మీరు పంపిణీని బాగు చేయకుండా, వృధాను అరికట్టకుండా నూటికి నూరు శాతం డిస్ట్రిబ్యూటర్స్ ట్రాన్సుఫార్మర్లకు మీటర్లు పెట్టకుండా, డిస్ట్రిబ్యూషన్‌ను ఇంప్రూవ్ చేయకుండా, విద్యుతు వ్యవస్థను బాగు చేయలేరు, విద్యుత్తును అందించలేరు. దానికి పథకాలు చేపట్టారా? 4. పి.పి.ఏలు (విద్యుత్ కొనుగొలు ఒప్పందాలు) ఉన్నా కూడా Independent Power Projects కు 25 శాతం మార్కెట్‌లో అమ్ముకునే ఏర్పాట్లు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్తు కొరతను

దృష్టిలో ఉంచుకొని దానిని తాత్కాలికంగానో, దీర్ఘకాలికంగానో సవరించే ఏర్పాట్లు ఏమైనా చేస్తారా? దానిలో భాగంగానే విశాఖపట్టణంలో ఒక ప్రాజెక్టుకు నూటికి నూరుపాళ్లు కూడా మార్కెట్‌లో అమ్ముకునే ఏర్పాట్లు చేస్తున్నారని వార్తలు వచ్చాయి. ఈ రాష్ట్రంలో విద్యుత్తు కొరత నేపథ్యంలో ఈ పి.పి.ఏ వారితో కూడా ఏర్పాటు చేసుకొని మనకు భారత ప్రభుత్వంతో వచ్చినటువంటి ఎన్‌టిపిసి ప్రాజెక్టుతో సమానంగా ట్యారిఫ్‌తో మనం కొనుగోలు చేసి ఏర్పాట్లు చేస్తారా? 5. మనకు మెట్ట ప్రాంతంలో భూగర్భ జలం లేనప్పుడు కూడా ఎప్పుడు అయితే ఉచిత విద్యుత్తు ఇస్తున్నారో అక్కడ బాగా నీటిని వినియోగించేటటువంటి వరి, చెరుకు పంటలను పండిస్తున్నారు. వాటిని ఆరికటట్టకపోతే అక్కడ భూగర్భ జలం నాశనం అయిపోతుంది, ఇటు విద్యుత్తు రంగం నాశనం అయిపోతుంది. దాని కోసం ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా? 6. ఈ వేళ సభలో ఓట్ల కోసం మనం అంతా కూడా మనస్సాక్షిని చంపుకొని మాట్లాడుతున్నాము. అక్కడ వున్న అధికారులను చూస్తే నాకు చాలా బాధ వేస్తున్నది. రసూల్‌ఖాన్ గారు చెప్పినట్లుగా, కాళ్లు చేతులు కట్టిపారేసి ఒలింపిక్స్‌లో పరుగెత్తమని అంటున్నాము. కానీ, విద్యుత్తు ఉచితంగా ఇవ్వాలి. మీటర్లు ఉండకూడదు, ట్యారిఫ్‌లు పెట్టకూడదు. 24 గంటలు విద్యుత్తు గ్రామాలకు రావాలి. కానీ, కొరత లేకుండా వుండాలి. యూనిట్ 13 రూపాయలతో కొనాలి. అదే సమయంలో బడ్జెటులో లోటు ఉండకూడదు. అప్పులు ఉండకూడదు. ఇవన్నీ అయ్యాక ప్రతి రంగానికి రెట్టింపుగా కేటాయించాలి. ప్రపంచంలో దేవుడు కూడా ఇవన్నీ చేయించలేడు. ఈ రోజు గుజరాత్ రాష్ట్రాన్ని చూడండి, 24 గంటలు గ్రామాలకు విద్యుత్తు ఇస్తున్నారు. గుజరాత్‌లో ఆంధ్రప్రదేశ్ కంటే వర్షాపాతంలో సగటున తక్కువ. వారు 8 వందల అడుగుల నుంచి నీళ్లు తీస్తున్నా కూడా హార్స్‌పవర్‌కు 850 రూపాయలు అక్కడ వసూలు చేస్తున్నారు లేదా మీటరు పెట్టినట్లయితే యూనిట్‌కు 50 పైసలు వసూలు చేస్తున్నారు. అయినా కూడా వ్యవసాయం లాభసాటిగా రైతులు అక్కడ చేస్తున్నారు. ఎంత కాలం మనం ఓట్ల వేటలో భవిష్యత్తును సమాధి చేస్తాం? ఎంత కాలం మనం ఈ రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలో ఉంచుదాం? గ్రామాలలో 24 గంటలు విద్యుత్తు కావాలి, వ్యవసాయేతరంగా పరిశ్రమలు కావాలి, ఉపాధి కావాలి, అక్కడ నుంచి వలసలను అరికట్టాలి. కాని, తాత్కాలిక ఓట్ల వేటలో మనం పార్టీలు ఒకరితో ఒకరూ పోటీ పడి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, విద్యుత్తు పరిస్థితిని నాశనం చేస్తే వ్యవసాయం నాశనం అవుతుంది. రాష్ట్ర భవిష్యత్తు నాశనం అవుతుంది. దయచేసి ఇప్పటి నుంచైనా గుజరాత్‌లో చేసినట్లుగా మీటరింగ్ పెట్టి ఎంతో కొంత ఛార్జి

చేసినట్లయితే వృధా చేయకుండా అరికట్టి ఈ రాష్ట్ర భవిష్యత్తును కాపాడే పరిస్థితి ఉంటుంది. దాని కోసం అది వాస్తవం అని తెలిసినా కూడా మంత్రివర్యులు గానీ, ప్రభుత్వం గానీ మాట మెదపలేక పోతున్నారు. అందుకు తీవ్రమైన నిరసన వ్యక్తం చేస్తూ ఈ రాష్ట్రంలో ప్రజలు, ముఖ్యంగా యువత, రైతులు వారి భవిష్యత్తును గమనిస్తారని ఆశిస్తూ నేను కూర్చుంటున్నాను.

**డా॥యన్. జయప్రకాష్ నారాయణ్ :** అధ్యక్షా, నేను ఒక విషయమే మనవి చేస్తాను. పక్షపాతాలకు అతీతంగా రాష్ట్ర భవిష్యత్తును రక్షించుకోవాలంటే విద్యుత్‌కు మీటర్లు ఉండాలి. మీరు కావాలంటే ఉచితంగానే ఇవ్వండి, లేదా యూనిట్‌కు పది పైసలు పెట్టండి. కానీ ఓట్ల కోసం రాష్ట్ర భవిష్యత్తును బలిపెడుతున్నామనే మాట కఠోరమైన వాస్తవం. ఎన్ని సార్లు చెప్పిన కూడా విననట్లుగా నటిస్తున్నారు. తెలియకపోతే చెప్పవచ్చు కానీ పూర్తిగా వాస్తవాలు తెలుసు. నూటికి నూరు పాళ్లు తెలుసు. అక్కడ కూర్చున్నవారికి తెలుసు. ఇక్కడ కూర్చుని బయటికి వెళ్ళినవారికి తెలుసు. మన అధికారం కోసం రాష్ట్రాన్ని పాతిపెట్టడానికి సిద్ధపడుతున్నాం. రాష్ట్ర యువత భవిష్యత్తు నాశనం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. ఇరవై నాలుగు గంటలూ గ్రామాలకు విద్యుత్ అందించి అక్కడ పారిశ్రామికీకరణ పెంచినట్లయితే రాష్ట్రం బాగుపడుతుంది. గుజరాత్‌లో చేసిన రీతిని మీటర్లు పెట్టి ఎంతో కొంత ఛార్జ్ చేసినట్లయితే విద్యుత్ వృధా చేయకుండా అరికట్టవచ్చు.

**(17-03-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# విద్యుత్‌రంగాన్ని సంస్కరించాలి

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, విద్యుత్ రంగాన్ని మించినటువంటి కీలకమైన రంగం ఆర్థికాభివృద్ధికి ఇంకొకటి లేదు. మంత్రి గారి ప్రభుత్వ ప్రకటనంతా ఎట్లా వుందంటే, ఏడు సంవత్సరాల కాలంలో 63 శాతం విద్యుత్ వినియోగం పెరిగింది. 45 శాతం వినియోగదారులు పెరిగారని అటువైపు చూపిస్తూ నొక్కి మరీ చెప్పారు. అధ్యక్షా, 9 శాతం ఆర్థికాభివృద్ధి దేశంలో జరుగుతుంటే మన రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని మనం అనుకుంటుంటే. ఏడేళ్లలో 63శాతం వినియోగం పెరుగుదలని మీరు ఊహించలేదా? నిజానికి ఏడేళ్లలో వంద శాతం పెరగాలి. అలాంటిది ఆర్థికాభివృద్ధి శరవేగంగా జరుగుతున్న కాలంలో, 63 శాతం మాకు వినియోగం పెరిగింది కాబట్టి, మేము చేతులెత్తేస్తున్నాం అంటున్నారంటే, ప్రభుత్వానికి ఏరకమైన ముందుచూపు గానీ, ఆలోచనగాని, ఆర్థికాభివృద్ధి పట్ల దృష్టిగానీ కనిపించడం లేదు.

అధ్యక్షా, ఇదేదీ ప్రజలు అడుక్కోవడం లేదు. అయ్యా మాకేదన్నా ఇవ్వండని అడగడం లేదు. వినియోగదారుల్లో వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు 26 లక్షల మంది మినహాయిస్తే ప్రతి ఒక్కళ్లకీ మీటర్లున్నాయి. ప్రతి ఒక్కళ్లకీ బిల్లులు వేస్తున్నారు. ప్రతి ఒక్కళ్ల దగ్గర ముక్కు పిండి చార్జీలు వసూలు చేస్తున్నారు. సకాలంలో డబ్బులు చెల్లించకపోతే, మీటర్లు కట్‌చేసి విద్యుత్ లేకుండా చేస్తున్నారు. మనం 2011వ సంవత్సరంలో వున్నాం. ప్రభుత్వం వారి లెక్కల ప్రకారమే.. జాగ్రత్తగా చూశాను. ఇవాళ 15 వేల కోట్ల రూపాయల పైచిలుకు విద్యుత్ రంగంలో వినియోగదారుల నుంచి అంటే వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నా కూడా, దాన్ని ప్రక్కన పెట్టినా కూడా 15 వేల కోట్ల రూపాయల పై చిలుకు వినియోగదారుల నుండి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. వ్యవసాయం కోసం ప్రభుత్వ ఖజానా నుండి దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలు సబ్సిడీగా ఇస్తున్నారు. అంటే 19 వేల కోట్ల రూపాయలు చెల్లిస్తున్నాము. అధ్యక్షా, 2011వ సంవత్సరంలో – బాబ్బాబు... మాకు విద్యుత్ ఇవ్వండి, మేము డబ్బులు కడతామని అడుక్కునే పరిస్థితికి వచ్చిందంటే ప్రతి ఏడాది... ఇవాళ మంత్రిగారు ఏం చెబుతున్నారు? పదజాలం విషయంలో కూడా euphemisms ఎంత బాగా వాడారో చూడండి. 'They are availing the

facility of power cut' పవర్ కట్ అవకుండా మేము load shedding చేస్తున్నామన్నారు. ఎక్కడన్నారు? ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాల్లోనూ, మండల కేంద్రాల్లోనూ పగటి పూట కూడా లోడ్ షెడ్డింగ్ చేస్తున్నామని చాలా గొప్ప విషయంగా, ఘనకార్యంగా చెబుతున్నారు అధ్యక్షా. డబ్బులు చెల్లించి మాకు విద్యుత్తు కావాలి. మా పిల్లలు చదువుకోవడానికి, మా పరిశ్రమలను నడుపుకోవడానికి, మేము టీవీ చూడటానికి, ఫ్యాన్లు తిరగడానికి, వేసవి కాలంలో హాయిగా నిద్రపోవడానికి డబ్బులు చెల్లించి మేము, విద్యుత్తు కొనుక్కుంటామంటే, ప్రస్తుత సంవత్సరంలో కూడా, వర్షాలు బాగా కురిసి, రిజర్వాయర్లన్నీ పూర్తిగా నిండి ఉండి, మనం ఇంకా మార్చి మాసములోనే ఉ న్నాము. ఇంకా వేసవి కాలం కూడా ప్రారంభం కాలేదు. మాములు సంవత్సరాల కంటే ఈ సంవత్సరం చలి కూడా ఎక్కువగా ఉన్నది. పుష్కలంగా నీళ్ళొచ్చి నీళ్లెక్కువైపోయి పంటలు కుళ్లిపోయాయి అనుకుంటున్న ఈ సంవత్సరంలో కూడా మాకు బ్రహ్మాండంగా వినియోగం పెరిగింది కాబట్టి మేము విద్యుత్తును ఇవ్వలేకపోయాం అంటున్నారు. ఇది నిజంగా ఆర్థికాభివృద్ధిని సాధించే పద్ధతేనా అధ్యక్షా? ఈ ప్రశ్నను సూటిగా అడగాలి. ఏదో ఈ రోజు ఒక load shedding అయ్యింది. ఒక వంద మెగావాట్లు నష్టపోయింది. ఈ పూట కలిసొచ్చింది. అవన్నీ మాకు అనవసరం. మీరు ఏమి తంటాలు పడతారో మాకు అనవసరం. 2011న సంవత్సరంలో మేము డబ్బులిచ్చి విద్యుత్ కొంటామని అంటే ఆ విద్యుత్తును ఇవ్వలేకపోతున్నారంటే అటువంటి ప్రభుత్వానికి మనుగడసాగించే అర్హత ఉన్నదా? అని అడుగుతున్నాను.

అధ్యక్షా, విద్యుత్తు సరఫరాలో కూడా క్వాలిటీ అధ్వాన్నంగా ఉంటుంది. సరఫరా ఉండటం లేదు అది వేరే విషయం హైదరాబాద్ నగరం నడిబొడ్డులో కూడా, నా నియోజకవర్గమైన కూకట్‌పల్లిలో ఇబ్బడిముబ్బడిగా విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. ఇప్పటికి కూడా 220 కిలోవాట్ల సబ్ స్టేషన్‌ను అక్కడ ఏర్పాటు చేయాలని చాలా కాలం నుంచి ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, ఈ నాటికి కూడా కనీసం ప్రారంభం కాలేదు. అంటే ఉన్న విద్యుత్తును ఎలా పంపిణీ చేయాలి? నష్టాన్ని ఎలా నివారించాలి? క్వాలిటీని ఎలా పెంచాలి? అనే విషయంలో ప్రభుత్వానికి కనీసమైన అవగాహనగానీ, శ్రద్ధగానీ లేదని స్పష్టంగా అర్థమవుతుంది.

విద్యుత్తు వాడకం ఇంకా పెరగబోతుంది. ఎందుకంటే మంత్రిగారు వారి ప్రకటనలో మన రాష్ట్రం ఎంత అధ్వాన్నంగా ఉందో చెప్పలేదు. ఇప్పటికీ కూడా మన రాష్ట్రంలో సగటు విద్యుత్తు వినియోగం ఒక సంవత్సరానికి కేవలం 900 యూనిట్లు. రోజుకి

కేవలం రెండున్నర యూనిట్లను మాత్రమే వినియోగిస్తున్నాము. ఇంకా వెయ్యి యూనిట్లు కూడా దాటలేదు. ప్రపంచంలో ఉన్న నిరుపేద దేశాలలో కూడా సంవత్సరానికి రెండు వేలు, మూడు వేల యూనిట్లు వినియోగం ఉంది. 900 యూనిట్లు వినియోగం ఉంటేనే మనం ఈ స్థాయిలో చేతులెత్తేస్తుంటే, రేపు మధ్యస్థాయి దేశంగా ఈ దేశం ఎదిగితే, ఆర్థికాభివృద్ధిని ఈ ప్రభుత్వం దారుణంగా చేసినా, పూర్తిగా విఫలమైనా, అవినీతి భయంకరంగా ఉన్నా, ప్రజల ప్రయత్నం వల్ల ఆర్థికాభివృద్ధి పెరిగితే, రేపొద్దున కనీసం 15 వందలు, 2 వేల యూనిట్లకు వినియోగం పెరగాలని కోరుకుంటున్నాం. ఆ విధంగా పెరిగితే, ఇక ప్రభుత్వం ఇంట్లో పడుకోవడమే జరుగుతుంది.

ఈ నేపథ్యంలో నేను నిర్దిష్టమైన కొన్ని క్లారిఫికేషన్లను అడుగుతున్నాను. మొట్టమొదటిది, ఎపీ జన్‌కో నుంచి పవర్ పర్చేజ్ అగ్రిమెంటు చేసిన ప్రైవేటు ప్రాజెక్టుల నుంచి, మర్చెంట్ పవర్ ప్లాంట్ల నుంచి విడివిడిగా సగటున పర్చేజ్ కాస్ట్ ఎంత ఉంటున్నది? ఉదాహరణకి మార్చి మాసంలో 250 మిలియన్ యూనిట్లు దాటి రోజువారీ వినియోగం పెరిగిపోయింది. మేము చాలా కష్టాల్లో ఉన్నామన్నారు. మంచిది, అయితే మీరు సగటున ఎంతకు కొంటున్నారో స్పష్టంగా ఈ సభ ముందు పెడతారా? ఇప్పుడు చెబుతారా? పెడతారా అంటే రేపొద్దున పెడతానంటారు. వచ్చేనెల అంటారు. ఎవరికీ అర్థం కాదు. ఇప్పుడు చెప్పాలి. నిర్దిష్టంగా ఏ.పీ జన్‌కో ప్లాంటుకు పవర్ పర్చేజ్ అగ్రిమెంటు చేసి ప్రైవేటు ప్రాజెక్టుల నుంచి మూడవది మార్చెట్ పవర్ ప్లాంట నుంచి కొంటున్నామంటున్నారు. కాబట్టి ఆ మూడింటికీ విడివిడిగా average cost for the month of march మార్చిది ఉంటే మార్చిది, ఫిబ్రవరిది ఉంటే ఫిబ్రవరిది ఇవ్వండి.

రెండవది, ఈ మూడు రంగాలలో ఉన్న ప్లాంట్లకు జెన్‌కో గానీ, ప్రైవేటు ప్లాంట్లుగానీ, మర్చెంట్ పవర్ ప్లాంట్లుగానీ, ప్లాంటు వారీగా మొత్తంగా ప్లాంటు లోడ్ ఫ్యాక్టర్లను ఇవ్వండి. మూడు రంగాలకు సంబంధించి విడివిడిగా ఇవ్వండి, కలిపి ఇవ్వకండి. ఎందుకంటే ఇరవై ముప్పయి ఏళ్ల క్రితం కూడా పిఎల్ఎఫ్ ఈ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నది. జలగం వెంగళరావు గారి కాలం నుంచి నార్ల తాతారావు గారి పుణ్యమా అని చెప్పి అప్పటి నుంచి 90 శాతం. 97 శాతం పిఎల్ఎఫ్‌లో ఒక్క థర్మల్ పవర్ స్టేషన్‌లో భారతదేశంలో తప్ప ప్రపంచంలో ఇంకెవరూ చూడలేదు. కాబట్టి, స్పష్టంగా ఇక్కడ ఉన్న కెపాసిటీని మనం ఉపయోగిస్తున్నామా? అన్నది అబ్జర్వ్ చేసే హక్కు ఈ సభకు ఉన్నది.

మూడవది ఇందాక పెద్దలు డి.నరేంద్ర కుమార్ గారు మెన్షన్ చేశారు. సెంట్రల్ పవర్ గ్రిడ్ నుంచి మన రాష్ట్రానికి అతి పెద్ద వాటా ఎప్పుడు వస్తోంది? నిర్దిష్టంగా మాసం వారీగా ఎంత షేరు వస్తోంది? అసలు సెంట్రల్ పవర్ గ్రిడ్‌లో ఎన్ని యూనిట్లు నెలవారీగా ఉత్పత్తి అవుతున్నాయి? దానిలో ఆంధ్రప్రదేశ్ వాటాగా ఎంత వస్తున్నది? నిర్దిష్టంగా సభ ముందు పెట్టండి. మిగిలిన నాలుగు రాష్ట్రాల వాటాలను కూడా తెలియజేయండి.

నాలుగవది ఇంత చేసినా ఇప్పటికీ కూడా ఈ రాష్ట్రంలో మర్చెంట్ పవర్ ప్లాంట్ల కోసం అదే పనిగా వెంపర్లాట జరుగుతున్నది. ఇప్పటికీ కూడా ప్రభుత్వం దానిని ప్రోత్సహిస్తోంది. రేప్పొద్దున మీకు విద్యుత్తు కొరత ఉన్నప్పుడు కొనాలంటే వాళ్లు ఎంత చెబితే అంతకు రూ॥11, రూ॥12 అయినా కొనాల్సిందే. మన రైతులకు భూములు పోతాయి. మనకు పొల్యూషన్ మిగులుతుంది. మనకు ఉద్యోగాలు రావు. ఇతర రాష్ట్రాలో ఉద్యోగాలను ఎగుమతి చేయడం కోసం మన రాష్ట్రంలో అన్ని రకాలుగా నష్టపోయి చివరకు విద్యుత్తును కొనాల్సి వస్తే రూ॥11, రూ॥12 వెచ్చించి కొనుక్కొని, మన ఖజానాను లూటీ చేయడమేనా మన ఉద్దేశం. మర్చెంట్ పవర్ ప్లాంట్స్ విషయంలో ఇప్పటికైనా మేము ఆపేస్తున్నామనే విధానాన్ని మీరు చేపడతారా లేదా?

అయిదవది, 2017 మార్చి నాటికి 18వేల మెగావాట్లు ఉత్పత్తి కొత్తగా వస్తుందని చెబుతున్నారు. కేవలం కెపాసిటీ కాకుండా. ప్లాంటు వారీగా (లేరియబుల్ కాస్ట్ ఫ్యూయల్ కాస్ట్ ఈ రోజు మనం చెప్పలేము దానిని ప్రక్కన పెడదాం.) ఫిక్స్‌డ్ కాస్ట్‌ను మీరు నిర్ధారించారా? నిర్ధారిస్తే ప్లాంట్ వారీగా ఫిక్స్‌డ్ కాస్ట్ పర్ యూనిట్ ఎంత పడబోతున్నది? ఏ రూపేణా నిర్ధారణ చేశారు?

ఆరవదిగతంలో సింహాద్రి పవర్ ప్రాజెక్టు నుండి ఏ రేటుకైతే మనం కొంటున్నామో అదే రేటుకి హిందుజా నుంచి కొంటామన్నారు. ఇటీవలి కాలంలో వస్తున్న వార్తలు, సభలో చేస్తున్న స్టేట్‌మెంట్లు కూడా తికమకగా ఉన్నాయి. స్పష్టంగా నిర్దిష్టంగా ఎన్‌టీపీసి నుంచి సింహాద్రి పవర్ ప్రాజెక్టు నుంచి ఏ రేటుకి కొంటున్నారో అంతకు మించి ఒక్క పైసా కూడా ఎక్కువ పెట్టి మేము కొనము. ఖచ్చితంగా రాష్ట్ర అవసరాల మేరకు, ఆ రేటుకు రాష్ట్రానికి సరఫరా చేసేటట్లయితే ఆ ప్రాజెక్టుని రానిస్తాము అన్న ప్రకటన ఈ సభ నుంచి మంత్రిగారి ద్వారా వస్తుందా రాదా?

ఏడవది, ఇప్పటికీ 24 గంటల విద్యుత్తు పట్టణ ప్రాంతాలలోని పారిశ్రామిక

అవసరాలకు కూడా అందడం లేదంటే, నిజంగా సభలో – ప్రభుత్వం శాసనసభ్యులుగా మనమంతా సిగ్గుపడాలి. ప్రపంచంలో బాగా వేగంగా ఎదుగుతున్న ఏ దేశంలో కూడా 24 గంటలు విద్యుత్తు లేకుండా లేదు. మన దేశంలోని గుజరాత్ రాష్ట్రంలో అగ్రికల్చర్ ఫీడర్స్‌ని మిగిలిన ఫీడర్స్ నుంచి వేరు చేసిన తరువాత ప్రతి గ్రామానికి ఢంకా భజాయించి గుండె మీద చెయ్యి వేసుకొని 24 గంటలు విద్యుత్ ఇస్తున్నామని చెప్పుకోగలుగుతున్నారు. లోక్‌సత్తా ఒక ఉద్యమంగా ఎన్నో సంవత్సరాల క్రితం పశ్చిమ గోదావరి జిల్లా కళ్ల చెరువులో 24 గంటల విద్యుత్తును ఎట్లా ఇవ్వాలో మేము చేసి చూపించాము. ఒక ఫీడర్ లైన్ తీసుకొని, అక్కడ ఏ రకంగా ఓల్టేజ్ ఫ్లక్చుయేషన్స్ లేకుండా, రైతులకు అసౌకర్యం లేకుండా, నూటికి నూరు పాళ్లు వ్యవసాయేతర పనులకు గ్రామీణ ప్రాంతాలలో 24 గంటల విద్యుత్తు ఇవ్వడం మేము చేసి చూపించాం.

ఈ సభలో వేరే సందర్భంలో అడిగితే, ఇప్పటికైనా గుజరాత్‌లో చేసిన రీతిగా మీరు franchising పెట్టుకొని డీసెంట్రలైజేషన్ ద్వారా డిస్ట్రిబ్యూషన్ పెట్టుకొని విధిగా అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్లను వేరు చేసి, గ్రామీణ ప్రాంతాలలో 24 గంటల విద్యుత్తును ఇస్తారా? దానికి స్పష్టమైన పథకం ఉన్నదా? అది చేస్తారా అంటే నీళ్లు నములుతున్నారు తప్ప, నిర్దిష్టంగా ఫలానా కాలానికి ఇంత పెట్టుబడి పెట్టి ఇన్ని సంవత్సరాలలోపు, ఈ సభలో ఈ విధమైన చర్చ లేకుండా, 24 గంటలు ప్రతి గ్రామానికి విద్యుత్తునిస్తామని చెప్పే పరిస్థితి లేదు. సిగ్గుచేటు. ఇప్పుడు కూడా పట్టణాలకు, మండల కేంద్రాలకు కూడా load Shedding పగలు చేస్తున్నామని చెప్పే ప్రభుత్వం. రాత్రి ఎట్లాగు పవర్ రాదు. ఈ రోజు ఒక్క గ్రామమంటే ఒక్క గ్రామానికి కూడా ఆంధ్రప్రదేశ్‌లో 24 గంటల విద్యుత్ సరఫరా ఉందని చెప్పే పరిస్థితి లేదు. ఇప్పుడు సరే అయిదేళ్లకు ఇస్తాము, దానికి ఈ పథకం ఉంది. ఇంత ఖర్చు పెడుతున్నామని చెప్పమనండి. అది కూడా చెప్పలేకపోతే ఎందుకు ఉన్నదీ ప్రభుత్వం? విద్యుత్తును గ్రామాలకు పట్టణాలకు అందించలేకపోతే ప్రభుత్వం ఎందుకు? ప్రణాళికలు ఎందుకు? పన్నులెందుకు? ఈ బడ్జెటెందుకు?

నీరు గురించి ఈ రోజు చేసిన ప్రకటనలో చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్‌ను ఖాళీ చేసి మరీ క్రింద ప్రాంతాలకు అవసరం ఉన్నా లేకపోయినా సంక్షోభాన్ని గట్టెక్కించడానికి అర్జెంటుగా జలవిద్యుదుత్పత్తి చేశాము. ఆ తరువాత నాగార్జున సాగర్‌ని ఖాళీ చేస్తారు. సముద్రంలోకి పంపించేస్తారు. నీళ్లు ముఖ్యమా? విద్యుత్తు ముఖ్యమా? మనం మన అసమర్థత పూర్తిగా ప్రభుత్వానికి దూరదృష్టి లేకపోవడం వలన ఉన్న నీటిని

తగలబెట్టేసుకుని, రేప్పొద్దున నీళ్లు లేవని చేతులెత్తడం కంటే ప్రమాదం మరొకటి లేదు. ఇప్పటికే కృష్ణా వాటర్ డిస్‌ప్యూట్ ట్రైబ్యునల్‌లో వాళ్లు ఏమీ చెబుతున్నారు? మీరు 150 టిఎంపసీలను carry over గా ఉంచుకోండి. ఇక నుంచి వచ్చే సంవత్సరం వర్షాలు కురవకపోతే మీ కర్మ మీరు ఉంచుకోండని చెప్పారు. మనం ఏమంటున్నాం. మేము 75 శాతం మాకు గ్యారంటీ ఇచ్చిన తరువాత డిపెండబిలిటీ ఇచ్చిన తరువాత, దానిలో ఫస్ట్ ఛాయిస్‌గా పెట్టమని మనం కోరుతున్నాం. వాళ్లు నేటి వరకు అటువంటిదానిని నీరు, విద్యుత్ కోసం వదిలేస్తారంటే రేపు ఈ రాష్ట్రంలో నీరు, విద్యుత్ ఉండదు. ప్రభుత్వానికి జల విద్యుత్‌ని ఎప్పుడు తీసుకువస్తామనే విషయంలో స్పష్టమైన అవగాహన ఉందా? ఆపద్ధర్మంగా అప్పుడు ఇప్పుడని చెప్పడం కాదు. పరిస్థితుల దృష్ట్యా రేపు చేతులు ఎత్తేదామనే విధంగా కాదు. నీరు అంతా ఇప్పుడే వినియోగం చేసి రేపు విద్యుత్, నీరు లేకుండా చేస్తారా?

చివరి విషయం, భవిష్యత్తులో మరింత సంక్షోభంలో జల విద్యుత్‌ని తీసుకురావడం కాదు. కృష్ణా జల వివాద ట్రిబ్యునల్‌లో వారు ఇచ్చిన తీర్పులో మార్పులు చేస్తారని అనుకొన్నా ఈ రాష్ట్రం తట్టుకోవాలంటే, నాగార్జునసాగర్ దిగువకి నీరు ఒక చుక్క కూడా వెళ్లే అవసరం లేకుండా చేసి కృష్ణా డెల్టా అవసరాలను కేవలం నాగార్జునసాగర్ దిగువ ఉన్న ప్రాజెక్టుల ద్వారా లేదంటే, గోదావరి నుంచి వాటిని మళ్లీ కృష్ణా డెల్టాకి వినియోగించేలా చేయాలి. దాని వల్ల ఎగువ ఉన్న తెలంగాణా, రాయలసీమ, నాగార్జునసాగర్, శ్రీశైలం నీటిని పూర్తిగా వినియోగించే అవకాశం ఏర్పడుతుంది.

రాష్ట్రంలో జలవనరులున్నాయి. 1670 మెగావాట్ల జల విద్యుత్ నాగార్జునసాగర్‌లో ఉత్పత్తి ఉంది. ప్రభుత్వానికి ఏ మాత్రం ఇంగితజ్ఞానం, ముందు చూపు, దూరదృష్టి ఉన్నా, 1670 మెగావాట్లు భవిష్యత్తులో ఉండదని అనుకోవాలా? అంతేగానీ అది ఇరిగేషన్, ఇది పవర్ అని లెక్కలు వేసుకోవాలంటే కాదు. 1670 మెగావాట్లు సమీప భవిష్యత్తులో మాకు అందదు. నాగార్జునసాగర్ నుండి నీరు క్రిందకు రాకుండా మేనేజ్ చేస్తున్నాము. గోదావరి నుండి కృష్ణా బేసిన్‌కి నీరందించాక జల విద్యుత్ పైన నుండి రాదని లెక్క వేసుకొన్నా, అవసరాలనుబట్టి ఇప్పటికయినా తెస్తారా? ఈ పనులు రేపు చేస్తామని అనడం కాదు. 30 సంవత్సరాల నుండి చూస్తున్నాము. కాబట్టి భవిష్యత్తులో చేయడం కోసం నిర్దిష్టమైన ప్రమాణాలు చేయాలి. మంత్రిగారు మాట ఇవ్వాలి. ఆ విధంగా మాట ఇస్తారని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, నేను సమయం ఎక్కువ తీసుకోను. ముందుగా కొరత ఉన్నప్పుడు ఖచ్చితంగా యంత్రాంగం రోజువారీ రాత్రింబగళ్లు పనిచేస్తున్నారని నాకు తెలుసు. లేకపోతే ఇంత కొరత ఉన్నప్పుడు, ఇన్ని ఒత్తిళ్లు ఉన్నప్పుడు దీన్ని తట్టుకోవడం కష్టం. అందుచేత ఇవాళ, రేపు ఏమీ చేస్తారు అనే విషయంలోకి నేను వెళ్లను. ఏదో తంటాలు పడుతున్నాం. గంతకు తగ్గ బొంత. గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా సభలో ఉన్నారు కాబట్టి నేను కొన్ని నిర్దిష్టమైన అంశాలు తెలియచేస్తాను. దయచేసి ఒకసారి ఆలోచించండి. ఈ క్షణాన సమాధానం నేను ఎక్స్‌పెక్ట్ చేయడం లేదు.

మొట్టమొదటిది 30 వేల నుంచి 40 వేల మెగావాట్ల మర్చంట్ పవర్ ప్లాంట్స్ 2003 చట్టాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రంలోకి వస్తున్నాయి. ప్రతిసారీ మనం దాని గురించి మాట్లాడుకుంటున్నాం. అధ్యక్షా, ఖచ్చితంగా మన రాష్ట్ర అవసరాలు ఎంత మేరకున్నాయి? మర్చంట్ పవర్ ప్లాంట్స్ 2003 చట్టం ప్రకారం రావాలంటే వాళ్లను ఏదో రకంగా ఇరుకున పెట్టడానికి మనకు మార్గాలున్నాయి. ప్రభుత్వం మన చేతుల్లో ఉంది. పొల్యూషన్ కంట్రోల్ దగ్గర నుంచి పవర్ ట్రాన్స్‌మిషన్ వీలింగ్ అగ్రిమెంట్ దాకా మన చేతుల్లో ఉంది. వాళ్లు ఆకాశం నుంచి తీసుకోవడం లేదు. కాబట్టి విధిగా first right of refusal ఇచ్చి ఈ రాష్ట్రానికి అవసరమైతే మనం ముందుగానే నిర్ధేశించిన రేటుకు కొనుక్కునే ఏర్పాటు చేసి ఆ తరువాతనే అమ్ముకునేట్లు చేయటం ఒకటి. రాష్ట్రంలో పొల్యూషన్ లేకుండా ఉండే రీతిని మినిమమ్ పొల్యూషన్ ఉండే రీతిలో 30,40 వేల మెగావాట్ల నుంచి చాలా గణనీయంగా తగ్గించడం రెండవది. అధ్యక్షా, ఈ రెండూ ఖచ్చితంగా మన అధికార్లు, మన ప్రభుత్వం చేతుల్లో ఉన్నాయి. మనం అంత నిరాశ పడనక్కర్లేదు. దయచేసి దాన్ని లోతుగా పరిశీలించండి. ప్రతిసారీ మనం ఫైరింగుల దాకా వెళ్లడం, పొల్యూషన్ పొందడం, విద్యుత్తును మాత్రం ఎక్కువ రేటుతో కొనడం ఈ పద్ధతి సరైనది కాదు.

రెండవ విషయం మంత్రిగారి సమాధానంలో తమిళనాడుకు 31 శాతం సెంట్రల్ సదరన్ గ్రిడ్ నుంచి వెళుతుంటే మనకు 24 శాతం మాత్రమే వస్తున్నది. తమిళనాడు కంటే మనది పెద్ద రాష్ట్రం. పారిశ్రామికంగా వాళ్లు ముందున్న మాట వాస్తవమే. కానీ నాకు గుర్తున్నంత వరకూ...అది కరెక్ట్ కూడా కాకపోవచ్చు. 29 లేదా 30 శాతం మనకు వచ్చేది. అంటే మనకు వచ్చే శాతం తగ్గినట్లు కనబడుతున్నది. దయచేసి పునఃపరిశీలించి మన రాష్ట్రానికి వాటా పెంచే ఏర్పాటు చేయాలి. అది వెంటనే

జరగదని నాకు తెలుసు కానీ కనీసం కొత్తగా వచ్చిన జనరేషన్ కెపాసిటీలో మనకు వచ్చినట్లయితే ఆ మేరకు మన జనాభా దామాషా వచ్చేట్లుగా గట్టిగా పోరాటం చేస్తే మనకు న్యాయం జరుగుతుంది. మూడవ విషయం హిందూజాకు సంబంధించి ఇప్పటికి కూడా మంత్రి గారు స్పష్టంగా చెప్పడం లేదు. 25 శాతం ఆఫర్ ఇస్తామంటున్నారు మేము ప్రయత్నం చేస్తున్నాం, ఆపుతున్నాం కుదరలేదని చెబుతున్నారు. ఇందులో రెండు అంశాలున్నాయి. ఒకటి షేర్, ఎంత ప్రభుత్వానికి కొనుగోలు ఒప్పందం ద్వారా వస్తుంది? రెండు ఏ రేటుకు వస్తుంది? నాకు నిర్దిష్టమైన హామీ ఈ సభ నుంచి కావాలి, ఈ సభకు కావాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖపట్టణంలో కేంద్ర ప్రభుత్వంలో ఉన్నటువంటి NTPC ఏర్పాటు చేసినటువంటి సింహాద్రి పవర్ ప్రాజెక్టు ఫిక్సడ్ కాస్ట్ కంటే ఎక్కువ లేకుండా ప్రతి యూనిట్‌కు పొందుతామా? 25 శాతమా, 30 శాతమా లేదా 70 శాతమా ఆ హామీ రాకపోతే ఇది ఖచ్చితంగా అసంపూర్ణమైన అంశమే. లేకపోతే కొన్ని వేల కోట్ల రూపాయలు నష్టపోతాం.

నాలుగవ విషయం మంత్రి గారు మొన్న అడిగారు, మరలా అడిగారన్నారు. అధ్యక్షా ఇంకో వంద సార్లయినా అడుగుతాను. 24 గంటలు విద్యుత్తును పొందే హక్కు ఈ రాష్ట్ర ప్రజలకు ఉండాలి. ఒక్కరోజులో మీరు అది చేయలేరు. ఒక్క రాత్రిలో వచ్చేది కాదు. ముఖ్యమంత్రి గారి నుంచి స్పష్టమైన పథకం కావాలి. అధికార యంత్రాంగం మీద ఒత్తిడి కావాలి. దానికి వనరుల కేటాయింపు కావాలి. ఇదేమీ ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడం లేదు. మీరు పెట్టే వెయ్యి కోట్ల పెట్టుబడికి రెండు వేల కోట్ల రూపాయల లాభం వస్తుంది. విద్యుత్తును 24 గంటలు సప్లై చేసే శక్తి మీకు ఉంటే విద్యుత్తుకు వచ్చే రెవెన్యూ ఆదాయం కావచ్చు, పారిశ్రామికీకరణ వల్ల వచ్చే ఆదాయం కావచ్చు. ఉపాధి పెరగడం వల్ల వచ్చే ఆదాయం కావచ్చు. రాజకీయ లబ్ధి కావచ్చు. అవన్నీ మనకు లాభమే. కాబట్టి దీన్ని ఏదో చేస్తున్నాం, చూస్తున్నాం. ఒక పైలట్ ప్రాజెక్టు పెట్టాం, తరువాత ఆలోచిస్తాం, తాత్కాలికంగా ప్రతిపక్ష నాయకులు ఈపూట ఏదో అన్నారని ఈ పూట చూస్తాం.... అధ్యక్షా, ప్రతీ పూటా పరగడుపే, ఈ పూటకు చాలా సమస్యలుంటాయి. ఈ పూట సమస్యలు రేపటికి ప్రతిబంధకాలైతే ఖచ్చితంగా తప్పే. అది ఈ మాట ఎవరో ఒకరు చెప్పాల్సిన అవసరం ఉంది. దానికి మంత్రి గారు నొచ్చుకోవలసిన అవసరం లేదు. మాకు తెలుసు, విద్యుత్ అవసరాలన్నీ మాకు తెలియదా అంటున్నారు. అధ్యక్షా, తెలిస్తే వెయ్యి యూనిట్ల లోపల మనకు విద్యుత్ పారిశ్రామిక రంగంలో వేలాది మెగావాట్ల సొంత జనరేషన్ కెపాసిటీ

ఉండదు. ఇవేళ రాష్ట్రంలో పరిశ్రమలు పెడితే కిరణ్ కుమార్ రెడ్డి గార్ని అడగండి. వారికి పారిశ్రామిక రంగం పూర్తిగా తెలుసు. ఎవరన్నా ఒక్కళ్లు పరిశ్రమ పెట్టాలంటే గవర్నమెంటు మీద ఆధారపడకుండా సొంతంగా పెట్టిన దమ్ములున్నాయా? అధ్యక్షా, పరిశ్రమలను పెట్టలేకపోతే ఎట్లా? డబ్బులిచ్చేది వాళ్లు, సంపద సృష్టించేది వాళ్లు ఉపాధిని కల్పించేది వాళ్లు, ఆదాయాన్ని కల్పించేది వాళ్లు కాబట్టి ఖచ్చితంగా పారిశ్రామిక రంగంలో ఇవేళ రాష్ట్రంలో ఎంత జరేషన్ కెపాసిటీ సొంతంగా వాళ్లు పెట్టుకోవలసి వచ్చింది, ఆ వివరాలు దయచేసి సభముందు పెట్టాలని కోరుతున్నాను.

మెట్రోపాలిటన్ వాటర్ సప్లై బోర్డు అధ్వాన్న స్థితిలో ఉంది. దయచేసి ఎలక్ట్రిసిటీ బోర్డుల దగ్గర, డిస్కమ్‌ల దగ్గర ఉన్న బిల్లింగ్ డేటా వాటర్ సప్లై బోర్డుకిచ్చి... ఎందుకంటే వాటర్ సప్లై ఉంటే వాళ్లకు విద్యుత్తు సప్లై కూడా ఉంటుంది. విద్యుత్ సప్లై విషయంలో వారిని మెచ్చుకోవాలి. అక్కడక్కడ కొన్ని పొరపాట్లు జరుగుతున్నా వాటర్ సప్లైతో పోలిస్తే మీటరింగ్, బిల్లంగ్ ప్రాపర్‌గా ఉంది. వాటర్ సప్లై బోర్డు అధ్వాన్నంగా ఉంది. ఈ రెండూ reconcile చేయవలసిందిగా కోరుతున్నాను. ముఖ్యమంత్రి గారు వాటర్ సప్లై బోర్డుకు అధ్యక్షులు కూడా కాబట్టి ప్రత్యేకంగా ఆ పని చేపట్టవలసిందిగా కోరతున్నాను. చివరగా మా సొంత నియోజక వర్గానికి చెందినది. 220 కిలోవాట్ల సబ్‌స్టేషన్‌కు సంబంధించి సంవత్సరమున్నర నుంచి నేను శతధా పోరుతున్నాను. ఇంతవరకూ దాని పని ప్రారంభం కాలేదు. అక్కడ కోట్లాది రూపాయల రెవెన్యూ వస్తోంది. అధ్యక్షా, మీ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి తెలియచేస్తున్నాను, అక్కడెవరన్నా బిల్లులు కట్టకపోతే విద్యుత్ అధికారులతో మీరు విద్యుత్తును కట్ చేసేయండి, తప్పు చేస్తే శిక్షించండి అని నేనే చెబుతున్నాను. ఇల్లీగల్ కనెక్షన్లుంటే జైలుకు పంపించండి అని నేను చెబుతున్నాను. కానీ విద్యుత్తుకు మేము డబ్బులు కడుతున్నప్పుడు మాకెందుకు 220 కిలోవాట్ల సబ్‌స్టేషన్ ఇవ్వడంలేదు? ఎందుకని శాంక్షన్ ఉంది. ప్లాన్‌లో ఉందని చెబుతున్నారు. వెంటనే అది ప్రారంభం కావాలి. ఆరు నెలల్లో పని పూర్తి కావాలి. ఆ హామీ నిర్దిష్టంగా మంత్రిగారిని ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

**(18-03-2011 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# పాఠశాలలను పునర్వ్యవస్థీకరించండి

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ఈ రాష్ట్రంలో పాఠశాల విద్య ప్రాథమిక విద్యకు సంబంధించి ఒక కీలకమైన అంశాన్ని మీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తేదల్చుకున్నాను. రాష్ట్రం మొత్తంలో 56,963 ప్రాథమిక పాఠశాలలున్నాయి. 1,11,000 మంది అధ్యాపకులున్నారు. విద్యార్థుల సంఖ్య సుమారుగా 28 లక్షలున్నది. అంటే ఒక్కొక్క అధ్యాపకుడికి విద్యార్థుల నిష్పత్తి 1:25 అంటే చూడటానికి చాలా బాగున్నది.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, రాష్ట్రం మొత్తంలో 56, 963 ప్రాథమిక పాఠశాలలు ఐదవ తరగతి లోపల వున్నాయి. 1,11,000 మంది అధ్యాపకులున్నారు. విద్యార్థుల సంఖ్య సుమారుగా ఇరవైఎనిమిది లక్షలుంది. అంటే, ఒక్కొక్క తరగతికి లేదా ఒక్కొక్క అధ్యాపకుడికి విద్యార్థుల నిష్పత్తి 27 లేదా 28 వుంది. చూడడానికి బాగుంది. కానీ లోతుకు వెళ్లితే అందులో చాలా విచిత్రాలున్నాయి. రాష్ట్రంలో 3,200 పాఠశాలల్లో పది మంది కంటే తక్కువ మంది పిల్లలున్నారు. 1,562 పాఠశాలల్లో ఐదుగురి కంటే తక్కువ మంది పిల్లలు రాష్ట్రంలోని ఆయా పాఠశాలల్లో వున్నారు. వీటిల్లో ఇరవై పాఠశాలల్లో ఐదుగురుగానీ, ఐదుగురి కంటే ఎక్కువగానీ ఆధ్యాపకులున్నారు.

అధ్యక్షా, రాష్ట్రంలోని మంత్రివర్గం చాలా జాగ్రత్తగా దీన్ని పరిశీలించాలి. రాష్ట్రంలోని 3,200 పాఠశాలల్లో పది మంది కంటే తక్కువగా పిల్లలుంటే, 1562 పాఠశాలల్లో ఐదుగురి కంటే తక్కువ మంది పిల్లలుంటే. ఇరవై పాఠశాలల్లో ఐదుగురి కంటే ఎక్కువ మంది అధ్యాపకులున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది చాలా విచిత్రం. అదే సమయంలో రాష్ట్రంలో 5,744 పాఠశాలల్లో ఒక అధ్యాపకుడు కూడా లేడు. మొత్తం రాష్ట్రంలోని 56,900 పాఠశాలల్లో కేవలం 9,250 పాఠశాలల్లో మాత్రమే వంద మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులున్నట్లు నమోదైంది. ఎంత మంది విద్యార్థులు పాఠశాలలకు వస్తున్నారో దేవుడికి ఎరుక, అసలు నమోదైంది వంద మంది కంటే ఎక్కువ అన్నది 9,251. ఇంతకంటే విచిత్రం దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఎక్కడా మనం చూడలేదు.

ఈ పరిస్థితుల్లో 44,330 పాఠశాలల్లో ఇద్దరి కంటే తక్కువ మంది అధ్యాపకులుండగా, ఐదుగురు, పది మంది కంటే తక్కువ మంది విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలల్లో ఐదుగురి కంటే ఎక్కువ మంది అధ్యాపకులున్నారు. కాబట్టి ప్రభుత్వాన్ని నిర్దిష్టంగా మీ ద్వారా కోరేదేమిటంటే, రాష్ట్రంలోని ఇరవై వేల పాఠశాలలకు మొత్తాన్ని మీరు పునర్వ్యవస్థీకరించండి. ఒక్కొక్క పాఠశాలకు కనీసం మీరు వందమంది విద్యార్థులు చదువుకునేందుకు ఏర్పాట్లు చేయండి. వంద, రెండు వందల మీటర్ల దూరానికి ఒక స్కూలు అవసరం లేదు. ఒక విద్యాసంస్థ అంటే ఏ విధంగా వుండాలనే విషయానికొస్తే ఇటీవల నేను ఇతర దేశాల్లో పర్యటించి చూస్తే, ఒక ప్రాథమిక పాఠశాలను చూస్తే, మన కాలేజీల కంటే మంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అక్కడి స్కూళ్లల్లో వున్నది. సిగ్గుచేటు మనకు. కాబట్టి వంద కంటే తక్కువగాకుండా విద్యార్థులు వుండేట్లు చూడండి. ఒక్కొక్క పాఠశాలకు కనీసం ఐదుగురికి తక్కువగాకుండా మినిమమ్ అధ్యాపకులుండేట్టు చూడండి. ఎటువంటి పరిస్థితుల్లోనైనా అది సాధ్యమేనని నేను భావిస్తున్నాను. అది చేసి పాఠశాలలను పునర్వ్యవస్థీకరించాలి. ప్రైవేటు విద్యాసంస్థలకు ఇవాళ రాష్ట్రంలో లక్షల మంది పిల్లలు ప్రాథమిక విద్యనభ్యసించడానికి వెళుతున్నారు. నేను చిన్నప్పుడు ప్రభుత్వ విద్యా సంస్థలోనే చదువునభ్యసించాను. ఈ విద్యాసంస్థల పర్యవేక్షణ లేకుండా పోయింది. వేలాది పాఠశాలలు రాష్ట్రంలో కేవలం పేరుకే వున్నాయి గానీ అక్కడ విద్యార్థులు విద్యనభ్యసించడానికి కావలసిన వసతులు లేవన్నది నిజం. "రైట్ టు ఎద్యుకేషన్" అనేది అమలు జరగాలంటే, దయచేసి దీన్ని ఆషామాషీగా తీసుకోవద్దు, దీన్ని తీవ్రంగా తీసుకోండి, పాఠశాలలను పునర్వ్యవస్థీకరించండి. ఒక్క పైసా కూడా ఎక్కువగా ఖర్చు పెట్టనక్కర్లేదు. కేటాయించిన డబ్బును సద్వినియోగం చేయండి. రాష్ట్రంలోని ఇరవై వేల పాఠశాలల్లో ఒక్కొక్క పాఠశాలలో కనీసం ఐదారుగురు అధ్యాపకులు విద్యార్థులకు విద్యను బోధించడానికి వుండేట్టుగా తగిన ఏర్పాటు చేస్తారని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**(09-07-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# సర్వశిక్షా అభియాన్ నిధులు సద్వినియోగం చెయ్యాలి

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, ఇటీవలే 2009 విద్యాహక్కు చట్టం వచ్చింది. అందులోని 7వ సెక్షన్ ప్రకారం అందరికీ విద్యనందించటంలో రాష్ట్రాలది ప్రధాన బాధ్యత. అందుకోసం నిధులు రాష్ట్రాలే సమకూర్చాలి. కాని మన రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితిని నేను మీ ద్వారా ముఖ్యమంత్రి గారికి, విద్యాశాఖ మంత్రి గారికి తెలియజేయాల్సిన అవసరమున్నది. గత సంవత్సరం బడ్జెట్‌లో సర్వశిక్షా అభియాన్ కోసం అంటే ప్రాథమిక పాఠశాలలలో సదుపాయాల కల్పన కోసం ఏర్పాటు చేసిన డబ్బును రూ॥1100 కోట్లుగా చూపెడితే, ఖర్చయింది కేవలం రూ॥400 కోట్లు మాత్రమే. అంటే 2009 -10 సంవత్సరంలో మనం బడ్జెట్‌లో చూపించిన దానికన్నా 700 కోట్లను తక్కువగా చూపెడుతున్నాం. అతి కీలకమైన రంగంలో నిరుపేద విద్యార్థులు వెళ్లే పాఠశాలల సదుపాయాల కోసం కేవలం రూ॥400 కోట్లు మాత్రమే వెచ్చించి మిగతా రూ॥700 కోట్లు వినియోగించలేకపోయాం. రాష్ట్ర వాటా 40 శాతం విడుదల చేయకపోవటం వల్ల ఢిల్లీ నుంచి రావలసిన రూ॥700కోట్ల నిధులు ఆగిపోయాయి. అదే పరిస్థితి మళ్లీ కొనసాగితే ఈ సంవత్సరం రూ॥700 కోట్లకు మించి మనం ఖర్చు పెట్టలేం. ప్రస్తుత పరిస్థితే మళ్లీ కొనసాగితే ఈ సంవత్సరం సర్వశిక్షా అభియాన్ మాధ్యమిక విద్య క్రింద వచ్చే నిధులు ఎస్ఎస్ఎ నిధులు కలిపి రూ॥1100 కోట్లు మరియు గత సంవత్సరం కోల్పోయిన రూ॥700 కోట్లు కలిపి రూ॥1800 కోట్లు కోల్పోయే అవకాశమున్నది. కీలకమైన ఈ రంగంలో మనకు వేలాది కోట్ల రూపాయలు వచ్చే అవకాశమున్నా, ఈ రకంగా రాష్ట్రం నుంచి తన వాటా డబ్బును విడుదల చేయకపోవటం వల్ల... Pennywise-pound foolish. కొద్దిపాటి డబ్బు మనం విడుదల చేయకపోవటం చేత కేంద్రం నుంచి వచ్చే నిధుల్ని మనం కోల్పోతున్నాము. రాష్ట్రంలో బిడ్డలు నష్టపోతున్నారు. ఉన్న కొద్దిపాటి డబ్బును కూడా దుర్వినియోగం చేస్తున్నారు. ఉదాహరణకు స్కూల్ బిల్డింగులకు సంబంధించి ఒక్కొక్క తరగతి గదికి రూ॥నాలుగున్నర నుంచి రూ॥ఐదు లక్షలు చూపెడుతున్నారు. ఏ frills లేకుండా కేవలం కన్‌స్ట్రక్షన్ కాస్టే మనకు కావలసిందిక్కడ. ఈ స్కూళ్లలో గ్రానైట్ లేదా మార్బుల్

ఫ్లోరింగ్ లేవు. ఖరీదైన frills ఏమీ లేవు. ఒక్క చదరపుటడుగుకు వెయ్యి రూపాయల నుంచి రూ॥12 వందలు చూపెడుతున్నారు. అంటే రాష్ట్రంలో ప్రాథమిక విద్య మీద ఏ మాత్రం శ్రద్ధ కాని, సమీక్ష కానీ లేవు. విద్యాశాఖ మంత్రిని, ఈ ప్రభుత్వాన్ని, ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గారిని నేను కోరేదేమంటే దయచేసి రాష్ట్రం వాటా విడుదల చేసే ఏర్పాటు చేయండి. ఈ సంవత్సరమైనా ఈ రూ॥1800 కోట్లు వచ్చే అవకాశాన్ని వినియోగించుకోండి. ఉన్న డబ్బును కూడా దుర్వినియోగపరచకుండా సద్వినియోగం చేయమని కోరుతున్నాను.

**(12-07-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# సహకార రంగం బలంగా వుంటే మైక్రోఫైనాన్స్ సంస్థల బెడద వుండదు

అధ్యక్షా, ఈ గ్రామీణ లేక పట్టణ పేదల పరపతి వ్యవస్థలో ఈ సంక్షోభానికి వెనుక అంశాలున్నాయి. వాటిని పరిశీలించకుండా మంచి ఉద్దేశంతో ఈ బిల్లు వచ్చినా కూడా దీన్ని ఆమోదించి చేశామనుకుంటే అది చాలా పొరపాటవుతుంది. ఈ సభలోని కొంత మంది పెద్దలున్నారు, మంత్రులున్నారు, వారు బ్యాంకుకు డైరెక్టర్లుగా ఆనాడు ఉండగా, నేను అదే బ్యాంకుకు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నాను. ఈ కాలంలో పూర్తిగా గ్రామీణ పరపతి రంగాన్ని నేను అధ్యయనం చేశాను.

అధ్యక్షా, ఎక్కడైతే సహకార పరపతి రంగం చాలా బలంగా పనిచేస్తుందో, అక్కడ మీకు మైక్రోఫైనాన్స్ సంస్థల బెడద లేదు. ఇలా వున్నటువంటి కరీంనగర్ జిల్లాకు చెందిన హుజూరాబాద్ శాసన సభ్యులు, శ్రీ అలిగిరి ప్రవీణ్ రెడ్డి గారు ములకనూర్ సహకార బ్యాంక్‌కు అధ్యక్షులుగా కూడా వుండేవారు. వారి తండ్రిగారు నాకు చాలా ఆప్తులు. అలాగే ముఖ్యమంత్రి (కిరణ్‌కమార్ రెడ్డి) గారి తండ్రిగారు – అమరనాథరెడ్డిగారు వారు గతంలో సహకార శాఖామాత్యులుగా పనిచేశారు. అదేకాలంలో ప్రవీణ్‌రెడ్డి గారి తండ్రిగారు శ్రీ ఎ.కె. విశ్వనాథ్ రెడ్డి ముల్కనూర్ సంఘాన్ని స్థాపించారు. అత్యుత్తమ ప్రమాణాలతో నడుస్తున్నది. అక్కడ చూడండి. ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థల బెడద ఏ ఒక్క గ్రామంలో కూడా మీకు అక్కడ కనిపించదు. అదేవిధంగా గట్టిదుద్దినపల్లె వెళ్లండి. ఆచంట, ద్వారకా తిరుమలకు వెళ్లండి, లేదా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కూడా చాలా పటిష్టంగా ఈ సహకార పరపతి సంస్థలు లేదా పూర్తిగా మహిళల నుంచి వచ్చిన సంస్థలు. బయటి నుంచి వచ్చే డబ్బులపై ఆధారపడకుండా వాళ్లే కొంత డబ్బు దాచుకుని క్రమక్రమంగా ఆ సీడ్ మనీతో వాళ్లకు వాళ్లే ఇష్టమొచ్చినట్టు అప్పులిచ్చుకుని అవసరాన్ని బట్టి మళ్లీ తిరిగి తీసుకోవడమనేది ఒక అద్భుతమైన సాంప్రదాయంగా నడుస్తున్నది. బంగ్లా గ్రామీణ బ్యాంక్ ఈ రీతిన వచ్చిందే. కేవలం ఆ బృందాల వారి పొదుపు నుంచి వచ్చిన డబ్బు లేదా అంతర్జాతీయ సంస్థల నుంచి ఉచితంగానో, సబ్సిడీలుగానో, వడ్డీలు లేకుండా వచ్చిన డబ్బుతో వాళ్లు వ్యాపారం చేసి ఆపై ఋణాలందిస్తే, దీనిలో మనం లాభాపేక్షతో

"there is profit to be made out of poverty" అనే ఉద్దేశంతో "bottom of the pyramid" అనే కాన్సెప్ట్‌తో ఈ పేదరికం నుంచి డబ్బులొస్తాయనే ఒక భ్రమను తెలియక సృష్టించారు.

కానీ, ఇవాళ మహిళలు వంద రూపాయలు పెట్టి నెత్తిమీద తట్టలో కూరగాయలో, పళ్లో, కొనుక్కుంటుంటే ప్రొద్దున్నే పది రూపాయలు వడ్డీ ఇచ్చి, వంద రూపాయల అప్పుకు తొంబై రూపాయలు డబ్బు తీసుకుని సాయంత్రానికి వంద రూపాయలిచ్చే పరిస్థితి చాలా చోట్ల ఉంది. ఇది చూసి చాలా సంస్థలకు ఆశ పుట్టింది. ఆ విషయమై వీళ్లేమంటున్నారంటే, మేమిచ్చే డబ్బు మీద బోల్డెంత ఆదాయాన్ని తీస్తున్నారు. వందకు నలభై రూపాయల ఆదాయాన్ని తీస్తున్నారు. మా వడ్డీ ఎంత కేవలం ఇరవై ఐదు, ఇరవై ఆరు రూపాయలే కదా! పదిహేను రూపాయలు ఇంకా మిగులుతుందనేటటువంటి భ్రమలో ఇంకా వీళ్లంతా ఉన్నారు. ఆ మహిళ ఆ రోజంతా పడే కష్టాన్ని వీళ్ళంతా లెక్క చేయటం లేదు. అదంతా ఆదాయంగా భావిస్తున్నారు. రోజంతా నెత్తి మీద తట్ట పెట్టుకుని ఆమె అమ్ముకుంటుంటే, లేకపోతే రోజంతా కూడా తోపుడుబండిని తోసుకుంటూ వ్యాపారం చేస్తే, ఆ వచ్చే ఆదాయం, ఈ డబ్బు మీద వచ్చేటటువంటి ఆదాయం కాదు అధ్యక్షా, అది ప్రాఫిట్ కాదు. ఆ మనిషి పడే కష్టం రిస్క్ వున్నది. వర్షానికి, ఎండకు పళ్లు, కూరగాయలు కుళ్లిపోతే, లేదా బందో, రాస్తారోకో వస్తే ఇవన్నీ లెక్కలోకి తీసుకోకుండా లాభం వుందన్న భావంతో వచ్చినటువంటి సంస్థలు ఇవన్నీ. దీని వెనుకనున్నది ప్రధానంగా ప్రభుత్వ వైఫల్యం. ఈ పార్టీ, ఆ పార్టీ అని కాదు, ఒకరోజు కాదు, చాలాకాలంగా మనం పరపతి వ్యవస్థను పూర్తిగా కుళ్లబొడిచాం. సామాన్యులకు ఋణ సౌకర్యం, సదుపాయం అందకుండా చేశాం. ఆ కారణంగానే వీరంతా కూడా మైక్రోఫైనాన్స్ సంస్థల బారిన పడ్డారు.

అధ్యక్షా, ఇప్పుడే గౌరవ సభ్యులు శ్రీ కిషన్ రెడ్డి గారు చెప్పినట్టుగా, ఈ సంస్థలను మూసివేస్తే, వేరే వడ్డీ వ్యాపారులొస్తారు. వేరే సంస్థలొస్తాయి. కాబట్టి మనం దీన్ని సమగ్రంగా పరిశీలన చేయాలి.

రెండవది ఏమిటంటే ప్రభుత్వం వైఫల్యం ఇంకోరకంగా ఉంది. కిషన్‌రెడ్డి గారు చెప్పినట్టుగా పేదరికం పోవడానికి కేవలం చిట్కాలు ఏమీ లేవు – విద్యను, ఆరోగ్యాన్ని ప్రజలకు పూర్తిగా అందించకుండా, ఉపాధికి కావల్సిన నైపుణ్యాన్ని ఇచ్చి, ఆదాయాన్ని పెంచకుండా, మంత్రిగారు ఇందాక బాధపడ్డారు. ఈ మద్యం వినియోగాన్ని గ్రామాల్లో

తగ్గించకుండా, పేదల్లో తగ్గించకుండా పేదరికాన్ని మీరు పోగొట్టలేరు. ఆత్మవంచన చేసుకోవచ్చు మీ విధానాలు మీకు ఉండొచ్చుగాక. మీ సంక్షేమం మీకు ఉండొచ్చుగాక పేదరికానికి ప్రధానమైన కారణాలు విద్య, ఆరోగ్యం లేమి, నైపుణ్యం లేకపోవడం, ఆదాయం రాకపోవడం, ఉన్న ఆ కాస్తా ఆదాయం ఆ కుటుంబంలో మద్యం బారిన పడిన కారణాన పూర్తిగా ఆ కుటుంబం నాశనం కావడం. అక్కడి విధానాలు కూడా పేదరికాన్ని పెంచి పోషించేవిగా ఉండి, ఇక్కడికిక్కడే పేదరికం అకస్మాత్తుగా పోవడం సాధ్యం కాదు. ఈ సంస్థలంటున్నాయి మా వల్ల బీదరికం పోతుందని. నా వద్దకు కూడా వచ్చి లెక్కలు చెప్పారు. తరువాత నేను కొన్ని రిపోర్ట్‌లు చూశాను. నూటికి ఎనభై ఐదు మంది మైక్రో ఫైనాన్స్ సంస్థల దగ్గర డబ్బులు తీసుకుంటున్న వాళ్లు, గతంలో కంటే పేదరికం పోలేదు. కొంతమంది మటుకు మరీ బీదరికంలో పావలా వడ్డీకి ఋణాన్ని ప్రభుత్వం ఇస్తోందని చెప్పుకుంటుంటే, అక్కడ బీద ప్రజలు ముప్పై ఆరు శాతం, నెలకు పావలా బదులు మూడు రూపాయలు - పన్నెండు రెట్లు పెంచి, పద్దెనిమిది రెట్లు నాలుగున్నర రూపాయలదాక యాభైనాలుగు శాతం మంత్రిగారే బహిరంగంగా శెలవిచ్చారు. యాభై నాలుగు శాతం ప్రకారం వడ్డీ వసూలు చేస్తున్నారని చెప్పారు. అంత ఎక్కువ వడ్డీలకు ఋణాన్ని తీసుకోవాల్సి వస్తోందంటే, ఇది పూర్తిగా ప్రభుత్వం వైఫల్యం. మరి పావలా వడ్డీ పథకం ఏమైంది. నిజంగా మనవల్ల ఈ సామాన్యులకు, బీదలకు కనుక ఈ పరపతి అందుతున్నట్లయితే, ఇంత పెద్ద వడ్డీకి ఋణాన్ని తీసుకునే గతి ఎందుకు పట్టింది. వీళ్లందరికి కూడా?

మూడవ అంశమేమిటంటే, ఈ సభలోనే ఎన్నోమార్లు సభా నాయకులుగా ఉన్న వాళ్లు మేము ఋణ మాఫీ చేశాం రైతులకు బోల్డెంత, బీదలకు బోల్డెంత న్యాయం చేశామని అన్నారు. ఈ రుణ మాఫీ దేశంలో 65,000 కోట్ల రూపాయలు జరిగితే, ఈ రాష్ట్రంలోనే సుమారుగా పన్నెండు వేల కోట్ల రూపాయలందిందని లెక్కలు చెప్పారు. ఆ పైన మూడు వేల కోట్ల రూపాయలను ఋణాలు చెల్లించిన వారికి ఇచ్చామని కూడా చెప్పారు. అంటే పదిహేను వేల కోట్ల రూపాయలు మన రాష్ట్రంలోనే వాళ్లందరికి బట్వాడా చేశాం. అధ్యక్షా, మన రాష్ట్రంలో సూక్ష్మఋణాల పంపిణీని మీరు చూస్తే ఆ పదిహేను వేల కోట్ల రూపాయలే ఉన్నాయి. దేశంలో ఇచ్చిన ఋణాల మొత్తంలో నలభై శాతం మన రాష్ట్రంలో ఉన్నా కూడా ఇంతే డబ్బు. అంటే మన విధానాలు కేవలం తాత్కాలికంగా ఓట్లు రాబట్టడం కోసం ఉన్నాయి. కాని, పరపతి అందించడం కోసం, బీదరికం భారాన్ని తగ్గించడం కోసం లేవు. ఇవాళ గనుక అంతే డబ్బును

మీరు సీడ్‌మనీగా పెట్టి, పేదలకు పరపతిని సులభంగా సహకార సంస్థల ద్వారా అందించే ఏర్పాటు చేసి, ఈ సహకార సంస్థలను కనుక బలోపేతం చేసినట్లయితే, ఈ నలభై శాతం, యాభై శాతం వడ్డీల అవసరమే ఉండదు. ఇప్పటికి కూడా దీనిపై ఆ ఆలోచన లేదు. కేవలం మాట్లు వేస్తున్నాం. ఏదో ఒక సంస్థ వచ్చింది. దాన్ని నియంత్రిస్తాం, ప్రజల్లో గొడవొచ్చింది. ఏదో చేశామనిపిస్తాం. రిజిస్ట్రేషన్ పెడతాం, ఆ తరువాత వాళ్లు వడ్డీ వ్యాపారుల బారిన పడితే అప్పుడు మరల ఆలోచిస్తామనే ధోరణిలో ప్రభుత్వం ఉంది. ప్రతిదానికీ రియాక్టివ్‌గా ఉన్నాం గాని, ప్రొయాక్టివ్‌గా, లోతుగా ఆలోచించడం లేదు. ఇక బ్యాంకుల విషయం చూస్తే రిజర్వు బ్యాంకు, బ్యాంకులు, ప్రభుత్వం చాలా పెద్ద పొరపాటు చేసినాయి.

18 శాతం వారు ఇచ్చే అప్పులను ప్రయారిటీ సెక్టర్ కోసం వ్యవసాయానికి, పేదరిక నిర్మూలన కోసం పేదలకు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, బ్యాంకులకు ప్రభుత్వం పూర్తిగా వత్తాసు పలికింది. మేము ఇవ్వలేమని చెప్పి, ఆ డబ్బంతా ఈ సూక్ష్మఋణ సంస్థలకు ఇచ్చేసి, ప్రయారిటీ సెక్టర్ పేరుతో ఈ దేశ ప్రజలను మోసం చేసి – మీ ఇష్టం వచ్చినట్లు రుణాలను ఇచ్చి – ఆబ్లిగేషన్ ఫుల్‌ఫిల్ చేశామన్న రీతిలో చెపుతూ మేం ప్రయారిటీ సెక్టర్‌కి ఇచ్చామని వారు నటించడం మొదలుపెట్టారు. మనం ఒప్పుకుంటున్నాం. ప్రయారిటీ సెక్టర్ ఋణాలు బాధ్యతతో పేదలకు అందించినట్లయితే దీని అవసరమేమీ ఉండదు. ఈ నాడు రాష్ట్ర అందించే ఋణాలలో అందితే సమస్యే ఉండదు. కానీ, ఇప్పటికి కూడా మనం ఆ పనిచేయడం లేదు. దేశంలోని సామాన్యులకు ఋణ సదుపాయాలు అందుతాయన్న ఉద్దేశ్యంతో, బ్యాంకుల జాతీయకరణ 41 సంవత్సరాల క్రితం చేయడం జరిగింది. దేశంలో ఆరు లక్షల గ్రామాలు ఉంటే, కేవలం 35 వేల గ్రామాల్లోనే బ్యాంకు బ్రాంచీలు నేడు ఉన్నాయి. 20 గ్రామాలకు ఒక బ్యాంకు బ్రాంచ్ ఉంటే, పరపతి అందక, ఈ బ్యాంకులు పట్టించుకోక ఈ ప్రయారిటీ సెక్టర్ లెండింగ్ అంతా ఎమ్.ఎఫ్.సి. లకు ఇచ్చేసి, వారి నుండి డబ్బు ఎలాగూ వచ్చేస్తుంది మాకేమీ ఇబ్బంది లేదని వారి చావు వారు చస్తారని అనుకోవడం వల్లే ఈ ఉపద్రవం వచ్చింది. ఆర్.బి.ఐ. కానీ, కేంద్ర ప్రభుత్వం కానీ, రాష్ట్ర ప్రభుత్వం కానీ, ఈ బాధ్యత నుండి తప్పించుకోడానికి వీల్లేదు. బ్యాంకుల నుండి ప్రయారిటీ సెక్టర్ లెండింగ్‌ని పేదలకు, రైతులకు ఇప్పించకపోతే, ఈ రూపంలో కాకపోతే, మరో రూపంలోనైనా సామాన్యుడికి ఋణభారం మెడకు చుట్టుకొంటుంది. వడ్డీలు పెరుగుతాయి.

ఈ చట్టంలో మౌలికమైన లోపం ఇప్పటికీ వడ్డీని నియంత్రించే ఏర్పాటు లేకపోవడం అని తెలియజేస్తున్నాను. అదేమని అడిగితే మాకు హక్కు లేదని అంటున్నారు. అది వాస్తవం కాదు. నేను ఆర్.బి.ఐ. గవర్నర్‌తో మాజీ గవర్నర్ వేణుగోపాలరెడ్డి గారితో మాట్లాడాను. ఆర్.బి.ఐ. డిప్యూటి గవర్నర్‌తో ఒక సంఘాన్ని వేసింది. ఇవి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలైనప్పుడు ఆర్.బి.ఐ. వీటి వడ్డీని నియంత్రించడం లేదు. ఇవి బ్యాంకులు కావని. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం క్రింద పనిచేయవు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వీటిని వడ్డీ వ్యాపారులుగా భావించి ఆ వడ్డీని నియంత్రించే అధికారం బాధ్యత రెండూ ఉన్నాయి. అవసరమైతే ఆర్.బి.ఐ.ని సంప్రదించి చట్టరూపంలో వడ్డీ నియంత్రణ తేవాల్సిన అవసరం ఉంది. దేశంలో ప్రపంచంలో మానిటరింగ్ పాలసీలో రిజర్వుబ్యాంకు నిర్వహణలో ప్రసిద్ధిపొందిన వారు వడ్డీ వ్యాపారులుగా వారిని భావించి నియంత్రణ చేయమని, ఎటువంటి అడ్డంకీ లేదని వారు చెపుతున్నారు. మనం అనవసరంగా మన చేతులకు సంకెళ్లు వేసుకొని నియంత్రణ లేకుండా సదుద్దేశంతోనైనా ఆదరాబాదరాగా చట్టాన్ని తీసుకువచ్చాం. అధ్యక్షా సెక్షన్3 ప్రకారం రిజిస్ట్రేషన్ కావాలి. రిజిస్ట్రేషన్ అన్నది అవసరమే. కానీ ఒక ప్రభుత్వాధికారిక ప్రభుత్వ సంస్థకో, ఒక రిజిస్ట్రేషన్ లైసెన్స్ అధికారం ఇవ్వమని అన్నామో అక్కడ లంచాలు విరివిగా ఉన్నాయి. ఆ రిజిస్ట్రేషన్ అథారిటీ దీని రూపంలో కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించకుండా ఏర్పాట్లు చెయ్యాలి. మీకు అనుమానం అక్కరలేదు. రిజిస్ట్రేషన్ అథారిటీ కోట్లాది రూపాయలు సంపాదించి తీరుతాడు. మీరు జాగ్రత్తలు తీసుకోకపోతే స్పష్టమైన పారదర్శకమైన చర్యలు తీసుకోకపోతే ఈ వేళ వీరికి వడ్డీ రూపంలో పోయేది రేపు లంచాల రూపంలో వారికి పోతుంది. దీన్ని అరికట్టడంలో చట్టాల్లో ఏర్పాట్లు లేవు. నగరాల్లో పట్టణాల్లో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ నుండి వచ్చిన మహిళలతో పారిశుధ్యం గ్రూప్స్‌ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 30 వేల మంది మహిళలు ఉంటారు. నా నియోజకవర్గంలోనే 1700 మంది మహిళలు పనిచేస్తున్నారు. నెలకు వారికి రూ. 3900 ల చొప్పున ఇవ్వాలి. ఈ శాసనసభలో బహిరంగంగా ఒక నిర్దిష్టమైన ఆరోపణని నేను చేస్తున్నాను. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న ఈ 30 వేల మంది శానిటరీ మహిళల్లో ఒక్కరికి కూడా ప్రతి నెల రూ.3900 లు అందడం లేదని నిశ్చయంగా నేను చెప్పగలను. ఈ నగరంలో కానీ, రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా నేను ఋజువు చేయగలను. నిరుపేద మహిళలను మోసం చేస్తున్నారు. అయినా ప్రభుత్వం నిస్తేజంగా కూర్చొంది.

అవినీతిమయమైపోయింది. ఇక్కడ అవినీతి ఉండదు అనుకోకండి. ఖచ్చితంగా ఉండి తీరుతుంది. దానికి ఏర్పాటు కావాలి.

సెక్షన్ 15 ప్రకారం ఫాస్ట్ ట్రాక్ చట్టాన్ని చేసింది. దేశవ్యాప్తంగా వర్తించాలని పార్లమెంట్ చట్టం చేసింది. There shall be Rural Courts గ్రామ న్యాయాలయాలు అని. సమ్మరీ ప్రొసీజర్స్‌తో మండలానికి ఒక కోర్టు పెట్టి ఇటువంటి కేసులన్నీ విచారించాలన్న ఉద్దేశ్యంతోనే పెట్టారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసి, మీకు డబ్బులు ఇస్తాం, కోర్టులు పెట్టండని అంటే, సంవత్సరంన్నర నుండి మీకు దానిపై ఏమాత్రం శ్రద్ధ లేదు. కోర్టులను పెట్టమని చట్టం చెపుతోంది. ఇప్పుడు కొత్తగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెడతారట. ఎందుకయ్యా ఈ రాష్ట్రంలో వెయ్యి కోర్టులు పెట్టవచ్చు. కేంద్ర ప్రభుత్వం రన్నింగ్ కాస్ట్‌ని భరిస్తుంది. వారు డబ్బు ఇస్తామంటే, ఆ చట్టం అమలు చేయడానికి మీకు ఓపిక లేకుండా పోయింది. నేను ఈ సభలో ఎన్నిసార్లు చెప్పినా బధిర శంఖారావం అయిపోయింది. వినేవాళ్లే లేరు. మళ్ళీ మరో చట్టం చేస్తున్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు అంటున్నారు. అంటే కుడికి ఎడమకు సంబంధం లేదా? ఇది న్యాయశాఖ వారికి తెలియదా? ఎలాంటి ప్రభుత్వాన్ని మనం నడుపుతున్నాం? ప్రభుత్వంలో ఎటువంటి చట్టాలు ఉన్నాయి? ఆ చట్టాలను ఏ విధంగా మన రాష్ట్రానికి ఉపయోగించుకోవచ్చు. డబ్బు ఖర్చు కాకుండా ఏం చేయాలి. అన్న ఆలోచనే ఉండదా? గుడ్డిగా చట్టాలు చేయడమేనా? అదేమని మేమడిగితే, సమయాభావం ఉందని అన్ని బిల్స్‌ని పాస్ చేసుకొని పోతుంటారు. మీరు ఒక పర్యాయం ఆలోచించండి అధ్యక్షా చాలా అసంబద్ధంగా ఉంది. ప్రభుత్వం నిర్వహణ ఈ విధంగా కాదు. చట్టాలు చేసే తీరు ఇది కాదు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని, మీరు దీని విషయంలో ఖచ్చితంగా జాయింట్ సెలక్ట్ కమిటీ వేయాలి. ప్రతిష్టలకు పోకండి. ఆరు నెలల కాలం దాటిపోతే మీరు మళ్లీ ఆర్డినెన్స్ తీసుకోండి. సెలక్ట్ కమిటీ వేయడమన్నది మంచి సాంప్రదాయం. మైక్రోఫైనాన్స్‌పై రివ్యూ చేసుకొందాం. కొన్ని పార్టీలు ఋణాలు చెల్లించవద్దని పిలుపు ఇచ్చారు. కాబట్టి సంస్థలు కుప్పకూలే పరిస్థితి ఉంది. అది రాష్ట్రానికి దేశానికి మంచిది కాదు. కాబట్టి, ఇంట్రస్ట్ రేటు నియంత్రణ, ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదులు గ్రామీణ న్యాయాలయాలను ఏర్పాటు చేసి దానికి జ్యూరిసిడిక్షన్ ఏర్పాటు చేయడం, సెక్షన్ 3 రిజిస్ట్రేషన్‌లో పొరపాట్లు జరగకుండా చూడడం, సహకార సంస్థలను బాగు చేసి, పరపతి విధానం, లెండింగ్ విధానం బాగుచేయడానికి, దీన్ని సమగ్రంగా అధ్యయనం చేస్తే మరింత బలమైన పరిష్కారాలు వస్తాయి. ప్రభుత్వ

సంకల్పం మంచిది. రాష్ట్రంలో పేదలంతా ఆవేదనలతో ఉన్నప్పుడు ప్రభుత్వం చట్టాన్ని తీసుకువచ్చి వారికి కొంత ధైర్యాన్ని ఇచ్చింది. అది మంచిదే. ఇప్పుడు నాలుగడుగులు ముందుకేసి ఈ పరపతి వ్యవస్థను బాగుచేయాల్సిన అవసరం ఉంది. దయచేసి సెలక్ట్ కమిటీకి రెఫర్ చేసి లోపాలను పూడ్చాలని కోరుతున్నాను.

## ఇతర చట్టాలు

అధ్యక్షా ఒక చట్టం అనేది తీవ్రమైన విషయం అందులో ఇటువంటిది మరీ ముఖ్యం చాలా సదుద్దేశంతో పెద్దలు కిషన్ రెడ్డి గారు అమెండ్‌మెంట్స్ ప్రతిపాదించారు. ఈ చట్టాన్ని సూత్రప్రాయంగా స్వాగతిస్తూ అయ్యా, కొంచెం లోతుగా ఆలోచించండి, తొందరపడకండి అని చెబుతున్నాము. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు అక్కరలేదు. గ్రామీణ న్యాయాలయాలు పెట్టుకోండి అని అంటే .... పాపం విషయం కూడా అర్థం కావడం లేదు. సెక్షన్ 3లో రిజిస్ట్రేషన్ గురించి చెప్పారు. సెక్షన్ 8లో ఇంట్రస్ రెంట్ రెగ్యులేషన్ గురించి చెప్పారు. ఇంత మొండిపట్టుదల ఎందుకు? దయచేసి ఇప్పటికైన పునరాలోచించండి. తీవ్ర నిరసన తెలియజేస్తున్నాను. చాలా బాధాకరం. ఇంత కీలకమైన అంశాలపై యధాలాపనంగా ఇంత మొక్కుబడిగా చర్చించడం చాలా బాధాకరమైన విషయం నా నిరసనను తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఇక60 సెకన్ల కంటే ఎక్కువ సమయం తీసుకోను. బిల్లు విషయంలో ఒక విషయం మాత్రమే ప్రస్తావిస్తాను. ప్రభుత్వం చిత్తశుద్ధిని పూర్తిగా అభినందిస్తున్నాను. కానీ, Interest regulation ను కూడా మీరే చేతిలో పెట్టుకొనుంటే బాగుండేది. మంచి సూచన చేశారు. ఇప్పటికి సరే ఈ బిల్లు అయిపోయింది. చట్టం అయిపోయింది. తరువాత అమెండ్‌మెంట్స్ తీసుకురండి, ఈ సభ సంతోషంగా ఆమోదిస్తుంది. మీకు అధికారం ఇవ్వాలనే మా కోరిక. రిజర్వ్‌బ్యాంకు రెగ్యులేట్ చేయకుండా మీరు రెగ్యులేట్ చేయకుండా మంచిది కాదు. అట్లాగే మూడేళ్లు చేయండి. లేకపోతే ప్రతి సంవత్సరం లంచాలవుతాయి. మీకు తెలుసు నాకు తెలుసు ఏమి జరుగుతుందో మంచి సూచనలను దయచేసి పాటించండి. ప్రతిష్టకు పోవద్దని నేను కోరుతున్నాను.

ఇది మంచి బిల్లు, ఈ బిల్లును నేను స్వాగతిస్తున్నాను. కానీ, అయిదు సంవత్సరాలు దాటి మాత్రమే లీజు ఉండాలని చెప్పారు. అయిదు సంవత్సరాల లోపల కాదు. మరి భాషలో పొరపాటు ఉందో బిల్లులోని చట్టం –3 చూడండి. Section-3 (2) says that "the duration of lease which shall not be less than five

years." మరి మీ ఉద్దేశం ఏమిటో మీ భాష ఏమిటో నాకు అర్థం కావడం లేదు.

అంటే ఒక నిమిషంలోనే రెండు మాటలు చెబితే ఎట్లా? సరే ఈ అంశం విషయంలో ఎక్కడో పొరపాటు పడ్డారు. పప్పులో కాలేశారు. ఇప్పుడు సమర్థించుకుంటారు అనుకోండి. కానీ, సూత్రప్రాయంగా అధ్యక్షా, టెనెన్సీ యాక్ట్ విఫలమైపోయింది. విఫలమైన నేపథ్యంలో కనీసం మహిళా సంఘాలు టెనెన్సీ యాక్ట్ కాకుండా, లీజు సులభం చేస్తూ, లీజు ఉంటే కేవలం కొన్ని పరిమిత హక్కులను ఇచ్చి, ఇప్పుడున్న చట్టం ప్రకారం హక్కులన్నీ వాళ్ళకిచ్చేసి, ఆ టెనెన్సీని లేకుండా చేసేటట్లుగా చేయడం కోసం చేశారు. దయచేసి మొత్తం టెనెన్సీ యాక్ట్‌ను అదేవిధంగా మార్చండి. ఇక్కడే రెవెన్యూ శాఖా మంత్రిగారు ఉన్నారు. ఆవేళ మీకు ఈ టెనెన్సీ యాక్ట్ వల్లనే, ప్రస్తుతం టెనెన్సీ రిజిష్టర్ కావడం లేదు. అందుచేతనే మీకు లోన్లు రావడం లేదు, బీమా రావడం లేదు, నష్టపరిహారం రావడం లేదు, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా రావడం లేదు., అందుచేత టెనెన్సీ యాక్ట్ మొత్తాన్ని మార్చాల్సిన అవసరం ఉందని మీరే ఋజువు చేస్తున్నారు. వాస్తవం అది. మొత్తం టెనెన్సీ యాక్ట్‌ని ఈ రకంగా చేసినట్లయితే బాగుంటుంది. అయిదేళ్ల లీజు మినిమమ్ అన్నది.. అది హేతుబద్ధంగా లేదు. దాని వల్ల లీజులు రావు. దాని పర్పస్ కూడా నెరవేరదు. అయితే, బిల్లు మాత్రం సూత్రప్రాయంగా మంచిది, సమర్థిస్తున్నాను.

అధ్యక్షా, ఈ బిల్లు గురించి మళ్ళీ మాకు కన్‌ఫ్యూజన్ ఉన్నది. మంత్రిగారు చెప్పేటప్పుడు అయిదు సంవత్సరాల వరకు అంటున్నారు, చట్టంలో అయిదు సంవత్సరాలు దాటి అంటున్నారు. అయిదు సంవత్సరాల వరకు అసలు ఏం చట్టం పాస్ చేస్తున్నారో మాకు అర్థమయ్యేటట్లు చెప్పండి. అయిదు సంవత్సరాల వరకా లేదంటే అయిదు సంవత్సరాలు మించా అనేది చెప్పండి, మంత్రిగారు చెప్పినదాంట్లో నాకు చాలా కన్‌ఫ్యూజన్ ఉన్నది.

**(05-01-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# "మహిళల సంగతి మరిచిపోకండి"

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, మహాత్మా గాంధీ ఒకప్పుడన్నారు. 'నాకే కనుక మరు జన్మ వుంటే, నేను ఒక మహిళగా పుడతాను' అని. నిజానికి నేను ఈ రోజు మాట్లాడేందుకు అవకాశం యివ్వమని కోరింది వేరే అంశం గురించి అయినప్పటికీ, కానీ నన్ను ఒక ఆనరరీ మహిళగా మహిళా సభ్యులు గుర్తించి ఇవ్వాళ ఈ అవకాశం యిచ్చారు. అందుకు ధన్యవారాలు.

**డా॥జయప్రకాష్ నారాయణ :** వారందరికీ అదే అనుమానం వచ్చిందిట. కానీ నేను ఈ రోజు సగర్వంగా నిలబడి మీ అనుమతితో మాట్లాడుతున్నాను. కాబట్టి అధ్యక్షా, నేను మిమ్మల్ని అనుమతి కోరిన అంశం మీద కాకుండా, ఇవ్వాళ చర్చలో వున్న అంశం మీద క్లుప్తంగా ప్రస్తావిస్తాను.

దాదాపు 215 సంవత్సరాల క్రితం అమెరికాలో రాజ్యాంగం వచ్చాక మహిళల ఓటు హక్కు కోసం పోరాడటం జరిగింది. అంటే 130 సంవత్సరాలపాటు పోరాటం జరిగి, చివరకు 1920వ సంవత్సరంలో మహిళలకు ఓటు హక్కు వచ్చింది. ఆ రాజ్యాంగం రాస్తున్నప్పుడు అబిగెయిల్ యాడమ్స్ అని, జాన్ యాడమ్స్ గారి భార్య ఆ దేశంలో రాజ్యాంగ నిర్మాణంలో కీలకమైన వారిలో ఒకరాయన. ఆ దేశానికి రెండవ రాష్ట్రపతి ఆయన.

ఆమె భర్తకు ఉత్తరం రాస్తూ, 'మీరు గొప్ప రాజ్యాంగాన్ని మొట్టమొదటిసారిగా ప్రపంచంలో రాస్తున్నారు. దయచేసి మా మహిళల సంగతి మరచిపోకండి' అని రాసింది. అయినా వాళ్లు మరచిపోయారు. అలాగే, బ్రిటన్‌లో 500 సంవత్సరాల పోరాటంలో 1928 సంవత్సరంలో మహిళలకు ఓటు హక్కు వచ్చింది. అట్లాంటిది మన దేశంలో రాజ్యాంగం వచ్చిన తొలి రోజునే, కులం, మతం, భాష, ప్రాంతం, లింగ వివక్ష యివన్నీ విస్మరించి వయోజన ఓటు హక్కు యిస్తూ, మహిళలకు ఓటు హక్కు యిచ్చారు. ప్రపంచ రాజ్యాంగాలలో మహిళలకు రాజ్యాంగం వచ్చిన తొలి రోజునే ఓటు హక్కు యిచ్చినటువంటి తొలి రాజ్యాంగం భారత రాజ్యంగం.

ఇన్నేళ్లకు మహిళలకు ప్రాతినిధ్యం కోసం ఏర్పాట్లు చేయాలని పార్లమెంటులో చట్టం కోసం గట్టి పోరాటం జరుగుతోంది. విజయం సాధిస్తారని నాకు విశ్వాసం వుంది. తర్వాత రాష్ట్ర శాసన సభలకు వస్తుంది. మన రాష్ట్ర చట్ట సభలకు వస్తుంది. సగం

రాష్ట్రాలకు పైగా దానిని మనం ఆమోదించాలి. ఈ బిల్లు విషయంలో మహిళలకు ప్రాతినిధ్యం ఖచ్చితంగా రావాలని అందరం కోరుకుంటున్నాం. అందరం కోరుకుంటున్నా కూడా ఈ రొటేషన్సు మూలంగా కొంత గందరగోళం వుంటుందని ఆందోళన చాలా మందికి వున్న మాట వాస్తవం. దానికి ప్రత్యామ్నాయాలు కూడా వున్నాయి. 1998 సంవత్సరంలోనే లోక్‌సత్తా తరపున నేనూ, మరి కొందరు మిత్రులు యితర ప్రాంతాల నుంచీ, మంచి ప్రత్యామ్నాయాలను తయారు చేసి యిచ్చాము గాని, ఏవో కారణాల వల్ల వాటిని ముందుకు తీసుకువెళ్లలేదు. ఒక సామెత వున్నది. The impossible best is the enemy of possible అని. అసాధ్యమైన అద్భుతం, సుసాధ్యమైన మంచికి శత్రువు అవుతుంది కాబట్టి, ఏదో ఒక రూపంలో మహిళలకు ప్రాతినిధ్యం యివ్వడం అవసరం. దానిని మనసారా ఆహ్వానిస్తున్నాను.

అయితే, నేను మీ ద్వారా ఈ సభను, అన్ని పార్టీలనూ, ఈ రాష్ట్ర ప్రజలను కోరేది కేవలం మగవాళ్ల స్థానంలో మహిళలు వచ్చేసి రాజకీయాలలో పాత్ర తీసుకుంటే చాలదు.

**ఎన్. జయప్రకాష్ నారాయణ :** కేవలం మగవారి స్థానంలో మహిళలు వచ్చేసి రాజకీయంలో పాత్ర తీసుకుంటే చాలదు. మూల కారణాలుగా మనం ఈ మార్పు రావాలని కోరుకుంటున్నాము. మొట్టమొదటిది, మహిళలు పెద్దయెత్తున రాజకీయంలోకి ప్రవేశించి రాజకీయ నాయకత్వం తీసుకున్నట్లయితే నేర ప్రవృత్తి, అవినీతి రాజకీయానికి ఈనాడు పర్యాయపదం అయిపోయింది. ఒకరకంగా రాజకీయం అంటే నేర ప్రవృత్తి, అవినీతి అనే భావన ప్రజల హృదయాల్లో బాగా చొరబడిపోయింది. దాని నుండి బయటకు తీయటం కోసమని మహిళలు వస్తే అవకాశం ఉంటుందనే ఆశ మొట్టమొదటిది. రెండవది, సభల లోపలగాని, ప్రభుత్వంలోగాని, రాజకీయంలోగానీ, బహిరంగ చర్చల్లోగాని ప్రమాణాలు బాగుపడతాయి. కేవలం తిట్టుకోవటం, అరచుకోవటం, గందరగోళంకాకుండా హేతుబద్ధమైన వాదనలతో, వాస్తవాలతో ప్రజా సంక్షేమానికి అనుగుణంగా చర్చలు జరుగుతాయి, ఆరోగ్యకరమైన వాతావరణం వస్తుందన్న ఆశ రెండవది. మూడవది, అధికారానికి అర్థం మారుతుందని. ఈ రోజు అధికారం అంటే పోలీసు అధికారం, అధికారం అంటే భూమి మీద అధికారం. అధికారం అంటే ఎక్సయిజ్, కమర్షియల్ టాక్సెస్. కాని నిజంగా అధికారం అంటే విద్య అందించటం కావాలి, ఆరోగ్యం అందటం కావాలి, నైపుణ్యం పెరగటం కావాలి, ప్రతి వ్యక్తి ఎదగటం కావాలి. అందుకోసం మహిళల సాధికారత అనేది, నిజంగా

సమాజంలో ఈ సాధికారత రూపుదాలుస్తుందని ఆశిస్తూ ఇక్కడున్నటువంటి సభ్యులందరికీ ఈ నూరవ  మహిళా దినోత్సవం సందర్భంగా మనసారా అభినందనలు తెలియచేస్తూ ఈ అవకాశం ఇచ్చిన మీకు నమస్కారం తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**(10-03-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# వెనుకబాటుతనం ఆధారంగానే ముస్లిం రిజర్వేషన్లు

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, మన సమాజంలో రిజర్వేషన్లను మించి రాగద్వేషాలను పెంచే సమస్య మరొకటి లేదు. ఎక్కడకు వెళ్లినా రిజర్వేషన్ అనగానే జీరో సమ్ గేమ్ కాబట్టి, కొంత మందికి లాభం మిగతా వాళ్లకి అంతే మేరకు నష్టం. అవకాశాలు కొంతమందికి వస్తాయి. మిగతా వాళ్లకు తగ్గుతాయి కాబట్టి విపరీతంగా అసూయ, ద్వేషం, క్రోధం చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కీలక అంశంపై దృష్టి పెడుతున్నాం. పేదరికానికి కులం లేదు, మతం లేదు భాష లేదు, ప్రాంతం లేదు, ఈ దేశంలో ఇప్పటికీ కూడా చాలా మంది విద్యాపరంగా ఆర్థికంగా పేదరికానికి గురవుతున్న మాట, వివక్షకు గురవుతున్న మాట వాస్తవం. కాబట్టి, కులమతాలతో సంబంధం లేకుండా ఏర్పాటు చేయాలి. కాని ఇవ్వాళ చర్చలో, నిన్న చర్చలో కొన్ని అపశ్రుతులు దొర్లినాయి. మన దేశంలో పాలనే తప్పుచేస్తున్నట్లుగానో.. రాజ్యాంగమే తప్పు చేస్తున్నట్లుగానో.. మత వివక్ష చూపెడుతున్నట్లుగానో కొంత చిత్రించే ప్రయత్నం జరిగింది. దీనిని పూర్తిగా నేను నిరసిస్తున్నాను. ఎందుకంటే, మన దేశంలో పాలనలో ఉన్న తప్పుల్ని నేను తిట్టినట్లు ఈ దేశంలో ఎవరూ తిట్టలేదు గత 15 ఏళ్లలో రాజకీయంలో ఉన్న తప్పుల్ని నా అంతగా ఎవరూ విమర్శించలేదు. కానీ, ఉదాత్తమైన రాజ్యాంగాన్ని ఈ దేశం అందరికీ ఇచ్చింది. మతం పేరుతో ముక్కలైనా కూడా కులం, మతం, భాషా, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కళ్లకీ వయోజన ఓటు హక్కుని మొట్టమొదటిసారిగా ఇచ్చిన రాజ్యాంగం భారత రాజ్యాంగం. మిగతా వాళ్లకి లేని హక్కుల్ని మైనారిటీలకు ప్రత్యేకంగా కల్పించింది ఈ రాజ్యాంగం. ఆర్టికల్–29గాని, 30గాని, హిందువులకు లేని హక్కుల్ని ఇతర మతాలకు కల్పించింది మర్చిపోకూడదు. మనం త్వరపడి ఆవేశంతో దేశంలో ప్రజలను అవమానించే విధంగా మాట్లాడితే ప్రమాదం జరుగుతుంది. మరే దేశం నాకు తెలిసి ప్రజాస్వామ్య రాజ్యాంగాలలో మరే దేశంలో కూడా మెజారిటీకి హక్కులు లేకుండా మైనారిటీలకు ప్రత్యేకమైన హక్కులను ఇచ్చింది ఒక్క భారత రాజ్యాంగం మాత్రమే.

మూడవది, ముస్లిం రిజర్వేషన్లు క్రొత్త కాదు. మన రాష్ట్రంలోనే ఇవ్వాళ చర్చకు

రాలేదు. 5 కులాలకు ఈ రాష్ట్రంలో రిజర్వేషన్ ఉన్నది. ఒకటి మెహతా, బీసిఏ పేరుతో మెహతా కులానికి రిజర్వేషన్ ఉన్నది. మరో నాలుగు కులాలకు రిజర్వేషన్ ఉన్నది. ఆ కులాలు దూదేకుల, పింజారి, నూర్ భాషా, లడాఫ్ 5 కులాలకు ఇప్పటికే ఉంది. అంటే ముస్లిం సమాజంలో 20శాతం జనాభాకి మన రాష్ట్రంలో రిజర్వేషన్లు ఉన్నాయి. ముందు అది గుర్తించాలి. ఇది హిందూ ముస్లిం సమస్య కాదు. వెనుకబాటుతనాన్ని సరిగ్గా గుర్తించారా లేదా అని చర్చించాలి. మూడు లిటిగేషన్లలో ఇంత పరాభవం ఎందుకు వచ్చింది. కోర్టుల్ని తిడుతున్నాం, కోర్టుల తప్పులేదు. నిర్ద్వందంగా ఓటు బ్యాంకు రాజకీయాన్ని ప్రభుత్వాలు చేసినాయి. తొందరపాటుతో ఏదో చేసేశామనే భ్రమను కల్పించే ప్రయత్నం చేశామే తప్ప, నిజాయితీగా చిత్తశుద్ధితో జనాభాని బ్యాక్‌వర్డ్‌నెస్‌ని పరిగణనలోనికి తీసుకునే ప్రయత్నం చేయలేదు. గణాంకాల గురించి చాలా మాట్లాడారు. నాకు తెలిసి, పెద్దలందరినీ అగౌరవ పరచాలని కాదు. చాలా అవాస్తమైన గణాంకాలను చెప్పారు.

అధ్యక్షా, నా దగ్గరే హైకోర్టు తీర్పు ఉన్నది. సచార్ కమిటీ నివేదిక ఉన్నది. సచార్ కమిటీ నివేదిక ప్రకారం చెబుతున్నాను. సచార్ కమిటీ నివేదిక ప్రకారం మన రాష్ట్రంలో ముస్లిం జనాభా 9.2 శాతం ఉంటే, ఉద్యోగాలలో మన రాష్ట్రంలో ముస్లింల వాటా 9.3 శాతం 9 లక్షల 49వేల ఉద్యోగుల్లో రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వంలో 88 వేల మంది ముస్లింలు ఉన్నారు. దానిలో హోం శాఖలో, పోలీసు శాఖలో 14.2 శాతం, సగర్వంగా చెప్పుకోవచ్చు మనకు వివక్షత లేదు. రెండవది, విద్యాపరంగా వెనుకబాటని చాలా మంది గౌరవ సభ్యులు మాట్లాడారు. ఏ లెక్కలు చూశారో నాకర్థం కావడం లేదు. భారతదేశం లెక్కలు వేరు, మన రాష్ట్రం లెక్కలు వేరు. 2001 లెక్కల ప్రకారం మన రాష్ట్రం మొత్తం మీద అక్షర జ్ఞానం 60.5 శాతం ఉంటే, ముస్లింలలో అధ్యక్షా, 68 శాతం ఉన్నది. దయచేసి సభంతా గమనించండి, సచార్ కమిటీ చెప్పిన వాస్తవాలు చెబుతున్నాను, నేను సొంతంగా చెబుతున్నవి కావు. అలాగే, 7 నుంచి 16 ఏళ్ల వయస్సు వరకు, ఎంత కాలం స్కూలింగ్ జరుగుతుంది? పాఠశాలకు ఎంత కాలం వెళ్లుతున్నారు? సగటున రాష్ట్రంలో 4.38 సంవత్సరాలు, పాఠశాల విద్య అందుతుంటే ఆ వయస్సులో, ముస్లింలలో 4.42 సంవత్సరాలు అలాగే ప్రైమరీ స్కూలు ఎవరు పూర్తి చేస్తున్నారు? సగటున..

**డా॥ జయప్రకాష్ నారాయణ:** అధ్యక్షా, కొంచెం కీలకమైన అంశాలు ఉన్నాయి కొంచెం సమయం ఇవ్వండి. నేనే ఎక్కువ సమయం తీసుకోను, అప్రస్తుతం మాట్లాడను.

ముస్లింలలో 74.7 శాతం అంటే 75 శాతం ప్రైమరీ స్కూల్ పూర్తి చేస్తున్నారు. కాని, ఎస్సీ, ఎస్టీలలో 59.9 శాతం మాత్రమే మిగిలిన వారిలో 75 శాతం. కాబట్టి అక్కడ కూడా విద్యాపరంగా ముస్లింల మొత్తాన్ని చూస్తే అక్కడ వివక్ష లేదు. మిడిల్ స్కూల్ అదే రీతిన 53 శాతం ముస్లిం లలో 42 శాతం ఎస్సీ, ఎస్టీలలో ఇతరులలో 57 శాతం. మెట్రిక్యులేషన్ 41 శాతం ముస్లిం లలో, 41 శాతం ఇతరులలో, ఎస్సీ, ఎస్టీలలో 24 శాతం కాబట్టి, విద్యాపరంగా వెనుకబడ్డారు అనడానికి మొత్తంగా ముస్లిం లను చూస్తే ఆధారాలు లేవు. కాబట్టి, ముస్లింల ప్రతి గ్రూపుని మనం జాగ్రత్తగా అంచనా వేయాలి. హైకోర్టు ఏమి చెప్పింది. ఆయ్యా.. మీరు ప్రతి వర్గానికీ లెక్కలు వేయండని చెప్పింది. మన వాళ్లు మూడు సార్లు కొండను త్రవ్వి ఎలుకనే పట్టారన్న విధంగా, మన వాళ్లిచ్చింది 12 కులాలకి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ, 14 కులాలకి ముస్లిం రిజర్వేషన్లను ఖరారు చేస్తూ, మరో 10 కులాలను ప్రక్కన పెట్టి, ఆ 10 కులాలను మినహాయించి, ప్రతి ముస్లింకు కూడా రిజర్వేషన్ అన్నారు. ఎంత విచిత్రంగా ఉందంటే, డా. మర్రి చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉండగా మండలి కమిషన్ ఉద్యమం వస్తే అయనొక మాట అన్నారు. మండల్ కమిషన్ నివేదికను చదివినట్లయితే, ఈ రోజు సమర్థిస్తున్న వాళ్లు వ్యతిరేకిస్తారు, వ్యతిరేకిస్తున్న వాళ్లు సమర్థిస్తారు అన్నారు. ఎందుకంటే, మండల్ కమీషన్‌లో రెడ్డి, కాపు, కమ్మ మూడు కులాల్ని కూడా బీసీలలో చేర్చారు. చాలామందికి ఆ సంగతి తెలియదు. అదే గనుక చేసినట్లయితే, దానిని సమర్థించేవారు వ్యతిరేకించేవారు, వ్యతిరేకించేవారు సమర్థించేవారు. అందుచేత విషయం తెలియకుండా మాట్లాడు తున్నాం. హైకోర్టు తీర్పులో అధ్యక్షా, వారు చెబుతుందల్లా ఏమిటంటే, ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వొదని వాళ్లు అనలేదు. ఇవ్వొచ్చు కానీ ఎక్కడ లెక్కలు వేశారు?

**డా॥ జయప్రకాష్ నారాయణ :** 112 బి.సి కులాలు అభ్యర్థన పెట్టుకుంటే వాటిని ప్రక్కన పెట్టారు. బి.సి(ఎ), బి.సి(బి)లకు చెందిన అయిదు కులాలవారుంటే వారిని అలాగే ఉంచి మిగతా వారిని మాత్రం బి.సి(ఇ)గా ఏర్పాటు చేశారు. మరి వారి సంగతేమిటి? అలాగే రాష్ట్రంలో ముస్లిం జనాభా అన్ని చోట్లా ఒకే రకంగా లేదు. రాయలసీమలో ముస్లిం జనాభా 14.2% తెలంగాణాలో 12% కోస్తాంధ్రలో 4.4% కాబట్టి మీరు క్రింది స్థాయి ఉద్యోగాలలో రిజర్వేషన్‌ను ఇచ్చి అంతా ఒకే విధంగా రిజర్వేషన్‌ను కల్పిస్తే కొన్ని ప్రాంతాలలోని ముస్లింలకు అన్యాయం జరుగుతుంది.

ముఖ్యంగా మన రాష్ట్రంలో రాష్ట్రమంతా ఒక యూనిట్‌గా లేదు. సిక్స్ పాయింట్ ఫార్ములా ప్రకారం జిల్లా యూనిట్‌గా ఉన్నది జోన్ యూనిట్‌గా ఉన్నది. జోన్‌వారీగా అక్కడి ముస్లిం జనాభాను వెనుకబాటుతనాన్ని బట్టి రిజర్వేషన్‌ను కేటాయించాల్సిన అవసరమున్నది.

కోర్టులో ముస్లిం రిజర్వేషన్‌ను గురించి గట్టిగా పోరాడాం. కాని, నాకు అర్థమైనంత వరకు కోర్టు జడ్జిమెంట్ చాలా జాగ్రత్తగా చదివితే సోదరుడు అక్బరుద్దీన్ చెప్పినట్లుగా చాలా తొందరగా ఏ మాత్రం సర్వే సమగ్రంగా చేయకుండా ఏదో చేయాలనే ఆదుర్దాతో చేశారే తప్ప శాస్త్రబద్ధంగా సహేతుకంగా చేయలేదు. నిజానికి వెనుకబడిన తరగతులకు కేటాయించిన వారి జనాభా కూడా చెప్పలేకపోయారు. వట్టిగా ఫలానా వర్గాలు తప్ప మిగతా వారంతా బి.సిలని అన్నారు. అంటే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు తప్ప మిగతావారంతా బి.సిలే అన్నట్లుగా ఉన్నది. ఇది అశాస్త్రీయం. అలాగే అంకెలలో ముస్లిం కమ్యూనిటీ మొత్తాన్ని చూస్తే లిటరసీ ఉద్యోగాలలో మిగతా వారితో సమానంగా వస్తున్నాయి. కాబట్టి మీరు ప్రతి వర్గాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసే ఏర్పాటు చేయండి. మిగతా 112 కులాలను కూడా కలిపి మొత్తానికి నివేదిక వచ్చే ఏర్పాటు చేయండి.

మూడవది శాస్త్రీయంగా వెనుకబాటుతనమంటే ఏమిటి? లిటరసీ మిగతావారికంటే ఎక్కువగా ఉంటే విద్య చదివే కాలం ఎక్కువుంటే మీరు వెనుకబాటుతనంగా ఎలా చెబుతున్నారు. మీరు నిర్ధారించే ఏర్పాటు చేయండి.

రిజర్వేషన్‌ల వల్ల జీవితాలు గట్టెక్కవు. అరవైమూడు సంవత్సరాల రిజర్వేషన్ రాజకీయంలో మనం ఏం చేశాము. ప్రతి కులం నేను ఎదిగానని గర్వంగా చెప్పుకోవడం కాకుండా నేను వెనుకబడ్డానని పోరాడే పరిస్థితికి మనం తీసుకొచ్చాం. వెనుకబాటుతనాన్ని ఒక ఆభరణంగా భుజకీర్తిగా ఈ దేశంలోకి తీసుకొచ్చాము. ప్రపంచంలో మరెక్కడా ఇటువంటిది ఉండదు. ఒక్క అంగ్లో ఇండియన్‌లు, పార్సీలు మాత్రమే మాకు వెనుకబాటుతనం లేదు. మాకు మీరిచ్చే ప్రత్యేక రాయితీలు అక్కర్లేదు. అందరితో సమానంగా హక్కులివ్వండి. మీతో సరితూగుతామన్నారు ఆ వివక్షకు గురైన వారిని వివక్ష నుంచి బయట పడేయకుండా ఇన్నేళ్ల రిజర్వేషన్ తర్వాత ఇవ్వాల్టికి కూడా 41% మంది మాత్రమే ఎస్.సి.లు అయిదవ తరగతి వరకుక చదివే పరిస్థితి ఉన్నది. ఇవ్వాల్టికి కూడా ఎస్.సి., ఎస్.టిలలో అక్షరజ్ఞానం సమాజంలో మిగతా

వారితో పోలిస్తే 14, 15% తక్కువగా ఉన్నది. గ్రామ ప్రాంతాలలో ఉన్న మహిళలలో అక్షర జ్ఞానం 26% మాత్రమే ఉన్నది. ఇంత దారుణమైన పరిస్థితి ఎందుకు వచ్చింది.

రాష్ట్రంలో విద్యా ఆరోగ్యాన్ని ఇవ్వకుండా పాలనను బాగు చేయకుండా, పుట్టిన ప్రతి బిడ్డకు అవకాశాలివ్వకుండా ఈ దేశాన్ని బాగుచేయలేము. అందువల్ల ఇవ్వాళ ఇది కానివ్వండి. అయితే ప్రాంతాల మధ్య వ్యత్యాసాన్ని తొలగించండి. ఎక్కడ ముస్లిం జనాభా ఎక్కువుంటే అక్కడ ఎక్కువ వచ్చేట్లు ఎక్కడ ముస్లిం జనాభా తక్కువుంటే అక్కడ తక్కువ వచ్చేట్లుగా చేసి శాస్త్రీయంగా అధ్యయనం చేయండి. కాని దీర్ఘకాలికంగా నాలుగు చర్యలను చేపట్టాలి.

**మొదటిది** పుట్టిన ప్రతి బిడ్డకు మంచి ప్రమాణాల విద్యను అందించి పదవ తరగతి పూర్తయ్యేదాకా పేదలంటే గవర్నమెంట్ స్కూలు, డబ్బున్నవారంటే ప్రైవేట్ స్కూలు కాదు. ఆడపిల్లలంటే గవర్నమెంట్ స్కూలు మగపిల్లలంటే ప్రైవేటు స్కూలు కాదు. పుట్టిన ప్రతి బిడ్డకు మంచి ప్రమాణాల విద్యను అందించి పదవ తరగతికి వచ్చేటట్లుగా ఏర్పాటు చేయాలి. ఇది ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం కావాలి.

**రెండవది** ప్రతి ఒక్కరికి మలేరియా నుండి గుండెజబ్బు చికిత్స వరకు ఆరోగ్యం బీదలకు అందే ఏర్పాటు కావాలి.

**మూడవది** ఇవ్వాళ ఉన్నత విద్య కోసం ప్రభుత్వాన్ని మనసారా అభినందిస్తున్నాను. నేను తప్పులు చేస్తే ఖచ్చితంగా తిడతాను. మంచి చేస్తే సంతోషంగా సమర్థిస్తాను. బహుశా దేశంలో ఎక్కడా లేని స్థాయిలో అతిపెద్దయెత్తున ఉన్నత విద్య కోసం డబ్బులు లేకపోతే విద్య అందని పరిస్థితి లేకుండా రాష్ట్రంలో రూ॥2,300 కోట్లు కేటాయించడం చాలా మంచిది, నేను మనసారా అభినందిస్తున్నాను. ఇప్పటికి కూడా ఉన్నత విద్యలో సహాయం అందని వారున్నారు. మంత్రిగారిని అడిగితే వారు చెప్పింది ఏమిటంటే ఇంకా 1190 ఉన్నత విద్యలో డిమాండ్ ఉన్నదన్నారు. అంత డబ్బు ఇవ్వలేకపోవచ్చు కనీసం బ్యాంకు గ్యారంటీతో రుణాలు ఇప్పించే ఏర్పాటు చేయండి. ఇంటరెస్టు సబ్సిడీ ఇవ్వండి. తర్వాత వాళ్లు అప్పు తీర్చుకునే ప్రయత్నం చేస్తారు.

**నాల్గవది**... కులానికి బీదరికానికి సంబంధం లేదు. బ్రాహ్మణులు, రెడ్లు, వెలమలు, కాపులలో కూడా బీదవారు ఉన్నారు. ఇంకా ఇతర కులాలలో కూడా ఉన్నారు. దయచేసి గ్రామీణ ప్రాంతాలలో ఉన్నవారు పట్టణాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు

పంపిస్తున్నవారిని ప్రత్యేకంగా గుర్తించి రిజర్వేషన్ సాధ్యం కాకపోతేనే వారికి వెయిటేజీనివ్వండి. యాభైశాతం రిజర్వేషన్‌ను దాటడానికి వీలు లేదు. క్రీమీలేయర్ కూడా అమలవుతుంది. కాబట్టి రిజర్వేషన్ అదనంగా సాధ్యం కాదు కాని మార్కుల వెయిటేజీనివ్వండి వందకు మూడు మార్కులో అయిదు మార్కులో వెయిటేజీనివ్వండి. ఒక కలెక్టర్ కొడుక్కో, మంత్రి కూతురుకో కులం పేరుతో రిజర్వేషన్‌ను కొనసాగిస్తూ నిరుపేదలకు అవకాశాలు లేకుండా ఒక గ్రామంలో స్కూలుకు వెడుతున్న బిడ్డకు ఎనబై మార్కులు వస్తే కలెక్టర్ కొడుక్కి ఎనభై అయిదు మార్కులు వస్తే ఎవరికి మెరిట్ ఉన్నట్లు అధ్యక్షా? కారులో వెళ్లి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న కలెక్టర్ కొడుకా, మంత్రి కూతురా, లేదంటే ఆ గ్రామంలో ఉన్న కూలి బిడ్డకా? కాబట్టి వెనుకబాటుతనాన్ని నిజాయితీగా గుర్తించి గ్రామీణ పాఠశాలల్లోనే ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్న పిల్లలకు అదనంగా కొన్ని మార్కులు కేటాయించి కొన్ని సంవత్సరాలు గడిచాక రిజర్వేషన్ అవసరం లేని సమాజాన్ని సృష్టించండి గాని మళ్లీ పది, ఇరవై సంవత్సరాలు పోయాక రిజర్వేషన్‌లో మమ్మల్ని చేర్చండి. మమ్మల్ని చేర్చండి, రిజర్వేషన్‌లు పెంచండి అనే పద్ధతి లేకుండా అలాంటి గర్వించదగిన సమాజాన్ని తెస్తారని ఆశిస్తూ, కోర్టులను తిట్టడం కాకుండా నిజాయితీగా దీని విషయంలో తప్పును సవరిస్తారని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

# ముస్లిం రిజర్వేషన్లు

**డా॥ జయప్రకాష్ నారాయణ :** మతంతో సంబంధం లేకుండా వెనుకుబాటుతనంతో వున్నటువంటి వర్గాలన్నింటినీ కూడా గుర్తించి ఈ రిజర్వేషన్ అమలు చెయ్యడం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచన చేసింది. వారిని మనసారా అభినందిస్తున్నాను. ఇది మతానికి సంబంధించిన విషయం కాదు. మళ్లీ, మళ్లీ రాజకీయ లబ్ధి కోసం ముస్లిం మైనారిటీలు అనబోకండి. మతానికి అతీతంగా వెనుకబాటుతనం వారిని గుర్తించితే సుప్రీం కోర్టు దానిని అంగీకరిస్తుంది గానీ మతం పేరుతో అంటే మళ్లీ ఇవ్వలేకపోతుంది. రెండవ అంశం ఏమంటే దయచేసి ఇప్పటికైనా దీనిలో ప్రతి వర్గానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించింది. శాస్త్రీయంగా అర్హులైన పేదలకు ఫలితాలు వచ్చేట్లుగా చెయ్యండి. లేకపోతే మళ్లీ రేపొద్దున ఈ పేరుతో అర్హులైన పేదలు ఫలితం

పొందకుండా వుంటే అన్యాయం జరుగుతుంది. 3వ అంశం ఏమంటే రాష్ట్రంలో ఈ వర్గాల జనాభా ఏ వర్గాలకు అయితే 4 శాతం కేటాయించామో ఒక్కో ప్రాంతంలో ఒక్కోటి వుంటుంది. మన రాష్ట్రంలో నియామకాలు ఈ జోనల్ సిస్టం వల్ల ఒక జిల్లాకు గానీ, ఒక జోన్‌కు గానీ నియామకాలు పరిమితం అవుతున్నాయి. కాబట్టి మళ్లీ ఈ వర్గాలలో ఆ జిల్లాలో, ఆ జోన్‌లో వున్న జనాభాను పరిగణనలోనికి తీసుకొని ఆ దామాషా ప్రకారం పంచినట్లయితే రాయలసీమ, తెలంగాణాలో వున్న ఈ వర్గాలకు ఎక్కువ సంఖ్యలో వున్న ఈ వర్గాలకు న్యాయం జరుగుతుంది. లేకపోతే ఊరికే గుడ్డిగా అమలు చేసినట్లయితే న్యాయం జరగదు. చివరి అంశమేమంటే 112 బీసీ కులాలు మమ్మల్ని కూడా చేర్చాలని కోరుతున్నారు. వాటిని వెంటనే పరిశీలించమని దయచేసి బీసీ కమీషన్‌ను కోరండి. దానిలో వున్నటువంటి సాధ్యా సాధ్యాలను బట్టి అక్కడ వున్నటువంటి వాస్తవాలను బట్టి ఏ మేరకు వారికి ఇవ్వవచ్చో మనం నిర్ణయం చేసినట్లయితే త్వరగా ఊరట కలుగుతుంది. లేకపోతే కేవలం కొంతమందికి మీరు రాజకీయ లబ్ది చేస్తున్నారు, మమ్ములను అన్యాయం చేస్తున్నారు. అన్న భావం వచ్చి మళ్లీ సమాజంలో వైరధ్యాలు వస్తాయి, వైషమ్యాలు లేకుండా చెయ్యండి. చివరగా వచ్చే 10,15 ఏళ్లలో విద్య మీద, ఆరోగ్యం మీద, పేదరిక నిర్మూలన మీద నిజాయితీగా నిర్మూలను మీద, నైపుణ్యం మీద శ్రద్ధ పెట్టి ఈ రిజర్వేషన్ అవసరం లేని సమాజాన్ని నిర్మించండి గానీ, రిజర్వేషన్‌ను నిరంతరం కొనసాగించేలా చేసి ఆ పేరుతో ఓట్లు బ్యాంకులుగా మార్చేసే సమాజానికి ఈ దేశానికి మంచిది కాదు, రాజకీయానికి మంచిది కాదు, ఎల్లకాలం ఇది నిలవదు. కాబట్టి దాని మీద దృష్టి పెట్టమని కోరుతూ, మీకు నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**( 30-03-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# పౌరసరఫరాలను క్రమబద్ధం చెయ్యాలి

**జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా! మొట్టమొదటిది పౌర సరఫరా శాఖా మంత్రి గారు వారి ప్రకటనలో ఒక ఆందోళనకరమైన విషయం చెప్పారు. రాష్ట్రంలో గిడ్డంగుల సామర్థ్యం పూర్తిగా నిండిపోయింది. అవి ఖాళీ అయ్యే వరకు కొత్తగా మేం ధాన్యం సేకరించలేమని చెప్పారు. ఇది చాలా ఆందోళనకరమైన అంశం. ఎందుకంటే ఈ సీజన్‌లో మనం ధాన్యాన్ని సేకరించకపోతే, ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోలేకపోతే ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంటుంది, కాని తగ్గవు. కాబట్టి గిడ్డంగుల సామర్థ్యాన్ని పెంచడానికి గాని లేదా ఉన్న సరుకును ఖాళీ చేయడానికి గాని ఎంత నిర్దిష్టంగా మీరు ప్రణాళిక చేస్తున్నారు? గిడ్డంగులలో ప్రస్తుతం ఎంత సామర్థ్యమున్నది అనే దానికి చాలా స్పష్టమైన వివరణ కావాలి.

రెండవది గౌరవ సభ్యురాలు శోభా నాగిరెడ్డి గారు చెప్పినట్లుగా ఇవ్వాళ వర్షం పడుతున్నది, వర్షం ఇదే విధంగా కొనసాగాలని, ఋతుపవనాలు కనీసం ఆలస్యంగానైనా రావాలని కోరుకుందాం అందరం. కానీ, ఒకవేళ ప్రకృతి అనుకూలించకపోతే ఈ సంవత్సరం ముఖ్యంగా పప్పు దినుసులు, సన్న బియ్యం గురించి మరింత గడ్డు సమస్యను ఎదుర్కోబోతున్నాం. అలాంటప్పుడు వాటిని ఇతర రాష్ట్రాల నుండి, లేక ప్రపంచం మొత్తం నుండి దిగుమతి చేసుకోవడానికి మీరు ఏం ఏర్పాట్లు చేయబోతున్నారు? అలాగే వ్యవసాయ రంగంలో కనీసం పంట పండినంత మేరకు మనకు ఎక్కడైతే ఆహార ధాన్యాల కొరత వుందో అక్కడ ఉత్పత్తి పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు.

మూడవది, నిత్యావసర వస్తువుల చట్టంలో సవరణకు భారత ప్రభుత్వం అనుమతి ప్రత్యేకంగా తీసుకున్నాం. ఆ చట్టంలో కొన్ని అంశాలను వినియోగించడం కోసమన్నారు. మరి నాకైతే అర్థం కాలేదు. భారత ప్రభుత్వం కంకరెన్స్ ఏ విషయంలో వచ్చింది. నిర్దిష్టంగా ఆ చట్టాన్ని ఏ రకంగా వినియోగిస్తున్నారు?

నాల్గవది, కమోడిటీస్ ట్రేడింగ్ కార్పొరేషన్ పేరుతో లేకపోతే ఇంకొక పేరుతో ఒక ప్రభుత్వ సంస్థ నిరంతరం జాగరూకతతో విదేశాల నుంచి అవసరమైతే దిగుమతి

చేసుకుని నిత్యావసర వస్తువుల సరఫరా కోసమని మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేయకపోతే మనం చాలా చిక్కుల్లో పడతాం. మరి అలాంటి సంస్థ ఏర్పాటు కోసం ప్రతిపాదన ఏమైనా వున్నదా?

చివరి అంశం ఇప్పటికి కూడా చాలా చౌక ధరల దుకాణాలలో మన హైదరాబాదు నగరంలోనే కొన్ని చోట్ల అయిదు వేల కార్డులు, కొన్ని చోట్ల పదహారు వందల కార్డులు ఉన్నాయి. కనీసం వాటిని రేషనలైజ్ చేసి ఒక్కొక్క చౌక ధరల దుకాణానికి 700, లేక 800 లకు మించకుండా కార్డులను ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువుల పంపిణీ పేదలకు సరిగా అందజేసే ప్రతిపాదన ఏమైనా ఉన్నదా?

**(21-08-2009 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# గ్రేటర్ హైదరాబాద్‌కు ఏకీకృతపాలన

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, గ్రేటర్ హైదరాబాదు పరిధిలో రెండు రకాల పరిపాలన నడుస్తోంది. ఒకటి– గతంలో వున్న మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాదు, ప్రధానంగా హైదరాబాదు రెవెన్యూ జిల్లాకు చెందినటువంటింది. రెండు– గ్రేటర్ హైదరాబాదులో కొత్తగా చేర్చబడి హైదరాబాదు నగరంలో పూర్తిగా విలీనం అయినటువంటి, గతంలో మున్సిపాలిటీలుగా వున్నవి ఇప్పుడు నగరంలో భాగంగా వున్నాయి. 37లక్షలు, 40 లక్షలు కాస్త అటూ ఇటూ సగం సగం జనాభా వుంది. ఈ రెండూ విడివిడిగా ఉండడం చేత ఒక రోడ్డుకు అటుప్రక్కగా వుంటే అది యంసిహెచ్ ప్రాంతం–హైదరాబాదు జిల్లా. ఇటుప్రక్క వుంటే అది రంగారెడ్డి జిల్లా. దీని వల్ల ఒక ప్రాంతంలో నివాసం వుండి మరొక ప్రాంతంలో పనిచేయవచ్చు. ఒక ప్రాంతంలో నివాసం వుంటే ఇంకొక ప్రాంతంలో వ్యాపారం ఉండవచ్చు. ఒక జిల్లాలో వుండి మరొక జిల్లాలో పని చేయడమవుతోంది. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు సివరేజ్ విషయం చూస్తే– రంగారెడ్డి జిల్లా ప్రాంతంలో జిహెచ్‌యంసి పరిధిలో దాన్ని చూసే బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్‌ది. హైదరాబాదు ప్రాంతంలోనైతే ఆ బాధ్యత హైదరాబాదు మెట్రోపాలిటన్ వాటర్ సప్లయి బోర్డుది. ఇక స్కూల్స్ విషయానికి వస్తే– రంగారెడ్డి జిల్లాలో జిహెచ్‌యంసి పరిధిలో జిల్లాపరిషత్, మండలపరిషత్ స్కూల్స్ వున్నాయి, అదే యంసిహెచ్ పూర్వభాగంలో హైదరాబాదు జిల్లాలో ఉన్నవన్నీ ప్రభుత్వ స్కూల్స్, అక్కడేమో హెల్త్‌సెంటర్లన్నీ కూడా పిహెచ్‌సిలు, ఇక్కడేమో అర్బన్ హెల్త్ సెంటర్స్. పోలీసు విభాగానికి వస్తే– క్రైమ్ ఎక్కడైనా జరగవచ్చు. Investigation Jurisdiction ఎవరిదో అర్థం కాక గందరగోళ పరిస్థితులున్నాయి. ఎంప్లాయిమెంట్ విషయానికి వస్తే– జిల్లా స్థాయిలో రిక్రూట్ కావలసిన వాళ్లు ఇక్కడ వాళ్లు అక్కడ, అక్కడి వాళ్లు ఇక్కడ, ఏమీ అర్థంగాక గందరగోళం జరుగుతోంది. గ్రామాలు, పట్టణాల మధ్య తేడా వస్తోంది. రంగారెడ్డి జిల్లాలో వున్న నగర ప్రాంతంతో రంగారెడ్డి జిల్లాలోని గ్రామ ప్రాంతాలు పోటీపడలేకపోతున్నాయి. గ్రామాలలో వున్న వాళ్లు జిల్లా ఉద్యోగాలకు పోటీ పడలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో జిహెచ్‌యంసిలో వున్న నగరం మొత్తాన్ని ఒక రెవెన్యూ జిల్లాగా ప్రకటించడం చాలా అవసరం, ఇప్పటికే

చాలా ఆలస్యమయింది. పట్టించుకోకుండా తాత్సారం చేశాం. జిహెచ్‌యంసి పరిధి మొత్తాన్ని ఒక రెవెన్యూ జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**(25-03-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# హైదరాబాద్‌కు తాగునీరు

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, జంట నగరాలలోని నీటి సంక్షోభం గురించి మిత్రులు అక్బరుద్దీన్ ఓవైసీ గారు చెప్పారు. నేను మీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తేవాలనుకున్నది ఏమిటంటే రోజుకు 330 మిలియన్ గ్యాలన్ల నీటిని జంట నగరాలలో సరఫరా చేస్తున్నారు. అంటే రోజుకు సుమారుగా 150 కోట్ల లీటర్లు. ఎనభై లక్షల జనాభాకు రోజుకు తలసరి 180 లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నాము. అంటే లండన్, ప్యారిస్ నగరాలకంటే కూడా ఎక్కువ నీటిని సరఫరా చేస్తున్నాము కాని నీళ్లు అందడం లేదు. నీళ్లు వచ్చిన వారికేమో ఎక్కువ ప్రెజర్ వచ్చి నీరు వృధా అవుతున్నది, వాటికి ట్యాపులు కూడా సరిగా ఉండవు. లేనిచోటనేమో చుక్క కూడా నీరు లేదు. నీటి సరఫరా అస్థవ్యస్థంగా ఉన్నదని వాటర్ సప్లై బోర్డు వారికి చెబితే, ఏం లేదండి! మాకు మూడు వేల కోట్ల రూపాయలుంటే సరిపోతుంది, మేం చేసేస్తామని చెబుతారు. ఈ ప్రభుత్వానికి ఏ మాట చెప్పినా కూడా మూడు వేల కోట్లు, ముప్పై వేల కోట్లు, మూడు లక్షల కోట్లు అని సున్నాలు చేర్చుకోవడమే.

కృష్ణా జలాల విషయంలో రెండు ఫేజ్‌లు పూర్తి చేసి మూడవ ఫేజ్ టేకప్ చేయాలంటే ఏడు వందల కోట్ల రూపాయలతో అయ్యే పథకాన్ని చేపట్టకుండా గోదావరి జలాల కోసం 3,500 కోట్ల రూపాయలతో సిద్ధంగా ఉన్నది ఈ ప్రభుత్వం. డబ్బు లేకపోయినా అప్పు చేసి పప్పు కూడు తిన్నట్లుగా. అందుచేత హైదరాబాదు నగరంలో నీటి సరఫరా కోసమని ఉన్న నీటిని సరిగా నియంత్రిస్తే, ఉన్న కనెక్షన్ల ప్రకారం, ఉన్న మీటర్ బిల్లింగ్ ప్రకారం ఆయా వార్డులలో, సర్కిళ్లలో నీటిని సరఫరా చేసినట్లయితే న్యాయం జరుగుతుంది. అసంబద్ధమైన పథకాలను కట్టిపెట్టి అంటే రూ॥700 కోట్లు ఖర్చుపెట్టేదానికి, రూ॥ 3500 కోట్లు ఖర్చు అంటే... ఎందుకు ఈ రాష్ట్రాన్ని, నగరాన్ని దివాలా తీయిస్తున్నారు. నేను ముఖ్యమంత్రి గారిని ప్రత్యేకంగా కోరేదేమిటంటే మీరు దయచేసి మేం చెప్పేవి వాస్తవాలు కాకపోతే మమ్మల్ని నోరు మూయించండి. మేం చెప్పేవి వాస్తవాలనుకుంటే సమీక్షించి ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలను కాపాడతారని ఆశిస్తున్నాను.

**(20-03-2010న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**

# రాష్ట్రంలో రైల్వే సౌకర్యాలు

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, మన రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి మౌలిక సదుపాయాలు కీలకమైన అంశం కాబట్టి ఈ అంశాన్ని మీ ద్వారా ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకొస్తున్నాను. ఇవాళ రైల్వేలు ఈ యుగంలో పారిశ్రామిక ప్రగతికి కీలకం. దక్షిణ మధ్య రైల్వే ప్రతి రోజూ అయిదు కోట్ల రూపాయల లాభాన్ని ఆర్జిస్తున్నది. సంవత్సరానికి సుమారుగా రెండు వేల కోట్ల రూపాయల లాభాన్ని రైల్వే శాఖకు ఆర్జిస్తున్నది. తూర్పు రైల్వే రోజుకు ఆరు కోట్ల రూపాయల నష్టాన్ని తెస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రైల్వేలలో దక్షిణ మధ్య రైల్వే లాభసాటిగా ఉండి కూడా అదనపు సదుపాయాలు కల్పించే అవకాశం ఉన్నా కూడా నిర్ణయాలు కొత్త ఢిల్లీలో జరగడం చేత, లోతుగా సరైన అధ్యయనం లేక, సరైన అవగాహన లేక ఈ రాష్ట్రానికి రైల్వేల విషయంలో చాలా అన్యాయం జరుగుతున్నది. ఉదాహరణకు తిరుపతిలో క్యారేజ్ రిపేర్ వర్క్‌షాప్ ఉంది. దానిలో 140 కోట్ల రూపాయల పెట్టుబడి పెడితే దానిని కోచ్ ఫ్యాక్టరీగా తయారు చేయవచ్చు. సంవత్సరానికి 500 కోచ్‌లు అందులో తయారుచేయవచ్చు. అన్ని రకాలుగా లాభసాటిగా ఉన్న చోట రైల్వేలలో పెట్టుబడి పెట్టే అవకాశం ఉన్నా కూడా కేంద్రీకరించిన నిర్ణయాల వల్ల రాష్ట్రానికి సరైన న్యాయం జరగడంలేదు. గతంలో పోర్టులు గానీ, ఎయిర్‌పోర్టులు గానీ పూర్తిగా కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉండేవి. ప్రస్తుతం పోర్టుల అంశాన్ని వికేంద్రీకరించి రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం కల్పించడంతో, వికేంద్రీకరణ నిర్ణయాలు రావడంతో గత ఇరవై సంవత్సరాల క్రితం దేశం మొత్తం మీద పోర్ట్ క్యారీయింగ్ కెపాసిటీ ఎంత ఉందో, ఇవాళ రాష్ట్రంలోనే అంత కెపాసిటీ వచ్చింది. మీద్వారా ముఖ్యమంత్రిని కోరేది, దక్షిణ మధ్య రైల్వేతో సహా ప్రతి రైల్వే జోనుకు స్వయంప్రతిపత్తి ఇచ్చి స్థానికంగానే నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఇచ్చి ఆర్థికపరమైన నిర్ణయాలు కూడా తీసుకొనే అధికారమిచ్చి, రాష్ట్ర ప్రభుత్వానికి అందులో కీలకమైన పాత్రను ఇచ్చినట్లయితే ముఖ్యంగా మన రాష్ట్రం దేశం మొత్తంలో లాభసాటిగా దక్షిణ మధ్య రైల్వే నిలిచే అవకాశం ఉంటుంది. హైదరాబాదు, విశాఖపట్నం, విజయవాడ లాంటి అత్యధిక జనాభా ఉండి అభివృద్ధి

సాధిస్తున్న నగరాలలో మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీలలో ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీలను ఏర్పాటుచేసుకొని నగర ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు సరైన స్థానిక రవాణా అందించి న్యాయం చేయవచ్చు. ఈ అంశం జాతీయ స్థాయిలోని ప్రభుత్వానిది అయినప్పటికీ కూడా సరళీకరణలో భాగంగా రావడంకోసం ప్రభుత్వం ఈ అంశాన్ని ప్రత్యేకంగా చేపట్టవలసిందిగా కోరుతున్నాను.

**(02-03-2010 న జేపీ అసెంబ్లీ ప్రసంగం)**



డా॥ జయప్రకాష్ నారాయణ్

# శాసనసభ ప్రసంగాలు

